ఓం శ్రీ సాయిరాం

# అల్లా అచ్ఛా కరేగా

'అల్లా అచ్ఛా కరేగా' అని అంటూ శిరిడీలో శిధిలమై పాడుపడిన మసీదులో అనేక సంవత్సరములు నివసించి ఒక పిచ్చి ఫకీరుగా అవతరించిన యోగి మన అందరి పరమాత్మ శ్రీసాయినాథుడు. పరమాత్మ సాయి అని ఒక ప్రక్క అంటూ పిచ్చి ఫకీరని ఒక ప్రక్క అంటున్నామేమిటి? ఇదే మాయ ! అతని పేరే శంబరుడు. ఈ విద్యనే శాంబరీ విద్య అని విష్ణుసూక్తమున 5వ శ్లోకం "ఇంద్రా విష్ణూ దృంహితాః శంబరస్య...." అని వివరించెను. లేనిది వున్నట్లుగా, వున్నది లేనట్లుగా కనిపించుటయే మాయ. ఆ ఆదిమాయ బ్రహ్మాదులనే చికాకు పరచుచుండగా మనమెంత? యోగులను గుర్తించుట అసాధ్యం. ప్రయత్నించగా సాధించనది ఏదీ లేదంటారు. కానీ ప్రయత్నించిన మాయను తప్పించలేము, యోగులను గుర్తించనూలేము. అటువంటి యోగి మన సాయి. భగవద్గీత 7వ అధ్యాయం, 14వ శ్లోకము "దైవీ హ్యేషాగుణమయీ మమ మాయా దురత్యయాం. నా మాయత్రిగుణాత్మకమైనది. అలౌకికమైనది. దీనిని అధికమించుట సాధ్యం కాదు. కాని నా అనుగ్రహం వల్ల ప్రయత్నించిన సాధ్యమగును. నిరంతరం నన్నే భజించువారికి సాధ్యమగును. ఫకీరుగా కనపడి పిచ్చివానిగా ప్రవర్తిస్తూ, అగ్గిపుల్లతోను, నాణేములతోను ఆడుతూ ఊదిపాటను పాడుతూ, మాసిన బట్టలతో, స్నానమే చేయక పాడుబడ్డ మసీదున మట్టి చెత్తలోనున్న ప్రదేశములో కూర్చుని తనలో తాను మాట్లాడుతూ ఆకాశమును చూస్తూ చేతులను తమాషాగా ఆడిస్తూ మనలోకంలో లేనట్లు కనిపిస్తాడు మన సాయి. వచ్చినవారిని దక్షిణ అడిగి కొందరిని కసురుకుంటూ మనల్ని తన మాయలో ముంచెత్తుతాడు. వచ్చినవాడు తప్పక 'అరె ఇతను పిచ్చివాడా ఏం?' అని మనస్సున ఆలోచన కల్గిస్తాడు. మనల్ని పిచ్చివానిగా చేస్తాడు. ఇలాగే ఒక మహానుభావుణ్ని ఒక అతను ఇలా అన్నాడట, "అయ్యా! లోకులు మిమ్మల్ని పిచ్చివాడని అంటున్నారు" అప్పుడు ఆ మహానుభావుడు అన్నారట, "ఆ లోకులు పిచ్చివాళ్ళని నాకు ఎప్పుడో తెలుసులే!" **శ్రీసాయిని పిచ్చిఫకీరుగా తలవడం నిజంగా మనం పిచ్చివాళ్ళమే !** అయితే సాయి పిచ్చి ఫకీరు కాదు కాబట్టి 'పరమాత్మయే!' మరి పరమాత్మ అంటే సరిపోతుందా? మరి ఆయనే పరమాత్మ (అల్లా) అయితే సాయి, అల్లా అచ్ఛాకరేగా అని ఆ అల్లాను వేరుగా చూపుతున్నాడే? నిదర్శనం ఏమిటి? మానవుని మనస్సు సంశయాల పుట్ట. పాముపుట్టలో చేయిపెడితే పాము కాటేస్తుంది. పాముకాటుకు విషం విరుగుడికి మందైనా ఉంది కాని మానవుని మనస్సు అను పుట్టన సంశయములు అనే కాటు పడితే, మందే లేదు. ఆ విషము ఇంకా పైకి ఎగప్రాకి మరెన్ని సంశయాలు నురగలా కక్కుతాము. దేవుడున్నాడా? ఉంటే కనిపించడే? పూజ చేసిన కష్టాలు ఏమిటి? చక్కగా వున్నాడే ! ఇంతలోనే మరణమా? దేవుడెంత అన్యాయం చేశాడు. ఇలాంటి సంశయాలు కొల్లలు. మాయను తప్పించుకొనుట బహుకష్టం. సాక్షాత్తు

అమ్మభవానికే సాధ్యపడలేదు. శ్రీరాముని విషయమున సీతాదేవి వియోగముతో శ్రీరాముడు అడవులలో కనపడిన చెట్టును పుట్టను, కొండను చూసి "సీతా! సీతా!" అని పరితపించినాడట శ్రీరాముడు. ఆ ఘటనను చూసిన పార్వతి తన పతి శివునితో రాముని అవస్థను గురించి చెప్పి నిందెంచనట. అప్పుడు ఈశ్వరుడు హరిమాయ తప్ప అది నిజం కాదని నారాయణుడి లీలావిలాసమేనని పార్వతికి రాముని మహిమను, అవతార రహస్యమును, రామకథను వర్ణించెను. ఆ హరిమాయ సాక్షాత్తు అంబ పరమేశ్వరినే మోసగించినదే మరి అతి సామాన్యులైన మనము సాయి పరమాత్మేనా? అనే సంశయం రావడం సహజం. అవతారపురుషులు ఒక కార్యానికి వుద్ధరించుటకై అవతరించెదరు. వారు సాక్షాత్తు దైవాంశసంభూతులే కానీ వారి నడత, ప్రవర్తన, చర్య అతి విచిత్రముగా అనుమానస్పందంగా పిచ్చివిగా కనిపిస్తాయి. నాటకంలో నటుడు తన పాత్రను నటిస్తాడు. నటనలో జీవిస్తాడు. కానీ ఆ నటుడికి తెలుసు అది కేవలం నటనేనని నిజ జీవితంలో తాను వేరు అని. శిరిడీసాయి సాక్షాత్తుగా పరమాత్మయే. కానీ జనుల ముందు ఒక పిచ్చిఫకీరు పాత్రను ఎన్నుకొని నటిస్తూ, మాయతెర కప్పుకొని అందరి కళ్ళను మోసగించి వారి పాత్రను పోషిస్తూ ఆట ప్రారంభించారు శిరిడీ అను గ్రామమున. భక్తుడు ఎంత మనోనిష్ఠతో, విశ్వాసముతో వుంటాడో, భగవంతుడు అంత త్వరగా దొరికిపోతాడు. సాయి ఒక సందర్భములో ఒక భక్తునితో 'నీవు దానిని తీసివేయుము; మనకు మధ్యనున్న అడ్డును తీసివేయుము. అప్పుడు మన యోకరినొకరు ముఖాముఖి చూచుకొనగలము" అని అనెను. ఇంత కంటే నిదర్శనం ఏం కావాలి? మనకు మధ్యనున్న అడ్డును తీసివేయుము' అనగా మాయ తెరను తొలగించుటకు యత్నించమని సూచన. 'మన మొకరినొకరు ముఖాముఖి చూచుకొనగలమ'ని అనగా పిచ్చిఫకీరుగా కనబడుతున్న మాయ తెరను తొలగిస్తే లోపలనున్నది అనంతకోటి బ్రహ్మాండనాయకుడు, రాజాధిరాజు, యోగిరాజు, పరబ్రహ్మ శ్రీసచ్చిదానంద సాయిస్వరూపుడు కనిపిస్తాడు అని అర్థం.

శ్రీసాయిసచ్చరిత్రము, ఆ సాయిపరమాత్ముని లీలలను 53 అధ్యాయములలో వర్ణించబడినది. శ్రీసాయి సుమారు 1838వ సం॥ ప్రాంతములందు అవతరించి వుండవచ్చును. సుమారు 16 ఏండ్ల వయస్సున శిరిడీకి వచ్చి 3 సం॥లు అచ్చట నుండి హఠాత్తుగా మాయమై 20 సం॥ల ప్రాయమున చాంద్‌పాటిల్ పెండ్లి గుంపుతో శిరిడీకి మళ్ళీ చేరి, అప్పటి నుండి సుమారు 60 సం॥లు శిరిడీని వదలక అచ్చటనే వుండి1918వ సం॥లో మహాసమాధి చెందారు శ్రీసాయినాథుడు. సుమారు 80 సం॥లు తన నటజీవితాన్ని ప్రదర్శించారు. పిచ్చిఫకీరుగా అగుపిస్తూ 'అల్లా అచ్ఛాకరేగా' అంటూ, పరమాత్మ లీలను ప్రదర్శిస్తూ మాయ అను తెరపై నటించారు పరమాత్మ సాయి. ప్రతి సంఘటన చూస్తే పిచ్చివాడిగా కనిపిస్తాడు. ప్రవర్తన పిచ్చివాడిగానే

కనిపిస్తాడు. మాట తీరు పిచ్చివాడిగానే అగుపిస్తాడు. ఒక్కసారిగా ఆచరణ చూస్తూనే పరమాత్మగా ఋజువు చేస్తాడు.

శ్రీసాయిసచ్చరిత్రము అను మహాగ్రంధమున మొత్తం 53 అధ్యాయాలను ఇక్కడ పరిక్షిద్దాం.

పిచ్చిఫకీరుపాత్రలో కనిపిస్తున్న పరమాత్మ సాయిని పట్టుకుందాం. నా యీ ప్రయత్నం నిజంగా బహుకష్టమైనదే. పరమాత్ముని నా బోటివాడు పట్టుకొనుట సాహసకృత్యములతో కూడినది. మళ్ళీ 53 అధ్యాయాలు తిరిగి వ్రాయవలసిందే. పూర్వ సంప్రదాయానుసారము ఈ 'అల్లా అచ్చాకరేగా' అను గ్రంధము సర్వదేవతా స్వరూపుడైన శ్రీసాయినాథుని పాదాలపై నా శిరస్సునుంచి నన్ను అనుగ్రహించిమని, దీవించిమని ప్రార్థిస్తూ ఈ నా సాహసకృత్యాన్ని సఫలీకృతం చేయమని కోరుతూ ప్రారంభించుచున్నాను 'శ్రీసాయి సచ్చరిత్రము' అను గ్రంధమును మనకు అందించిన శ్రీఅన్నాసాహెబ్ దాభోల్కర్ (హేమాడ్‌పంత్)గారు బాబాగారికి అనన్య భక్తులు, వారి కారణంగా మనందరికి సాయి లీలలు తెలుసుకొనుటకు అవకాశమిచ్చిన మహానుభావుడికి సాష్టాంగ నమస్కారములందిస్తున్నాను. సాయిభక్తులు నా తల్లిదండ్రులు శ్రీమతి కోటంరాజు బాలాత్రిపుర సుందరి, శ్రీకోటంరాజు జనార్ధనరావుగారికి వారి దివ్యపాదములకు నా నమస్కారములు. పూజ్యులు, గురుదేవులు శ్రీమాన్ మహాభాష్యం రంగాచారికి సాష్టాంగనమస్కారములు.

## మొదటి అధ్యాయము

ఒకసారి శ్రీసాయి గోధుమలు విసురుటకు సంసిద్ధుడగుచుండెను. బాబా భిక్షాటనముచే జీవించువారు. మరి వారికి గోధుమలు విసురుటలో అంతరార్ధమేమిటి? వారు నేలపై కూర్చొని గోధుమలు తిరుగలిలో పోసికొని వారి కఫ్నీని మడిచి విసరుచు శిరిడీ జనులకు ఆశ్చర్యం కలిగించెను. చూచువారికి పిచ్చివాడిగా ప్రవర్తింపచేస్తూ అందరిని తన పిచ్చి ఫకీరు రూపమున మోసపుచ్చెను. భిక్షచేయువానికి గోధుమలతో పని ఏమి? బాబా సంసారి కూడా కాదు. ఆయన పోషించ వలసిన వారెవరు కూడా లేరు. మరి ఈ కార్యమునకు అర్ధమేమి? శిరిడీలోని వనితలు కొందరు ఆ ఘటనను చూచి బాబాను ప్రక్కకు జరిపి వారే విసరుట ప్రారంభించిరి. ఆ గోధుమపిండిని నాలుగు భాగాలుగా చేసి ఒకొక్కరు ఒక్కొక్క భాగమును తీసుకొనుటకు యత్నించిరి. **భగవంతుడు సృష్టించినవి మానవుడు అనుభవించుట అను దానికి ఇదే నిదర్శనము.** బాబా కోపముతో వారిని తిట్టి ఎవడబ్బ సొమ్మని లూటీ చేయుచుంటిరి? అని మొదలు అరిచెను. ఈ సంఘటనలో బాబా పిచ్చి ఫకీరుగా తన ప్రవర్తనలో కోపగించుటలో మొదట తన మాయతో అక్కడి జనులను మోసగించి వెంటనే ఆ

విసరిన పిండిని తీసికొనిపోయిన శిరిడీగ్రామపు సరిహద్దులపై చల్లుడని ఆజ్ఞాపించెనట. విసిరిన పిండి బాబాకి ఉపయోగపడక ఆ పిండిని మొదలు పంచుకొన్న నలుగురు స్త్రీలకు ఉపయోగపడక నేలపాలైనదట. ఇది చూచుటకు ఆ ఫకీరు నిజంగా పిచ్చివాడే అని అనిపిస్తుంది. కాని ఆ పరమాత్మ సాయి ఆజ్ఞానుసారముగా చల్లిన పిండి ఊరిలో కలరా జాడ్యము శాంతింపబడినదట. "అల్లా అచ్ఛా కరేగా" అంటారు ఆ పిచ్చి ఫకీరు. ఆ అల్లా సాక్షాత్తు శ్రీసాయే అని ఆ పరమాత్ముని ఈ లీల ద్వారా ఋజువైంది.

## రెండవ అధ్యాయము

ఒక్కసారి అన్నాసాహెబు దాభోళ్కర్ బాబా లీలలను చూసిన పిదప 'సాయి సచ్చరిత్ర' అను గ్రంధమును వ్రాయవలెనని సంకల్పించి బాబా యొక్క అనుమతిని శ్యామా ద్వారా బాబాను ప్రార్థింపచేయగా బాబా ఇట్లనెనట. "వాడు నిమిత్తమాత్రుడే. నా జీవితచరిత్రను నేనే వ్రాసి నా భక్తుల కోరికలు నెరవేర్చవలెను. ఎవరైతే అహంకారమును విడిచి నా పాదములపై పెట్టెదరో వారికి నేను మిక్కిలి సహాయ పడుదును. వారి గృహకృత్యములందు తోడ్పడెదను. నా కథలు, బోధలు విన్న భక్తులకు భక్తి విశ్వాసములు కుదిరి వారి ఆత్మసాక్షాత్కారమును బ్రహ్మానందమును పొందెదరు".

గృహకృత్యములందు తోడ్పడేవాడు, సహాయపడేవాడు మరియు ఆత్మసాక్షాత్కారమును కల్గింపజేసేవారు బ్రహ్మానందమును పొందింపచేసేవాడు ఒక్క పరమాత్ముడికే సాధ్యం. బాబా మానవుని రూపంలో వచ్చి పిచ్చి ఫకీరుగా నటించి మాయతెరను కప్పుకున్న వేషధారి. కాని బాబాపై భక్తి విశ్వాసములు కుదిరిన భక్తులకు తన నిజస్వరూపం దర్శించెదరు. మాయ తెర తొలగిపోయిన పిదప శ్రీసాయి మానవుడు కాదు, ఫకీరు కాదు, సద్గురువు అని ఆ సద్గురువే పరమాత్మ అని తెలుసుకుంటారు. గురువు దేవుడు ఒక్కరే! గురువుని, దేవుని వేరుగా భావించువారు భగవంతుడిని చూడలేరు. గురువుని చూడలేరు.

ఈ అన్నా సాహెబ్ దాభోళ్కర్ స్నేహితుని కుమారునికి జబ్బు చేసినప్పుడు వాని గురువుని పిలిపించుకుని ప్రక్కకు కూర్చుండపెట్టుకొనినను జబ్బు నయము కాలేదు. ఆ సంగతిని విన్న అన్నాసాహెబ్ "నా స్నేహితుని కుమారుని రక్షించలేనట్టి గురువు యొక్క ప్రయోజనము దేనికని, శిరిడీ యేల పోవలె"నని భావించెను. కాని నానాసాహెబ్ చాందోర్కర్ అన్నాసాహెబ్‌ను శిరిడీ ప్రయాణము వాయిదా వేసినందులకు కోపగించెను. అదేరాత్రి అన్నాసాహెబ్ శిరిడీకి బయలుదేరెను. రైలు బండిలో ఒక మహమ్మదీయుడు వచ్చి అన్నాసాహెబుకు తాను ఎక్కడ దిగాలో సలహా ఇచ్చి వెళ్ళిపోయెను. ఆ మహమ్మదీయుని రూపంలో వచ్చి శిరిడీకి లాగినది సాక్షాత్తు

పరమాత్మ శ్రీసాయినాథుడే. అన్నాసాహెబు శిరిడీలో వున్నప్పుడు బాలా సాహెబ్‌తో తీవ్ర వాగ్వివాదం జరిగెను. అప్పుడు ఆ వాడలో బాబా లేకపోయినప్పటికి మసీదున కూర్చొని వున్న బాబా కాకాతో, "వాడాలో ఏమి జరిగినది? ఏమిటా వివాదము? ఈ హేమాడ్‌పంత్ (అన్నాసాహెబ్) ఏమనుచున్నాడు?" అని సంభోదించెను. మసీదు ఆ వాడాకు దూరంలో వున్నది. మసీదులో పిచ్చివాడిగా కూర్చొని ఉన్న ఆ ఫకీరు సాయి వాడాలో జరిగినదాన్ని మసీదులో చెప్పెను. ఆహా ! శ్రీసాయి పరమాత్మయే! అన్నా సాహెబుకు హేమాడ్‌పంత్ అనే బిరుదు బాబా ఒసంగిరి. దీనికి గల కారణము అన్నాసాహెబ్‌ని అడిగినప్పుడు "నా అహంకామును చంపుకొనుటకై ఇచ్చిరి" అని చెప్పెను. వేదాంత విషయములో మానవుడు స్వేచ్ఛాపరుడు కాదనే వివాదము వలన ప్రయోజనము లేదని హేమాడ్‌పంత్ గ్రహించెను. పరమార్ధము నిజంగా గురుబోధనలవలననే దక్కునని దానికి నమ్మకము, ఓపిక అనే రెండు పవిత్రగుణములు అవసరమని గ్రహించెను. ఈ నమ్మకము, ఓపికే నిష్ఠ,సబూరి అనే రెండు రూపాయలు. బాబా ప్రతివారిని దక్షిణగా రెండు రూపాయలు కోరేవి ఇవే! కాని బాహ్యప్రపంచానికి బాబా ధనము అడుగుతున్నారేమిటి? దక్షిణతో పని ఏమిటి? పిచ్చివానివలె చేయి చాపి కోరుతున్నాడేమిటి? అని తోస్తాయి. నిజానికి లోన అంతరార్ధం గ్రహిస్తే **ఆ పరమాత్ముడు కోరేవి కాసులు కావు, నిష్ఠ, సబూరి అనే కానుకలు మాత్రమే.**

## మూడవ అధ్యాయము

శ్రీసాయిసచ్చరిత్ర వ్రాయుటకు బాబా పూర్తి అనుమతి ఒసంగుచూ ఇట్లనెను. "నా లీలలు వ్రాసినచో అవిద్య అంతరించిపోవును. వ్యామోహము క్షీణించును. భక్తి కెరటములు లేచును. జ్ఞానరత్నములు లభించును" అని బాబా పల్కెను. అవిద్యను అంతరింపచేయువాడు వ్యామోహమును నశింపచేయువాడు ప్రేమ, భక్తిని ప్రసాదించువాడు మరియు జ్ఞానమనే రత్నములను అభయమిచ్చువాడు ఒక్క పరమాత్మునికే సాధ్యముకాని, పిచ్చి ఫకీరులకి కాదు. మరియు బాబా తాను పరమాత్ముడని గ్రహింపచేయుటకై మరియు ఇట్లు పలికెనట. "ప్రేమతో నా నామమును ఉచ్చరించిన వారి కోరికలన్నియు నెరవేర్చెదను. వారిని అన్ని దిశలనుండి కాపాడెదను. ఎవరు నన్ను శరణువేడెదరో నా రూపమును తమ మనస్సున నిలుపుకొనెదరో వారిని దుఃఖబంధనము నుండి తప్పించెదను. వారిని మరణము నుండి బైటికి లాగెదను. సకల రోగములను నివారించెదను. శాంతిని కలుగజేసెదను" కోరికలు తీర్చువాడు కాపాడేవాడు, దుఃఖబంధనములనుండి తప్పించువాడు, మరణము నుండి బైటకు లాగేవాడు, రోగముల నుండి నివారింపబడువారు గల అతీతమైన శక్తులు పరమాత్మునికి తప్ప మరెవరికి

కలవు. సాయి పరమాత్మయే రోగాన్ని నివారించువాడు, వైద్యుడని భావిస్తాము. వైద్యుడు చికిత్స చేయగలవాడు మాత్రమే. నివారించేవాడు ఆ పరమాత్మయే. వారే శ్రీసాయి. అందుకే చాలా ఆస్పత్రులో మనము చూస్తూ ఉంటాం. డాక్టర్లు (I Treat, But He Cures) అనే బోర్డుని పెట్టుకొనుట మనము గ్రహిస్తూనే ఉంటాము. అసలైన వైద్యుడు రోగనివారణ చేయువాడు మరణాన్నైనా తప్పించువాడు పరమాత్మ సాయియే. భగవంతుని అనుగ్రహమువల్ల మూగవానిని మాట్లాడునట్లు చేయును. కుంటివానిని పర్వతము దాటునట్లు చేయును. ప్రపంచమను మహాసముద్రములో ఈ బాబా కథలు దీపములవలె వెలుతురు ప్రకాశింపచేసి దారి చూపును. 1916వ సంవత్సరమున అన్నాసాహెబు తన ఉద్యోగము నుండి విరమించి శిరిడీకి చేరి బాబాని అణ్ణాచించిణీకర్‌తో ఇంకేదైనా ఉద్యోగము ఇప్పించమని అడుగగా సాయి ఇట్లనెను. "వానికి ఇంకొక ఉద్యోగము దొరకును. కాని వాడు నా సేవలో తృప్తి పడవలెను. వారి భోజనపాత్రలు ఎప్పుడూ పూర్ణముగానే ఉండును. అవి ఎన్నటికిని నిండుకొనవు". ఈ ఆశీర్వచనముతో శ్రీసాయి భవిష్యత్తులో జరుగవలసినవి ముందే చెప్పినారు. ఉద్యోగము దొరకునని భోజన పాత్రలకు లోటులేదని జరుగబోవునది సూచించుట సామర్థ్యము ఒక్క దైవానికే సంభవము. **'అల్లా అచ్ఛాకరేగా' అంటారు ఒక ప్రక్క. భూత భవిష్యత్ వర్తమానకాలములో జరిగేవన్నీ చెప్పగల శక్తిసంపన్నుడు శ్రీసాయి పరమాత్మ (అల్లా) కాక మరెవరు ఆ సాయికి అల్లా ఎవరు? అది నటన తప్ప మరి ఏమిటి? మాయతో నటిస్తూ ఆడేవాడు పరమాత్ముడు.** అల్లా అచ్ఛాకరేగా అంటారు అన్నీ తనే సమకూర్చుతాడు. అచ్ఛా కరేగా అనేవాడు సాయి గాక మరెవరు?

శిరిడీలో రోహిల్లా అనే ఒకడు రాత్రింబవళ్ళు ఖురాన్ చదువుతూ అల్లా హు అక్బర్ అని బిగ్గరగా అరుచుచుండెను. ఆ అరుపులకు శిరిడీ ప్రజలకు రాత్రి నిద్రాభంగము కలుగుచుండెను. బాబాకి ఫిర్యాదు చేయగా రోహిల్లాకు ఒక దౌర్భాగ్యపు భార్యకలదనియు తనను బాధపెట్టుచున్నదనియు తన ప్రార్థనను విని ఆమె ఏమీ చేయదని బాబా చెప్పెను. నిజానికి రోహిల్లాకు భార్య లేదు. బాబాకు అన్నిటి కంటే దైవప్రార్థన అంటే ఇష్టం. ఎవరైనా ప్రార్థిస్తే ఆ ప్రార్థనకులోనై మిక్కిలి ప్రేమను అందించి రక్షించేవాడే పరమాత్మ. అందుకే రోహిల్లా తరుపున వాదించారు ఆ పరమాత్మ సాయి. **పిలిస్తే పలుకుతా అన్నదానికి నిదర్శనం. ఈ రోహిల్లా కథే అల్లాహు అక్బర్ అని పిలిచాడు రోహిల్లా. ఈ అల్లా(సాయి) పలికాడు, రక్షించాడు.**

ఒకసారి మసీదున మధ్యాహ్న హారతి తరువాత బాబా ఈ విధంగా పలికెను. "మీరెక్కడ వున్నను ఏమి చేయుచున్నను నాకు తెలియును. నే నందరి హృదయముల పాలించువాడను, నివశించువాడను. చరాచర జీవకోటిలో ఆవరించియున్నాను. ఈ జగత్తును నడిపించువాడనూ, సూత్రధారినీ నేనే. నేనే జగన్మాతను.

త్రిగుణముల సామరస్యమును నేనే. ఇంద్రియ చాలకుడను నేనే. సృష్టిస్థితిలయ కారకుడనూ నేనే. ఎవరైతే తమ దృష్టిని నావైపు త్రిప్పెదరో వారికే హాని గాని బాధ గాని కలుగదు. నన్ను మరచిన వారిని మాయ శిక్షించును. పురుగులు, చీమలు తదితర దృశ్యమాన చరాచర జీవకోటి అంతయు నా శరీరమే. నా రూపమే." ఈ ఉపదేశములో ప్రతి అక్షరము పదములలో శ్రీసాయి పరమాత్ముడనే సత్యం తెలుస్తుంది. మరియు నన్ను మరచిన వారిని మాయ శిక్షించును అనే పదంతో బాబా తన మాయను ప్రదర్శిస్తున్నట్లు కూడా బయట పడినది.

## నాల్గవ అధ్యాయము

శిరిడీ గ్రామము అహ్మద్‌నగర్‌జిల్లాలోని కోపర్‌గాం తాలుకాకు చెందినది. కోపర్‌గాం వద్ద గోదావరి దాటి శిరిడీకి పోవలెను. గోదావరి నది పవిత్రమైనది. ఆ పుణ్యనదిలో జనులు స్నానమాడిన వారి పాపకర్మములు ఆ గోదావరి మాత కడిగివేయును. మరి ఆ మాత స్వీకరించిన జనుల పాపములను కడుగువారెవరు? అందుకే కాబోలు గోదావరి నది శిరిడీకి అతి సమీపమున కలదు. ఎందుకనిన ఆ మాత తన నదిలో ఆ పరమాత్ముని పాదములు మోపుటకై ఎదురుచూస్తూ ఉండును. సద్గురుసాయి ఆ గోదావరినదికి పాపకర్మములతో కలుషితమైన బంధములనుండి విముక్తి చేయగలవాడు. అందుకే ఆ గోదావరి తల్లి ప్రతిరోజు బాబా రాకకై కనిపెట్టుకొనియుండును.

సాయిబాబా వలన ఆ శిరిడీ గ్రామము ప్రాముఖ్యము చెందినది. శ్రీ సాయి శాంతితోను ఆత్మసాక్షాత్కారమందు ఎల్లప్పుడు నిమగ్నులై ఉండెడివారు. వారి నిద్ర యోగనిద్ర. ఎల్లప్పుడు పాతబడిన మశీదుగోడకు ఆనుకొని నిలుచుండెడివారు. రోజుకు మూడు పర్యాయములు లెంటితోటవైపుకు, చావడివైపుకు పచార్లు చేయుచుండెడివారు. **ఆ పచార్లు చేయుటవలన భూదేవి ఆ సద్గురుని పాదస్పర్శచే పునీతమైనది. ఆ గ్రామమున వీచే గాలి బాబా శరీరాన్ని తాకగానే ఎంతో పవిత్రమైనది. మశీదులో నిత్యము వెలిగే ధుని (అగ్ని) బాబా తేజమును చూసి ఎంతో ఆనందించెడిది. మరియు ఆ సద్గురుని ప్రకాశము మశీదులో వెలుగుచున్న ధునికే ప్రకాశమైనదట. అనంతమైన ఆకాశము సద్గురు సాయినాథునికి ఛత్రములా పట్టెనట. ఈ విధముగా పంచభూతములే ఆ సర్వేశ్వర సాయిని పూజిస్తూ దయను అర్థించెనట.** కాని సాయి సిద్ధపురుషుడైనప్పటికి సామాన్యునివలె నటించేవారు. ఒకసారి 95 సంవత్సరములుగల గౌలీబువా అను పాండురంగని భక్తుడు శిరిడీ సాయిబాబాను చూసి "వీరు పండరీనాథుని అవతారమే !" అని పలికెను. సాయిబాబా భగవన్నామ

స్మరణయందును, సంకీర్తన యందును మిక్కిలి ఇష్టపడేవారు. వారెల్లప్పుడు అల్లామాలిక్ అని అనుచుండెడివారు. ఒకసారి దాసగణు మహారాజ్‌ను నామసప్తాహము చేయమని విఠలుని దర్శనము కలుగునని వాగ్దానమిచ్చెను సాయి. ఆ అభయమును బాబా తన భక్తుడైన దాసగణుకు ఋజువుతో నిరూపించెను. భగవంతరావు తండ్రి విఠోబా భక్తుడు. అతడు మరణించిన తర్వాత వారి కొడుకు పూజను కూడా మానెను. భగవంతరావు శిరిడీకి వచ్చినప్పుడు బాబా ఇట్లనెను, "వీని తండ్రి నా స్నేహితుడు. కావున వీడిని ఇచ్చటకు ఈడ్చితిని. వీడు నైవేద్యము ఎన్నడూ పెట్టలేదు. కావున నన్నును, విఠలుని కూడా ఆకలితో మాడ్చినాడు" అనిరి. గౌలీబువా బాబాను చూసి వీరు పండరీనాథుని అవతారమే అన్న నిజం దాసగణు మహరాజుకి విఠలదర్శనం ప్రాప్తించుట మరియు భగవంతరావుతో బాబా, "నన్నును విఠలుని కూడా ఆకలితో మాడ్చినాడు" అన్న సంఘటనలో ఋజువైనది. బాబా పరమాత్మ సాయియే.

ఒకసారి దాసగణు ప్రయాగకు పోయి సంగమములో స్నానము చేయవలెనని మనస్సున తలచెను. ప్రయాగ అనగా గంగా యమునా నది కలియు చోటు. బాబా దాసగణుతో ఇట్లనెను. "అంత దూరము పోవలసిన అవసరమే లేదు. మన ప్రయాగ ఇచ్చటనే కలదు" అనెను. ఇది వినుటకు ఆశ్చర్యముగను, వింతగను తోచును. గంగాయమునా నదులేమిటి? మశీదులో నిలయమేమిటి? పిచ్చివానిమాటలుగా తోచును. కాని సాయినాథుడు మరుక్షణమే వారి రెండు పాదముల బొటనవ్రేళ్ళనుండి గంగాయమున జలములు ప్రవహింపచేసెను.

ఇంతటి మహిమాన్వితుడు ఎచ్చటనుండి వచ్చెను? వారి తల్లితండ్రులు ఎవరు? జన్మస్థానము ఎక్కడిది? ఏమియు తెలియదు. ఏరుల జన్మ, యోగుల జన్మ ఎరుంగుట అసాధ్యము.మొట్టమొదట సారిగా సాయి 16 ఏండ్ల బాలుడిగా శిరిడీలోని వేపచెట్టు క్రింద బ్రహ్మజ్ఞానిగా కనిపించెను. పగలు, రేయి, శీతోష్ణములను లెక్కచేయక కఠిన తపస్సుతో సమాధిలో నిమగ్నుడై యుండెను. అంతటి మహాపురుషుని ముందు మాయ ఆటలు సాగునా? మాయ ఎంత భయంకరమైనదంటే కఠిన బ్రహ్మచారియైన నారదమహర్షిని కూడా ఆ మాయ విలాసముతో స్త్రీవ్యామోహితుడని చేసి నారదమహర్షి వంటి వారినే పడవేసినది. నిజానికి నారదమహర్షిపై ప్రయోగించిన ఆ మాయ విష్ణుమాయే. అట్లు ప్రయోగించుటవలననే శ్రీహరి రామావతారమునకు కారకుడాయెను. శిరిడీలో వేప చెట్టు క్రింద తపస్సు చేస్తున్న ఆ సాయినాథుని ఆ మాయ ఆ సద్గురు చేతిలో ఆటబొమ్మవలె ఇమిడియున్నది. సాయి, మాయకే అతీతుడు సాయి మాటకు మాయ జవదాటదు. కావున సాయి పరమాత్మయే. శిరిడీ ప్రజలకు గ్రామదేవత ఖండోబాదేవుడు. ఒకసారి ఖండోబా దేవుడు ఒకనిని ఆవేశించగా ఆ వేపచెట్టు క్రింద ఉన్న

బాలుడు ఎవరని ప్రశ్నించగా ఆ ఖండోబా ఒక స్థలమును చూపి త్రవ్వమనెను. అట్లు త్రవ్వగా క్రింద ఒక బండ కనిపించెను. నాలుగు దీపములు వెలుగుచుండెను. అందు గోముఖ నిర్మాణము, కర్రబల్లలు, జపమాల కన్పించెను. ఈ బాలుడచ్చట 12 సంవత్సరములు తపస్సు చేసెనని చెప్పెను. ఈ విషయమును కుర్రవానిని అడుగగా అది తన గురుస్థానమని వారి సమాధి అక్కడే కలదని చెప్పెను.

భగవద్గీత నాల్గవ అధ్యాయము 7వ శ్లోకము.

"యదా యధాహి ధర్మస్య గ్లానిర్భవతి భారత

అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానాం సృజామ్యహం" మరియు

8వ శ్లోకము

పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్

ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే

భావము : ధర్మము నశించునపుడు, అధర్మము వృద్ధి పొందునప్పుడు నేను (శ్రీకృష్ణుడు) అవతరించెదను. సన్మార్గులను రక్షించుటకు దుర్మార్గులను శిక్షించుటకు, ధర్మస్థాపన కొరకు యుగ యుగములందు అవతరించెదను". కాబట్టి భగవంతుని అంశలుగా యోగులు అవసరమొచ్చినప్పుడుల్లా అవతరించి కర్తవ్యములను నిర్వర్తించుదురు.

## ఐదవ అధ్యాయము

ఔరంగాబాద్, ధూప్‌గ్రామములకు మధ్యన ఒక మామిడి చెట్టువద్ద బాబా తలపై ఒక టోపి, పొడుగైన చొక్క, చంకలో సటకా పెట్టుకుని చిలుము త్రాగుటకు ప్రయత్నించుచు ఒక వింత పురుషుని వలె కూర్చుని ఉండెను. ఆ దారిన చాంద్‌పాటిల్ అను మహ్మమ్మదీయుడు రెండు మాసముల నుండి తన గుర్రము తప్పిపోవుట వలన నిరాశతో వెతకుచూ ఆ వింతపురుషుని చూసెను. చాంద్‌పాటిల్ తన బాధను, ఆ ఫకీరునకు చెప్పగా బాబా ఆ దగ్గరలో ఉన్న కాలువ ప్రక్కన వెదకమని బదులుచెప్పెను. చాంద్‌పాటిల్ పోయి చూడగా గుర్రము కనిపించెను. బాహ్యదుస్తులను, ప్రవర్తనను చూసి చాంద్‌పాటిల్ ఈ ఫకీరు సాధారణమైన మనుజుడు లేదా ఒక పిచ్చి ఫకీరుగా భావించెను, కానీ ఈ లీలా విలాసము చూసిన తరువాత ఆ ఫకీరు ఒక సిద్ధపురుషుడని తలంచెను. చిలుము వెలిగించుటకు నిప్పును, గుడ్డను తడుపుటకు నీరును కావలెను. ఆ ఫకీరు తన సటకాను భూమిలోకి గుచ్చగా నిప్పు నీరు వచ్చెను. చాంద్‌పాటిల్ ఆశ్చర్యం చెందెను. బాహ్యావేషమును చూసి ఆ ఫకీరు

పిచ్చి ఫకీరుగా తలంచెను కాని ఒక ఔలియా అని గుర్తించలేకపోయెనని చింతించెను. **బాహ్యముగా కనబడునది దేహము మాత్రమే కాని అంతరంగికముగా చూసిన లోన పరమాత్ముడు కలడని ఎరింగెను.** ఆ ఫకీరును తన ఇంటికి ఆహ్వానించెను. బాబా పాటీలు ఇంటికి పోయి కొంతకాలముండెను. తరువాత పాటిలు భార్య తమ్ముని కొడుకు పెళ్ళి శిరిడీగ్రామమున జరుగనున్నది కావున పెళ్ళివారితో బాబా శిరిడీకి వచ్చిరి. శిరిడీలో ఖండోబా మందిరమునకు సమీపమున పెండ్లివారిబండ్లలో నున్న ఒకరి తరువాత ఒకరు దిగుచుండిరి. ఆ ఫకీరు కూడా దిగెను. ఖండోబా మందిరమున నున్న మహల్సాపతి “ఆవో సాయీ !” అని స్వాగతించెను. అప్పటినుండి ఆ ఫకీరును ‘సాయి’ అని పిలువ నారంభించిరి. సాయిబాబాగా పేరుప్రఖ్యాతులు గడించెను. **అంతవరకు ఆ ఫకీరుకు నామమనునది లేదు. దేహము అనుకుంటేనే నామము, వర్ణము, గుణములు మొదలగున్నవి అవసరము. ఈ ఫకీరు దేహాతీతుడు. పూర్ణ పరబ్రహ్మ పరమయోగి. స్థితప్రజ్ఞుడు. కావున నామ రూప గుణములకు అతీతుడు. దేహానికి పేరుకాని, ఆత్మకు ఏ పేరు లేదు. ఆ ఆత్మయే పరమాత్మ. ఆ పరమాత్మ పంచభూతములకు అతీతుడు. కావుననే ఆ ఫకీరు నేలపై సటకాతో మోదగనే నీరు, నిప్పులు ఉద్భవించినవి.** ఆ ఫకీరు భూత భవిష్యత్ వర్తమాన కాలమును ఎరిగినవారు. కావుననే పాటీలు గుర్రము తప్పిపోయిన దానిని ఎక్కడ వున్నదని నిర్ధారించెను. ఇట్టి అగోచరమైన చర్యలు ఆ దైవానికే తప్ప మరి ఏ ఇతర జీవులకీ సాధ్యము కాదు. అప్పటినుండి సాయిబాబా శిరిడీలో ఒక మశీదులో ఉండిరి. దేవీదాసు, జానకీదాసు గోసాయి, పుణతంబే వైశ్యయోగి, ఆనందనాథుడను యోగిపుంగవులు ఆ మశీధునన్న సాయిని దర్శించి ఆ ఫకీరు సామాన్యమానవునివలె కన్పించుచున్నప్పటికి ఆయన రాయికాదు, వజ్రమని ఆ ఫకీరు వలన శిరిడీ నేల పుణ్యము చేసికొన్నదని నిర్ధారించిరి.

మొదట బాబా జుట్టు పెంచుకొని దుస్తులు వేసికొనెడివారు. శిరిడీ నుండి మూడు మైళ్ళదూరమున నున్న రహతాకు పోయి పూల మొక్కలను తీసుకువచ్చి అచ్చట నేలను చదును చేసి వానిని నాటి నీళ్ళు పోయుచుండెను. బాబా కృషి వలన అచ్చట ఒక పూలతోట లేచెను. ఆ స్థలమే ఇప్పుడు బాబా మహాసమాధి. దానినే సమాధిమందిరము అందురు.

శ్రీగురుచరిత్ర సుప్రసిద్ధమైన గ్రంథము. ఇందు 1. శ్రీపాద శ్రీవల్లభుడు 2. శ్రీ నృసింహసరస్వతి యొక్క లీలలు వర్ణించబడెను. వీరు దత్తాత్రేయుని ముఖ్యావతారములు. శ్రీదత్తుని తర్వాత అవతారములు కూడా కలవు. అవి 3. నైజాం ఇలాఖాలో శ్రీమాణిక్యప్రభువు, 4. షోలాపూర్‌లో శ్రీ అక్కల్‌కోట్‌కర్ మహరాజుగారు, 5. అహమ్మద్‌నగర్‌జిల్లాలోని శిరిడీలో శ్రీసాయిబాబా. భాయికృష్ణాజీ అను అక్కల్‌కోటకర్ మహారాజుగారి

భక్తుడు ఆ మహారాజ్‌గారి చిత్రపటమును పూజించెడివారు. ఒకసారి మహారాజ్‌గారి పాదుకలను అక్కల్‌కోట పోయి దర్శించవలెనని అనుకున్న తన స్వప్నము నందు అక్కల్‌కోటమహారాజ్ దర్శనమిచ్చి, "ప్రస్తుతము శిరిడీ నా నివాసస్థలము. అచ్చటికి పోయి నీ పూజ ఒనరింపు"మనెను. భాయికృష్ణాజీ శిరిడీకి చేరి బాబాను పూజించి జ్ఞాపకార్థముగా పాదుకలు చేయించి వేపచెట్టు క్రింద ప్రతిష్ఠించెను. ఈ సంఘటనతో సాయిబాబా అక్కలకోటమహారాజ్ (శ్రీస్వామి సమర్థ)గారే అని అంటే సాక్షాత్తు బ్రహ్మవిష్ణుమహేశ్వరస్వరూపులైన శ్రీదత్తాత్రేయుల వారని తెలియుచున్నది సాయిబాబా పరమాత్మయే.

ఒకసారి తాంబోళి అను ఒక మహమ్మదీయునితో బాబాకు భేదాభిప్రాయము వచ్చి కుస్తీ పట్టిరి. అందులో సాయిబాబా ఓడిపోయెను. అప్పటినుండి బాబాకు విరక్తికలిగి తన దుస్తులను, తన తీరును మార్చుకొని కఫ్నీ ధరించి నెత్తిపై గుడ్డ కట్టుకొని ఒక గోనెముక్కపై కూర్చొనెడివారు. సాయినాథుడు నిజానికి విరాగే. కాని బాహ్యప్రపంచముకొరకు ఆ తాంబోళీతో కుస్తీపట్టి ఓడిపోయినట్లు నటించెను. **పరమాత్ముడు ఇతరుల చేతిలో ఓడిపోవటమేమిటి? ఇది కేవలము నటన.** అర్జునుడికి సారథిగా కృష్ణుడు నటించినట్లు, మహల్సాపతి సాయి అని సంభోదించినప్పటి నుండి ప్రతివారు ఆ పరమాత్ముని సాయి అని పిలిచెడివారు. ఇది నటనే ! కాని **ఆ పేరుతో పిలిచి ఉండకపోతే ఆ పరమాత్ముణ్ని ఎలా గుర్తించేవాళ్ళము. ఎలా పిలిచెడివారము? కావుననే ఆ పరమాత్మ సాయి తనకు సాయీ అని పేరు తానుగా సృష్టించి మహల్సా నోటినుండి పలికించెను.** సాయిబాబా అప్పటినుండి జనులతో కలసిమెలసి తిరిగెడివారు కాదు. ఎక్కువగా మాట్లాడేవారు కాదు. ఎందుకంటే తన స్వరూపరహస్యం బయటపడుతుందేమోనని. కావుననే చిత్ర విచిత్రవేషములతో నటన కొనసాగించేవారు. మొదట బాబాను దర్శించుటకు ప్రజలు వచ్చేడివారు కాదు. వారి కోపతాపములకు వింత చర్యలకు భయపడెడివారు.

ఒకసారి నానాసాహెబ్‌నకు పుత్రసంతానము బాబా తన అనుగ్రహముచే కలిగించెను. అప్పటినుండి వారి కీర్తి అంతటను వెల్లడి అయ్యెను. అప్పటినుండి బాబాను దర్శించుటకు ప్రజలు తండోపతండాలుగా రాసాగిరి. నానాసాహెబునకు సంతతి బాబా కలిగించకపోతే ప్రజలు నమ్మెడివారు కారు. **ప్రజలకు ఎల్లప్పుడు ఒక యోగి నుండి కాంక్షించేది చమత్కారములే. చమత్కారములకు చకితులైనప్పుడు మాత్రమే ప్రజలు మానవుడిని దేవుడు అని సంభోదించెదరు. కావుననే శ్రీసాయి ఇటువంటి చమత్కారములు చేయక తప్పలేదు. కొన్ని కొన్ని కార్యములు లోక కళ్యాణార్థమునకై కావింపవలెనన్న యోగులు చమత్కారములు చూపవలసి వస్తుంది.** రాత్రులందు బాబా పాడుబడిన పాత మశీదులో నిద్రించుచుండెవారు. ఆ నిద్ర కనుతెరిచియే. చిలుము గొట్టం, పొగాకు,

రేకుడబ్బా, కఫ్నీ, తలగుడ్డ, సటకా సాయిబాబాకున్న సామానులు. తమ దుస్తులను వారములు తరబడి ఉతకకుండా ఉంచేవారు. చెప్పులను కాలికి తొడిగేవారు కారు. ధునికెదురుగా మశీదులో కూర్చొనెడివారు.

శ్రీసాయిబాబా మరొక చమత్కారము ప్రదర్శించెను. మశీదున దీపములు వెలిగించుటకై నూనెను దుకాణదారుని కోరగా బాబాకు నూనె ఇవ్వలేదు. బాబా ఏమి చేయునోఅని ఆ నూనె వ్యాపారస్థులు ఆసక్తితో గమనించుచుండిరి. అడుగున రెండు, మూడు నూనె చుక్కలు మిగిలి వున్న రేకుడబ్బాలో నీటిని పోసి కలియబెట్టి ఆ నీటిని మ్రింగివేసిరి. నూనె అవశేషమును పావనము చేసిన పిమ్మట మరల డబ్బాలో నీరు తీసుకుని ప్రమిదలలో నీరు పోసి దీపములను నీటితో వెలిగించిరి. ఈ ఆశ్చర్యకరమైన సంఘటనతో **అజ్ఞానమనే చీకటిలో జ్ఞానజ్యోతి వెలిగించుట ఇదే అని నిరూపించెను.** దీపములు నీటితో వెలగటమేమిటి? బయట ప్రపంచానికి దీపములలో నీళ్ళుపోయడం చూస్తే ఎవరికైనను నూనెకు బదులు నీళ్ళను పోయుట పిచ్చితనముగా కనిపిస్తుంది. ఆ వెలిగించే ప్రయత్నం కూడా పిచ్చిపనిగానే అనిపిస్తుంది. వెలిగించే వారు కూడా పిచ్చివానిగనే కనిపిస్తుంది. అంతగా మాయను చూపి ఇంతోనే ఆ నీటితోనే దీపాలను వెలిగించటం పరమాత్మగానే సూచిస్తుంది. ఆహా శ్రీసాయి పరమాత్మయే !

## 6వ అధ్యాయము

సాయిబాబా హిందువా? మహమ్మదీయుడా? ఎవ్వరికీ తెలియదు. కబీరు తన మతమన్నాడు. భగవానుడు తన కులమన్నాడు. **కులమతము లనునవి బద్ధునికే కాని భగవానుడికి కాదు.** భగవంతుడు చూసేది భక్తి. ఆ భక్తుని మనస్సు మాత్రమే. ఆ వ్యక్తి కార్యమును చూడును. ప్రతిజీవి ఆ పరమపురుషుని తృప్తిచేయుటకు పనిచేయవలెను. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రుల ధర్మములు వారి వారి గుణముల ననుసరించి నిర్దేశింపబడినవి. ఏ జీవినైనను తన పనిచే దేవదేవుని సేవించిన అతడు ఏ కులమైనను, ఏ మతమైనను ఇబ్బంది లేదు. భగవానుడు రక్షించును. మోక్షమును కూడా ఇచ్చును. సాయిబాబా కులమతములకు ఎప్పుడూ ప్రాధాన్యత ఇవ్వలేదు. హిందువైన ఒక్కటే, మహమ్మదీయుడైన ఒక్కటే.

సాయిబాబా హిందువన్నచో మహమ్మదీయుడివలె, మహమ్మదీయుడు అన్నచో హిందువువలె ప్రవర్తించేవారు. వారి చెవులు కుట్టబడియున్నవి. ధునియును అగ్నిహోత్రమును వెలగించెను. తిరుగలిని త్రిప్పేవారు, శంఖంవూదేవారు. భజన, అన్న సంతర్పణ మొ॥వి చేసేవారు. ఫకీరులతో కలసి మాంసం భుజించేవారు. నమాజ్ చేసేవారు. మసీదున తాబూతు నుంచేవారు. సాయిబాబా హిందూమహమ్మదీయుల సమైఖ్యత కోసం శ్రీరామనవమి మరియు ఉరుసు ఉత్సవమును ఒకేరోజున జరుపుకొనుటకు సంకల్పించినారు.

గోపాల్‌రావు గుండు అనునతనికి సాయి ఆశీర్వచనములతో కొడుకు పుట్టెను. ఆ ఆనందమున అతడు శిరడీ ఉరుసు ఉత్సవం నిర్వహించవలనని తలచి బాబా ఆశీస్సులతో అనుమతిని పొందెను. బాబా సలహాతో ఉరుసు ఉత్సవమును శ్రీరామనవమినాడు జరుపుకొనుటకు నిశ్చయించిరి. శిరిడీలో నీటికొరత ఎక్కువ. ఆ గ్రామమును రెండు బావులు కలవు. ఒక బావిలో నీరు ఎండిపోయెను. రెండవ దానిలో ఉప్పునీళ్ళు మాత్రమే. బాబా కొన్ని పువ్వులను ఆ ఉప్పునీటి బావిలో వేసెను. ఉప్పు నీళ్ళు మంచి నీరుగా మారిపోయెను. ఈ ఉత్సవముతో పాటు చందనోత్సవము కూడా జరుపుటకు అనుమతినిచ్చెను. శిరిడీలో జరుగు శ్రీరామనవమి ఉత్సవము ముఖ్యమైనది. రాధాకృష్ణమాయి అను భక్తురాలు పనులన్నీ చూచుకొనెడివారు. మసీదును శుభ్రముచేసి పేదలకు అన్నదానము బాబా చేయించెడివారు. కొన్ని సంవత్సరములు తరువాతే శ్రీరామనవమి దినమున రామజయంతి జరుపుటకు నిర్ణయించిరి. బాబా దానిని ఆశీర్వదించెను. భీష్ముడు అను వానిచేత కీర్తనలు చెప్పించేవారు. మసీదున ఊయలను కట్టిరి. అందరు ఒకరిపై నొకరు ఎర్రరంగు పొడిని చల్లుకొనిరి. ఆ పొడి బాబా కంటిలో పడగానే ఒక్కసారి బాబా కోపంతో తిట్టుట ప్రారంభించెను. అక్కడున్నవారు అందరూ భయపడిరి. సాయిబాబా ఎప్పుడూ శాంతముగా ఉండెదరో, ఎప్పుడు కోపముతో ఉండెదరో ఎవ్వరికీ తెలియదు. వారు అవధూత అనగా అవధులే లేనటువంటివారు. వారి ప్రవర్తన, ఆ అరుపులు చూసిన బాబా సామాన్యుల వలె కోపతాపాలు కలిగినవారని తలంతురే కానీ ఆ తిట్లన్నియూ బాబా తిట్లరూపముగా అక్కడున్న వారికి ఆశీర్వచనము లిచ్చెనని తెలిసికొనలేరు. **బయటకు కనిపించునది ఒకటి. లోన దాగినది మరి యొకటి. అది తెలుసుకోలేని వాళ్ళే సామాన్యులైన మనం ఆ పరమాత్ముని లీల అగోచరం.** శిరిడీలో ఏదైనా కొత్తది ప్రారంభించినప్పుడు బాబా ఇట్లు కోపించుట జరుగుచుండెను. ఆ సమయములో కట్టిన ఊయలను విప్పుచుండగా బాబా విప్పవద్దని రామనవమి మరునాడు గోపాలకాలోత్సవముతో కానీ ఆ పండుగ పూర్తికాదని చెప్పెను. మరుసటి దినము "కాల హుండీ" అను ఉత్సవమును జరిపిన తరువాత బాబా ఊయలను విప్పుటకు అనుమతి నిచ్చెను. 1914వ సం॥ నుండి ప్రతీ శ్రీరామనవమి పండుగ నాడు శిరిడీలో సంకీర్తన చేయు బాధ్యతను బాబా శ్రీదాసగణుకు అప్పగించెను.

కొన్నాళ్ళకు మసీదును మరమ్మతు చేయుటకై భక్తులు సమ్మతించెను. బాబా దానికి మొదట ఒప్పుకొనక తరువాత ఇష్టములేకుండినను అనుమతి నిచ్చెను. ఎంతో డబ్బు ఖర్చుపెట్టి పై కప్పును వేసెను. ఇనుపస్తంభములు నాటిరి. ఆ మరుసటి రోజు బాబా అంతయు చూచి పీకి పారవేసేవారు. బాబాకు ఎటువంటి వస్తుప్రీతి, ధనకాంక్ష, ఆడంబరములు మీద ప్రీతి ఉండేడిది కాదు. ఆ విరాగికి వైరాగ్యమే ఆస్తిపాస్తులు. **పరమశివుడు పేరుకు తన నివాసము కైలాసమైనను ఎప్పుడు స్మశానము నందే తిరుగుచుండెడివాడట.** వంటిపై ఏ ఆభరణములు

లేకయే పీతాంబర వస్త్రములను ధరింపక నాగేంద్రుని తన మెడలో ఆభరణముగా ధరించి రుద్రాక్షలు వంటిపై ధరించి పులిచర్మమును తొడిగొకొని ఒంటినిండా బూడిదెను మాత్రము రాసుకుని ఎల్లప్పుడు ఆత్మధ్యానములోనే తపోమగ్నుడై ఉండెడివాడట. ఈశ్వరుడే శ్రీసాయిగా శిరిడీలో తిరుగుచుండెను. అందుకే కాలిన కట్టెలనుండి వచ్చి బూడిదను విభూతిగా తలంచి ఆ విభూదినే దివ్య ఔషముగను అందరికి పంచిపెట్టెడివారు. అటువంటి విరాగికి మసీదు మరమ్మతులు విశాలమైన పై కప్పులు, ఇనుపస్తంభములు చూసిన కోపము రాక మరేమిటి? కాని చూచువారికి బాబా ఒక పిచ్చివాడుగా ఖర్చుపెట్టిన దానిని పాడుచేయువానిగ కనిపించునే గాని ఆ ఈశ్వరతత్వము గ్రహించే శక్తి లేకుండెను. ఆ మశీదు మరమ్మత్తుకై బాబా ఒప్పుకొనుట తన కొరకు కాదు. కాని పదిమందికి ఆశ్రయనిమిత్తమునకై ఆ మసీదున బాబా లీలలను విని వచ్చి భక్తులెందరో రకరకాల పిండివంటలను తెచ్చి బాబాకు పెట్టగా అవి సాయిబాబా స్వీకరింపక అక్కడున్న పేదలకు, పశుపక్ష్యాదులకు, కుక్కలకు పంచిపెట్టెడివారు.

ఒకసారి బాబా పోళీలు అను నైవేద్యము పెట్టమని చందోర్కరునకు చెప్పెను. అది తయారుచేసి సాయిబాబా ముందుపెట్టగా వానిని తాకనైనా లేదు. కొన్ని చీమలు, ఈగలు మాత్రం వానిపై వ్రాలెను. చందోర్కర్ కొంచెమైనను ఆ నైవేద్యము తినమని ప్రార్థింపగా బాబా నేను తింటినని పలికెనట. ఆ భక్తుడు ఎప్పుడు? అని అడుగగా ఆ కనిపించే చీమలు, ఈగలు నందు నేను లేనా? అని ప్రశ్నించెనట. దీనిని బట్టి సాయిబాబా పైకి కన్పించే ఈ ఆడంబరాలు, మరమ్మతులు, రకరకాల నైవేద్యాలు, వారికొరకు కాక తన భక్తుని కొరకు తనపై ఆధారపడిన ఈ చరాచరజీవుల కొరకు మాత్రమే. **ఈ ప్రపంచమున మనం సృష్టించినది ఏమీయు లేదు. మట్టి నుండి మాణిక్యము వరకు అంతా పరమాత్మునిదే. ఈ నేల, నీరు, నిప్పు, వాయువు, ఆకాశము, జీవుడు రాకమునుపునుండే భగవంతునిచే సృష్టింపబడియున్నవి.** కాని మానవులు భూమిపై పుట్టిన తర్వాత పరమాత్ముడు ప్రసాదించిన ఆ నేల, నీరు, నిప్పు, వాయువు, ఆకాశము తన ఉపాధి కొరకకే వినియోగించుకొనుచున్నారు. మరమాత్ముడు సృష్టించిన నీరును భగవంతునికి అభిషేకము చేయుచు తీర్థముగా తీసుకొనుచున్నారు. **పరమాత్ముడు సృష్టించిన ఫలములనే తిరిగి ఆ దేవునికే నైవేద్యముగా పెడుతున్నారు. ఈ ఎరుక గ్రహిస్తే జీవుడు సృష్టించినది ఏమియు లేదు.** పరమాత్ముడు సృష్టించినవి అనంతములు. వాటిపై ఏ అధికారము జీవుడికి లేదు. కేవలము ఆ పరమాత్ముని ప్రార్థించి అనుమతిని పొంది వినియోగించవలెను కాని స్వతంత్ర్యముగా చేసిన మనము చోరులమే. ఈ విషయమును గ్రహించినచో ప్రతి మానవుడు సంసార బంధములలో చిక్కుకొనక అహంకారమునకు లోనుగాక రాగద్వేషములను వీడినవాడై దేహాభిమానము లేనివాడై పరమాత్మను దర్శింపగలడు.

అటువంటి వాళ్ళకే పై పై కనిపించు శ్రీసాయిరూపము నిజముకాదని ఆ సాయి హిందువా, మహమ్మదీయుడా అనే సందేహములు పోయి మాయ తొలగి అసలైన పరమాత్మ అగు శ్రీసాయిని తెలిసికొనును.

## ఏడవ అధ్యాయము

దక్షిణరూపముగ వచ్చిన పైకమును బాబా పంచి పెట్టిడివారు. మరియు శిరిడీ గ్రామమున ఉన్న దేవాలయములను తాత్యాపాటిల్ ద్వారా బాబా బాగుచేయించుచుండెడివారు. బాబా కీర్తి నలుమూలల వ్యాపించెను. అన్ని దిక్కులనుండి భక్తులు శిరిడీకి వచ్చుచుండిరి. సాయిని దర్శించిన మాత్రమున ప్రజలు శుభములు పొందుట, రోగులు ఆరోగ్యవంతులగుట, కోరికలు నెరవేరుట, గ్రుడ్డివారికి కళ్ళు, కుంటివాళ్ళకు కాళ్ళు వచ్చుచుండెడివి. బాబా కీర్తి విని జనులు తండోపతండాలుగా మసీదుకు వచ్చుచుండిరి. ఆ మశీదుకే 'ద్వారకామాయి' అని పేరు. ఆ జనుల సందడి మెప్పులు బాబాకి పడవు. జనులు బాబా సాక్షాత్తు భగవంతుడే అని నిర్ధారించుకొన్నప్పుడల్లా సాయి ఏదో ఒక వింత చర్యతో లేదా పిచ్చి చేష్టలతో వారిని మభ్యపట్టేవారు అనగా వాళ్ళని మళ్లీ సందిగ్ధపరచేవారు. వాళ్ళలో వాళ్ళు బాబా నిజంగా పరమాత్మయేనా లేదా పిచ్చివాడా? అని మనస్సులో బాబా చర్యలు చూసిన తరువాత ఆలోచనలో మునిగెడివారు. మశీదులో ఒక్కొక్కప్పుడు సాయిబాబా మల మూత్ర విసర్జన అక్కడే చేసెడివారు. అక్కడే స్నానం చేసేవారు. ఒక్కొక్కప్పుడు స్నానం లేకుండా ఉండేవారు. ఇటువంటి అభ్యంతర చర్యలతో జనులను కవ్వించి జనులకు సంకోచములను కల్పించి వారి మూర్ఖఆచారములను నియమనిబంధనలను కని బోసినవ్వులతో లోలోన కులుకుతూ ఆనందించేవారు. మొదట సాయినాథును పిచ్చి ఫకీరనిరి. తరువాత వారు వైద్యం చేయుట రోగికి నివారణయగుట చూసి బాబాను హకీం అనిరి. బాబా ధునిలో కాల్చబడిన బూడిదను ఊదిగా ఉపయోగించి ఎందరికో ఆశీస్సులు ఇవ్వగా నయంకానటువంటి రోగములెన్నెన్నో ఆ ఊదిచే నివారణమైనది.

ప్రతి మూడు రోజులకొకసారి మశీదునకు దూరముగానున్న మర్రిచెట్టు కడకు పోయి ముఖప్రక్షాళనము, స్నానము చేయుచుండెడివారు. ఆ సమయమున బాబా తన ప్రేవులను బయటకుకక్కి వాటిని నీటితో శుభ్రపరచి పక్కనే ఉన్న నేరేడు చెట్టుపై ఆరవేసేవారు. అలాగే బాబా ఒక్కొక్కసారి తన శరీరావయములను వేరు చేసి మశీదునందు వేరు వేరు స్థలములలో ఆ అవయవ భాగాలను పెట్టేవారు. ఒకసారి ఒక పెద్దమనిషి ఆ అవయవమును చూసి బాబాను ఎవరో ఖూనీచేసిరని అనుకొనెను. మరుసటి దినము ఆ పెద్దమనిషి మశీదునకు పోగా బాబాను చూసి ఆశ్చర్యపోయెను. ఒకసారి దీపావళి పండుగరోజు బాబా ధునివద్ద కట్టెలు వేయుచు, ఒక్కసారిగ తన చేతిని ధునిలోనికి పెట్టెను. మాధవుడనే నౌకరు, శ్యామాను చూసి బాబాను వెనుకకు లాగెను.

బాబాను "ఈ పిచ్చి పని ఏల?" అని ప్రశ్నింపగా సాయిబాబా ఇట్లనిరి. 'చాలా దూరమున ఒక కుమ్మరిస్త్రీ కొలిమి ఊదుచుండగా తన భర్త పిలువగా ఒక్కసారిగా లేవగా తన ఒడిలోని బిడ్డ ఆ కొలిమిలో పడెను. వెంటనే నా చేతిని కొలిమిలోనికి దూర్చి ఆ బిడ్డను రక్షింతిని" అనెను. ఈ దృశ్యములో హఠాత్తుగా బాబా తన చేతిని ధునిలో పెట్టుట చూస్తే ఒక మతిలేని వానిస్థితి మాత్రమే గుర్తుకువస్తుంది కాని సాయి దాని అంతరార్ధము తెలిపిన తరువాత ఆలోచిస్తే ఈ సృష్టిలో ఏ మూల ఏ ప్రాణికైనా ఆపదకల్గిన తను రక్షిస్తున్నాడని ఋజువైనది. శ్రీ సాయి పరమాత్మయే. సాయి తన చేతికి కలిగిన గాయానికి ఎటువంటి వైద్యం తీసుకోలేదు. ఆ రోజునుండి భాగోజీ షిండే అను కుష్టురోగి బాబా కాలిన చేతికి ఆకువేసి కట్టుచుండెడివాడు. ఇది సాయిబాబా మహాసమాధి వరకు జరిగెను. నిజానికి ఈ వైద్యం అవసరమే లేదు. **తాను సృష్టించిన పంచభూతములలో ఒకటైన అగ్నిలో సాయి తన చేతిని పెట్టినంత మాత్రమున కాలటమేమిటి? ఆ అగ్ని బాబాకు వేడికి బదులు చల్లదనమునే ఇచ్చి తన ఋణమును తీర్చుకొనుటకు ప్రయత్నించునే కాని సాయికి బాధ కల్గించదు.** భాగోజీ షిండే నందు గల ప్రేమచే సాయి అతడు చేసే సేవను గైకొనునే కాని సాయికి ఎటువంటి ఆకలిదప్పికలు, బాధలు, నొప్పులు ఎరుగని స్థితప్రజ్ఞుడు. భాగోజీ యొక్క ఈ సేవలూ అతని కుష్టురోమునకు నివారణమునకై సాయి ఆడిన నాటకమిది.

ఒకసారి దాదాసాహెబ్ ఖపర్డే భార్య తన కొడుకుతో శిరిడీలో వున్నప్పుడు తన కొడుకుకి ప్లేగు జ్వరము వచ్చినది. బాబాను వేడుకొనగా బాబా తన కఫ్నీని పైకెత్తి చంకలో కోడిగ్రుడ్లంత నాలుగు ప్లేగు పొక్కులను చూపెను. సాయి ఇట్లనెను. నా భక్తులకొరకు నేను ఎట్లు బాధపడెదనో చూడుము. వారి కష్టములన్నియు నావే". సాయిబాబాను సశరీరముగా ఉన్నప్పుడు ఎందరో జనులు అనేక కోరికలతో బాధలతో వేడుకొనగా సాయి వారి కోరికలను, బాధలను తీర్చుటకై భక్తుల బాధలను సాయిబాబా తనపై వేసుకొని సాయి తన శరీరమునంతా ఇలాంటి ప్లేగు పొక్కులను ఎన్ని భరించెనో కదా! సాయి మహాసమాధి చెందిన తరువాత ఇప్పటికైనా జనులు బాబాను మనసా వాచా స్మరించి శ్రద్ధగా దర్శించి సాష్టాంగ నమస్కారములతో తిరిగి రావడానికి ప్రయత్నించవలెనని మనవి. సమాధిస్థితిలోనున్న సాయికి మన రోగములను, బాధలను, దుః ఖములను అంటించకుండా సాయిని శరణు వేడి తిరిగి రావడానికి ప్రయత్నిద్దాం.

నానాసాహెబ్ చాందోర్కర్ బాబా భక్తుడు. అతడు పందరి పోయి ఉద్యోగములో చేరవలసి యుండెను. ముందుగా శిరిడీలోని సాయిని దర్శించవలెనని బయలుదేరెను. వారు రాకమునుపే సాయి మశీదులో భక్తులతో నిట్లనిరి. "మన మందరము కలసి భజన చేసెదనము. పందరి ద్వారములు తెరచినారు. కనుక ఆనందముతో

పాడుదము లెండు” అనెను. తర్వాత మశీదుకు వచ్చి నానాసాహెబ్‌కు ఆ విషయము తోటి భక్తుడు సాయి పాడిన పాట భావము విని నానాసాహెబ్ ఆనందించెను. శ్రీసాయిని వారితో రమ్మని వేడుకొనుటకు వచ్చిన నానాసాహెబ్ సాయి పాడిన పాటభావన గ్రహించి నిశ్చింతగా వుండెను. బాబా మళ్ళీ పండరీనాథుడని నిరూపించెను.

## ఎనిమిదవ అధ్యాయము

సాయిబాబా ఒకచేత రేకుడబ్బా పట్టుకొని భుజానికి ఒక గుడ్డజోలె తగిలించుకుని భిక్షాటనకు పోయెడివారు. ద్రవపదార్థములను రేకుడబ్బాలో పోసికొనెడివారు. ఘనపదార్థములను జోలెలో వేసికొనెడివారు. సాయిబాబా కొన్ని ఇళ్ళకు మాత్రమే భిక్షాటనకు పోయెడివారు. బాబాకు రుచి అనునది లేదు. వారు సర్వేంద్రియములను స్వాధీనమందు ఉంచుకున్నారు. కావున వారికి జిహ్వాచాపల్యము ఎరుగరు. భిక్షతో వచ్చిన అన్ని పదార్థములను ఒకేసారి కలిపివేసి భుజించెడివారు. భిక్షలో దొరికనవన్నింటిని ఒక మట్టిపాత్రలో వేయగా వాటిని పశుపక్ష్యాదులు తినుచుండెడివి. వాటిని తరిమేవారు కాదు. బాహ్యదృష్టికి వారు స్థిరత్వములేని వారిగా కనిపించినప్పటికి లోన వారు సంపూర్ణ స్థిరచిత్తముతో ఉండెడివారు. అయితే ఈ భిక్షాటన చేయుట, దక్షిణ అడుగుట సంపాదించిన ధనమును, భిక్షను పరులకు మరియు పశుపక్ష్యాదులకు పంచిపెట్టుట చూసిన శిరిడీ జనులు బాబాను ఒక పిచ్చి ఫకీరుగనే భావించిరి గాని ఒక గొప్ప మహాత్ముడని మొదట్లో గుర్తించలేదు. వారిలో కొందరు శ్రీసాయిబాబాగారి చర్యలు అంతుపట్టవని ఎరిగి వారిని ఒక గొప్పయోగిగా మహాత్మునిగా గుర్తించి సేవించిన వారు కలరు.

తాత్యాకోతే పాటిల్ తల్లిపేరు బాయిజాబాయి. ఆమె ప్రతిరోజు మధ్యాహ్నం ఒక గంపలో అన్నం పెట్టుకొని శ్రీసాయిబాబా కోసం వెతికెడిది. ఎక్కడో అడవుల్లో ఆత్మధ్యానములో నిశ్చలంగా తపస్సు చేసుకుంటున్న శ్రీసాయిని కనిపెట్టి భోజనం పెట్టుచుండెడిది. ఆమె భక్తి విశ్వాసములు అద్భుతమైనవి. శబరి శ్రీరామచంద్రునికి పళ్ళను తినిపించినట్లు ఆ పళ్లు తియ్యనివా కావో అని ఆ శబరి కొద్దిగా తిని ఆ ఎంగిలి పండుని భక్తి ప్రేమలతో ఆ శ్రీరామచంద్రునికి తినిపించెడిది. అలాగే శ్రీసాయిరాముడికి బాయిజాబాయి ఎంతో ప్రేమాభిమానములతో రొట్టెను తినిపించుచుండెడిది. అసలు సాయిబాబాకు ఆకలి అన్నది లేదు. దాహంతో సంబంధమే లేదు. కనిపించే దృశ్యములతో బంధము లేదు. బాహ్యంగా తన ఇంద్రియాలను చూచువారికి శ్రీసాయి అనుభవిస్తున్నట్లు కనిపించినప్పటికి ఆ సాయి అను నిత్యము ఆత్మవలోకనంలో నిమగ్నుడై ఉండుటచే దేహసంబంధము దేహంతో పనిచేయు పంచేంద్రియములతో ఎటువంటి సబంధము లేదు. భిక్షాటన చేయటం

మూగ జీవులకొరకే. మరియు ఆ తల్లి బాయిజాబాయి తృప్తి కోసం మాత్రమే సాయి తినేవారు.

ఒకసారి లక్ష్మీబాయి అను సాయిభక్తురాల్ని బాబా చాలా ఆకలివేయుచున్నదని చెప్పి ఏమైనా తీసుకొని రమ్మని వేడెనట. ఆ లక్ష్మీబాయి షిండే రొట్టెకూరను తీసుకువచ్చి సాయి ముందరపెట్టెను. శ్రీసాయి దానిని ఒక కుక్కకు వేసెను. ఆ లక్ష్మీబాయి షిండే కోపంతో ఇట్లనెను. "నేను పరుగెత్తుకొనిపోయి నా చేతులారా నీ కొరకు రొట్టె చేసితిని. దానిని కొంచెమైనా తినక కుక్కకు వేసితివి? అవసరంగా నాకు శ్రమ కల్గించితివి?" అని అనగా శ్రీసాయి, "కుక్క ఆకలి తీర్చుట నా ఆకలి తీర్చుట వంటిది. ఎవరైతే ఆకలితో ఉన్నవారికి భోజనము పెట్టెదరో వారు నాకు అన్నం పెట్టినట్లే". ఈ సంఘటనతో శ్రీసాయిబాబా నిస్వార్థపరుడని తన కడుపుకోసం ఎటువంటి ఆలోచన, శ్రద్ధ లేక ఇతర జీవుల, పశుపక్ష్యాదుల ఆకలిని గమనించి వాటికొరకై ఆహారము తీసుకొని వాటికి పంచెడివారు. అయినా **పరమాత్మకు ఆకలి ఏమిటి? అన్నము సృష్టించినవాడే ఆ పరమాత్ముడు. ఆ సృష్టించిన అన్నము సర్వజీవుల ఉపయోగం కోసమేకాని తాను సృష్టించినది తాను అనుభవిచుట కొరకు కాదు.** బాయిజాబాయి మరియు ఆమె పుత్రుడు తాత్యాపాటిల్ బాబాకు ఎనలేని సేవను చేసిరి. వారివురి సేవను చివరివరకు సాయిబాబా మరువలేదు. తాత్యాకోతే పాటిల్ మరియు భక్తమహాళ్సాపతి శ్రీసాయిబాబా ఈ ముగ్గురు ద్వారకామాయిలో (మశీదు) తమ తలలను తూర్పు, పడమర, ఉత్తరములు చేసి మధ్యలో ఒకరికాళ్ళు ఒకరికి తగులునట్లు పడుకొనెడివారు. ఈ విధంగా తాత్యా 14 సంవత్సరములు తన తల్లి తండ్రులను విడిచి శ్రీసాయిబాబాతో మశీదులోనే పడుకొనినారు. తాత్యా ఎంత అదృష్టవంతుడో కదా! ఆ అనంత పద్మనాభ సాయి ప్రక్కనే శ్రీశేషునిగా తాత్యా పవళించుట ఎంతో చూడముచ్చటైనది. తాత్యా తండ్రి మరణించిన తరువాత బాబా ఆజ్ఞచే అతను తన గృహమునందే నిద్రించుట ప్రారంభించెను.

శ్రీసాయిబాబా ఎవ్వరిని ఎప్పుడు పిలిచెదరో ఎవ్వరికి తెలియదు. తాత్యాను చూసినట్లే, రహతానివాసియగు చంద్రభాను సేఠ్ అన్న కొడుకు కుశాల్‌చంద్‌ను కూడా మిక్కిలి ప్రేమతో చూచుచుండెడివారు. వారి వారి యోగక్షేమములను కనుగొనుటకు శ్రీసాయి రహతా పోవుచుండెడివారు. శిరిడీకి దక్షిణమున రహతా, ఉత్తరమున నీమ్‌గాం కలవు. ఈ రెండు గ్రామములను దాటి శ్రీసాయిబాబా ఎన్నడు ఎచ్చటికి పోయి ఉండలేదు. వారు రైలుబండిలో ప్రయాణం చేసి ఎరుగరు. కాని ఆ రైళ్ళరాకపోకలు ఖచ్చితముగా వారికి తెలియుచుండెడివి. ఇక్కడ శ్రీసాయిబాబా రహతా మరియు నీమ్‌గాం దాటి బాబా ఎన్నడూ ఎచ్చటకి పోయి ఉండలేదు అన్నదానికి అర్థం ఈ రెండు గ్రామాలు ఎప్పుడు దాటలేదు. మరి ఎక్కడికీ పోలేదు అని అనుకుంటే అది అక్షరాల తప్పే. అది కేవలం మాయమాటలు. శ్రీసాయి సాక్షాత్తు పరమాత్ముడు, సర్వాంతర్యామి. ఒకసారి బాబాయే ఇట్లనెను.

“ఎవరైతే బాబాను శిరిడీలో మాత్రమే ఉన్నాడని అనుకొందురో బాబాను నిజంగా గ్రహింపలేరని తెలుసుకో”. **శ్రీసాయిబాబా ఒకే సమయమున యావత్ ప్రపంచములో దర్శనము ఇవ్వగలరు. వారి రాకపోకకు బస్సులు, రైళ్ళు, విమానాలు, నౌకలు వంటి వాహనాలతో ఎటువంటి సంబంధములు లేవు. తన భక్తుడిని చూచుటకు రాత్రిగాని, పగలుగాని అని నిషేధములు లేవు. తన భక్తుని ఇంట తలుపులు వేసివున్నా, ఆ తలుపులకు తాళం ఉన్నా శ్రీసాయి తన భక్తుడి ఇంటిలోపలకు ప్రవేశింపగలరు.** ఆ పరమాత్మసాయి అంతర్యామి, సర్వాంతర్యామి, సర్వవ్యాపి, సర్వప్రపంచమునందు పరమాణువులలో కూడా నిబిడీకృతమై ఉన్నవారు.

## తొమ్మిదవ అధ్యాయము

శిరిడీకి పోవలెనన్న బాబాను దర్శించవలెనన్న మన చేతిలోనిది కాదు. అది ఆ సాయి అనుగ్రహమే. అనుమతి లేకుండా శిరిడీకి వెళ్ళాలన్న ఏ ఆటంకమో కలిగి ప్రయాణం ఆగిపోవును. అలాగే బాబా అనుమతి లేక ఎవరైనా శిరిడీ విడచి వెళ్ళినచో వారు ఊహించని కష్టం తెచ్చుకొనును. సాయిబాబా బయలుదేరమని శెలవు ఇచ్చిన తరువాత శిరిడీలో ఉండరాదు. ఇటువంటి ఘటనలు శ్రీసాయి సూచనతో తెలియపరిచేవారు. ఒకసారి తాత్యాపాటిల్ కోపర్‌గాం పోవలెనని బాబాను అడుగగా శ్రీసాయి బైటకెక్కడికి పోవలదని ఆజ్ఞాపించెను. కాని తాత్యా సంతకు వెళ్ళవలెనని ఆతురతను చూపి కోపర్గాం బయలుదేరెను. కొంతదూరం పోయిన తరువాత తాను ఎక్కిన టాంగా కూలబడెను. మరొక్కసారి ఐరోపా దేశస్థుడు బాబాను దర్శించి శెలవుపొందుటకు కోరగా శ్రీసాయి మరుసటి దినము పొమ్మని చెప్పెను. కాని అతను శ్రీసాయి సలహాను ఉల్లంఘించగా అతనకు తాత్యాకోతేపాటిల్ గతియే అతనూ పొందెను. ఈ సంఘటనలు శ్రీసాయి సశరీరముగా శిరిడీలో ఉన్నప్పుడు జరిగినవి. ఇప్పుడు అనగా సాయి సమాధి తదనంతరము ఎందరో శ్రీసాయి భక్తులకు కూడా ఆ అనుభవము కలుగుచున్నవి. శిరిడీకి వెళ్ళాలని టికెట్టు కొన్న తర్వాత కూడా శ్రీసాయి ఇచ్ఛలేకపోతే ఆ ప్రయాణం వాయిదా పడుతున్నదని అలాగే శిరిడీ ప్రయాణం వెళదామని అనుకోకపోయినా శ్రీసాయి అనుగ్రహంతో అప్పటికప్పుడు శిరిడీకి వెళ్ళి దర్శించినవారు ఎందరో కలరు.

శ్రీసాయి భిక్షాటన చేయువారు కనుక వారు ఒక పిచ్చి ఫకీరని, ఒక వేళ బాబాయే పరమాత్ముడైనచో భిక్షచేసి జీవితమును గడుపనేల అనే సందేహము ఎందరికో కలుగును. సన్యసించువారు మాత్రమే భిక్షాటనమచే జీవించవచ్చునని మన శాస్త్రాలు చెప్పుచున్నవి. శ్రీసాయిబాబా గృహస్థుడు కాదు. వానప్రస్థుడు కాదు. వారు చిన్నతనము నుండి బ్రహ్మచర్యమునే పాటించిరి. ఆంజనేయునికి శ్రీసాయినాథునికి బ్రహ్మచర్యం పాటించుటలో ఇద్దరు సరిసమానమే. ఒకసారి ఒక సాయిభక్తుడు ఒక పూలదండను తెచ్చి ఇవ్వగా శ్రీసాయి ఆ పూలదండను

ఆంజనేయుని మెడలో వేయించెను. గృహస్థులు వారి పనులు చేయుచున్నప్పుడు అనేక క్రిమికీటకాలు మరణించును. ఏ విధంగా అనగా వారు దంచినప్పుడు, విసిరినప్పుడు, పాత్రలు తోమినప్పుడు ఇల్లును ఊడ్చినపుడు పొయ్యిని ముట్టించినప్పుడు – వీటినే పంచసూనములు అందురు. ఈ పనులు చేస్తున్నప్పుడు ప్రతి గృహస్థుడు పాపము ననుభవించవలెను. ఈ పాపపరిహారమునకు ఆరు మార్గములు కలవు. అవే బ్రహ్మ, వేద, పితృ, దేవ, భూతి, అతిథియజ్ఞములు.

దీనికొరకే బాబా ఇంటింటికి వెళ్ళి భిక్ష అడుగుటలో ఆ యింటి గృహస్థులకు వారు చేయవలసిన కర్మలను బాబా జ్ఞప్తికి తెచ్చినట్లయినది. చూసేవారికి భిక్షకొరకే వచ్చారని భిక్షపెడితే వెళ్ళిపోతారని కొందరు మరికొందరు భిక్ష ఇవ్వకపోగా చీదరించుకొనేవారు. ఐనను శ్రీసాయి ఎవ్వరిని ఎక్కువగా గాని తక్కువగా గాని భేదభావములను చూపక 'అల్లా అచ్ఛాకరేగా' అని అభయమిచ్చి వెళ్ళిపోయేవారు. వారు కోరేది అన్నము, రొట్టె కాదు. ఆ యింటి గృహస్థులకు వారు చేయవలసిన కర్మను బాబా జ్ఞప్తిచేయుటకై వెళ్ళేడివారు. కాని తన కొరకు కాదు. ఈ పంచసూనములు గృహస్తుడి పాపములు తొలగుటకు శాస్త్రములు చెప్పిన యజ్ఞములలో, అతిథి యజ్ఞము ఒకటి. శ్రీసాయి భిక్షాటన నెపముతో అతిథిగా ఆ ఇళ్ళకు వెళ్ళి భిక్షను కోరి ఆ యింటి గృహస్థుల పాపములను తొలగిస్తున్నారు. వారిచే కర్మను చేయిస్తున్నారు. తమ భక్తుడు ఏ కారణము చేతనైనను బాబా సమర్పించుకొనుదానిని మరచినచో అట్టివానికి శ్రీసాయి జ్ఞాపకము చేసి ఆ నివేదనను స్వీకరించి ఆశీస్సు లిచ్చేవారు. బాబా సాహెబ్ తర్కడ్ అనునతడు, అతని భార్య, పుత్రుడు కూడా బాబా భక్తులు. తల్లి కొడుకు శిరిడీకి శుక్రవారం బయలుదేరిరి. శ్రీసాయిపూజను తండ్రి నియమానుసారముగా చేసెదనని ప్రమాణము చేయుటచే తల్లికొడుకు శిరిడీకి వచ్చిరి. తండ్రియగు తర్కడ్ శనివారం, ఆదివారం మరియు సోమవారం బాబాకు సక్రమముగా పూజచేసి నివేదన పెట్టిరి. కాని మంగళవారం నాడు పూజ చేసెను కాని నైవేద్యం పెట్టుట మరచెను. అదే మంగళవారం శిరిడీలో మధ్యాహ్న హారతికి ముందు తర్కడ్ భార్యతో బాబా ఇట్లనెను. "తల్లీ! ఏమైననూ తినవలెనని ఉద్దేశ్యంతో నీ యింటికి పోయితిని. తాళం వేసి ఉన్నను లోపల ప్రవేశించితిని. కానీ అక్కడ తినుటకు ఏమీ లేకపోవుటచే తిరిగి వచ్చితి" అనెను. వారిరువురు ఇంటి వద్ద లోటు జరిగెనని గ్రహించిరి. ఈ సంఘటన ప్రకారం **ప్రతి భక్తుడు తన యింట పూజచేసిన పిదప శ్రీసాయి నైవేద్యం తప్పకపెట్టవలెనని నీతిని గ్రహించవలెను. ఆ పరమాత్ముడు ఏ రూపములోనైనా వచ్చి మనము నివేదించిన నైవేద్యం తప్పక భుజించును. ఆ పరమాత్ముని భుక్తశేషమును మన మారగించిన అంతకంటె మనకు భాగ్యము**

**ఇంకొకటి కలదా!**

ఒకసారి ఆత్మారాముని ఆర్య బాబాకు ఒక వంకాయకూర పెరుగుపచ్చడి నైవేద్యము పెట్టుటకై సంకల్పించి రఘువీర భాస్కర్ అను అతడు శిరిడీకి పోవుచుండగా ఇచ్చి పంపెను. బాబా ఆమె ప్రేమభక్తులతో పంపినవాటిని స్వీకరించెను. అలాగే గోవిందబలరామ్ మాన్కర్ శిరిడీకి పోవుచున్నప్పుడు ఆత్మారామ్ భార్య బాబా కొరకై ఒక పేడా పంపెను. ఆ పేడా అప్పటికే గోవిందబలరామ్ మాన్కర్ శిరిడీకి పోవుచున్నప్పుడు ఆత్మారామ్ భార్య బాబాకొరకై ఒక పేడా పంపెను. ఆ పేడా అప్పటికే సాయికి నివేదింపబడియుండెను. ఐనా బాబా కొరకు ఆ పేడాను పంపెను. మాన్కర్ శిరిడీకి వెళ్ళి బాబాను దర్శించెను. కాని ఆ పేడా ఇచ్చుట మరచెను. శ్రీసాయి గుర్తుచేయగా వెంటనే పేడాను తెచ్చివ్వగా సాయి ఆ పేడాను గుటుక్కున మింగెను. "శ్రద్ధాభక్తులతో ఎవరేని పత్రముగాని, పుష్పముగాని, ఫలముగాని లేదా నీరుగాని అర్పించినచో నేను గ్రహించెదన"ని శ్రీకృష్ణుడు భగవద్గీతలో చెప్పినదానిని శ్రీసాయి కృష్ణుడు ఋజువు చేసెను. ఒకసారి ఆత్మారామ్ తర్కడ్‌భార్య శిరిడీలో ఉండగా ఒక రొట్టెముక్కను ఒక కుక్కకు విసిరెను. ఆ కుక్క ఎంతో మక్కువగా ఆ రొట్టెను తినెను. ఆ సాయంత్రం ఆమె మశీదుకు పోగా శ్రీసాయి ఆమెతో ఇట్లనెను. "తల్లీ! నాకు కడుపునిండా భోజనం పెట్టావు. నా జీవశక్తులు సంతుష్టి చెందినవి. ఎల్లప్పుడు ఇట్లే చేయుము" అనెను. దానికి ఆత్మారామ్ భార్యకు అర్థము చేసికొనలేదు. అప్పుడు శ్రీసాయి ఏ కుక్కకు నీవు రొట్టె పెట్టితివో అదియు, నేనూ ఒక్కటే" అని అనెను. **దీనిని బట్టి శ్రీసాయికి సంతుష్టిగా భోజనం పెట్టుట అనగా జీవశక్తులు సంతుష్టి చెందిన యెడల శ్రీసాయికి సంతుష్టిగా భోజనం పెట్టినట్లగును.** పిల్లులు,కుక్కలు, పందులు, ఆవులు, ఈగలు, చీమలు మొదలగునవన్నియు ఆ పరమాత్మ సాయి అంశములే. ఆ సాయియే ఆ ఆకారములలో కనబడుచున్నాడు. ఎవరైతే సకల జీవకోటిలో సాయినే చూడగలరో వారే శ్రీసాయికి నిజమైన ప్రియభక్తులు. అప్పుడే శ్రీసాయి తృప్తిపొందును. జీవుల అన్నింటియందును పరమాత్మని దర్శింపుము అను నీతిని గ్రహించవలెను.

10వ అధ్యాయము

నానాసాహెబు డేంగలే ఒక కఱ్ఱబల్లను సాయిబాబాకు పడకకని ఇచ్చెను. సాయిబాబా ఆ బల్లను ద్వారకామాయి(మశీదున)లో దూలములకు ఊయలగా వ్రేలాడునట్లు పైగా చినిగిన పాతగుడ్డ పీలకలతో గట్టి, దానిపై పండుకొనుట మొదలుపెట్టెను. ఆబా ఆ బల్ల యొక్క నాలుగు మూలల యందు నాలుగు దీపములు పెట్టేవారు. ఒక్కసారి ఆలోచించిన కఱ్ఱబల్ల ఏమిటి? దానిని గుడ్డపీలికలతో కట్టుట ఏమిటి? ఆ బల్లను దూలమునకు ఊయలవలె వ్రేలాడ తీయుట, పైగా నాలుగువైపులా తెల్లవార్లు దీపపు ప్రమిదలలో వెలుగుచూపుట,

ఆ కఱ్ఱబల్లపై మిగిలిన స్థలమున ఆజానుబాహుడవగు బాబా పడుకొనుట ఎంత విడ్డూరం. ముందు ఆ కఱ్ఱబల్లను దూలమునకు కట్టిన పిదప, అసలు దానిపై ఎట్లు ఎక్కుట, ఎట్లు దిగుట? ఆశ్చర్యకరమైన విషయం. **యోగుల చర్యలు అంతు పట్టనివి. ఒక్కొక్కసారి పిచ్చివారిగా ప్రవర్తిస్తూ ఒక్కసారిగా చమత్కారం ఒక మెరుపులా కనురెప్పపాటులో వింత చూపి ఆశ్చర్యపరిచెదరు.** ఒక్కొక్కసారి అసాధ్యమైన చర్యలు (ఉదాహరణపై చెప్పిన కఱ్ఱబల్ల దృశ్యం) చూపించి మనం ఆశ్చర్యచకితులై వారు సామాన్యులు కారు, దైవమే అనుకొనిన సమయమున వెంటనే ఆ చమత్కారమును విరమించి మళ్లీ సామాన్యునిగా, పిచ్చివానిగా ప్రవర్తించి ఆ యోగి చేసే చర్య నిజమైనను మనం చూసే కళ్ళకు భ్రమయేమోనని కల్పిస్తారు. ఇక్కడ శ్రీసాయి చూపిన అసాధ్యమైన పని, ఆ కఱ్ఱబల్ల దానిపై పండుకొనుట జనులలో సంచలనం కలిగింది. బాబాను దైవమని గ్రహించే లోపల, శ్రీసాయి విసుగుచెంది ఒకనాడు ఆ కఱ్ఱబల్లను విరచి పారవైచిరి. ఆ సంఘటన చూచినవారికి మళ్లీ శ్రీసాయి పిచ్చివానిగానే ప్రవర్తించినట్లు కనబడును.

శ్రీసాయి మానవదేహంతో కనిపిస్తున్ననూ, వారు సాక్షాత్తు పరబ్రహ్మ. వారి అంతరంగమున ఎటువంటి బంధములు, కోరికలు మరియు ఇంద్రియములకు లోను గాక ఎల్లప్పుడు పరబ్రహ్మ స్థితియందే ఉండును. కానీ బయటకు సామాన్యుడివలె నటించుచుండెడివారు. ఒక్కొక్కసారి కోపం ప్రదర్శించెడివారు. ఆ కోపము కూడా తన నటనలో ఒక భాగమే గానీ, నిజం కాదు. బయటకు ప్రపంచమునందు తగులుకొనినవారివలె నటించినను, లోన వారికి ప్రపంచముతో ఎటువంటి సంబంధము లేదు. నిజానికి వారికి ప్రపంచమే కనబడదు. సర్వం బ్రహ్మమయముగా కనిపించి, పరబ్రహ్మస్థితిలోనే మునిగియుండును. నిజానికి వారి అవతారం హిందువులకు, మహమ్మదీయులకు సమైక్యం నెలకొల్పుటకే వారెప్పుడు శ్రీరాముడు, రహీమ్ ఒక్కరేనని చెప్పెడివారు. శ్రీసాయిబాబా నిజానికి సద్గురువు, పరమగురువు, కానీ వారు ఎప్పుడు తనగురించి వారి గొప్పతనము గురించి చెప్పుకొనలేదు. వారు ఎల్లప్పుడు సహజస్థితిలోనే ఉంటూ వారిని నమ్ముకున్న భక్తులను అదే సహజస్థితిలో యందు ఉండునట్లు చేసి ఆ భక్తులను ప్రపంచపు ఉనికికి అతీతముగా తీసుకొని వెళ్ళేవారు. అటువంటి శ్రీసాయి సద్గురువు వారికి భేదభావము లేదు. పూజించిన వారిని తనను నిందించిన వారిని సమానముగా చూచుచుండెను. వారు శరీరముతో కనిపించుచున్నను వారికి దేహముపై అభిమానం లేదు. వారు నిశ్శరీరులు.

భగవంతుని లక్షణములన్ని శ్రీసాయిలో కనిపించును. నిజానికి వారే భగవంతుడు. మనకొరకు మానవరూపమును దాల్చెను. ఎటువంటి ఆడంబరములు శ్రీసాయికి లేవు. వేటిపైనా వ్యామోహము లేదు. ఒకసారి శ్రీసాయి వారి గద్దెపై కూర్చుని ఉండగా నానావళి అనే ఒక విచిత్ర భక్తుడు సాయి దగ్గరకు వచ్చి

శ్రీసాయిని ఆ గద్దెపై నుండి లేవవలసినదని, ఆ గద్దెపై నానావళికి కూర్చుండవలెనని బుద్ధిపుట్టెను. శ్రీసాయి ఏమీ మాట్లాడక తన గద్దెనుండి దిగి నానావళిని కూర్చోనిచ్చి తన కోరికను తీర్చెను. పరమాత్ముడు తన భక్తులకొరకు సర్వం పరత్యదించెదరు. శ్రీకృష్ణపరమాత్ముడు, తన భక్తుడైన ఏకనాథుడి ఇంట్లో ఆ కృష్ణుడు శ్రీఖండుడనే పేరుతో వంటవాడిగా ఏకనాథునికి తన నిజస్వరూపం తెలియకుండునట్లు ఆ భక్తుడి ప్రేమకు లోనై వంటవాడిగా పనిచేస్తూ భక్తుని ఇంట్లోనే 12 సం॥లు వుండెనట. ఏకనాథుడు శ్రీఖండుడను మామూలు వంటవాడని భ్రమించి గిన్నెలు తోమిస్తూ గంగ నుండి నీరు తెప్పిస్తూ వుండేవాడట. కృష్ణప్రాప్తికోసం ఒక బ్రాహ్మణుడు శ్రీకృష్ణుని రహస్యము తెలుసుకొని, ఏకనాథుని ఇంటికి వెళ్లి నిజం చెప్పగా, ఆ ఏకనాథుడు ఎంతో బాధకలిగి ఆ పరమాత్ముని చేతనే సేవ చేయించుకున్నందుకు సిగ్గుపడి ఏడవసాగెను. ఐనా, ఆ కృష్ణపరమాత్మ ఇటువంటి అవమానమును, బాధలను తన మనస్సున పెట్టుకొనక తన భక్తునికోసం భరించెనట. అట్లే పరమాత్మగు శ్రీసాయి తన గద్దెపై కూర్చునప్పుడు నానావలి ఆ స్వామిని లెమ్మని చెప్పి తాను ఆ గద్దెను ఆక్రమించినను, ఆ సాయికి ఎటువంటి అవమానము బాధ కలుగలేదు. తన భక్తుని కొరకు తాను, అట్లు ప్రవర్తించెను. దేవుడికి తన భక్తులంటే ఎంత ఇష్టమో తెలియుచున్నది. శ్రీనారాయణుడు తన భక్తుడుపైన గజేంద్రుని కొరకు మకరం బాధనుండి తన భక్తుడైన గజేంద్రుని మొర ఆలకించిన వెంటనే తన భార్య లక్ష్మీదేవికి చెప్పక, ఆ నారాయణుని ఆయుధములు అయిన శంఖచక్రములను ధరింపక ఉన్న పళముగా వట్టి చేతులతోనే గజేంద్రునిని రక్షించుటకు పరిగెత్తెనట. ఆ నారాయణుని వెంట లక్ష్మి, శంఖచక్రములు కూడా వెంబడించెనట. భగవంతునికి తన భక్తుడంటే ఎంత ఇష్టమో, తన భక్తుని కొరకు ఆ దేవుడు ఎంత ప్రాముఖ్యతను ఇచ్చునో స్పష్టముగా ఈ సంఘటనముల ద్వారా ఋజువగుచున్నది, “ఆహా ! శ్రీసాయి పరమాత్మయే!”.

## పదకొండవ అధ్యాయము

కొంతమంది భక్తులు వారి స్నేహితులతో కూడి శిరిడీకి వచ్చుచుండెడివారు. అటువంటి స్నేహితులలో కొంతమంది బాబాను పూజించుటకు ఇష్టపడెడివారు కాదు. ఎందుకంటె బాబా పై పై ఆకారమును బట్టి మశీదులో ఉండుట బట్టి అప్పుడప్పుడు మాంసాహారము తినుటబట్టి శ్రీసాయి ముసల్మాను అని అట్టివారిని బ్రాహ్మణులైనవారు పూజించనచో మైల పడునని భావించుకొనుచు ఊరకే శిరిడీకి వచ్చెడివారు. మరికొందరు ఎట్టి దురభిమానము లేకుండా వారి వారి గురువులుగా భావించి వారి గురువుని తలంచుకొని శ్రీసాయిని కొలిచెదరు. ఇటువంటి మిత్రులతో ఒకరు డా॥పండిట్ వీరు తాత్యాసాహెబ్ నూల్కర్ మిత్రుడు. అతను ఒకసారి శిరిడీకి వచ్చెను. శ్రీసాయి నుదుటిపై చందనము పూసెను. అక్కడ ఉన్న భక్తులందరు ఆశ్చర్యచకితులైరి.

ఎందుకంటె శ్రీసాయి నుదుటిని తాకే అర్హత ఒక్క భక్త మహల్సాపతికి మాత్రమే ఐనను ఆ మహల్సా చందనమును శ్రీసాయి కంఠమునకు మాత్రమే పూసెడివారు. దాదాభట్ ఈ సంఘటనను చూసి సాయితో ఇట్లనెను. "మేమెవ్వరము చందనము పూయుదుమన్న నిరాకరించెదవు. డా॥పండిట్ విషయమున ఊరకుంటివేమి?". అందుకు బాబా, "నేనొక ముసల్మాన్‌నని తానొక సద్బ్రాహ్మణుడని కావున నన్ను పూజించుట ద్వారా తాను మైలపడిపోవుదునని దురభిమానము లేకుండా అతడు నాలో తన గురువును భావించుకుని అట్లు చేసెను. అతని నిష్కల్మషమైన భక్తి నన్ను కట్టివేసినది. దాదాభట్ డా॥పండిట్‌ని ఇదే ప్రశ్నించగా అతను శ్రీసాయిని తన గురువుగా భావించి అట్లు చేసితిననెను. శ్రీసాయి డా॥పండిట్‌ని మనసులో దాగిన దానిని గ్రహించి అట్లు ప్రవర్తించెను. **కులమతములు దైవమునకు లేవు. అవి మానవులు కల్పించుకొనినవి**. శ్రీసాయి, రామ్, రహీమ్ ఒక్కరేనని ఎల్లప్పుడు చెప్పుచుండెడివారు. అసలు శ్రీసాయి మహమ్మదీయుడా? హిందువా? అన్నది ఎవ్వరికిని తెలియదు. వారు మశీదులో ఉన్నప్పటికిని చూచుటకు ఒక మహమ్మదీయునివలె కనిపించునప్పటికి వారు హిందూధర్మ ఆచారములను ఎన్నడూ ఉల్లఘించలేదు. పైగా అన్న సంతర్పణము చేయు సమయములలో శాఖాహారులకు, మాంసాహారులకు ఎటువంటి అభ్యంతరములు కలుగకుండా వేరు వేరు పంక్తులలో కూర్చోనిచ్చి శాఖాహారులను ఎట్టి పరిస్థితులలోను మాంసాహారముతిన నిచ్చేవారు కాదు. హిందువు, ముసల్మాన్, క్రైస్తవులు మొదలగు మతములతో ఆయా మతస్తులు వారి వారి మతాచారముల ప్రకారము ఆచరించెదరు. దేహసంబంధముతో ముడి వేసికొనుట వలన బాహ్యంగా కనపించే ప్రపంచము, జనులు, శరీరము, నామరూపములు, సంసారబంధములు కల్గించుకొనెదరు. దీనికి గల కారణము నేన దేహమునే అన్న భావించుటవలన సుఖదుఃఖములు, జననమరణములు అనే చక్రములో పడి జీవుడు కొట్టుమిట్టాడుతూనే యుండెదరు. కాని ఏ మతస్థులైనను హిందువైనా, మహమ్మదీయుడైనా, క్రైస్తవుడైన ఆత్మావలోకన జ్ఞానదృష్ట్యా చూచినచో ఆ అందరి మతస్తులలో నివశించేవాడు పరమాత్మ. ఆ పరమాత్మకు ఎటువంటి కులమతములు లేవు. డా॥పండిట్ శ్రీసాయిలో తన గురువును భావించుకొని సాయికి నుదుటిపై చందనము పూసెను. అలాగే ప్రతి భక్తుడు కూడా ప్రపంచములో కనిపించే ఏదైనను అనగా జీవుడు, పశుపక్ష్యాదులు వస్తువులు చెట్టు కొండకోనలు ఇలా ఎందెందు వెతికినా ఆ పరమాత్మనే భావించుకుని ఆయా వస్తువులను కాని జీవులను కాని చూసినచో పరమాత్మనే దర్శింతురు. అప్పుడు శత్రువు, మిత్రుడు అనీ భేదముండదు. ఒక్కొక్కసారి శ్రీసాయి మిక్కిలి చిత్రముగా ప్రవర్తించెడివారు. ఒక్కొక్కప్పుడు పూజాద్రవ్యపళ్ళెములను విసిరివేసెడివారు. ఒక్కొక్కప్పుడు శాంతితో ప్రవర్తించేవారు. ఎవరైనా శ్రీసాయి ప్రవర్తన చూసి ధైర్యముచేసి ఇటువంటి ప్రవర్తనను గూర్చి ప్రశ్నింపగా శ్రీసాయి ఇట్లనెడివారు, "తల్లి తన బిడ్డలను కోపించి తరిమివేయునా? నెనెప్పుడు మీ క్షేమములను

కోరెదను. నేను మీ సేవకుడను. నేనెప్పుడు మీ వెంటనే ఉండి పిలిచిన పలుకుదును” అని అనెడివారు.

శ్రీసాయి ఎప్పుడు ఏ భక్తుణ్ని ఎట్లు ఆశీర్వదించెదరో ఎవ్వరికీ తెలియదు. అది వారి ఇచ్ఛపై ఆధారపడియుండును. కొందరిని చాలా తొందరగా మశీదులో రానిచ్చెడివారు. మరికొందరిని నెలలు తరబడినా వారికి ప్రాప్తము కలుగజేసెడివారు కారు. హాజీసిద్ధిక్ ఫాల్కే అను మహమ్మదీయుడు. మక్కామదీనా యాత్రలు చేసి శిరిడీకి వచ్చినను బాబా వానిని ద్వారకామాయిలో రానివ్వ లేదు. అలా 9 మాసములు గడిచిపోయినవి. అయినా ఫాల్కేకు ప్రాప్తము కలుగలేదు. ఈ విషయమును సాయి ముఖ్య భక్తుడైన శ్యామాతో విన్నవించగా హాజీ తరపున శ్యామా శ్రీసాయిని వేడుకొనగా, బాబా “అల్లా ఒప్పుకొననిచో నేమి చేయగలను. ఈ మశీదులో పాదము పెట్టగలవారెవ్వరు? **ఇక్కడ గమనించవలసిన విషయమేమిటంటే శ్రీసాయి మహాసమాధి చెందక పూర్వము, సమాధి చెందిన తరువాత ఈ రోజువరకు కూడా ద్వారకామాయిలో కాలు ఎవ్వరైతే మోపినారో వారు ఆ అల్లా (సాయి) ఒప్పుకొనెనని వారి కటాక్షము కలదనియు కావుననే శిరిడీలో ద్వారకామాయిన (మశీదున) కాలు పెట్టగలిగినారు అనే సత్యాన్ని గ్రహించవలెను. ఈ రోజుకు శిరిడీకి వెళ్ళనివారు సాయి దర్శనము చేసికొనవలెనని సంకల్పించినను వారి కోరిక నెరవేరనివారు ఆ అల్లా (సాయి) ఒప్పుకొనలేదని కావుననే శిరిడీకి వెళ్ళలేకుండిరనే సత్యాన్ని గ్రహించవలెను.** శ్రీసాయి శ్యామాతో బావి వద్దనున్న ఇరుకు కాలిబాటన రాగలడా అని, రూ.40వేలు 4 వాయిదాలలో ఇవ్వగలడా అని, ఈనాడు మేకను కోసెదము, మాంసము కావలెనా? వృషణములు కావలెనా? అని హాజీని కనుక్కుని రమ్మనెను. హాజీ సాయి చెప్పిన షరతులన్నిటికి ఒప్పుకొనెదననెను. శ్రీసాయి అడిగినవన్నీ చూచుటకు, వినుటకు చాలా చిత్రముగను సంబంధము లేనివిగను కనిపించును. వెంటనే సాయి కొలంబా, నీటికుండలు మశీదులో ఉన్నవి, తీసి బైటకి విసిరివేసెను. బాబా ప్రవర్తన చూడగా ఎవ్వరికైనను భయము మరియు పిచ్చి ప్రవర్తన అని మనస్సున అనుకోక తప్పదు. శ్రీసాయి కోపముతో హాజీ దగ్గరకు వెళ్లి ఇట్లనెను. “నన్ను గూర్చి ఏమనుకుంటున్నావు? నీవు గొప్పవాడవని పెద్ద హాజీవని గొప్పలు పోవుచున్నావు. నా దగ్గరా నీ ఆటలు. ఖురాన్ చదివినను తెలిసికొన్నది ఇదేనా? మక్కామదీనా యాత్రలు చేసినను గర్వముతో నేనెవరినో తెలిసికొనలేకున్నావు?” అని తిట్టి వెళ్ళిపోయెను. తరువాత బాబా కొన్ని గంపల మామిడి పండ్లను హాజీకి పంపెను. హాజీ వద్దకు వచ్చి 55 రూపాయలు హాజీకి ఇచ్చెను. ఎంత విడ్డూరము! అంతలో కోపము. ఇంతలో శాంతము. ఒక్కసారి పెద్దవాన వెంటనే మబ్బు వీడి ఎండ కాచినట్లు అవధూతల లక్షణములు ప్రవర్తన చాలా తమాషాగా చిత్ర విచిత్రములుగా బోధపడవు. ఆనాటి నుండి హాజీ మశీదులో స్వేచ్ఛగా కాలుమోపి సాయి భక్తులలో ఒకడైనాడు.

అయితే శ్రీసాయి ఈ కోపావేశములు ఆజ్ఞలు ఒక్క మనుష్యులపైనేనా అని ప్రశ్నింపగా బాబా పంచభూతములపై కూడా చూపెడివారు. శిరిడీలో ఒకసారి ఒక పెద్ద తుఫాను సంభవించి జనం, పశుపక్ష్యాదులతో సహా భయపడినప్పుడు బాబా మశీదునుండి పైకి చూస్తూ "ఆగు ! నీ తీవ్రత తగ్గించు" అని అనగా వెంటనే తుఫాను ఆగిపోయెను. అలాగే మరొక్కసారి ధునిలోని మంటలు పైకి లేవగా అక్కడున్నవారు భయపడుతున్న సమయమున శ్రీసాయి తన చేతిలో సటకాతో పక్క స్తంభముపై కొట్టుచు "దిగు దిగు శాంతింపుము" అని అనగానే మంటలు తగ్గిపోయెను.

## పంద్రెడవ అధ్యాయము

ఎవరైనా సరే వారి వంతురానిదే వారు శ్రీసాయిని స్మరించుటకాని, వారి లీలలు ఎరుగుట గాని బాబాను దర్శించుటగాని కలుగదు. అట్టి వారికి బుద్ధి కూడా పుట్టదు. కొందరు శ్రీసాయిని శశీరులుగా ఉన్నప్పుడు వారు మహాసమాధి చెందులోపల దర్శించుకొనవలెననుకొనినను వారికి అవకాశము కలుగలేదు. ఎవరి ఇష్టానుసారము జరుగదు. ఒకసారి కాకామహాజని శిరిడీకి పోయి బాబా దర్శించిన వెంటనే శ్రీసాయి "ఎప్పుడు తిరిగియింటికి పోయెదవు?" అని ప్రశ్నించెను. బాబా ఆజ్ఞ ప్రకారము అక్కడ అతను ఒక వారం ఉందామని అనుకొన్ననూ మరునాడే శిరడీని విడిచెను. వానికొరకు తన యజమాని కనిపెట్టుకొనియున్నట్లు తెలిసెను. కాబట్టి శ్రీసాయి సన్నిధిలో ఉండవలెననుకొన్ననూ ఉండలేకుండిరి. దీనికి భిన్నముగా బాపూ సాహెబ్ ధుమాల్ అను ప్లీడరు కోర్టుకేసుపై పోవుదారిలో శిరిడీలో దిగి బాబాను దర్శించగా బాబా ఆ ప్లీడరును నిఫాడ్‌కు పోవుటకు అనుజ్ఞ ఇవ్వలేదు. శిరిడీలో ఒక వారం ఉండునట్లు చేసెను. తర్వాత అతడు నిఫాడ్ కోర్టులో మేజిస్ట్రేటుకు అనారోగ్యము కారణముచే తన కేసు వాయిదా పడినదని తెలిసికొనెను. కాబట్టి శ్రీసాయి సమర్థుడు రాసినట్లుగా జరుగనున్నది జరుగక మానదు, అనే సత్యము ఋజువైనది. నానాసాహెబ్ నిమోంకర్ మెజిస్ట్రేట్ తన భార్యతో శిరిడీలో కొంతకాలముండెను. బేలాపూర్‌లోనున్న వారి కుమారుడు జబ్బు పడినట్లు తెలియగా తల్లి బేలాపూర్‌కు పోయి తన బిడ్డను చూడదలిచెను. నానాసాహెబ్ కుమారునిచూసి మరునాడే తన భార్యను శిరిడీకి రమ్మనెను. ఆమె సాయిని అనుమతి కోరగా శ్రీసాయి బేలాపూర్‌లో "నాలుగు రోజులు ఉండి నెమ్మదిగా ఇక్కడకు రమ్ము" అనెను.

మూళేశాస్త్రి అనే బ్రాహ్మణుడు గొప్ప జ్యోతిష్యుడు. అతను బాపూసాహెబ్ బూటీని కలుసుకొనుటకు శిరిదీకి వచ్చెను. శ్రీసాయిని దర్శించిన పిదప బాబా తన డబ్బుతో మామిడి పండ్లను కొని మశీదులో నున్న

వారందరికి పంచిపెట్టుచుండగా మూళేశాస్త్రి జ్యోతిష్కుడగుటచే బాబా అరచేతిని చూచుటకు ప్రయత్నించెను కాని బాబా అవకాశము ఇవ్వలేదు. బాబా హఠాత్తుగా “ఎర్రరంగు తయారుగా నుంచుడు. ఈనాడు కాషాయవస్త్రము ధరించెదను” అనెను. మధ్యాహ్నం బాబా మూళేశాస్త్రి దగ్గరకు బూటీని పంపి దక్షిణ ఇమ్మని అడిగెను. మూళేశాస్త్రి శ్రీసాయికి ఎందుకు దక్షిణ ఈయవలెనని తన మనస్సులో అనుకొనెను. బూటీయే స్వయముగా వచ్చి అడుగుటచే కాదనలేక బూటీతో మశీదుకు పోయి బాబాను తదేకముగా చూస్తూ ఒక్కసారిగా శ్రీసాయిపై పూలవర్షమును కురిపించెను. తమ గురువగు ఘోలప్‌స్వామిని అక్కడ ఆశీనులై ఉండుట చూచి ఆశ్చర్యపడెను. గురుపాదములపై పడి లేచి మొక్కుతూ నిలబడెను. అక్కడున్నవారందరు సాయి హారతి పాడుచుండెను. మూళేశాస్త్రి తన గురునామమును ఉచ్ఛరించుచుండెను. తన సందేహము తీరినదనియు తనకు గురు దర్శనమైనదనియు మశీదులోనున్న వారందరికి మూళేశాస్త్రి చెప్పెను. ఎర్రరంగు తయారుగా ఉంచుడు, ఈనాడు కాషాయవస్త్రము ధరించెదను అనే శ్రీసాయి పలుకులకు అర్థము తెలిసికొనిరి. **ఏ భక్తుడైనను తను నమ్ముకొన్న వానినే అను నిత్యం భక్తి విశ్వాసములతో ఏకాగ్రతతో తను నమ్ముకొన్న గురువైనను, దైవమైనను ఆ మహాత్ముని పాదములనే గట్టిగా పట్టుకొని మధ్యలో ఇంకొకరు అనే భావన తలంపులేక ఉన్న భక్తుడికి ఏ యోగినైనను చూసినను చూడబడ్డ ఆ యోగి చూసిన భక్తుని నమ్మిన గురువునే కాని దైవమునే కాని ఆ రూపమునే దర్శింపచేయును. ఇది చూసేవాడు ఎంత గొప్పవాడో చూడబడ్డ ఆ మహాపురుషుడు కూడా అంతకన్న గొప్పవాడు. ఎందుకంటే ఆ మహాపురుషుడు తానే గొప్పవాడని తన రూపమే సత్యమని తనను చూసిన భక్తుడిని తనవైపు లాక్కొనుటకు ప్రయత్నించక చూసిన వాని గురురూపమున లేదా దైవరూపమున దర్శనమిచ్చుట ఎంతో గొప్ప విషయము. ఇటు చూసిన భక్తుడు కూడా తన విశ్వాసమును ఎన్నడూ కోల్పోకతను నమ్ముకున్న గురువైనను దైవమైనను తనను ఎల్లప్పుడు కాపాడుతు తన వెంట నీడలా నుండి దర్శనము ఇస్తాడనే నమ్మకము స్థిరపడిపోవును.**

ఒకనాడు మమలతదారు తన స్నేహితుడగు డాక్టరుతో శిరిడీకి వచ్చెను. ఆ డాక్టరు తన ఇష్టదైవం శ్రీరాముడని తాను ఒక మహమ్మదీయునికి నమస్కరించనని చెప్పగా ఆ మమ్‌లతదార్ తనతో సరదాగా గడుపుటకు రమ్మని కోరగా అతడు శిరిడీలో బాబాని దర్శించెను. అందరికంటే ముందుగ ఆ డాక్టరే శ్రీసాయిని నమస్కరించుట చూసి అక్కడున్న వారందరు ఆశ్చర్యపోయిరి. కారణం మూళేశాస్త్రికి తను నమ్ముకున్న గురవగు ఘోలప్‌స్వామి రూపమున శ్రీసాయి దర్శనమిచ్చినట్లుగా ఇక్కడ డాక్టరుకు తాను నమ్ముకున్న దైవమగు శ్రీరామచంద్రుని రూపములో సాయి దర్శనమిచ్చెను. నల్లని ఒత్తైన జుట్టుతో నీలమేఘశ్యాముని రూపముతో విశాల నుదుటిభాగంపై తిలకము, సూర్యచంద్రుల వంటి కన్నులతోను పొడవైన అందమైన నాసికముతోను

చిరునవ్వుల పెదవులతోను అజానుబాహుడు అరవిందదళాక్షుడు పట్టుపీతాంబరములతో రాయిపై ఆసీనుడైయుండుట చూసిన ఆ డాక్టరు ఒక్కసారిగ శ్రీసాయిపాదములపై సాష్టాంగ నమస్కారములు చేసెను. తిరిగి చూడగా అక్కడ శ్రీసాయి కూర్చొనుట చూసెను. మరి బాబా మహమ్మదీయుడా? హిందువా? రామ్, రహీమ్ అంతుపట్టనది. శ్రీసాయి ఇట్లనెను, "ఎవ్వరైనా వచ్చి నిన్నిక్కడకు రమ్మని పిలిచితిరా?" ఆ డాక్టర్ సాయిప్రశ్నను విని ఆశ్చర్యం చెందెను. అతనికి ఆనాటినుండి బాబాపై అనన్యమైనటువంటి భక్తి కలిగినది.

## పదమూడవ అధ్యాయము

బాబా మాటలు చాలా లోతైన భావములతో నిండిఉండును. అవి అర్థం చేసికొన ఎంతో మేలును సత్యమును తెలిసికొనగలుగుతాము. బాబా పలుకులు ఒకటికి రెండు సార్లు చదివి దానిలోని మర్మమును తెలిసికొనవలెను. ఉదాహరణ ఒకసారి శ్రీసాయి ఇట్లనెను. "నేను ఫకీరునయినప్పటికి తప్పించుకొనలేని మాయ నన్నును బాధించుచున్నది. హరి యొక్క మాయ బ్రహ్మాదులనే చికాకు చేయగా ఫకీరుడను నేనెంత. హరి ప్రసన్నుడయితే ఆ మాయను తప్పించుకొనుటకు సాధ్యం. నిరంతరం హరిభజనయే దానికి మార్గం". ఇందులో శ్రీసాయి తనను గురించి చెప్పుకునే పలుకులు కావు నిజానికి. ఆయన సాక్షాత్తు విష్ణువే. కాని మనలను మభ్యపెట్టుటకై నేను ఫకీరు అయినప్పటికి అని మొదలుపెట్టి, తప్పించుకొనలేని మాయ నన్నును బాధించుచున్నది అన్నారు. **ఈ నన్నును అనే పదము రెండర్థాలు యిస్తాయి. ఒకటి మనల్ని మభ్యపెట్టే ఫకీరుగా, రెండవది అతి ముఖ్యమైనది "నన్నును" అనగా "ఒక విశేష పురుషుణ్ణి" సూచిస్తున్నది. అనగా ఆ విశేషపురుషుడే పరమాత్మ.** పరమాత్మకు మాయ అనునది ఉండదు. కాని తాను ఒక అవతార రూపమున వచ్చినప్పుడు ఆ మాయ తనకును అంటినట్లు చూపించెదరు. భగవద్గీతలో శ్రీకృష్ణపరమాత్ముడు కర్మయోగములో అర్జునునికి కర్మలు అవలంబించుట గూర్చి చెప్పుచున్నప్పుడు తాను కూడా కర్మలను ఆచరించెదనని చెప్పెను. నిజానికి కృష్ణుడు కర్మాతీతుడు. కర్మములతో ఎటువంటి సంబంధము లేదు. కాని లోకులు వారికంటె పెద్దవారిని తెలిసినవారిని జ్ఞానుల భోదనలను వారి పద్ధతులను అనుసరించెదరు. కృష్ణుడంతటివాడే కర్మ అవసరం లేదని చెప్పినాడు కదా! ఇంక మనమెందుకీ కర్మ చేయవలెనని తలచి కర్మను వదలివేసెదరని ఆ కృష్ణుడు లోక సంరక్షణకోసము కర్మను విధించినట్లు నటించెను. అట్లే శ్రీసాయి తనకు మాయతో ఎటువంటి సంబంధము లేకపోయినను "నన్నును ఆ మాయ బాధించిచున్నది" అని ఎందుకు సంభోదించినారంటే మన అందరి కోసమే. ఎటువంటి వారికైనను ఏ క్షణములో మాయ కమ్మివేయునో ఆ మాయా ప్రభావముచే అహంకారము కలిగి మానవుడు

పతనమైపోయే సందర్భములు రాకూదనే బాబా ఆ మాయల గురించి అంతగా నొక్కి చెప్పుచున్నారు. ఆ మాయనుండి తప్పించుకొనుటకు నిరంతరము హరిభజనయే మార్గమని శ్రీసాయి అన్నారు. అంటే అనునిత్యము దైవనామస్మరణముతో ఆ భగవానుని ఆరాధిస్తూ స్మరస్తూ భజించే వానికి ఏ మాయా ఏమీ చేయలేదని చెప్పుచున్నాడు. సాయి పలికిన పలుకులు ఎన్నెన్నో. పై చెప్పిన ఉదాహరణ ఒక మచ్చుతునకే ఇలా బాబా మాటల్లో భావములను అర్థం చేసుకొన్న ఎంతో జ్ఞానాన్ని పొందవచ్చును.

ఇంకొకసారి శ్రీసాయి ఇట్లనెను. "పూజాతంతుతో నాకు పనిలేదు. షోడశోపచారములు గాని, అష్టాంగయోగములు గాని నాకు అసవరము లేదు. భక్తియున్నచోట నా నివాసము" అని అన్నారు. పై ఉదాహరణను ఈ మాటలను గమనిస్తే బాబా ఎవరో అర్ధమౌతుంది. పైన ఉదాహరణలో బాబా నేను ఫకీరుని మాయ బాధిస్తుంది అన్నారు మామూలు మనిషివలె. ఇక్కడ పూజ తంతుతో నాకు పనిలేదు. షోడశోపచారములు, అష్టాంగయోగములు అవసరములు లేదన్నారు. పూజ చేసేది ఎవరికీ భగవంతునికేగా. మరియు భక్తియున్న చోట నా నివాసమన్నారు. భక్తుని ఇంట్లో నివసించేది ఎవరు? భగవంతుడే. సాయి సాక్షాత్ పరమాత్మయే.

భీమాజీ పాటిల్ ఊపిరితిత్తుల రోగంతో బాధపడుచు శ్రీసాయిపాదములను ఆశ్రయించి రోగ నివారణముకై వేడుకొనెను. అందుకు బాబా చేసిన వైద్యం ఏమీ లేదు. కాని రెండు స్వప్నములలో తన బాధను నివారించెను. మొదటి స్వప్నంలో భీమాజీపాటిల్ ఒక పాఠశాల విద్యార్థిగా పద్యము చెప్పనందుకు ఉపాధ్యాయుడు దెబ్బలు కొడుతున్నట్లు కనిపించెను. రెండవ స్వప్నంలో వాని ఛాతీపై పెద్ద బండను వైచి త్రోయుచు బాధను అనుభవించుచు కనిపించెను. ఈ రెండు స్వప్నముల బాధలతో అతని జబ్బు నివారణమైనది. ఇలాగే ఒక భక్తుని కండ్లు వాచి ఎర్రబడినప్పుడు బాబా నల్లజీడిగింజలను నూరి ఒక్కొక్క కంటిలో ఒక్కొక్కమాత్రగా తయారుచేసి వాటిని పెట్టి కట్టు కట్టిరి. మరునాడు కట్టు విప్పగా కండ్లు మామూలు స్థితికి వచ్చెను. ఈ ఇద్దరి రోగులకు బాబా చేసిన వైద్యం వేరుగా కనిపిస్తుంది. ఒకరిని తాకనైనా తాకలేదు కాని స్వప్నముద్వారా నివారించెను. ఇందు తన గొప్పతనము చమత్కారము కనబడుచున్నది. కాని రెండవరోగి విషయంలో పూర్తి విరుద్ధము వాచినవి, ఎర్రబడినవి అగు రోగి కళ్ళకు నల్లజీడి పిక్కలను నూరి కళ్ళలో పెట్టుట ఎంత కఠినవైద్యము. కళ్ళు మండిపోతాయి. చూసేవారికి వైద్యుడు పిచ్చివాడా అని అనిపించేటట్లు కనిపిస్తుంది. అదే శ్రీసాయి యొక్క అవతారం. పట్టుకొనుటకు సాధ్యం కాకపోవడము.

ఒకసారి బాలాగణపతికి మలేరియా సోకినప్పుడు బాబా వానికి లక్ష్మీమందిరము ముందున్న నల్లకుక్కకు పెరుగన్నం పెట్టించి వాని జ్వరమును తగ్గించెను. మరొకసారి బాపూసాహెబు బూటీ విరోచనములతోను, వమనములతోను బాధపడుచుండగా శ్రీసాయి తమ చూపుడు వ్రేలును చూపిస్తూ, "జాగ్రత్త ! నీవిక విరోచనములు

చేయకూడదు, వమనములు కూడా ఆగవలెను" అన్న ఒక్క మాటతో రెండు వ్యాధులను తగ్గించెను. బూటీకి కలరా సోకినప్పుడు దప్పికతో బాధపడుచుండగా బాదంపప్పు, పిస్తా, అక్రోటు నానబెట్టి పాలు చక్కెరలో ఉడికించి తాగించి తగ్గించెను. నిజానికి వీటి ద్వారా దప్పిక ఎక్కువై రోగము తీవ్రమగును. కాని బాబా చిత్రమైన వైద్యముతో పూర్తిగా తగ్గెను. శ్రీసాయి "అల్లా అచ్ఛాకరేగా" అనే ఒక్కమాటతో ఆళింది అను సన్యాసికి చెవిపోటును తగ్గించెను. కాకా మహాజనికి విరోచనములు కలిగినప్పుడు ఆ భక్తుడు తన బాధను బాబాకు చెప్పకపోయినా శ్రీసాయి సర్వజ్ఞుడని నమ్మకముతో ఉన్నప్పుడు బాబా శనగపప్పు తీసి నలిపి పప్పును కాకాకిచ్చి తినమనెను. విరోచనములకు శనగపప్పేమిటి? నిజమైన ఔషధము బాబా యొక్క వాక్కే. దత్తోపంత్ 14 సంవత్సరముల నుండి కడుపునొప్పిబాధతో ఉన్న రోగమును బాబా కేవలం తన దయాదృష్టితో తగ్గించెను. ఇన్ని విడ్డూరపు లీలలు కొందరిని తాకనైనా తాకక ఏ మందులివ్వక ఒకవేళ మందు రూపేణా ఇచ్చినవి ఆ రోగానికి తగ్గించేది కాకుండా హెచ్చించేవి అగు గుణములు కలిగిన వాటిని ఇచ్చేవారు బాబా. వాటితో ఆ దీర్ఘరోగాలను తగ్గించేవారు. కొందరికి కేవలం తన మాటలతో మరికొందరికి మాటైనా మాట్లాడక తన దృష్టితోనే ఎన్నో రోగాను తగ్గించి మనల్ని ఆశ్చర్యపరచి పిచ్చివాడు అనుకొనే లోపలే గొప్ప యోగిపుంగవుడు అని యోగిపురుషుడు అని అనుకునే లోపలే ఒక పిచ్చివాడా ఏమిటి? అనునట్లుగా మనల్ని ఆలోచనలో పడివేసేవారు ఆ అవతారపురుషుడు శ్రీ సాయి పరమాత్ముడు.

## పధ్నాల్గవ అధ్యాయము

నాందేడ్‌లో రతన్‌జీ అనే అతడు ఐశ్వర్యములతో నివశించుచుండెడివాడు. అతడు ధనికుడు. దాన ధర్మములు చేయువాడు. కాని పుత్రసంతానము లేక బాధపడుచుండెను. దాసుగణు మహరాజ్ సలహాప్రకారము రతన్‌జీ శిరిడీకి వెళ్లి మశీదున బాబాను కలిసెను. తన బాధను శ్రీసాయికి విన్నవించుకొనెను. బాబా 5 రూపాయలు దక్షిణ కోరెను. రతన్‌జీ ఇవ్వగా సాయి, రూపాయలు 3-14-0 ఇంతకు పూర్వమే ముట్టియుండెనని మిగిలిన 1-2-0 మాత్రమే తనకు ఇమ్మనెను. ఆ రతన్‌జీ సాయి మాటలకు అర్ధం గ్రహించలేకపోయెను. ఐనా, సాయి ఆజ్ఞ ప్రకారం ఇచ్చెను. శ్రీసాయి "దిగులు పడకు! నీ కీడు రోజులు ముగిసినవి. అల్లా నీ మనసులోని కోరిక నెరవేర్చు"నని చెప్పెను. సాయి పలికిన పలుకులలో నీ కీడు రోజులు ముగిసనవి, అన్నదానకి శ్రీసాయి తాను పరమాత్ముడనే సూచన ఇస్తున్నారు. రతన్‌జీ పడ్డ బాధలు ఆ క్షణము నుండి ముగిసినట్లే. వెంటనే శ్రీసాయి మళ్ళీ అచ్చటనున్న వారందరు బాబాను గొప్పగా తలచెదరని బాబాయే పరమాత్ముడని గ్రహిస్తారనే భావంతో వెంటనే శ్రీసాయి మళ్ళీ ఇట్లనెను. "అల్లా నీ మనసులోని కోరిక నెరవేర్చును". ఆ

అల్లాను మళ్ళీ తన మాయతో వేరుగా చూపిస్తూ అందరి కోరికలను నెరవేర్చువాడు. ఆ అల్లాయే అనెను. రతన్‌జీ నాందేడ్ తిరగివచ్చెను. శిరిడీకి తాను వెళ్ళుట మొదటిసారి మరి బాబాకు తన ద్వారా ఇదివరకు కొంత పైకం ముట్టుట ఎట్లు? అని సందేహము కలిగెను. కొన్నాళ్ళకు ఆలోచింపగా మౌలానాసాహెబు అనే మహాత్ముడు రతన్‌జీ ఇంటికి వచ్చినప్పుడు ఆనాటి ఖర్చు సరిగ్గా 3-14-0 అగుట నిర్ధారణమైనది. ఈ విషయము ఎక్కడో దూరాన మశీదున కూర్చుని ఉన్న ఆ యోగికి ఎలా తెలిసినది? అందుకే శ్రీసాయి పరమాత్ముడు, రూపములు వేరైనా అన్ని రూపములలో వేరు వేరు నామములతో వేరు వేరు ప్రదేశములలో అవతరించెదరు. మౌలానాసాహెబ్ శ్రీసాయినాథుడు ఒక్కరే అని గ్రహించవలెను.

శ్రీసాయి వచ్చినవారి దగ్గర దక్షిణపుచ్చుకొనుచుండెడివారు. ఫకీరు అయిన బాబాకి దేనియందు అభిమానము ఉండకూడదు కదా! మరి దక్షిణ అడుగుటకు కారణమేమిటి? మొట్టమొదట శ్రీసాయి ఎవ్వరినీ ఏమీ అడిగేవారు కాదు. ఎవరైనా రెండు కాసులు గాని యిచ్చినచో వాటితో నూనె, పొగాకు కొనెడివారు. బీడీగాని, చిలుము గాని పీల్చెడివారు. అగ్గిపుల్లలను జేబులో వేసుకొనెడివారు. ఈ అలవాటు చూచినవారికి శ్రీసాయి ఒక పిచ్చివానిగా తోచెడిది. బాబా లీల నలుదిశలా వ్యాపించిన తరువాత బాబాను చూచుటకు అనేకులు అనేక దిశల నుండి వచ్చుచుండిరి. బాబా అప్పుడు వచ్చిన వారిలో కొందరిని దక్షిణను అడుగుచుండెడివారు. కొందరు అడుగకపోయినా యిచ్చినచో ముట్టెడివారు కాదు. ఎవరు మశీదుమాతకి ఋణపడియున్నారో వారి వద్దనుండే ఆ ఋణం తీర్చుకొనెడివారు. బృహదారణ్యకోపనిషత్తులో ప్రజాపతి దేవతలకు, మానవులకు, రాక్షసులకు 'ద' అను అక్షరము బోధించిరి. దీనివల్ల దేవతలు 'దమము'గా మానవులు 'దానము'గా, రాక్షసులు 'దయ'గా గ్రహించిరి. కాబట్టి మానవజన్మ ఎత్తినవారు దానము చేయవలెను. శ్రీసాయి తన భక్తులను దానము గూర్చి తెలిసికొనుటకు వారు సంపాదించిన ధనము నందు అభిమానము పోగొట్టుకొనుటకు దక్షిణ అడుదుచుండెడివారే కాని బాబాకు డబ్బుపై ఎటువంటి ఆసక్తి లేదు. **సాయి ఇచ్చువాడే కాని పుచ్చుకొనేవాడు కాదు.** ఒకవేళ సాయి దక్షిణరూపమున తాను పుచ్చుకొనినను దానికి వందరెట్లు తిరిగి ఇవ్వవలసినది. ఒకసారి గణపతిరావు బోడాస్‌ను బాబా ఘడియఘడియకు దక్షిణ అడుగగా మొత్తం సంచీని శ్రీసాయిముందు గుమ్మరించెను. ఆనాటి నుండి గణపతిరావు బోడాస్ జీవితములో ధనమునకు ఎట్టి లోటు లేకుండెను.

శ్రీసాయి దక్షిణ అడిగినప్పుడు డబ్బు మాత్రమే ఇవ్వవలసిన పనిలేదని జి.జి.నార్కే అనే భక్తుని విషయమున ఋజువు చేసెను. జి.జి.నార్కేను శ్రీసాయి 15 రూపాయలు దక్షిణ అడుగగా తనవద్ద దమ్మిడీ కూడా లేదని అన్నప్పుడు శ్రీసాయి "నీవద్ద ధనములేదని నాకు తెలియును. కాని యోగవాశిష్టము చదువుచున్నావు కదా! దాని నుంచి నాకు దక్షిణ నిమ్ము" అనగా దక్షిణ అనగా ఇక్కడ ఆ మహా గ్రంధము నుండి నేర్చుకొనిన

విషయములను జాగ్రత్తగా హృదయములో దాచుకొనుమని అర్థము. అలాగే తర్కడ్ భార్యను శ్రీసాయి 6 రూపాయలు దక్షిణ తన ఆరుగురు శత్రువులను కామ,క్రోధ,లోభాదులను రూపములను శ్రీసాయికి పూర్తిగా సమర్పించవలెనని కోరెను. దక్షిణ అనగానే ధనము మాత్రమే అనే అర్థాన్ని గ్రహించిన మనము ఎంత పిచ్చివాళ్ళేమో కదా! శ్రీసాయి దక్షిణరూపములో ధనము వసూలు చేసిన్నన్నిటిని ఏరోజు కారోజే పంచిపెట్టుచుండెడివారు. మర్నాడు మామూలు పేద ఫకీరుగనే కనపడెడివారు. మహాసమాధి చెందునాటికి శ్రీసాయి వద్ద కేవలం 7 రూపాయలు మాత్రమే మిగిలినవి. **శ్రీసాయి తన భక్తులకు ఇక్కడ నేర్పినవి దానమును వైరాగ్యమును, త్యాగమును. దక్షిణ అడుగగానే మానవుడు దాన బుద్ధి కలిగియుండవలెనని ఆ దానముచే తాను సంపాదించిన ధనముపై వైరాగ్యము చెందుటకు నేర్పించి త్యాగబుద్ధితో ఉండవలెనని శ్రీసాయి యొక్క ఉద్దేశము.** శ్రీసాయి దక్షిణ అడుగువారు కారు. కొందరినే అడిగేవారు. అడుగకుండా ఇచ్చినా, ఒక్కొక్కప్పుడు పుచ్చుకొనెడివారు, ఇంకొక్కప్పుడు నిరాకరించువారు. అడిగినచో ఇచ్చెదమని అనుకొన్నవారి వద్ద పూచ్చుకొనెడివారు కారు. తమ ఇష్టమునకు వ్యతిరేకంగా ఇచ్చినా, ఆ దక్షిణను తాకనైనా తాకేవారు కారు. దక్షిణ ఇవ్వని వారిపై కోపము ఉండెడిది కాదు. ఎవరిద్వారానైనా భక్తులు దక్షిణను పంపినచో వారికి దానిని గూర్చి జ్ఞప్తికి తెచ్చి పుచ్చుకునేవారు. కొందరికి కొన్ని రూపాయలు తిరిగిఇచ్చి పూజలో పెట్టుకోమనేవారు. అనుకున్నదానికంటె ఎక్కువ దక్షిణ ఇచ్చినచో కావలసినది మాత్రమే తీసుకొని మిగిలినదానిని తిరిగి ఇచ్చెడివారు. దక్షిణకు బదులుగా ఎవరైనా విలువైన వస్తువులు ఇచ్చినచో వారిపై మండిపడేవారు. సంపాదించిన దక్షిణను బాబా చిలుమునకు ధునికొరకు కొంత ఉపయోగించి మిగిలిన దానిని పేదలకు దానము చేసేవారు. తన ఆస్తిపాస్తులు కొపీనము, విడిగుడ్డ, కఫనీ, తంబరేలు గ్లాసు అని చెప్పెడివారు. మన నిత్యజీవితంలో స్త్రీ, ధనము ఈ రెండూ ఎంతో ఆటంకమును కల్గించునవి. శ్రీసాయి ఈ రెండింటి విషయములో ఒకటి దక్షిణగా, రెండవది రాధాకృష్ణమాయిగా. ఈ రెండు విషములలో సాయిని నమ్ముకున్న భక్తులు ఎంతవరకు వదిలివేసారో అని పరీక్షించుటకై బాబా వీనిని అమలులోకి పెట్టెను. భక్తులు రాగానే దక్షిణ అడిగి రాధాకృష్ణమాయి ఇంటికి పంపుచుండెడివారు. కాంత, కనకములపై వ్యామోహము పోయినప్పుడే శ్రీసాయి వారిని ఆశీర్వదించేవారు. **శ్రీసాయి ఎంత లోతైన భావనతో ఎంత లోతుగా దిగినప్పటికి అందకుండ సముద్రములో అట్టడుగున దాగియున్న రత్నము వంటివారు.** వారి అర్థము చేసికొనుట ఎంతో కష్టము. వారు దక్షిణ అడుగుటలో ఎంత గూఢార్థము కలదో కనపడుచున్నది. దక్షిణ అడుగుట వలన పుచ్చుకున్న సాయికి ఏ మాత్రము ఉపయోగము కాదు. కాని **ఆ దక్షిణను ఇచ్చేవానికి దానము, వైరాగ్యము, త్యాగము అనే త్రిమూర్తులు లభ్యమవుతున్నారు. ఆ త్రిమూర్తులచే ఆ దానము చేసిన మానవుడు శ్రీదత్తుని అవతారమగు శ్రీసాయి సమర్థుని సంపూర్ణ ఆశీస్సులను పొందుచున్నారు.**

కాబట్టి ఫకీరైన బాబాకు దక్షిణతో పని ఏల? అని అనుకోవటం మన పొరపాటే.

## పదిహేనవ అధ్యాయము

సాధకునకు ఎంత సాధన చేసినను తాను నిరాడంబరుడుగా ఉండవలెనని ఆడంబరములకు ఎటువంటి చోటు ఇవ్వకూడదని బాబా దాసగణుమహారాజ్ విషయమున గుర్తింపచేసెను. మహారాష్ట్రలో హరికథలు చెప్పువారు ఆడంబరమైన వస్త్రములు కట్టేవారు. శ్రీదాసగణుమహారాజ్‌ని బాబా శిరిడీలో జరుగు ప్రతి శ్రీరామనవమి పండుగకు హరిదాసుగా శాశ్వతముగా నియమించెను. దాసగణు కూడా ఆడంబరమైన దుస్తులు ధరించి బాబావద్ద శెలవుతీసికొనుటకు వచ్చినప్పుడు శ్రీసాయి కోటు, కండువా, టోపీ తీసివేయమని శరీరముపై ఎటువంటి అలంకారములు తగవని హరికథ చెప్పునప్పుడు నడుము నుండి తలవరకు ఏమీ వేసుకోకూడదని నారదమహర్షివలె హరికథను చెప్పవలెనని వారివలె నిరాడంరముగా ఉండవలెనని బోధించెను. **నారదమహర్షి ఆ విధముగా నిరాడంబరముగా హరినామ సంకీర్తన చేయుచున్నప్పుడు శ్రీహరిరూపమున ఉన్న శ్రీసాయి ఆ నారదమహర్షిని స్వయముగా చూసినాడు కాబట్టే ఆ సంఘటనను దాసగణుమహారాజ్‌కి కంటికి అగుపడునట్లు బోధించెనని గ్రహించవలెను.**

ఠాణాలో ఒకనాడు మహారాజ్ హరికథ చెప్పుచుండగా వచ్చినవారిలో చోల్కర్ అను పేదవాడు కోర్టు గుమాస్తాగా పనిచేయుచున్నవాడు ఆ కీర్తనను శ్రద్ధగా విని తాను రాసే సర్కారువారి పరీక్షలో ఉత్తీర్ణుడై స్థిరమైన ఉద్యోగము లభించనచో శిరిడీకి వచ్చి బాబా పేరున కలకండ పెట్టెదనని మ్రొక్కుకొనెను. చోల్కర్ బీదవాడు కనుక శిరిడీయాత్రకు ఖర్చుకోసమై తాను కొంతపైకము మిగిల్చవలెనని ఉద్దేశ్యముతో తేనీటిలో వేయు చక్కెరను మాని మిగిలిన ద్రవ్యమును దాచుటకు ప్రారంభించెను. బాబా కృపచే చోల్కర్ పరీక్ష ప్యాసయ్యెను. ఉద్యోగము వచ్చెను. వెంటనే శిరిడీకి వెళ్ళెను. బాబా జోగ్‌ను పిల్చి "నీ అతిథికి టీ కప్పులో విరివిగా చక్కెర వేసి ఇమ్ము" అనెను. చోల్కర్ బాబా పలికిన భావమును గ్రహించి ఆశ్చర్యము చెంది వారి కన్నులలో భాష్పములు నిలిచెను. జోగ్ విషయమును అడుగగా చోల్కర్ తాను మొక్కుకున్న విధానము బాబా గ్రహించెనని తిరిగి టీకప్పులో ఎక్కువగా చక్కెరవేసి ఇవ్వమని చెప్పినందుకు తన ఆనందమును తన స్నేహితుడగు జోగ్‌కు వివరించెను.

ఇక్కడ బాబా యొక్క గొప్పతనమును చెప్పుటకై నా అనుభవములలో ఒకటి తప్పనిసరై వ్యక్తము చేయవలసివచ్చెను. నా గొప్పతనమును భావించక ఆ సాయి సమర్థుని లీలను గ్రహించవలెనని కోరుతూ చెప్పుచున్నాను. చోల్కర్ వలె నాకు ఉద్యోగము లేని సమయమున పూజ్యులు నా గురుదేవులు శ్రీమాన్ మహాభాష్యం

రంగాచారిగారు, “ఉద్యోగము వచ్చునంత వరకు ఇష్టమైన తీపిపదార్థమును శ్రీసాయికి వదలమని ఆజ్ఞాపించిరి. మా దంపతులిరువురము జిలేబీని తినటం మానివసినాము. బాబా కృపతో నాకును చోల్కర్ వలె ఉద్యోగము లభించెను. మేమిరువురము ఒకసారి శిరిడీలో గురుస్థానము చుట్టు ప్రదక్షిణలు చేయుచుండగా ఒక సాయి భక్తుడు తిరుగుతున్న నన్ను నా చేయిపట్టుకుని ఆపి అప్పుడే తాను శ్రీసాయిసచ్చరిత్ర పూర్తిచేసెనని నా చేతిలో జిలేబీని పెట్టెను. శ్రీసాయి లీల ఏమి చెప్పగలము? దీనిని పట్టి బాబా ఎంత మహిమాన్వితుడో ఋజువైనది. శ్రీసాయి ఇట్లనిరి. “నా ముందర భక్తితో మీ చేతులు చాపినచో మీ చెంతన నేనుండెదను. నా దేహము ఇచ్చట ఉన్నప్పటికి సప్తసముద్రముల ఆవల మీరు చేయుచున్న పనులు నాకు తెలియును. ప్రపంచమున మీ ఇష్టము వచ్చిన చోటుకి పోవుడు. నేను మీ చెంతనే మీ హృదయములోనే మరియు సర్వజనుల హృదయమునందు ఉన్నాని గ్రహించి నన్ను పూజింపుడు. ఎవ్వరు నన్ను ఈ విధంగా గుర్తించెదరో వారు ధన్యులు.

ఒకసారి బాబా మశీదులో ఉన్నప్పుడు ఒక బల్లి టిక్ టిక్ అని పలుకగా వాని భావమును అక్కడ ఉన్న భక్తుడు శ్రీసాయిని ప్రశ్నింపగా ఔరంగాబాద్‌నుండి తన చెల్లెలు వచ్చుచుండుటచేత ఆ బల్లి ఆనందించుచున్నదని పలికిన బాబా మాటలు విని ఆ భక్తుడు నిర్ఘాంతపోయెను. శిరిడీలో మశీదున ఉన్న బల్లేమిటి? దానికొక చెల్లెలేమిటి? ఆ చెల్లెలు ఔరంగాబాదు నుండి రావటమేమిటి? అర్ధంపర్ధం లేని మాటలు అని తలంచెను కాని బాబా మహిమను గ్రహించలేకుండిరి. కొంతసేపటికి ఔరంగాబాద్ నుండి ఒకరు బాబా దర్శనమునకై వచ్చి సాయని దర్శించి తన గుర్రమునకు తినుటకు ఉలవలు కావలసి వచ్చి తన భుజముపై నున్న సంచిలోని ధూళిని విదిలింపగా ఆ సంచీనుండి ఒక బల్లి క్రిందపడి అందరూ చూస్తుండగా మశీదుగోడ పైనున్న తన అక్క(బల్లి) వద్దకు వేగముగా వెళ్ళెను. అక్కచెల్లెండ్రు కలుసుకొనిరి. అధికప్రేమతో గుండ్రముగా తిరిగిరి. బాబా ఆ బల్లిని ఔరంగాబాదునుండి శిరిడీకి లాగి అక్కచెల్లెళ్ళను కలిపెను. ఇదెంత చిత్రముగా ఉన్నదో కదా! బాబా ఎంత సర్వజ్ఞుడో అని ఋజువగుచున్నది.

## పదహారవ / పదిహేడవ అధ్యాయము

దైవాన్ని ఆరాధించేవారు తన కోరికలు తీరవలెనని ఆకాంక్షతో సాధన చేయువారు చాలా ఎక్కువమంది ఆ స్వభావముతోనే ఉండెదరు. ఏ కోరికా లేకుండా దైవాన్ని ఆరాధించేవారు చాలా అరుదు. సాధన చేసేది చాలా తక్కువ అయినా వెంటనే ఫలితం రావాలని ఆకాంక్షించేవారు మరికొందరు. ఏళ్ళ తరబడి సాధన చేసినను ఏ ఫలితము లేకపోయినదని మధ్యలో విడిచిపెట్టేవారు మరికొందరు. **భగవద్గీతలో కృష్ణపరమాత్ముడు ఏ కర్మనైనను చేసేవాడు కర్తగా భావించవద్దని ఆ కర్మ భగవంతుడిదే అని తలచి భగవంతుని కోసమనే ఆ**

**కర్మను నిర్వర్తించి ఫలితాన్ని భగవంతునికే అర్పించమన్నాడు.** ఇలా చేసేవారు మోక్షసాధనకు అర్హులని ఆ పరమాత్ముడు చెప్పెను. ఐతే **అంతులేని కోరికలతో చేసే సాధనవలన కోరికలు తీరుతే భగవంతుడని లేకపోతే ఆ భగవంతుడే లేడని సులువుగా నిర్ధారిస్తారు.** కొందరు అత్యాశతో సాధనలో తాను ఏమీ సాధింపక పోయినను పెద్దకోరికనే కోరుతారు. ఉదాహరణకు బ్రహ్మజ్ఞానం వంటిది.

ఒక ధనికుడు బాబా కీర్తివిని బాబాను బ్రహ్మ జ్ఞానము కోరుటకై శిరిడీకి వచ్చెను. మశీదుకుపోయి బాబాను చూసి నమస్కరించి ఇట్లనెను. బాబా ఇక్కడకి వచ్చినవారికి ఆలశ్యము చేయక బ్రహ్మమును చూపెదరని విని నేనంత దూరంనుండి వచ్చితిని. మీరు బ్రహ్మజ్ఞానమును ప్రసాదించినచో నేను పడిన శ్రమకు ఫలితము లభించుననెను. శ్రీసాయి "ఆతురుత పడవద్దు. ఇప్పుడే నీకు బ్రహ్మమును చూపెదను. నా వద్దకు వచ్చి బ్రహ్మజ్ఞానము ఇవ్వమని అడుగురవారు చాలా తక్కువ" అని అనెను. శ్రీసాయి వానితో సంభాషణ మొదలిడిరి. తన ప్రశ్నను తానే మరచునట్లుగా చేసిరి. ఒక బాలుణ్ణి పిలిచి నందూ మార్వాడీ వద్ద 5 రూపాయలు తీసుకురమ్మని పంపిరి. కాసేపు తర్వాత ఆ కుర్రవాడు ఆ మార్వాడి ఇల్లు తాళం వేసి ఉందని చెప్పెను. మరియొకరి దగ్గరికి పంపెను. ఆ బాలుడు వట్టి చేతులతో తిరిగివచ్చెను. ఇంకా ఇద్దరు, ముగ్గురు వద్దకు పంపినను బాబాకి ఆ 5 రూపాయలు రాలేదు. శ్రీసాయికి నిజానికి ఆ డబ్బు అవసరం లేదు. ఇదంతయు పేరాశతో వచ్చిన ఆ ధనవంతుని కొరకు ఆడిన నాటకమిది. అతని జేబులో నోట్లకట్టలు కలవు. నిజంగా అతనికి బ్రహ్మజ్ఞానం కావలసియున్నచో ఊరకే కూర్చుండడు. మరియు శ్రీసాయిపై నిజమైన భక్తిప్రేమలు కలవాడైతే చాలా చిన్న మొత్తమైనా 5 రూపాయలు తీసి ఇచ్చి యుండెడివాడు. అతను డబ్బు ఇవ్వలేదు. పైగా బ్రహ్మజ్ఞానమివ్వమని తొందర పడుచున్నాడు. శ్రీసాయి ఆయన వైఖరి చూసి ఇట్లనెను. "బ్రహ్మమును చూచుటకు ఐదు ముఖ్యమైన వస్తువులను సమర్పించవలెను. అవి 1. పంచప్రాణము 3. పంచేంద్రియములు 3. మనస్సు 4. బుద్ధి 5. అహంకారము. మరియు బ్రహ్మజ్ఞానము చూచుటకు కొంత యోగ్యత కూడా అవసరమని అది ఏమనగా అతను బద్ధుడనని తెలిసి బంధనములను తెంపుకొనుటకు కృషిచేసి ఇతర సుఖములను కోరక బ్రహ్మమును పొందుటై ప్రయత్నించువాడు అర్హుడు. అలాగే పారమార్థిక రంగములో ప్రవేశించుటకు ఇహ పరలోకములందు గౌరవములకు విషయములకు విసుగుచెందవలెను. ఆత్మసాక్షాత్కారమును కోరువాడు తన యింద్రియములు బాహ్యమును చూచుటకై ప్రయత్నింపక తన దృష్టిని అంతర్ముఖము చేయవలెను. మనుష్యుడు చెడుమార్గము నుండి తన బుద్ధిని తప్పించి మనస్సును చలింపకుండ చేయలేనప్పుడు మరియు తప్పులు చేయుట మాననప్పుడు ఆత్మసాక్షాత్కారము పొందలేము. సత్యము పలుకుచు తపస్సు చేయుచు లోన చూచచు బ్రహ్మచారిగా నుండినగాని

ఆత్మసాక్షాత్కారము లభించదు. మానవుడు వస్తువులను ఎన్నుకున్నప్పుడు ఆ వస్తువులు మంచివిగను, ప్రీతికరమైనవిగా ఉండును. మంచివి వేదాంత విషయమలకు సంబంధించినదైతే ప్రీతికరమైన వస్తువులు ప్రాపంచిక లౌకిక విషయాలకు సంబంధించినవి. తెలివైన మానవుడు వేదాంత విషయములకు సబంధించిన మంచి వస్తువులను ఎన్నుకొనును. అజ్ఞాని ప్రీతికరమైన వస్తువులను కోరును. మనస్సును ఇంద్రియములను స్వాధీనమునందుంచుకొనవలెను. ఇదే విషయము **శ్రీకృష్ణపరమాత్ముడు మనస్సును, ఇంద్రియములను స్వాధీనమందుంచుకొనవలనని అర్జునునికి "శరీరము రథము. ఆత్మ దాని యజమాని. బుద్ధి ఆ రథమును నడుపు సారథి. మనస్సు కళ్ళెము. ఇంద్రియములు గుర్రములు. ఇంద్రియ విషయములు వాని మార్గములు"** అని చెప్పి యున్నారు. ఎవ్వరి మనస్సు స్థిరమైనది కాదో, ఎవరి ఇంద్రియములు స్వాధీనమునందు లేవో వాడు తన గమ్యస్థానమును చేరలేడు. జనన మరణ చక్రములో పడిపోవును. తాను పుడుతూ మరణిస్తూనేవుంటాడు. ఎవరి మనస్సు ఇంద్రియములు స్వాధీనమునందుండునో వాడు తన గమ్యస్థానమును చేరును. అనగా విష్ణుపదమును సాధించును. శ్రీసాయి బ్రహ్మమును చూచుటకు యోగ్యత కావలెనని పై విషయముల ద్వారా బోధించుచు మరికొని అర్హతలు కూడా కావలెనని ఆ అర్హతలు ఈ విధమైనవని చెప్పెను. అవి ఏమనగా మనస్సును పావనము చేయుమనెను. అనగా విధులను ఫలాపేక్ష లేకుండా నిర్వర్తింపమని చెప్పెను. అహంకారము, లోభము, కోరికలు, విడిచిపెట్టలేనప్పుడు ఆత్మసాక్షాత్కారమునకు అర్హత లేదని అటువంటివాడు దేహమే నేననుకుంటాడని ఆ భ్రమచేతనే బద్ధుడు అవుతాడని చెప్పెను. కాబట్టి అభిమానమును వదిలిపెట్టవలెను. ఆత్మజ్ఞానమును తన సొంతంగా పొందలేరని ఆత్మజ్ఞానము పొందిన ఇంకొకరి సహాయముతో పొందవచ్చునని, ఆ ఆత్మసాక్షాత్కారము పొందినవ్యక్తినే గురువని, ఆ గురువు యొక్క ఆవశ్యకత ఎంతో అవసరమని చెప్పెను. ఆ గురుమార్గము నందు నడిచిన ఎంతో మేలు పొందవచ్చునని చెప్పెను.

బ్రహ్మమును చూచుటకు చివరిది అన్నింటిలో అతి ముఖ్యమైనది భగవంతుని కటాక్షము. ఇది అన్నింటి కంటే ముఖ్యమైనదని చెప్పినాడు. భగవంతుని కటాక్షము పొందినవారికి వివేకము, వైరాగ్యములు కలుగునని అట్టివారికి సులభంగా బ్రహ్మమును చూచెదరని చెప్పిరి.

బాబా, ఆ పెద్దమనిషి దగ్గర మొదటి ధనము కోరేవాడిగా ప్రవర్తించి ఆ పేరాశ కలవాడికి కళ్ళు తెరిపించుటకు నాటక మాడి బ్రహ్మమును చూచుటకు యోగ్యత గురించి ఎంతో విపులముగా వివరించి తుదకు ఆ ధనికునితో ఇట్లు చెప్పెను. "నీ జేబులో బ్రహ్మము యాబదింతలు 5 రూపాలయ నోట్ల రూపములో ఉన్నది. దానిని బైటకు తీయు" మనెను. ఆ ధనికుడు జేబు నుండి నోట్లను బైటకు తీసి లెక్కపెట్టగా సరిగ్గా

రూ.250/-లు కలవు. అతడు బాబా పాదములపై పడెను. శ్రీసాయి ఇట్లనెను. "నీ పేరాశలోభము వదలలేనంతవరకు నీవు నిజమైన బ్రహ్మమును చూడలేవు. నీ బ్రహ్మపు నోట్ల కట్టలను చుట్టిపెట్టుము. ధనమందు సంతానమందు ఐశ్వర్యమందు మనస్సు లగ్నమై ఉన్నవాడికి బ్రహ్మముపొందలేడు. ఎవరు కోరికలు లేనివాడో వాడే చూడగలడు. ఎవరు అహంకారపూరితులో ఇంద్రియ విషయములను గూర్చి ఎల్లప్పుడు చింతించెదరో వారు ఆత్మసాక్షాత్కారము పొందుటకు అర్హులు కారు. కావున దేనిని జీర్ణించుకొనగలడో దేనిని శరీరమునకు పట్టించుకొనగలడో దానినే వాడు తీసుకొనవలెనని "నా ఖజానా నిండుగా వున్నది. ఎవరికేది కావలసిన దానిని వారికి ఇవ్వగలను. కాని వానికి పుచ్చుకొను యోగ్యత కలదా లేదా అని నేను మొదట పరీక్షించవలెను". శ్రీసాయి తాను పరమాత్ముడని ఎంత బాగా బయటపడ్డారో కదా. బ్రహ్మము **తానై యుండి బ్రహ్మజ్ఞానమును కోరువారికి బ్రహ్మమును గురించి ఆ బ్రహ్మమును చూచుటకు గల యోగ్యత గురించి ఆత్మసాక్షాత్కారము ఎవ్వరికి ప్రాప్తించునోనని వివరముగా చెప్పి చివరికి ఆ పేరాశ గలవాడితో "నా ఖజానా నిండుగా ఉన్నది. ఎవరికేది కావలసిన దానిని వారికివ్వగలను"** అనగా శ్రీసాయి దగ్గరలేని వస్తువు అనునది లేదు. అది వస్తువేగాని మరేదైనా కాని బ్రహ్మజ్ఞానముతో సహా తన ఖజానాలో నిండుగా పొర్లుచున్నవని అర్థము. మళ్ళీ సాయి ఆ ధనికునితో ఇట్లనెను. "కాని వానికి పుచ్చుకొను యోగ్యగ కలదా లేదా అని నేను మొదట పరీక్షించవలెను" అనగా ఆ ధనికుడు బ్రహ్మజ్ఞానము కొరకు శిరిడీకి వచ్చి సాయిని వేడుకొనినప్పుడు వానికి యోగ్యగ కలదో లేదో అన్నదానికై రూ.5 మార్వాడీ దగ్గర నుండి తెమ్మని బాలుని పంపెను. ఆ 5 రూపాయలు సాయికి రానప్పుడు ఆ ధనికుడు తన జేబునుండి ఇవ్వలేదు సరికదా బ్రహ్మజ్ఞానము కొరకు ఆత్రుత పడెను. అప్పుడు శ్రీసాయి బ్రహ్మమును చూచుటకు యోగ్యత గురించి, ఆ యోగ్యతను గురించి చాలా విపులముగా ఆ పేరాశ గలవాడికి మరియు మశీదులోనున్న వారందరికి బోధించెను. బ్రహ్మమును చూచుటకు చెప్పిన యోగ్యత లక్షణములలో ఏ ఒక్కటి కూడా ఆ ధనికుని వద్దలేదు. కాబట్టి శ్రీసాయి వానికి పుచ్చుకొను యోగ్యగత కలదా లేదా అని పరీక్షించిన పిదప ఆ ధనికుణ్ణి తన అత్యాశ అయినటువంటి కోరిక తప్పని అతడు అర్హుడు కాదని శ్రీసాయి తన ఆధ్యాత్మిక భోదనతో అక్కడున్న వారందరికి బోధించి శ్రీసాయి తానే బ్రహ్మమని పరమాత్మ అని ఋజువుచేసికొనెను.

## పద్దెనిమిది, పంతొమ్మిది అధ్యాయాలు

ఈ అధ్యాయము కలకండవలె తియ్యగానుండును. సాయి సచ్చరిత్ర అన్ని అధ్యాయములలోను ఈ అధ్యాయము చాలా మధురముగా, గొప్ప రహస్యాన్ని దాగియున్నది. ఈ అధ్యాయమును అక్షరము అక్షరము

చాలా జాగ్రత్తగా నెమ్మదిగా చదివినా, ఎన్నో ముఖ్య విషయాలు ఇందునుండి ప్రకాశిస్తాయి. ఆ భోదనను మనము తూ.చ.తప్పకుండా పాటించిన అధ్యాత్మికస్థితిలో అగ్రశ్రేణిగా ఉత్తీర్ణులం తప్పక అవుతాము. మిగిలిన అధ్యాయములు మధురమైనవి కావని అర్థము కాదు. మిఠాయిలు అన్ని రకములు తియ్యదనాన్నే యిస్తాయి. అందులో ఒక్కొక్క రకానికి ఒక్కొక్క పేరు ఉంటుంది. ఐతే కలకండ అన్నిటిలో చాలా మధురమైనది మరియు చాలామందికి ప్రీతికరమైనది. అన్నిటికంటె ముఖ్యం శ్రీసాయి, కలకండను, శ్రీసాయసచ్చరిత్ర రాసిన హేమాడ్‌పంత్‌కు చేతిలో పెట్టి ఈ విధంగా అనెను. “ఈ కథను నీవు మనసుకు పట్టించుకొని జ్ఞప్తియందుంచుకొనినచో, నీ స్థితి కలకండవలె తియ్యగా నుండును.” దీని ద్వారా ఈ అధ్యాయములో చెప్పిన కథ శ్రీసాయి స్వయముగా సూచన ఇస్తున్నారు మనకి. **ఈ కథను పట్టించుకుని జ్ఞప్తియందుంచుకొనుమని అట్లు చేసిన యెడల మనందరి స్థితి కూడా కలకండవలె తియ్యగా ఉండి సుఖంగా ఉండెదము.** ఈ అధ్యాయము నాకు (రచయిత) ఎంతో ఇష్టమైనది. చదువుతున్నప్పుడు ఎనలేని అనుభూతిని కలిగిస్తుంది.

సాఠే అను నతడు వ్యాపారములో నష్టపోయి మరికొన్ని బాధలతో జీవితము గడుపుతున్నప్పుడు అతని మిత్రుడు సాఠేను శిరిడీకి వెళ్ళమని సలహా నిచ్చెను. సాఠే వెంటనే శిరిడీకి వెళ్ళి శ్రీసాయిని దర్శించి శాంతిని పొందెను. అతను గురుచరిత్ర పారాయణమును 7 రోజులలో చదివిన తరువాత శ్రీసాయి కటాక్షించి అతని స్వప్నము నందు బాబాయే గురచరిత్రను పట్టుకుని దానిలోని విషయములన్ని సాఠేకు బోధించుచున్నట్లు స్వప్నము చూపెను. సాఠే మర్నాడు ఆ స్వప్నము యొక్క వృత్తాంతము తెలిసికొనవలెనని ఒక సప్తాహము చాలునా, లేక మరియొక సప్తాహము చేయవలెనా అని కాకాసాహెబ్ దీక్షిత్‌ను సాఠే తన తరఫున కోరుమని వేడుకొనెను. కాకాసాహెబ్ దీక్షిత్ ఆ విషయమును శ్రీసాయిని అడుగగా బాబా ‘అతడు గురుచరిత్ర ఇంకొక సప్తాహము చేసిన అతను పావనుడగును. మేలు కల్గును. భగవంతుడు ప్రీతి చెంది వానిని ప్రపంచ బంధములనుండి తప్పించు”ననెను. బాబా పలికిన పలుకులు అక్కడే వున్న హేమాడ్‌పంత్ విని తన మనస్సులో ఇట్లనుకొనెను. “సాఠే ఇంకొక్క వారం మాత్రమే పారాయణచేసి ఫలితమును పొందునా, నేను 40 సం॥ల నుండి పారాయణ చేయుచున్నాను, కాని నాకు ఫలితము లేదు కదా! సాఠే 7 రోజులు మాత్రమే నివశించెను. నేను 7 సం॥ల నుండి యున్నాను. నా ప్రయత్నములు ఫలించవా” అని అనుకొనెను. మనిషి యొక్క మనస్సు ఎంత వికలము చేయునో చూచితిరా. 40 సం॥ల నుండి పారాయణం చేయుచున్న హేమాడ్‌పంత్‌గారికి ఏ రోజు కలుగని నిరాశ ఆ రోజు మాత్రమే అనగా సాఠేని దీవించిన రోజు మాత్రమే కలుగుట గల కారణము ఆ వికలమైన మనస్సే. ఏ రోజూ, శ్రీసాయి పాదాల వద్ద 7 సం॥లు ఉన్నాను అని అనుకొనని శ్రీహేమాడ్‌పంత్‌గారు

ఆ దినమున అనుకొనుటకు గల కారణము సాఠే ఇంకొక్క వారం మాత్రమే పారాయణం చేసిన తనకు ప్రపంచ బంధములనుండి భగవంతుడు అతనిని తప్పించునని మేలుపొంది పావనుడగును అనే బాబా నోటి నుండి వచ్చిన మాటలు వినిన క్షణమున అటువంటి ఆలోచనలు మనస్సునకు లేచెను. ఇక్కడ హేమాడ్‌పంత్ గారే కాదు మరి ఏ ఇతర భక్తులైనను తన గురువుదగ్గర ఉన్నప్పుడు తన కంటె తక్కువ స్థితిలో ఉండి అతి తక్కువ కాలంలో గురుకృప తన కళ్ళముందు పొందుచున్నప్పుడు ఎప్పటినుండో తన గురువుకడ పడివున్న శిష్యుడు తప్పక ఇటువంటి ఆలోచనలు కల్గుట సహజమే. ఇటువంటివి కలుగుట కూడా ఆ గురువు యొక్క క్రీడలో ఒక భాగమే. తన శిష్యుడు తన నుండి ఏమీ నేర్చుకున్నాడు తన గురించి ఏమి అనుకుంటున్నాడు అనే నిజాలను తెలిసికొనుటకు ఆ గురువు పెట్టే పరీక్ష మాత్రమే అలాగే శ్రీసాయి సమర్థుడు తన భక్తుడగు హేమాడ్‌పంత్ మనస్సులోని ఆలోచనను గ్రహించి హేమాడ్‌పంత్‌ను శ్యామావద్దకు 15 రూ॥లు దక్షిణ తీసుకుని కొంతసేపు అతనితో ముచ్చటించి రమ్మనెను. అసలే బాధతో కృంగిన హేమాడ్‌పంత్ తన బాధను గురువగు సాయి గ్రహించలేదు కదా, పైగా ఆ సమయములో నన్ను దక్షిణ తీసుకుని రమ్మని శ్యామా వద్దకు పంపుట మరియు ఆ శ్యామాతో మాట్లాడి రమ్మనుట అగోచరముగా ఉన్నదని శ్రీసాయి ఇటువంటి వింత ప్రవర్తన ఎందుకు చేయును అని అర్థం కాక హేమాడ్‌పంత్ శ్యామా వద్దకు వెళ్ళెను. శ్యామా హేమాడ్‌పంత్‌ను చూడగనే తన రాకకు కారణమడిగెను. సాయిదక్షిణ కోరెనని తనతో మాట్లాడి రమ్మనెనని దాభోల్కర్ చెప్పెను. శ్యామా నావద్ద ధనం లేదు. కాని నా 15 సాష్టాంగ నమస్కారములు బాబాకు అర్పించమని వేడెను. మరియు శ్యామా తను పల్లెటూరు వాడని హేమాడ్‌పంత్ జ్ఞాని అని నాతో మాట్లాడి రమ్మనుట విచిత్రము అని పలికి శ్రీసాయి లీలలు గురించి ముచ్చటించుట ప్రారంబించెను. శ్రీసాయి లీలలు అంతు పట్టవని చెపుతూ శ్యామా ఇట్లనెను. "నాకొక కథ జ్ఞాపకం వచ్చుచున్నది. **భక్తుడు ఎంత మనోనిశ్చయముతో పట్టుదలతో ఉండునో బాబా అంత త్వరగా వానికి సహాయపడును. ఒక్కొక్కప్పుడు బాబా భక్తులను కఠిన పక్షీక్ష చేసిన తరువాత వానికి ఉపదేశమిచ్చును.** శ్యామా పలికిన ఈ పలుకులు విని హేమాడ్‌పంత్ తనకు వెంటనే సాఠేగారి గురుచరిత్ర పారాయణము తన మనస్సుకు కల్గిన అశాంతియు గుర్తుకు వచ్చి ఆహా! శ్రీసాయి తనకు శాంతి కల్గించు ఉద్దేశ్యముతోనే బాబా తనను శ్యామావద్దకు పంపెనని గ్రహించి శ్యామా చెప్పబోవు ఆ ముఖ్యమైన కథను ఎంతో శ్రద్ధతో వినుటకు కుతూహలుడై యుండెను. శ్యామా హేమాడ్‌పంత్‌తో ఈ విధంగా కథను ప్రారంభించెను.

ఖాశాభా దేశ్‌ముఖ్‌గారి తల్లి అయిన రాధాబాయి దేశ్‌ముఖ్ ఒకసారి శిరిడీకి వచ్చి సాయిని దర్శించి ఆనందించెను. ఆమెకు బాబా అంటే ఎంతో ఇష్టం. శ్రీసాయిని తన గురువుగా చేసుకుని ఉపదేశం పొందవలెనని

పట్టుబట్టెను. సాయి మంత్రోపదేశం ఇవ్వనిచో ఉపవాసంతో తన ప్రాణములను విడుచునని పట్టుబట్టెను. ఆమె భోజనము, నీరు మానేసి మూడు రోజులు నుండి తన పట్టుదలతోనే నిరాహార దీక్ష చేయసాగెను. శ్యామా భయపడి బాబాకు ఆ విషయము తెలిపెను. ఆమెను అనుగ్రహించమని వేడెను. ఆమెను శ్రీసాయి మశీదున పిలిచి ఇట్లు బోధించెను. "ఓ తల్లీ! అనవసరముగా చావును కోరుచున్నావు. నేను చెప్పునది వినుము. నా వృత్తాంతమును గ్రహించిన నీకు మేలు కలుగును" అని శ్రీసాయి రాధాబాయిదేశ్‌ముఖ్‌తో తన వృత్తాంతము ఈ విధంగా తెలిపెను. "నాకొక గురువు ఉండెను. వారు గొప్ప యోగీశ్వరులు. దయాకరుణామయులు. నేను వారికి శుశ్రూష చేసితిని. **కాని నా చెవిలో వారు ఏ మంత్రము ఊదలేదు. ఐనను వారిని నేను వదిలి పోలేదు.** వారి సేవ చేయుటకు వారి వద్ద కొన్ని ఉపదేశములను గ్రహించుటకు నిశ్చయించుకొంటిని. కాని వారి మార్గమున ఏ మార్పులేదు. వారి మార్గము వారిదే. వారు నా తలను గొరిగించిరి. నన్ను రెండు పైసలు దక్షిణ అడిగిరి. నిజానికి వారు డబ్బును కోరలేదు. **వారు కోరిన రెండు కాసులు ఒకటి నిష్ట. రెండు ఓరిమి.** నేను ఆ రెండింటిని వారికి ఇచ్చితిని. 12 సం॥లు వారిని సేవించితిని. వారే నన్ను పెంచిరి. అన్నము, బట్టలు ఇచ్చి ఏ లోటూ లేక పోషించిరి. అటువంటి గురువే ఉండరు. వారిని నేను చూచితిని. నన్ను వారు చూచితిరి. వారి ధ్యానము, సేవ, తప్ప నాకు మరియొకటి లేకుండెను. నా గురువు నా నుండి ఏమియు కోరలేదు. ఐనను అన్ని వేళలా నన్ను కాపాడిరి. వారు తమ దృష్టిచేతనే కాపాడుచు నన్ను పెంచుచుండిరి. ఓ తల్లీ ! నాకు గురువు ఏ మంత్రము ఉపదేశించలేదు. అటువంటప్పుడు నేను నీకు ఏ మంత్రము చెప్పగలను. గురువు యొక్క ప్రేమమయమయిన చూపే మనకు ఆనంద మిచ్చునది. **మంత్రము గాని, ఉపదేశము గాని ఎవ్వరి వద్దనుండి పొందుటకు ప్రయత్నించకుము. నీ ఆలోచనలు, నీవు చేయు పనులు నా కొరకే వినియోగించి అట్లు చేసిన నీవు పరమార్థమును పొందెదవు**. నా వైపు పరిపూర్ణ హృదయముతో చూసిన నేను నీ వైపు అట్లనే చూచెదను. నీ గురువు నందు ప్రేమ విశ్వాసమును ఉంచుము. గురువే సర్వమని నమ్ముము. ఈ మశీదులో కూర్చొని నేను నిజమునే చెప్పుదును. నిజము తప్ప మరేమియు మాట్లాడను" బాబా ఉపదేశమును వినిన ఆ రాధాబాయా దేశ్‌ముఖ్ తన ఉపవాసమును విరమించుకొని బాబాకు నమస్కరించి వెళ్ళిపోయెను. ఈ అద్భుతమైన కథను శ్యామానుండి వినిన హేమాడ్‌పంత్ సంతోషముతో ఉప్పొంగి పులకరించి మాటైనా మాట్లాడక నిలచిపోయెను. శ్యామాకి ఏమీ బోధ పడలేదు. ఎందుకంటే హేమాడ్‌పంత్ తాను అనుకొనిన మాటలు సాఠే విషయము శ్యామాకు చెప్పలేదు. కాబట్టి అతనికి హేమాడ్‌పంత్ ఎందుకు ఆ విధంగా ఆశ్చర్యచకితులై ఉండిరో అని తెలిసికొనలేకపోయిరి.

శ్యామా, హేమాడ్‌పంత్ ఇద్దరు మధ్యాహ్న హారతికై మశీదుకు పోయిరి. బాబా శ్యామా దక్షిణను అడుగగా బదులుగా నమస్కారములు ఇచ్చెనని హేమాడ్ పంతు చెప్పెను. శ్రీసాయి “మీరిరువురు ఏమి మాట్లాడుకొనిరి?” అని అడుగగా హారతి సమయము కాబట్టి గంటల చప్పుళ్ళతో మారు మ్రోగుతున్నను హేమాడ్‌పంత్ ఆ ఆటంకములను లెక్కింపక జరిగినదంతా శ్రీసాయికి చెప్పెను. ముఖ్యముగా రాధాబాయ్‌దేశ్‌ముఖ్ కథను గురించి వివరించెను. శ్రీసాయి ఇట్లనెను. “ఆ కథ నీకు నచ్చినదా. దాని ప్రాముఖ్యమును నీవు గుర్తింతివా” అని హేమాడ్‌పంత్‌ను అడిగెను. దానిని హేమాడ్‌పంత్ ఇట్లనెను. “నా మనశ్చాంచల్యము విడిచినది. శాంతి లభించినది. సత్యమార్గము కనుగొంటిని” అని చెప్పెను. శ్రీసాయి దానికి ఇట్లనెను. “నా పద్ధతి మిక్కిలి విశిష్టమైనది. **ఈ ఒక్క కథను జ్ఞప్తియందుంచుకొనుము. అది మిక్కిలి ఉపయోగించును. ఆత్మసాక్షాత్కారమునకు ధ్యానమవసరము. దానివలన శాంతి పొందును. కోరికలు విడిచి నిష్కామివై నీవు సమస్త జీవరాశియందు గల భగవంతుని ధ్యానింపుము. సదా నా నిరాకర స్వరూపమును ధ్యానింపుము. అదే ధ్యాన స్వరూపము, చైతన్యము, ఆనందము. ఇది చేయలేనిచో రాత్రింబవళ్ళు మీరు చూచుచున్న నాయీ ఆకారమును ధ్యానించుము.** ఈ విధముగా చేయగా చేయగా మీ వృత్తులు కేంద్రీకృతమగును. ధ్యాత, ధ్యానము, ధ్యేయము అను మూడింటికి గల భేదము పోయి ధ్యానించువాడు, చైతన్యముతో ఐక్యమై బ్రహ్మతో అభిన్నమగును”. బాబా ఈ పలుకులు పలుకగానే మాధ్యాహ్నహారతి ముగిసెను. అందరూ సాయినాథునికి జేజేలు పలికిరి. మశీదున ప్రసాదం పంచిపెట్టిరి. బాపూసాహెబ్‌జోగ్ బాబా చేతిలో కలకండ ముక్కను పెట్టెను. **శ్రీసాయి ఆ కలకండ ముక్కను హేమాడ్‌పంత్ చేతిలో పెట్టి, “ఈ కథను నీవు మనస్సునకు పట్టించుకొని జ్ఞప్తియందుంచుకొనినచో నీ స్థితి కలకండవలె తియ్యగా నుండును. నీ కోరికలన్నియు నెరవేరును. నీవు సుఖముగా నుందువు.” హేమాడ్‌పంత్ సాష్టాంగ నమస్కారముచేసి నన్నెల్లప్పుడు ఆశీర్వదించుము, కాపాడుము అనగా శ్రీసాయి మళ్ళీ ఇట్లు చెప్పెను. “ఈ కథను వినుము. దీనిని మననము చేయుము. నిధి ధ్యాసనము చేయుము. అట్లు చేసిన నీవు భగవంతుని ఎల్లప్పుడు జ్ఞప్తియందుచుకొని ధ్యానించెదవు. భగవంతుడు నీ ముందర ప్రత్యక్షమగును.**

శ్రీసాయినాథుడు “ఈ కథను వినుము. దీనిని మననము చేయుము. భగవంతుడు నీ ముందర ప్రత్యక్షమగును” అని హేమాడ్‌పంత్‌కు చెప్పిరి. ఈ కథ ఎంత ప్రాముఖ్యత కలిగియున్నదో సాయినాథుని మాటలు చేత గ్రహించవచ్చును.

ఈ కథలో తెలిసికొనవలసిన ముఖ్యాంశములు

1. నిష్ఠ, ఓరిమి ఈ రెండు సాధకునికి ముఖ్యమైనవి.

2. గురువునకు సేవ చేయవలెను. (అనగా ఇంకేమి కోరికలు కోరరాదు. కోరికకై గురువును సేవించరాదు.)

3. మనస్సునందు ఎల్లప్పుడు గురువునే చిత్రీకరించుకొనవలెను.

4. గురువు నుండి ఏమీ ఆశించకూడదు.

5. గురువు సర్వకాల సర్వావస్థల యందు కాపాడుననే నమ్మకము ఉండవలెను.

6. గురువు తన దృష్టిచేత శిష్యుడుని పాలించుచు, కాపాడుచు, పోషించి పెంచును. గురుదృష్టిపైన నమ్మకము వుండవలెను.

7. గురువు నుండి ఏ మంత్రము గాని ఉపదేశముగాని పొందుటకు ప్రయత్నించకూడదు.

8. మనము చేసే పనులు కాని ఆలోచనలు కాని గురువుకే వినియోగించవలెను.

9. గురువును సంపూర్ణహృదయముతో చూడవలెను. అట్లు చూసిన గురువు కూడా అలాగే శిష్యుణ్ని చూచును.

10. గురువే సర్వమని, సర్వము చేయువడాని, కర్తయని పూర్తిగా నమ్మవలెను.

11. గురువును బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులుగా తలంచి త్రిమూర్తి స్వరూపుడని ఎరుంగవలెను.

12. గురువుని, దేవుణ్ణి వేరుగా భావించవద్దు. గురువే దేవుడు. దేవుడే గురువు.

13. సదా నిరాకార స్వరూపమును ధ్యానించవలెను.

14.ఆ నిరాకర స్వరూపమే జ్ఞానస్వరూపము, చైతన్యము మరియు సచ్చిదానందము.

15. ఒకవేళ నిరాకార స్వరూపమును ధ్యానించుట చేయలేనప్పుడు, పగలు రాత్రి మనము ఇష్టపడే ఏ భగవంతుని / గురువుని రూపమునైనను లేదా ఆకారమును ధ్యానింపవలెను.

16. ఇట్లు ధ్యానించగా మన వృత్తులు కేంద్రీకృతమగును.

17. ధ్యాత, ధ్యానము, ధ్యేయము అను మూడింటికి గల వ్యత్యాసము పోవును.

18. ఈ స్థితిలో ధ్యానించువాడు చైతన్యముతో ఐక్యమై బ్రహ్మములో అభిన్నమగును.

ఈ 18 సూత్రములు చాలా ముఖ్యమైనవి. 18 అంకెకు చాలా ప్రాముఖ్యత కలదు. భగవద్గీతలో 18 అధ్యాయములు కలవు. మహాభారతములో 18 పర్వములు కలవు. భారత యుద్ధం జరిగినది 18 రోజులు. దేవాలయం మెట్లు 18. శ్రీదుర్గాదేవికి గల భుజములు 18. యజ్ఞములో ఋత్విక్కులు 18. ఈశావ్యాసములోని

మంత్రములు 18. ఇలా 18=1+8=9 నవవిధభక్తికి సూచిస్తున్నవి. శ్రీసాయినాథుడు 9 సంఖ్యకు చాలా ప్రాముఖ్యత నిచ్చెను. సాయి మహాసమాధి చెందుటకు పూర్వము తన భక్తురాలగు లక్ష్మీబాయిషిండేకు 9 రూపాయలు దానము చేసెను. కాబట్టి పై 18 సూత్రములు బాబా మనకు బోధించినవి చలా అమూల్యమైనవి. అవి పట్టించుకొని జ్ఞప్తియందుంచుకొనినచో మనస్థితి కలకండవలె తియ్యగా నుండును. మనము సుఖముగా నుండెదము. ఈ 18 సూత్రములు మననము చేయగా అను నిత్యము జ్ఞప్తియందుంచుకొనగా భగవంతుడు (శ్రీసాయినాథుడే) మన ముందు ప్రత్యక్షమగును. ఇది సాయి ఎంతో గట్టిగా మరీ మరీ సూచించుచూ చెప్పిన పలుకులు. అనాడు హేమాడ్‌పంత్‌కు తన చేతి మీదుగా శ్రీసాయి తన భక్తునికి కలకండ ప్రసాదము నిచ్చెను. **ఆనాటి కలకండ ప్రసాదమే అక్షయపాత్రగా మన అందరికి ఆ ప్రసాదము తరగకుండా ఈనాటికి కూడా ఈ అధ్యాయమును ఎవరైతే క్షుణ్ణముగా శ్రద్ధాభక్తులతో అక్షరము అక్షరము నెమ్మదిగా చదివి ఆస్వాదించిన భక్తులకు శ్రీసాయి చేతితో పంచిన కలకండ ప్రసాదము తప్పకుండా ఈనాడు కూడా లభించి బాబా సంపూర్ణ ఆశీస్సులు లభ్యమగుట తథ్యము.**

శ్రీసాయి ఒకసారి మానవులయొక్క ప్రవర్తనను సూచిస్తూ ఈ విధంగా బోధించెను. “ఏదైనా సంబంధము ఉండనిదే ఒకరు ఇంకొకరు వద్దకు పోరు. జంతువుగాని మరి ఇంకెవరైనా కానీ నీవద్దకు వచ్చిన తరిమివేయకుము. ఆకలితో అన్నము, బట్టలులేని వారికి వస్త్రములు, నీ యింట ముంగిట కూర్చొనుటకు విశ్రాంతి కల్పించిన భగవంతుడు సంతసించును. నీ కిష్టము లేకపోయిన ఇవ్వవద్దు. కాని కుక్కవలె అరవవద్దు. ఇతరులు నిందించిన జవాబు ఇవ్వకుము. ప్రపంచము తలక్రిందులైనా చలింపకుము. నీ ముందర జరుగుచున్న నాటకమును చూడుము. నీకూ నాకూ మధ్యగల గోడను నిర్మూలించుము. అల్లాయే సర్వాధికారి”. ఈ అమూల్యమైన పలుకులలో శ్రీసాయినాథుడు మన ప్రవర్తన గురించి అనగా సామాన్య మానవుల గురించి చెప్పిన పలుకులు. ఈ పలుకులలో కూడా ముందు మన గురించి మనము చేయుపనులను గురించి చెప్పుతూ, ఒక్కసారిగా “నీ ముందర జరుగుచున్న నాటకమును చూడుము. నీకు నాకు మధ్యగల గోడను నిర్మూలించుము” అన్నారు. అనగా మన ముందు జరిగేది నాటకమని ఆ నాటకమునకు సూత్రధారి శ్రీసాయినాథుడని ఆ సాయినాథునికి మనకు గల మధ్య గోడ అనగా ఆ గోడయే మాయతెర. ఆ మాయ తెరను నిర్మూలించుటకు ప్రయత్నించమని సూచించెను. అట్లు నిర్మూలించుటకు సాధనలో ప్రావీణ్యము, ఇంద్రియములను నిగ్రహించుట వలన, దేహభావము తొలగించుటవలన, దృష్టిని బాహ్యమునుండి అంతర్ముఖము చేయుటవలన, ఆ మాయతెర తొలగి విశ్వరూపుడగు శ్రీసాయినాథుని దర్శనము లభించును. అప్పుడు జీవుడు, పరమాత్మ ఇరువురు ఒకటై పోవును. ఈ అమూల్యమైన పలుకులలో శ్రీసాయినాథుడు సర్వేశ్వరుడని బయటపడ్డారు.

ఇంకొకసారి ఒక భక్తుడు ఇంకొక భక్తుణ్ణి అందరిలోను నిందించెను. బాబా సర్వజ్ఞుడగుటవలన గ్రహించి ఆ నిందించువానికి ఒక పందిని చూపి, "నీ స్వభావము అట్టిదే" అని తిట్టెను. ఆ సమయములన ఆ పంది అక్కడున్న అమేధ్యమును ఆరగించుచుండెను. ఇట్లు శ్రీసాయి ఒక ప్రత్యేకస్థలముగాని, సమయముగాని భోదించుటకు అవసరము లేదని సందర్భ, అవసరములను బట్టి వారు తమ భక్తులకు భోదించుచుండెడివారు. అలాగే ఇతరుల మనస్సులను బాధించవద్దని మేలు చేయు పనులు చేయమని భగవంతుణ్ణి విశ్వాసముతో నమ్మినవారికి ఏ భయము వలదని వారు తప్పక ఆత్మసాక్షాత్కారము పొందెదరని చెప్పిరి. కొంతమందికి నామజపముతోను, కొందరికి తమ లీలలు వినుట, కొందరికి పాదపూజ, మరికొందరికి పవిత్ర గ్రంధపఠనములు, కొందరికి దేవాలయ దర్శనాలు చేయమని భోదించుచుండెడివారు. స్వయముగా గాని, స్వప్నమునందు గాని ఉపదేశము లిచ్చువారు. ఉదాహరణకు ఒక తాగుబోతుకు స్వప్నమున కనిపించి ఆ తాగుబోతు గుండెలపై కూర్చొని ఎప్పుడూ త్రాగనని మాటతీసుకొనెను. ఒకడు హఠయోగము చేయుచుండగా దానిని విడిచిపెట్టమనెను. శ్రీసాయి ఒకరి కష్టమును ఇంకొకరు ఉంచుకొనరాదని భోదించెను. దీనికి ఋజువుగా రాధాకృష్ణమాయి మలేరియా జ్వరము వచ్చినప్పుడు శ్రీసాయి ఒకనిచే నిచ్చెన తెప్పించి బాబా వామన్‌గోండ్‌కర్ ఇంటి పైకప్పు ఎక్కి రాధాకృష్ణమాయి ఇంటిపై కప్పును దాటి ఇంకొక ప్రక్క దిగెను. ఈ తమాషా చర్యను చూచిన జనులు మళ్ళీ భ్రాంతిలో పడిరి. ఎంత తత్త్వబోధ చేసి మహాజ్ఞాని అయిన శ్రీసాయి ఒక్కొక్కసారి చిత్రమైన ప్రవర్తన ప్రదర్శించుటచే జనులకు చేసినవి అన్ని ఒక్కసారిగా మటుమాయమైనట్లు అదే సాయిని పిచ్చిఫకీరుగా తన చర్యను చూచిన తరువాత మనస్సులో వికల్పము కలుగును. ఆ అవధూతల మాయ ఇటువంటిదే. ఈ నిచ్చెన బాబా ఎక్కుట ఇంకొకరి ఇంటి కప్పుపైనుండి దాటుట ఇలా విడ్డూరపు చర్యలు చూసిన ఎవ్వరికీ ఏమీ అర్థం కాదు. పైగా నిచ్చెన తెచ్చినవారికి రెండు రూపాయలు కూలీ ఇచ్చెను. ఇంతలోనే మళ్ళీ జ్ఞాని మాటలు స్పష్టమగును. కష్టపడి కూలీ చేయువానికి మనస్పర్ధలు ఉండవని ఒకరి కష్టమును ఇంకొకరు ఉంచుకొనరాదని భోదించిరి. ఈ విధంగా సాయి చిత్రమైన సంఘటన చేసిన పిదప తన భక్తురాలగు రాధాకృష్ణమాయి మలేరియా జర్వము శ్రీసాయి మాయతో మాయమైనది. ఆహా శ్రీసాయి పరమాత్మయే!

## 20వ అధ్యాయము

ఉపనిషత్తులు ఎన్నో కలవు. కాని మనకు 108 ఉపనిషత్తులు మాత్రమే లెక్కలోనికి వచ్చాయి. ఈ 108లో 14 ఉపనిషత్తులు ప్రధానమైనవి. అవి 1. ఈశ 2. కేన 3. కఠ 4. ప్రశ్న 5. ముండక 6. మాండూక్య 7. ఐతరీయ 8. తైత్తరీయ 9. చాందీగ్య 10. బృహదారణ్యక 11. శ్వేతా శ్వతర 12. కౌశితకీ 13. మహానారాయణ

14.మైత్రాయణి. ఇందులో ఈశావాస్యోపనిషత్తు చాలా ముఖ్యమైనది. దీనిని ఈశాఉపనిషత్ అని కూడా అంటారు. ఇది 18 మంత్రాలతో నున్న చిన్నదైన ఉపనిషత్. ఈ ఉపనిషత్తులో ఆత్మ గురించి చెప్పబడినది. జ్ఞానమార్గమును, కర్మయోగమును కలిసి చెప్పుట ఈ ఈశఉపనిషత్ సారాంశము. ఈ ఉపనిషత్‌ను సాయిభక్తులు 'శ్రీదాసగణు మహారాజ్' మరాఠీ భాషలో వ్రాసిరి. కాని దాసగణు ఈ ఉపనిషత్తులోని సారాంశమును గ్రహించలేకుండ చేత అసంతృప్తి చెంది తన మనస్సును నిలకడగా ఉంచుటకు ప్రయత్నించినను విఫలమై వికలమనస్కుడయ్యెను. ఈ ఉపనిషత్తు ఆత్మసాక్షాత్కారాన్ని తెలిపేది. కావున అట్టి ఆత్మసాక్షాత్కారం పొందిన మహానుభావులే దీనిని వివరముగా అర్థమయేటట్లు చెప్పగలరని అటువంటి మహానుభావులే శ్రీసాయినాథుడని గ్రహించి సాయిని వేడుకొనెను. బాబా ఆశీర్వదించి ఇట్లనెను. "ఈ విషయములో ఎట్టి కష్టము లేదు. నీ తిరుగు ప్రయాణములో విలేపార్లేలోని కాకాసాహెబ్ దీక్షిత్ యొక్క పనిపిల్ల నీ యొక్క సమస్యను తీర్చును" అని అనెను. బాబా మాట్లాడిన మాటలక అక్కడున్న వారందరు సాయి తమాషా చేయుచున్నాడని లేదా సాయి ఒక పిచ్చివాడా ఏమి? అని ఎందుకంటే వేదముల యొక్క సారాంశమే ఉపనిషత్తు. అటువంటి క్లిష్టమైన ఉపనిషత్తులను బోధపడుట ఒక్కొక్కసారి జ్ఞానులకు కూడా అర్ధము కావు. అటువంటి ఉపనిషత్తుల సారాంశమును పనిపిల్ల ఎట్లు చెప్పగలదు అని నవ్వుకొనిరి. దాసగణు మాత్రము సాయివాక్కు పరమాత్ముని వాక్కే అని భావించి విలేపార్లేకు వెళ్లి కాకాసాహెబ్‌దీక్షిత్ ఇంటిలో దిగెను. శిష్యునికి ఈ విధమైన నమ్మకము ఉంటేనే గురువు అనుగ్రహం కలుగుతుంది. తన గురువు ఏమి చెప్పినను ఆలోచించకుండా అమలులో పెట్టుట ప్రధానము. ఇటువంటి శిష్యులే ఉత్తమ శిష్యులలోనికి పరిగణింపబడును. మర్నాడు దాసగణు నిద్రలేవగానే ఒక చక్కటి పాట వినపడెను. ఆ పాట ఎవరు పాడుతున్నారని చూచేసరికి కాకాసాహెబ్ దీక్షిత్ పనిమనిషి నామ్యా చెల్లెలు పాడుచుండెను. ఆమె చాలా చిన్నపిల్ల. ఆమె చినిగిపోయిన గుడ్డను కట్టుకుని పాత్రలు కడుగుచుండెను. ఆమె పాడిన పాటలోని విషయము ఒక ఎర్ర చీర గురించి ఆ చీర వర్ణనము గురించి పాడుచుండెను. ఆమె యొక్క బాహ్యంగా కనబడుచున్న చినిగిన దుస్తులు తన పేదరికమైనా ఆమె అంతరింగకంగా ఆనందమైన భావనను నెలకొల్పుకొని ఆ ఆనందాన్ని తన గాధరూపమున ప్రకటించుచున్న ఆ చిన్నారిని చూసి దాసగణు జాలిపడెను. ఆ మరుసటి దినము దాసగణుకు ధోవతులు ఇవ్వగా ఆ పేదపిల్లకు ఒక చిన్న చీరను ఇమ్మని ధోవతులు ఇచ్చిన రావ్ బహదూర్ ప్రధాన్‌ను కోరెను. అతను ఒక మంచి చీరనుకొని ఆ చిన్నారికి బహూకరించెను. ఆ పిల్లకు ఆనందమునకు అడ్డులేక తక్కిన పిల్లలతో ఆడుతూ పాడుతూ మైమరచెను. కాని మరుసటి దినము యధావిధముగా తన క్రొత్త చీరను పెట్టలో దాచుకొని ఎప్పటిలాగా చినిగిన బట్టను కట్టుకొని అదే ఆనందముతోనే పనిచేయుచుండెను. దాసగణుకు ఈమె చేష్టలను చూసి ఆమె నిరుపేద కాని ఆమెకు క్రొత్త చీర కలదు. దానిని

పెట్టెలో దాచుకొనెను. ఐనను నిరాశగాని విచారమనునది పడకుండా ఆడుచూనేయున్నది. కావున **సంతోషముగాని దుఃఖముగాని ఆ భావములు మన మనోవైఖరిపై ఆధారపడియుండును.** పరమాత్ముడు ఇచ్చినదానితో మనము సంతసించవలెను. అప్పుడు ఆ పరమాత్మ మనల్ని కాపాడి కావలసినది ఇచ్చుచుండును. కాబట్టి దైవము ఇచ్చినదంతయు మనమేలుకొరకే అని గ్రహించెను. **ఏది మనకు సంభవించుచున్నదో అది అంతయు ఆ విశ్వేశ్వరుని ఆజ్ఞచే జరుగుతున్నదనియు తుదకది మనకు మేలే జరుగునని గ్రహించవలెను.** ఇక్కడ దాసగణు మహారాజ్ ఈశావాస్యోపనిషత్‌పై మరాఠీ భాషలో వ్యాఖ్యవ్రాసిరి. అది భగవంతుడు ఇచ్చునది. ఆ వ్యాఖ్యలోని సారాంశమను గ్రహించలేదని భావముతో తాను వ్రాసిన దానికి తృప్తి చెందలేదు. నిజానికి **దాసగణు వ్రాసినది ఆ భగవంతుని ఆజ్ఞచే జరిగినది. దానికి అతను సంతుష్టి చెందవలెను.** మరాఠీ భాషలో ఈశాఉపనిషత్తు ఆ పరమాత్ముని యొక్క ఆశీస్సులచే సంభవించినది. దానిలోని సారాంశము ఎంతవరకు అర్థమైతే అది అంతయు ఆ పరమాత్ముని యొక్క ఇచ్ఛానుసారముగా జరిగి తుదకది మేలు కొరకే అని గ్రహించవలెను కాని దానికి అసంతృప్తి చెందకూడదు. ఒక్క దాసగణు విషయమే కాదు మన నిత్యజీవితములో కూడా ఇటువంటి సంఘటనలు ఎన్నో జరుగుతూ ఉండును. ఉదాహరణకు అసలు ఉద్యోగమే లేని వ్యక్తికి చిన్న ఉద్యోగము ఆ భగవంతుడు యొక్క కృపచే లభించినప్పుడు ఆ వ్యక్తి కొన్నాళ్ళు అయిన తర్వాత ఇంకా పెద్ద ఉద్యోగము కావలెనని తానిది వరకు రెండు పూటలా కడుపు మాడిన రోజులను మరచి తనకు రెండు పూటలా పరమాత్ముడిచ్చిన ఉద్యోగముతో రెండు పూటలా తినుచున్నప్పటికి పరమాన్నము కోసము పాకులాడుట అజ్ఞానమే. **భగవంతుడు ఎవరికి ఎంత ఇవ్వదలచెనో అంత వరకు మాత్రమే లభ్యమగును కాని దానికి ఒక నయాపైస ఎక్కువగాని, తక్కువగాని లభించదు. ఈ సత్యము ముమ్మాటికీ నిజము. కాబట్టి భగవంతుడు ఇచ్చిన దానికి మానవుడు సంతుష్టి చెందవలెను. ఏలననగా భగవంతుడు రాయిలో ఉన్నాడు. మాణిక్యములోనూ ఉన్నాడు. అన్నింటి యందూ కలడు. తక్కువ సంపాదన, ఎక్కువ సంపాదన అనునవి మనం కల్పించుకొని మన యొక్క సుఖముల కొరకు విధించుకొన్నవే గాన అన్నిటా ఉన్న భగవంతుడు తక్కువలో తక్కువగాను, ఎక్కువలో ఎక్కువగాను ఉండడు.** రెండింటిలోను సమానముగానే ఉన్నప్పుడు ఈ దుఃఖము చెందుట మనకేల? ఏది ఇచ్చినను అది భగవంతునిదే అని అది తన మేలుకొరకే అని ఉన్నదానికి సంతృప్తి చెందినచో ఏ కష్టసుఖములు ఉండవు. అన్ని స్థితులలోను స్థిరముగాను ఆనందముగాను ఉండును. శ్రీసాయి దాసగణు విషయములో మనకు బోధపడవలెనని ఆడిన గొప్ప నాటకమిది. ఈ నీతిని గ్రహించినవాడు తప్పక మేలు పొందెదరు.

## 21వ అధ్యాయము

భగవద్గీతలో శ్రీకృష్ణపరమాత్మ ధర్మాన్ని కాపాడుటకు అధర్మము నశించినప్పుడు ధర్మరక్షణకై తాను మళ్ళీ అవతరించెదనని చెప్పిరి. ఆ కృష్ణపరమాత్మ అంశములుగా అనేకమంది యోగులు అనేకచోట్ల అనేక నామములతో వారికి విధింపబడిన పనులను నెరవేర్చుచు వారి పని ముగిసిన తరువాత వారి అవతారములను చాలించెదరు. ఒకరు చేయునది ఇంకొకరికి తెలియును. మరియు ఒకరు నిర్వర్తించిన దానిని మరియొకరు పూర్తిచేసెదరు. ఉదాహరణకు అప్పా అను కన్నడయోగి బెళగాం వద్ద వడ్గాంలో ఉండిరి. ఆయన గొప్పయోగి. ఎల్లప్పుడు గొప్ప గ్రంధములను చదువుచుండెడివారు. ఒకసారి బి.హెచ్.ఠాకూర్ అక్కడకు వచ్చి ఆ కన్నడయోగిని దర్శించెను. వారు ఠాకూర్‌తో ఇట్లనెను. "నీవు ఉద్యోగరీత్యా ఉత్తర దిక్కునకు పోయినప్పుడు నీకొక గొప్ప మహాత్ముల దర్శనభాగ్యం కలుగును" అని పలికి విచారసాగరం అనే పుస్తకాన్ని ఇచ్చి చదువమనిరి.

కొన్నేళకు ఠాకూర్‌కు జున్నార్ బదిలీ అయ్యెను. అక్కడకు పోవుటకు నానేఘాట్‌లోయను దాటిపోవలెను. అట్టిలోయను దాటుటకు ఎనుబోతు తప్ప ఇంకేమియు ఉపయోగించరు. ఠాకూర్‌కు కళ్యాణ్‌కు బదిలీ అయ్యెను. అక్కడ సాయిభక్తుడు నానా సాహెబ్ చాందోర్కర్‌తో పరిచయం కలిగి సాయి సంగతులన్ని తెలిసికొని కొన్నాళ్ళ తరువాత శిరిడీకి వెళ్ళి శ్రీసాయిబాబాను చూసి ఎంతో ఆనందించెను. శ్రీసాయి వానితో ఇట్లనెను. "ఇచ్చటి మార్గము అప్పా బోధించు నీతులంత సులభము కాదు. ఘాట్‌లో ఏనుబోతు పైన సవారి చేయుటకంటె కష్టం. ఈ ఆధ్యాత్మమార్గము ఎంతో కఠినమైనది. దీనికి ఎంతో కృషి అవసరము" అనెను. ఠాకూర్‌కు వెంటనే అప్పాయోగి మాటలు గుర్తుకు వచ్చెను. ఠాకూర్ శ్రీసాయి ఆశీర్వచనము కోరెను. బాబా ఊరకనే గ్రంథములు చదువుట వలన ప్రయోజనము లేదు. చదివిన విషయమును విచారించి ఆచరణలో పెట్టవలెను. గురువు అనుగ్రహం లేనిదే నిష్ప్రయోజనము అనెను. ఠాకూర్ అప్పా యోగి చెప్పినట్లుగా విచారసాగరమను గ్రంధమును చదివెను. కాని శ్రీసాయినాథుని భోదన విన్న తర్వాత ఆ గ్రంధ ఆచరణ శిరిడీలో నెరవేర్చెను. దీనిని బట్టి అప్పాయోగి వడగాం అను పట్టణమున, సాయినాథుడు శిరిడీ అను గ్రామమున వేరువేరుగా అవతరించి వారికి విధింపబడిన పనులను నెరవేర్చుచు ఒకరు చేయునది ఇంకొకరికి తెలియుచున్నది కనుకనే ఎక్కడో బెళగాం సమీపమున వడ్గాం అను పట్టణమున అప్పాయోగి చెప్పిన మాటలను ఠాకూర్‌కు ఇచ్చిన గ్రంథమును షిరిడీ గ్రామములో ఉన్న శ్రీసాయినాథునికి తెలిసినది. అట్లే ఠాకూర్ కళ్యాణ్‌కు బదిలీ అయినప్పుడు నానేఘాట్ లోయను దాటుట ఆ ఘాట్‌ను దాటుటకు ఠాకూర్ ఎనుబోతు ఎక్కుట ఈ విషయములు కూడా శ్రీసాయికి తెలిసినది. యోగులంతా ఒక్కటే. సాక్షాత్ పరమాత్మలే. వేరు వేరు రూపాలలో వేరు వేరు నామాలతో వేరు వేరు చోట్ల అవతరించెదరు.

**మనము కూడా 'శ్రీసాయి సచ్చరిత్రము' అను పవిత్ర గ్రంధమును శ్రద్ధా భక్తులతో చదివి శ్రీసాయి ఠాకూర్‌కు చెప్పినట్లుగా ఆచరణలో పెట్టవలెను.**

అలాగే ఒకసారి అనంతరావ్ పాటంకర్ అను నతడు పెక్కు గ్రంధములు చదివినప్పటికి తన మనస్సుకు శాంతి లేదని భావనతో శిరిడీకి వచ్చి సాయిని వేడుకొనగా సాయి ఒక కథను చెప్పెను. ఆ కథి వివరములు ఇట్లుండెను. ఒక వర్తకుడు శిరిడీకి వచ్చినప్పుడు అతని ముందు ఒక ఆడగుర్రము తొమ్మిది ఉండలతో లద్దె వేసెను. ఆ వర్తకుడు ఆ తొమ్మిది ఉండలను తన పంచెకొంగులో ఎత్తి దాచిపెట్టుకొనెను అని చెప్పెను. ఆనంతరావ్ పాటంకర్ సాయి చెప్పినది గ్రహించలేకపోయెను. తాము అడిగినదానికి తొమ్మిది ఉండల లద్దె కథకి సంబంధమే లేదని అనుకొనెను. దాదాకేల్కరుతో ఈ విషయము అడుగగా దాదాకేల్కర్ శ్రీసాయి చెప్పినదానికి అర్ధము ఆడగుర్రమనగా భగవంతుని అనుగ్రహమని తొమ్మిది ఉండల లద్దె అనగా నవవిధభక్తులని అవి 1. వినుట 2. ప్రార్థించుట 3. జ్ఞాపకముంచుకొనుట 4. పాదసేవనము 5. పూజ చేయుట 6. నమస్కరించుట 7. సేవ చేయుట 8. స్నేహము 9. ఆత్మను సమర్పించుట. వీటిలో ఏ ఒక్క మార్గమైనను అనుసరించిన భగవంతుడు ప్రత్యక్షమగును. **భక్తిలేకుండా ఎంత సాధన చేసినను ఉపయోగము లేదు.** కాబట్టి ఆ వర్తకుడు వలె నవవిధభక్తులను ప్రోగుచేయమని సాయి ఆ కథను చెప్పెనని కేల్కర్ చెప్పెను. మరునాడు పాటంకర్ బాబాను దర్శించినప్పుడు తొమ్మిది గుర్రపులద్ది ఉండలను ప్రోగు చేసితివా? అవి సాయి అడిగెను శ్రీసాయి చెప్పిన కథలో బాబా చెప్పినవి, వినుటకు అసభ్యము అనిపించును. తొమ్మిది ఉండల లద్ది ఏమిటి? గుర్రమేమిటి? అను సంకోచనలు మనస్సున కల్గును. ఆ తొమ్మిది ఉండల లద్దెను ఎంత ప్రాముఖ్యమో భక్తికి ఎంత అవి తోడ్పడునో నవవిధ భక్తుల పేర్లు విన్నంతనే తెలియుచున్నది. లద్దె అనే పదాన్ని భక్తిగా తెలిసికొనుట చాలా గమ్మత్తైనవిషయమని లోతుగా ఆలోచిస్తేనే తెలుస్తుంది. శ్రీసాయి పరమాత్ముడే కావున నవవిధ భక్తుల గురించి ఆ విధముగా బోధించెను.

పండరీపురము నుండి ఒక ప్లీడరు బాబా గురించి తెలుసుకొని శిరిడీకి వెళ్ళి ఆశీర్వచనము కోరగా సాయి ఇట్లనెను. "ప్రజలెంత టక్కరులు. పాదములపై పడెదరు. చాటున నిందించెదరు. మశీదులో ఉన్నవారికి బాబా పలికిన మాటలలోని అంతరార్థం తెలిసికొనలేకపోయిరి. కాని పండరీపురం నుంచి వచ్చిన ప్లీడరు మాత్రం గ్రహించెను. ఆ ప్లీడరు కాకాసాహెబ్‌దీక్షిత్‌తో బాబా చెప్పినదంతయు తన గురించియే అని చెప్పిరి. దానికి గల కారణం ఒకసారి పండరీపురం సబ్‌జడ్జిగారు అనారోగ్య కారణంచే శిరిడీకి వెళ్ళి అక్కడే బస చేసెను. పండరీపురం కోర్టు ప్లీడర్ల విశ్రాంతి గదిలో దీనిని గురించి చర్చ జరిగినది. అనారోగ్యం ఉంటే

ఔషధము తీసికొనవలెను, కాని శిరిడీకి పోతే అనారోగ్యం పోతుందా? అని కొంతమంది ప్లీడర్ల సాయిబాబాను నిందించిరి. ఆ నిందించిన వారిలో ఒకరు ఈ ప్లీడరు. కాకాసాహెబ్ దీక్షిత్‌కు జరిగిన విషయమునంతా చెప్పి ఆ పండరీపురం ప్లీడరు ఇక మీదట ఎవ్వరినీ దూషించకూడదనే నిర్ణయాన్ని తీసికొని బాబా బోధనలను ఆశీర్వచనముగా భావించి వెడలిపోయెను. పండరీపురము ఎక్కడ? శిరిడీ ఎక్కడ? శ్రీసాయి సర్వజ్ఞుడని మరల ఋజువు చేసికొనెను. వారికి తెలియనది ఏమి లేదు. దృష్టి నుండి తప్పించుకొనుటకు ప్రయత్నించిన ఆ ప్రయత్నం విఫలమేయుగును. ఈ కధద్వారా మనము కూడా నేర్చుకొనవలసినది ఒకరిని నిందించరాదని వారి గురించి చులకనగా మాట్లాడుకోరాదని శ్రీసాయి మనకు నీతిని భోదించెను.

## 22వ అధ్యాయము

మానవుడు భగవంతుని గురించి ఎన్నో రకాలుగా మాట్లాడును భగవంతుడు, ఒకడున్నాడని మరియొకడు లేడని ఒకడు ఉంటే కనిపించడేమని ఇలా వాదోపవాదాలతో తన జీవితాన్ని వ్యర్థం చేసికుంటారు. **చర్చించుకొనుచోట వివాదమే దగ్గర ఔతుంది కాని అసలు విషయం దూరమైపోతుంది.** అది తెలియక అనర్గళముగా చర్చలోకి దిగి అహంభావముతో జ్ఞానిలాగా ప్రవర్తిస్తాడు. భగవద్గీతలో శ్రీకృష్ణపరమాత్మ ఆత్మయే తానని బోధించిన శ్లోకములు ఎన్నో కలవు. నిజానికి భగవంతుడు ప్రతిజీవిలో అతి దగ్గరగా ఉంటాడు. ఆ జీవిలో ఆత్మరూపముగా ప్రకాశిస్తాడు. కాని జీవి, భగవంతుడు ఎక్కడో అల్లంతదూరాన కొండపైనో పవిత్రనదీ తీరముననో ఉండునని విశ్వసించి ప్రయాసతో ఎక్కడెక్కడకో వెళ్లి దర్శిస్తూ వస్తారు. అయినా ఆ జీవి భగవంతుడిని తన కళ్ళతో నిజస్వరూపమును చూడలేదే అనే నిరాశ పెరుగుతూనే ఉంటుంది. అర్జునుడంతటి మహానుభావుడే భగవాన్ కృష్ణపరమాత్మను విశ్వరూపమును ప్రదర్శించమని కోరెను. శ్రీకృష్ణుడు భగవంతుడు అనంతుడు. సర్వాంతర్యామి అని వివరిస్తూ విభూది యోగమున పక్షులలో గరుత్మంతుడుతానని, మృగములలో సింహముతానని, రాక్షసులలో ప్రహ్లాదుడుతానని కాలముతానని వేదములలో సామవేదమును, దేవతలలో ఇంద్రుడును, ఇంద్రియములలో మనస్సు, ప్రాణములో చైతన్యము, రుద్రులలో శంకరుడు, వసువులలో అగ్నియు, పర్వతములలో మేరువు, చెట్లలో రావిచెట్టు, దేవర్షులలో నారదుడు అని భగవానుడు అనంతుడు అయి ఉండటం వల్ల ఇలా వారి విభూతులు అనంతమైయుండును. అందులో ముఖ్యమైనవి భగవానుడు అర్జునునికి చెప్పెను. ఇన్ని రూపములలో తానున్నానని భగవానుడు చెప్పినను ఆ సర్వేశ్వరుడు అనంత మహావిభూతిని ఒక్కసారి కళ్ళారా చూడవలెనని అర్జునుడు కోరగా శ్రీకృష్ణపరమాత్మ అనుగ్రహించి తన విశ్వరూపమును చూచుటకు ఆ

అర్జునుని రెండు కళ్ళతో చూచుటకు సమంజసము కాదని జ్ఞాననేత్రములను ప్రసాదించి దివ్యదృష్టిని నొసంగి ఆ శ్రీకృష్ణపరమాత్మ తన విశ్వరూపప్రదర్శనమును ప్రదర్శించెను. అర్జునుటంతటి వానికే భగవంతుణ్ణి స్వయంగా చూస్తే తప్ప ఆ కృష్ణపరమాత్మ విభూతియోగములలో తాను ఉన్నానని చెప్పినని సంకోచముతో నిజరూపదర్శనమును కోరెను. సాయి భక్తులు ఎందరో బాబా మహాసమాధి చెందిన తరువాత కూడా బాబాను పూజించిరి. శ్రీసాయి స్వయంగా ఇట్లనెను, "నేను సమాధి చెందినను నన్ను నమ్ముకొన్న భక్తులకు నా సమాధి నుండియే సమాధానమిస్తాను. మరియు పూర్తిభక్తి విశ్వాసములతో ఉన్నవారికి నేను అండగా నిలిచెదను. ఈ బాబా పలికిన పలుకులు నమ్మిన భక్తులు కొందరు బాబా కనిపించుటలేదని నిరాశతో జీవనము గడుపుతున్నారు. శ్రీసాయి ప్రకాశమును చూడవలెనన్న భగవంతుడు మనకి ఇచ్చిన ఈ రెండు కళ్ళు చాలలేవు. అర్జునుడంతటివానికే సామాన్యమైన రెండు కళ్ళు చాలలేదు. కృష్ణపరమాత్మని చూడటానికి, మనలాంటి సామాన్య జీవికి శ్రీసాయి ప్రకాశమును చూడవలెనన్న ఎంతో కష్టం. బాబా జ్ఞాననేత్రములను, దివ్యదృష్టిని ప్రసాదిస్తే తప్ప. ఈ జ్ఞాననేత్రములు, దివ్యదృష్టి సంపాదించుటకు కూడా ఎంతో అర్హత కల్గి ఉండవలెను. దానికి నిర్మల భక్తి ఎంతో ముఖ్యం. అట్లని సాయిభక్తులు నిరుత్సాహపడకూడదు. బాబా పలికిన పలుకులు ఒక్కసారి గుర్తు తెచ్చుకోవలసిందే. ఆ పలుకులు ఏమనగా, "నా ప్రకాశమును చూడవలనంటే అహంకారమును విడిచి మిక్కిలి అణకువతో చూపుడు వ్రేలుకు మధ్యవ్రేలుకు మధ్యనున్న బొటనవ్రేలుపై దృష్టిని సారించినచో నా ప్రకాశమును చూడగలరు" అని బాబా స్వయంగా చెప్పినారు. బాబా చిత్రపటము ప్రపంచమంతా ప్రతి యింట తప్పక ఉండే ఉంటుంది. ఒక్కసారిగా బాబాపటమును చూడుము. బాబా కూర్చున్న విధానమును చూడుము. వారు తమ కాళ్ళను ఒకదానిపై ఇంకొకటి వేసియున్నారు. అనగా ఎడమతొడపై భాగమున కుడికాలు మడచియున్నారు. అనగా ఎడమచేతివ్రేళ్ళ కుడిపాదముపై వేసియున్నారు. జాగ్రత్తగా తదేకదృష్టితో దృష్టి మరల్చక సూటిగా కుడికాలు బొటనవ్రేలిపై ఎడమచేయి చూపుడు వ్రేలును, మధ్యవ్రేలును యున్నవి. ఇక్కడే అతి ముఖ్యముగా గమనించవలసినది ఆ చూపుడు వ్రేలుకు, మధ్య వ్రేలుకు మధ్యనున్న ఎడమకాలి బొటనవ్రేలిపై మన దృష్టిని పెట్టినచో శ్రీసాయి ప్రకాశమును చూడగలము. ప్రతిరోజు ఈ విధముగా ప్రయత్నించగా ప్రయత్నించగా ఆ అనంతకోటి బ్రహ్మాండనాయకుని ప్రత్యక్ష దర్శనము తప్పక కల్గును.

బాబా భక్తుల ఆపదలను కనుగొని రక్షిస్తూ ఉండేవారు. ఒకసారి బాలాసాహెబ్ మిరీకర్ చితలీకు పోవుచూ శిరిడీ వచ్చి బాబాను దర్శించి వెడలుచుండగా బాబా తన ఎడమచేతిని మూసి దానిని కుడిచేతి వద్దకు తెచ్చి పాముపడగవలె ఉంచి ఇట్లనెను. "అతడు భయంకరమైనవాడు. కాని ద్వారకామాయి బిడ్డలను

ఏమి చేయగలడు" బాబా సూచించినవి గ్రహించలేకుండిరి. బాబా బాలాసాహెబ్‌ను శ్యామాతో కలిసి చితలీకి వెళ్ళమని చెప్పిరి. వారిరువురు చితలీకి చేరిరి. హనుమాన్ గుడిలో ఒక చాపపై కూర్చొనియుండగా బాలాసాహెబ్ చదువుతున్నప్పుడు అతని అంగవస్త్రముపై ఒక పాము ఉండెను. అక్కడ వున్నవారు వచ్చి కట్టెలతో కొట్టి దానిని చంపిరి.

ఒక జ్యోతిష్యుడు బాపూసాహెబ్ బూటీకి ప్రాణగండమున్నదని హెచ్చరించెను. దానికి బాబా మృత్యువును ఎట్లు చంపునో చూచెదమనెను. ఆనాడు బాపూసాహెబ్ బూటీ మరుగుదొడ్డికి పోయినప్పుడు అక్కడ పాము వచ్చెను. నౌకరు కర్రలతో కొట్టే లోపు అది మాయమయ్యెను. ఈ విధంగా బాబా తన భక్తులకు ముందు రాబోయే ఆపదలను సూచిస్తూ మరికొందరికి ఆపదలు వచ్చినప్పుడు వారిని రక్షించేవారు.

ఒకసారి శిరిడీ నందు ఒక పిల్లవాడికి వడదెబ్బ తగిలి మరణించెను. ఆ పిల్లవాని తల్లి బాబాను ప్రార్థింపగా శ్రీసాయి ఆ పిల్లవాణ్ణి బ్రతికించెను. ఇలా శ్రీసాయి తమ భక్తులను కాపాడుతూ మరణాన్ని కూడా ధిక్కరించి జయించిన సంఘటనలు కూడా కలవు. అమీర్‌శక్కర్ అనునతడు కీళ్ళవాతంతో బాధపడుతూ శిరిడీకి వచ్చి బాబాను వేడెను. శ్రీసాయి అతనిని చావడిలో ఉండమని ఆజ్ఞాపించెను. కాని ఆ స్థలము చాలా తేమగా ఉండుటవలన కీళ్ళ వాతరోగికి సరియైన స్థలము కాదు. కాని బాబా ఆజ్ఞను జవదాటక అక్కడే 9 మాసములు ఉండెను. ఒకరోజు అతను విసుగుచెంది బాబాకు చెప్పక కోపర్గాంకు పారిపోయెను. అక్కడ ఒక ధర్మశాలలో ఉండెను. ఆ ధర్మశాలలో ఒక ఫకీరు ప్రాణములు విడుచుటకు సిద్ధముగా నుండెను. నీళ్ళు కోరగా ఆ అమీర్‌శక్కర్ ఆ ఫకీరుకు నీళ్ళు త్రాగించెను. నీళ్ళు త్రాగి ఫకీరు మరణించెను. అమీర్ భయపడెను. ఆ ఫకీరు చావుకు తాను కారకుడౌనని, నిందించెదరని భయపడి ఇంత పెద్ద ఆపదకు గల కారణము తాను బాబా ఆజ్ఞను తీసికొనక శిరిడీ విడిచిపెట్టి వచ్చుట చేతనే అని తలంచెను. మళ్ళీ అదే రాత్రి శిరిడీకి వచ్చివేసెను. బాబా ఆజ్ఞనుసారం అదే చావడిలో యుండి రోగ విముక్తుడయ్యెను.

శ్రీసాయి ఈ విధంగా కొందరిని రక్షిస్తూ మరణాన్ని కూడా తప్పిస్తూ అల్లా అచ్ఛాకరేగా అంటూనే ఆ అల్లా తానేనని నిరూపించేవాడు. ఇంతలోనే ఒక్కొక్కసారి తనకేమి పట్టని వానివలె ప్రారబ్దకర్మమును అనుభవించి తీరవలసినదేనని ఉద్దేశ్యముతో కొందరి విషయములలో కలుగచేసికొనలేదు. ఒకసారి ఒక బాలుడికి పాము కాటువేసినప్పుడు ఆ బాలుడు మరణించెను. ఆ బాలుని తల్లి వచ్చి చనిపోయిన తన బిడ్డ తనకు ఒక్కగానొక్క కొడుకని, ఊదిని ప్రసాదించమని ఆ బిడ్డను బ్రతికించమని శ్రీసాయినిప్రార్థించెను. కాని శ్రీసాయి ఊదిని ప్రసాదించలేదు. ఆ బిడ్డ మరణించెను. కాకాదీక్షిత్ శ్రీసాయితో ఆ బిడ్డను బ్రతికింపమని వేడుకొనగా శ్రీసాయి

ఇట్లనెను. “భావ్ నీ వీ విషమున జోక్యము కల్పించుకొనకుము. **ఏమీ జరిగినదో అది మేలుకొరకే జరిగినది. అతను నూతన తనువున ప్రవేశించెను. ఈ మనము చూచు తనువున చేయలేని గొప్ప గొప్ప పనులు ఆ నూతన దేహము చేయును. ఒకవేళ నేను ఈ బిడ్డను బ్రతికించిన నూతనదేహము చెడును. నీకొరకు ఈ పనిని చేసెదను. కాని ఆ బాధ్యత నీవు వహింపగలవా?”** అని బాబా ప్రశ్నించెను.

శ్రీసాయి ముఖ్య భక్తులలో ఒకరైన నానాసాహెబ్ చందోర్కర్ కుమార్తె మైనతాయి ప్రసవవేదన పడుచున్న సమయమున బాబా ఊదిని రామ్‌గిరిబువాతో పంపి ఆ మైనతాయిని రక్షించెను. కొన్ని నెలల తరువాత అదే బిడ్డను మైనతాయి కోల్పోయెను. నానాసాహెబ్ చందోర్కర్ బాబా ముందు బాధపడి చెప్పగా శ్రీసాయి ఇట్లనెను. “బిడ్డలు, పాపలు బంధువర్గములను గూర్చి నీవిట్లు కాంక్షపెట్టుకొందువేమి? వారి కొరకు నా దగ్గరకు రావలదు. ఇవన్నియు నాకు సాధ్యము కావు. బిడ్డలు పుట్టుట, బంధువులు మరణించుట వారి వారి పూర్వకర్మలపై ఆధారపడియున్నది. ఆ పరమాత్మ కూడా దానిని మార్పు చేయజాలడు. నియమిత స్థలమునకు రెండు బారల అవతల సూర్యభగవానుని ఉదయించమని దేవుడు ఆజ్ఞాపించగలడా? ఒకవేళ అట్లు చేసినచో సర్వం తారుమారగును.” ఇలాంటి అద్భుత, అగోచరమైన సంఘటనలు ఎన్నెన్నో కలవు. వారు ఒక్కొక్కప్పుడు సామాన్యుని వలె మరొకప్పుడు దైవం వలె కనిపిస్తూ మాయ చేస్తూ మనల్ని సందిగ్ధంలో పడవేస్తూ ఆటలాడేవారు.

## 23వ అధ్యాయము

అల్లామాలిక్ అంటూ ఆ అల్లానామాన్ని అల్లా అగు శ్రీసాయిపరమాత్ముడు ఎల్లప్పుడు నిరంతరంగా నామాన్ని జపిస్తూ తనలోకంలో ఉంటూ ధ్యాననిమగ్నుడై బయటకు ప్రపంచముతో ముడిపడినట్లుగా మామూలు మనిషివలె కనిపిస్తూ మనము అడిగే దానికి మనతో సంభాషిస్తున్నట్లు కనిపించినను శ్రీసాయి తన ధోరణి తనదే. వారు సమస్త జీవులలో నారాయణుని చూచు చుండెడివారు. సాక్షాత్తు వారే పరమాత్మ ఐనను వారు నేను భగవంతుడినని ఎన్నడు చెప్పుకొనలేదు. భగవంతుని సేవకుడనని చెప్పెడివారు. తనకొరకు ఏమి చేయక ఇతరుల కొరకు పాటుపడేవారు. అల్లామాలిక్, అల్లా అచ్ఛా కరేగా అంటూ ఆ అల్లాను వేరుగా చూపిస్తూ జీవనము గడిపేవారు. సబ్‌కామాలిక్ ఏక్ అని అనేవారు. **నిజానికి ఆ అల్లామాలిక్ సబ్‌కా మాలిక్ ఆ సాయినాథుడే.**

ఒకసారి నానాసాహెబ్ చందోర్కర్‌తో యోగాభ్యాస సాధకుడు దర్శనానికై వచ్చెను. అతని ఉద్దేశ్యము తన మనస్సును నిలకడ చేసి చాలాసేపు సమాధిస్థితిలో ఉండవలెనను కోరికతో సాయిని వేడుకొనవలెనని

శిరిడీకి వచ్చెను. అతను వచ్చిన సమయానికి బాబా రొట్టెను ఉల్లిపాయతో తినుట చూచి రుచిలేని రొట్టెను పచ్చి ఉల్లిపాయతో తినువాడు నా కష్టముల నెట్లు తీర్చగలడు అని అనుకొనెను. శ్రీసాయి తన మనస్సులోనిది గమనించి ఇట్లనెను. “నానా ఎవరైతే ఉల్లిని జీర్ణించుకొను శక్తి కలదో వారే దానిని తినవలెను”. ఆ వచ్చిన యోగాభ్యాససాధకుడు తన మనస్సులో అనుకొనినది బాబా చెప్పుటు చూసి సాయిపాదములపై పడెను. ఇదే యోగల మనస్సునకు, సామాన్యమానవులకు గల భేదము. ఆ వచ్చిన అతను యోగశాస్త్రముల గ్రంథములన్నియు పతంజలి యోగసూత్రముతో సహా చదివినను తన మనస్సు నిలకడ లేదు అనుటకు తాను మశీదున బాబాను ఉల్లిపాయతో రొట్టెను తినుట చూచి ఇక సాయి తన సమస్యను ఏమి తీర్చగలడు అనుకొనెను.

అవధూతల బాహ్యలక్షణములు ఇలాగే ఉంటాయి. ఐనా ఒక మనిషిని చూసినప్పుడు బాహ్యముగా తాను చేయుపనులతోనో తన బాహ్యరూపమును చూసో నిజమని నిర్ధారించుకొనుట తప్పు. రామభక్తుడు ఆంజనేయుడు మరి వానరుడు. కందమూలములను తినుచూ చెట్లపైన ఊగుతూ, దుమికెడు ఆ వానరుడే జగన్మాత సీతాదేవి యొక్క జాడను తెలిసికొనుటకు సముద్రమును దాటి లంకలో ప్రవేశించి తల్లి సీతాదేవి జాడను కనుగొని లంకా దహనము చేసి ఒక్కడే తిరిగి వచ్చి తండ్రి  శ్రీరామచంద్రునకు సీతాదేవి రహస్యమును తెలిపి రావణుని వధకు కారకుడయ్యెను. మరి ఆంజనేయుడు ఒక వానరుడు. బాహ్యముగా చూసిన ఒక కోతి ఏమి చేయగలదు? కోతి చేష్టలే తప్పు అని కనబడును. కాబట్టి బైటికి కన్పించేది నిజం కావని అని నిజమో కాదో అని మొదట నిర్ధారణ చేసుకొని ఒకరిని నిందించవలెను కాని తొందరపడి నిందించరాదు. అలాగే ఇక్కడ సాయి విషయములోను ఆ సాధకుడు బాబా బాహ్యచర్యలను చూసి మాట పారేసుకున్నాడు. తర్వాత బాబా చెప్పిన పలుకులు విని కళ్ళు తెరిచాడు.

ఒకసారి శ్యామాకు విషసర్పము కరిచెను. అది శ్యామా చిటికెన వేలును కరచుట చేత శరీరమంతయు విషము వ్యాపించెను. శ్యామా స్నేహితులు విఠోబా గుడికి తీసుకొనివెళ్లవలెనని అనుకొనిరి. కాని శ్యామా తన విఠోబాయగు శ్రీసాయి వద్దకు వెళ్లెను. బాబా శ్యామాను చూస్తూనే, “పో! వెడలిపొమ్ము! దిగువకు పొమ్ము” అని అరిచెను. మశీదులో వున్న శ్యామాతో సహా ఇతర భక్తులు కూడా ఆశ్చర్యపడిరి. శ్యామబా బాబాను పూర్తిగా నమ్ముకున్న భక్తుడు. పైగా బాబాను తన విఠోబాదేవుడని నమ్మి మశీదు మెట్లు ఎక్కి వచ్చినందుకు బాబా పలుకులు విని నిరాశచెందెను. శ్యామా బాబాను తన విఠోబా దేవుడని నమ్ముటకు గల కారణం కాళీయుడు అను విషసర్పము నదిలో దాగి ఆ నీరునంతా విషముతో నింపినప్పుడు అచ్చట ప్రజలందరు శ్రీకృష్ణపరమాత్మను ఆ విషసర్పభారమును తొలగింపమని వేడినప్పుడు నీలమేఘశ్యాముడు ఆ భయంకర కాళీయ విషసర్పముపై

కాళ్ళకు గజ్జులు కట్టుకుని తన ముద్దుపాదములతో కాళీయునితలపై ఘల్లుఘల్లుమని గజ్జల చప్పుడుతో నాట్యమాడెను. ఆ కాళీయుని ఒంటిలోని విషయమునంతా కక్కించి మర్దన చేసినాడు. అటువంటి కృష్ణుడే శ్రీసాయి అని శ్యామాకు పూర్తి విశ్వాసము.అంతటి భయంకరమైన కాళీయుని విషమును కక్కించిన తన విఠోబాయగు సాయి తన శరీరములో పాముకాటుచే వ్యాపించిన విషము కక్కించెదరని శ్యామాకు విశ్వాసము. కాని తన దేవదేవుడగు శ్రీసాయికృష్ణుడు ఆ విధముగా అరువగా భయపడిపోయెను. సాయి కొంతసేపటికి శాంతించి ఇట్లనెను. "భయపడకుము. ఫకీరు నిన్ను రక్షించును. ఇంటికిపోయి ఊరక కూర్చుండుము. బైటకు పోవద్దు" అని చెప్పెను. సాయి సలహాను శ్యామా పాటింపగా శ్యామా బాగుపడెను. బాబా పలికిన "పో, వెడలిపొమ్ము, క్రిందకు దిగు" అనునవి శ్యామాకు చెందినవి కావు. శ్యామా శరీరములో వ్యాపించిన ఆ భయంకర విషమునకు సంబంధించిన మాటలు. ఒక్కమాటతో బాబా విషమును కక్కించెను.

శిరిడీలో ఒకసారి కలరా రోగము వ్యాపించగా కట్టెల బండ్లను గ్రామములోనికి రాకూడదని నిషేదము మరియు మేకను ఆ గ్రామములో కోయరాదని నిషేధమును తీర్మానించిరి. బాబా ఈ తీర్మానమును రద్దుచేయుటకై కట్టెల బండిని మశీదునకు తీసుకుని పొమ్మని ఉత్తర్వు ఇచ్చెను. మరియు ఒక మేకను మశీదుకు తెచ్చి బడేబాబాను ఒక కత్తితో ఆ మేకను  నరకమని ఆజ్ఞాపించెను. కాని అనవసరముగా చంపుటదేనికని బడేబాబా ప్రశ్నింపగా సాయిబాబా ఆ పనిని శ్యామాను చేయమనెను. శ్యామా కత్తి తెచ్చుటకు పోయిరావుటకు ఆలస్యము అవ్వగా స్వచ్ఛమైన బ్రాహ్మణుడగు కాకాసాహెబ్‌దీక్షిత్‌ను ఆ పనిని చేయమని సాయి ఆజ్ఞాపించెను. ఆ బ్రాహ్మణుడు కత్తిపైకెత్తి మేకను నరుకుటకు సిద్ధముగా ఉన్న సమయమున సాయి ఇట్లనెను. "బ్రాహ్మణుడవై మేకను చంపెదవా?" కాకాసాహెబ్ దానికి ఇట్లు జవాబిచ్చెను. **"నీ అమృతము వంటి పలుకులే మాకు చట్టము. మాకింకొక చట్టమేదియు తెలియదు. నీ ఆజ్ఞా పాటింతును. ఇది ఉచితమా, కాదా అనునది మాకు తెలియదు. దానిని మేము విచారించము. గుర్వాజ్ఞ అక్షరాల పాటించుట మా విధి".** ఈ కలరా అను నెపముతో శిరడీ గ్రామములో రెండు విషయములకు ప్రాముఖ్యత నిచ్చి నిషేధించబడినవి కేవలం ఒక నెపం మాత్రమే. ఇందులో మొదటిది కట్టెలబండి విషయమున బాబా నిషేద ఉన్నప్పటికి బాబాకు ధుని వెలిగించుటకు కట్టెలు అవసరము కనుక కట్టెలు కొనెను. బాబాకు ఇల్లు వాకిలి ఆ మశీదే. ఆ మశీదుకు తలుపు వేయుట తాళం పెట్టుట ఉండదు. బాబా కొన్న కట్టెలు కొందరు మశీదుకు పోయి తమ వినియోగానికై తెచ్చుకొన్నను బాబా ఏమీ అనేవారు కారు. ఇందులో నేర్చుకోవలసినది తన కొరకు, తన స్వార్థము కొరకు ఏదియు ఉంచుకొనకూడదు. పరులకై పాటుపడువారు పరమాత్మునితో సమానము. తన సొమ్మును పరుల అనుభవించినను ఈర్ష్యపడక  ఊరకుండుట మహాత్ముల లక్షణము. ఇక

మేకను కోయుట అనే నిషేధము గ్రామములో విధించినప్పటికి సాయి ఒక మేకను కోయమని ఆజ్ఞాపించి చివరకు స్వచ్ఛమైన బ్రాహ్మణుని చేత కోయుటకై ఆజ్ఞాపించగా అది చూచుటకు సాయి చర్య ఎంతో పాపముగా తోచును. నోరులేని జంతువును అనవసరముగా చంపుట దేనికని మరియు ఆ మేకను చంపువాడు స్వచ్ఛమైన బ్రాహ్మణుడేమిటి అనే ఆలోచనలు రావటంతో బాబా నిజంగా ఒక పిచ్చిఫకీరా ఏమిటి? అని తోస్తుంది. కాని బాబా ఉద్దేశ్యము అది కాదు. గురువును నమ్ముకున్న శిష్యుడు గురువు ఆజ్ఞను ఎంతవరకు పాటించెదరో అను ఉద్దేశ్యముతో నిబంధించిన రెండవ నిషేధమే కాని నిజానికి బాబాకు ఆ మేకను చంపుటకు మరియు బ్రాహ్మణుని చేత దానిని నరుకుట కోసం కాదు. కాకాసాహెబ్‌దీక్షిత్ నిజంగా తన గురువైన శ్రీసాయిని పరిపూర్ణంగా నమ్ముకున్నవాడు. కనుకనే బ్రాహ్మణుడైనను తన గురువగు సాయి పలుకులే తనకు చట్టమని వేరే చట్టముతో పనిలేదని ఆ చట్టమును ఆజ్ఞగా భావించి అమలులో పెట్టుట విధిగా భావించి అది ఉత్తమమా కాదా అని విచారించక తన గురువగు సాయి ఆజ్ఞను అక్షరాలా పాటించుటకు సిద్ధపడిన ఉత్తమమైన శిష్యుడు. శిష్యుడు ఈ విధంగా తన గురువును నమ్ముకొనవలెనని గురవాజ్ఞను పాటించుట ధర్మమని ప్రతివాళ్ళు ఈ సంఘటనవలన నేర్చుకొనవలెను.

సాయి ఆ మేకను చంపనివ్వక బాబాయే దానిని చంపెదమని తకియా అనుచోట తీసుకొని పోవుచుండగా ఆ మేక మార్గమధ్యముననే ప్రాణములను విడిచెను. శ్రీసాయికి ఆ మేక అహింసతో గాక సహజముగానే మరణించునని ముందుగానే వారికి తెలుసు. కాని కట్టెలు, మేక అను రెండు సంఘటనలు సృష్టించి నిషేధములను అరికట్టుటకై ఆడిన ఆట.

## అధ్యాయము - 24

భగవంతుడు అగ్ని, వాయువు, జలము, భూమి, ఆకాశము సర్వం తానైయుండి సర్వవ్యాప్తిగా వెలుగుచున్నాడు. జీవి పుట్టక పూర్వమే ఆహారము, నీరు మొదలగునవి భగవంతుని సంపదలు. ఆ సంపదల యొక్క సర్వహక్కులు ఆ భగవంతునికే చెందినవి, జీవి పుట్టిన పిదప భగవంతుడు సృష్టించిన నీరుని, ఆహారాన్ని, గాలి ఇవన్నియు అనుభవించుచున్నాడు. **ఈ నేలపై పుట్టిన ఏ జీవిఐనను తాను సృష్టించినది ఏదీలేదు.** చివరికి నేలపై పుట్టినవాడికి ఆ నేల భగవంతుని సొత్తే. ఇలా ఈ ప్రపంచములో సృష్టించిన ప్రతిదీ ఆ భగవంతుని సొత్తు అయినపుడు ప్రతిజీవి కూడా వాయువు, నీరు, ఆహారము మొదలగునవి అనుభవించుచున్నపుడు ముందుగ సృష్టికర్త అయిన భగవంతుని ధ్యానించి ఈ భగవంతుని యొక్క అనుమతిని పొందిన పిమ్మట అనగా వాటిని నివేదించిన పిదపనే ఆ జీవి వాటిని అనుభవించవలెను. లేనిచో **భగవంతుని అనుమతి తీసుకోకుండా అనుభవించిన జీవి ఒక చోరుడుగనే పరిగణింపబడును.** మనము ఏదైనా తినుచున్నప్పుడుగాని నీటిని త్రాగుచున్నపుడుగాని

ముందుగా ఆ పరమాత్మని స్మరించి ఆయనకు అర్పించినపిదప వాటిని స్వీకరించవలెనని గీతలో కూడా చెప్పెను.

ఒక సారి హేమాడ్‌పంత్ బాబా దగ్గర కూర్చున్నపుడు శ్యామా, హేమాడ్ పంత్ కోటుకు శనగగింజలు అంటి ఉన్నవని అక్కడ ఉన్నవారికి శ్యామా చూపించెను. హేమాడ్ పంత్ చొక్కాచేతులను తట్టగా కొన్ని శనగగింజలు క్రిందపడెను. అక్కడున్నవారు ఆశ్చర్యపడిరి. శనగలు చొక్కాలో ఎట్లుండెనోనని చివరకు హేమాడ్ పంత్‌కు కూడా తెలియకుండెను. ఈవింతను చూచిన బాబా ఇట్లనెను. 'హేమాడ్ పంత్‌కు తానొక్కడే తిను దుర్గుణము కలదు. ఈరోజు ఆదివారము కావున సంతకు వెళ్ళి శనగలు తిని ఇక్కడకు వచ్చినాడు. దానికి నిదర్శనము ఆశనగలే' అనిరి. దానికి హేమాడ్ పంత్ ఇట్లనెను 'బాబా నేనెప్పుడు ఒంటరిగా తినను ఈదుర్గణము నాపై ఏల మోపెదవు. ఇంతవరకు సంతను చూడలేదు. ఇక నేను శనగలు ఎట్లు కొనియుంటిని. నా దగ్గర ఉన్నవారికి ఇవ్వకుండా నేను ఎప్పుడు తిని ఎరుగను అనెను. వెంటనె శ్రీసాయి **"దగ్గర లేనపుడు ఏమి చేయగలము. కాని నీవు తినుటకు ముందు నన్ను స్మరింతువా ? ఎల్లపుడు నీ చెంతలేనా ? నీవేదైనా తినుటకు ముందు నాకు అర్పించుచున్నావా ?"** అని అనిరి. ఈ పలుకులలో ఎంతో విశ్వాసము, నమ్మకము, ధైర్యము బాబా మనకు చూపిస్తున్నారు. సామాన్యముగా మానవుని యొక్క నైజం భగవంతుడు తన ఇంటి పూజా గదిలో మాత్రమే, కోవెలలో మాత్రమే లేదా పుణ్యక్షేత్రములలో మాత్రమే ఉంటాడని తలంచి తన ఇంటిలో పూజాగదిలో మాత్రమే తాను నైవేద్యమును పెట్టును. లేదా గుడికి వెళ్ళినపుడు ఏ మిఠాయినో తీసుకువెళ్ళి ఆ గుడిలో నివేదించును. అట్లే పుణ్యక్షేత్రములలో కూడా ఈ విధముగనే చేయును. కాని శ్రీసాయి చెప్తున్న ముఖ్యమైన రహస్య మేమనగా మనము తినుటకు ముందు సాయిని స్మరిస్తున్నామా లేదా. నిజానికి స్మరించుట లేదు. ఎవరో అతి తక్కువ భక్తులు తప్ప. దీనికి గలకారణం మనము నమ్ముకున్న పరమాత్మ సాయి మన చెంత లేడని ఎక్కడో శిరిడీలో మాత్రమే ఉన్నారిని అనుకొంటున్నాము. కాబట్టి మనము స్మరించక, అర్పించకుండానే కాలాన్ని గడిపేస్తున్నాము. సాయి చెప్పినది జాగ్రత్తగా గమనించినచో బాబాను పరిపూర్ణముగ నమ్ముకున్న భక్తుడికి సాయి సదా ఆ భక్తుని వెంట నీడవలె తన ఆత్మయే సాయిగా తనలోను మరియు బయటకూడా ఉండును. కావున బాబా చేప్పేది ఏమనగా ఏదైనా తినుటకు ముందు తన పక్కనే ఉన్న బాబాను స్మరించి, బాబాకు అర్పించి తినుట అలవాటు చేసుకొనవలెను. ఈ అలవాటు చేసికొనినచో బాబాకు నైవేద్యం ఎక్కడ ఉన్నను అనగా మన స్వగృహములో లేకున్నను, గుడిలో లేకున్నను పుణ్యక్షేత్రములలో లేకున్నను మరి ఏ ఇతర ప్రదేశములలో ఉన్నను ఈ అలవాటు పాటించిన ఆ నైవేద్యము బాబా స్వీకరించి ఆ పరమాత్ముని ఎంగిలి

ప్రసాదము మనకు లభించే గొప్ప అవకాశము కల్గుతుంది.

ఈ ప్రపంచమున సమస్తము బ్రహ్మస్వరూపమే. ఈ కనిపించే జగత్తు బ్రహ్మముందు మిథ్య మాత్రమే. భగవద్గీత 4వ అధ్యాయము 24వ శ్లోకం ॥

బ్రహ్మార్పణం బ్రహ్మహ విర్బ్రహాగ్నౌ

బ్రహ్మణా హుతమ్

బ్రహ్మైవ తేన గన్తవ్యం

బ్రహ్మకర్మ సమాధినా

ఏ కార్యమునైనను ప్రారంభించుటకు ముందు ఈ శ్లోకం పఠించవలెను. ఇట్లు చేసిన బ్రహ్మభావనచే సత్ఫలితములు తప్పక కల్గును. కొందరు భోజనం చేయునపుడు కూడా ఈ శ్లోకమునే చదువుదురు. మొదట భగవంతుని స్మరించవలెను. విషయములను మొదట పరమాత్మకు అర్పించినచో వాటియందు అభిమానం తొలగిపోవును. కామక్రోధలోభములతో కూడిన ఆలోచనలు కుడా అర్పించవలెను. ఏ విషయమునైనను, అనుభవించే ముందు సాయి మన చెంతనే వున్నాడనే నమ్మకముతో నుండి ఆ వస్తువును అనుభవించ వచ్చునా లేదా అనే జ్ఞానం కూడా లభించును. గురువు, దేవుడు ఒక్కడే వారిరువురికి భేదములేదు. కావున గురువుని స్మరింపనిదే ఏ వస్తువును పంచేంద్రియములతో అనుభవించరాదు.

బాబా ఒక్కొక్కప్పుడు ఇంత తత్వబోధన చేస్తూ సాయి ఒక గొప్ప యోగిపుంగవుడని, తత్వజ్ఞాని అని కనబడుతూ ఉండెడి వారు. ఒక్కొక్కసారి తన భోదనలు హాస్యాస్పదముగా సరదాగా కూడా ఉండెడివి. ఒకసారి అణ్ణాచించిణీకర్ అను మోటు భక్తుడు బాబా యొక్క ఎడమ చేతిని తోముతూ సేవ చేయుచుండెను. కుడివైపున ఒక ముసలి వితంతువు మావిశీబాయి బాబా నడుమును మొలను వీపును తోము చుండెను. మావిశీబాయి ముఖము క్రిందకు మీదకు అగుచుండెను. ఇలా జరుగు సమయమున ఆమె ముఖము అన్నాముఖమునకు దగ్గరగా పోయెను. ఆ మావిశీబాయి అణ్ణా చెడ్డవాడు నన్నుముద్దుపెట్టు కొనుటకు ప్రయత్నించు చున్నాడు అని హాస్యమాడెను. అది విన్న అణ్ణాకు కోపం వచ్చి నేను ముసలివాడను, దుర్మార్గుడని అనుచున్నావు నేను వెర్రివాడనా కలహమునకు ఏల కాలుదువ్వుచున్నావు ? అనెను ఈ ముసలి జంట కలహమును చూసిన మశీదులోని జనులందరును నవ్వుచుండిరి. సాయి అందరియందు సమాన ప్రేమ కల్గిన వాడు కావున వారిరువురి కలహమును ఓదార్చుటకు ఇట్లనెను “ఓ అన్నా తల్లిని ముద్దుపెట్టుకొనినచో తప్పేమున్నది” అనెను. అక్కడ ఉన్నవారందరు నవ్విరి సాయి ఒక్కొక్కసారి ఇటువంటి చమత్కారములు కూడా చేసెడి వారు.

శ్రీసాయి తన భక్తులకు వారి వారి ఇష్టానుసారము సేవ చేయుటకై అనుమతినిస్తూ అడ్డు చెప్పెడివారు కారు. ఎవరైనా ఆడ్డు చెప్పినచో బాబా వారిపై కోపగించువారు. సాయికి భక్తులంటే అంత ఇష్టం పంచభక్ష్య పరమాన్నములు నైవేద్యంపెట్టినా భక్తుల తృప్తికై తాను నిరాకరించ లేదు. నిజానికి తనకేమియు అవసరమేలేదు. ఆడంబరములంటే అసలు ఇష్టపడువారుకాదాయన. కాని సాయి భక్తుల ఇష్టానుసారము అడ్డు చెప్పేవారు కాదు. పల్లకి, జెండాలు ఇవన్నీ కూడా సాయి తన భక్తుల కోర్కెలపై అనుమతి ఇచ్చేవారు. కాని ఆ ఫకీరు సాయికి వెండి సింహాసనము, కిరీటము, శాలువలు అభిషేకాలు రకరకాల నైవేద్యాలు గంధములు, సుగంధములు, పన్నీరు ఇలాంటివి కోరువాడు కాదు ఆ ఫకీరు సాయి. కాని భక్తులపై ప్రేమచే వారి ఇష్టాను సారములసేవచేయించుకొనేవారు. భక్తులు సాయి శరీరమును తోముచూ కాళ్లను ఒత్తుచూ చేతి వ్రేళ్ళను రాయుచు సేవలు చేసినా వారితృప్తికై అడ్డు చెప్పేవారు కారు. ఒకసారి మావశీబాయి బాబా పొత్తికడుపును అతి బలప్రయోగముచే తోముచున్నపుడు అక్కడున్న ఇతర భక్తులు ఆమెను మెల్లగా తోమమని వేడుకొనగా బాబాకు వెంటనే కోపం వచ్చి తన చేతిలో సటాకను నేలకు కొట్టెను. వారి కళ్ళు ఎర్రబడి బాబా సటాక చివరను తన రెండు చేతులతో పట్టుకొని పొత్తి కడుపులోనికి గ్రుచ్చుకొనుచు ఆ సటాక ఇంకొక చివర మశీదులోని స్తంభమునకు ఆనించి తన పొత్తి కడుపులో గ్రుచ్చుకొనుచుండెను. అక్కడున్న వారందరూ భయపడిరి. ఆ భక్తులు బాబాపైనున్న ప్రేమ వలన మావిశీబాయినీ అట్లా అనెను. కాని బాబా ఉద్దేశ్యము భక్తుల ఇష్టానుసారము తనకు సేవ చేయునపుడు ఇతరులెవ్వరు ఆ విషయములలో తల దూర్చకూడదని నీతిని తెలిపెను. సాయి ఉగ్రరూపము చూసిన ఒక మతిలేని వానివలె పరిస్థితి చూచినట్లు అగుపించునే కాని సాయి ఉద్ధేశ్యము గమనించిన పిదప బాబా ఎంత ప్రేమ మూర్తియో దయామయుడో తన భక్తులను ఎవరైనా నిందించినను తన భక్తులు చేయుసేవను ఎవరైన ఆటంకపరిచినచో తన భక్తుల కోసం బాబా ఎటువంటి బాధనైనను భరించువాడని ఈ మావిశీబాయి విషయమున ఋజువు చేసెను. ఏ భక్తుని సేవ ఎటువంటిదో సామాన్యులమైన మనకు తెలియదు కాని సర్వజ్ఞుడగు శ్రీసాయి పరమాత్మకు మాత్రమే ఎరుక.

## అధ్యాయము - 25

మానవుడు భగవంతుడు ఇచ్చిన దానికి తృప్తిపడక ఇంకా ఎన్నో ఆశలను పెంచుకొని ఏవోవో ఊహించుకొని ఆకాశమున ఎగురుటకు ప్రయత్నించును. భగవంతుడు రాసిన నుదుటి రాత ప్రకారం జరుగును కాని మానవుడు వేసిన ఎత్తు ప్రకారం జరుగదు. ఒక మనిషికి నెలకు 3,000 రూ॥లు వరకే తన జీతం అని

భగవంతుడు నిర్ణయించిన ఆ మనిషికి అంతవరకే వచ్చును. దానికి మనిషి ఎంత ప్రయత్నించినను విఫలుడే అగును. **అన్నింటికన్నా తృప్తి అన్నది ఎంతో ముఖ్యం.** జీవితం నీటి బుడగ వంటిది. అది ఏ క్షణమున పగిలిపోవునో ఎవ్వరికినీ తెలియదు. అయినను మానవుడు అత్యాశతో ధనం సంపాదించవలెనని మేడలు మిద్దెలు కట్టాలని తన వ్యాపారముతో ఇంకా అభివృద్ధి కావాలని అనుకుంటూ విశ్వ ప్రయత్నం చేస్తూ నిద్రాహారములు మాని **తనకు భోగభాగ్యములు కల్గినచో చివరకు ఆ భగవంతునికి కూడా కొంత లాభము ఇచ్చుటకు తన మ్రొక్కుల ద్వారా ప్రయత్నించును.** ధనం కోసం భూతగాదాలు కల్పించుకొని అన్యాయంతో భూమిని ఆక్రమించే వారుకొందరు. రక్తసంబంధంతో పుట్టిన అన్నదమ్ములు సైతం ఆస్తిపాస్తుల కోసం గృహములకోసం తగాదాలుపడి తాను శాశ్వతుడు కాడు అనే నిజాన్ని గ్రహించక అశాశ్వతమైన సంపదలకోసం పరుగు తీయుచున్నాడు. **శాశ్వతమైనది ఒక్కటే. అదే పరమాత్మ తక్కినదేదియు శాశ్వతము కావు.** భగవంతుడు ఇచ్చిన జన్మ సార్ధకము చేసుకొనవలెనన్న అశాశ్వతమైన సంపదలను వదిలీ శాశ్వతమైన పరమాత్మను పట్టుకొనుటకు తన జీవిత పరమార్ధముగా ఎరుంగవలెను. ఐతే సంపదలను వదిలి భగవంతుని కోసమే ప్రాకులాడుతూ ఉంటే జీవితం గడిచేదెలా ? అని ప్రశ్నించు వారెందరో. **భగవంతుడు ఇచ్చిన దానికి తృప్తి పొందుటయే చాలు. ఆ తృప్తి ఉన్నంతవరకు మిగిలిన వాటికై పాకులాడక మిగిలిన సమయమంతా భగవత్ ధ్యాసలో అర్పితం చేయాలి. దాహం వేస్తే గుక్కెడు నీళ్ళు త్రాగిన దాహం తీరును. కాని సముద్రాన్నంతా తాగాలని ప్రయత్నించకూడదు.**

దామోదర్ సావల్‌రామ్ రాస్నే వీరినే దాము అన్నా అని పిలిచెదరు. అతని స్నేహితుడు, దాము అన్నాకు ప్రత్తి వ్యాపారమున భాగస్వామిగా చేరమని తద్వార లక్షలు సంపాదించవచ్చని లేఖ ద్వారా తెల్పెను. దాము అన్నా విషయం శ్రీ సాయికి ఒక లేఖ వ్రాసి పంపెను. ఆ లేఖ బాబా ముఖ్య భక్తుడగు శ్యామా పేరున రాసి బాబా సలహాను తీసుకొని తెలుపవలెనని కోరెను. శ్యామా దాము అన్నా వ్రాసిన లేఖను బాబా ముందర పెట్టెను. సాయి సర్వజ్ఞుడగుటచే ఆ లేఖ తెరువనైనా తెరువక ఇట్లనెను. **"ఏమి ఎత్తు వేయుచున్నాడు. భగవంతుడు ఇచ్చిన దానితో సంతృప్తి చెందక ఆకాశమునకెగుర ప్రయత్నించుచున్నట్లున్నది"** అని బాబా పలికి శ్యామాను ఉత్తరము చదువమని కోరెను. అప్పుడు శ్యామా "ఉత్తరములోని సంగతులన్నీ తెలిసి ఏల చదువమని అనెదవు" అనెను. వెంటనే బాబా తనగొప్పతనమును తన మహిమను మశీదులోని జనులు గమనించుచున్నారని మళ్ళీ యధావిధముగా తన మాయెను వెదజల్లి సాయి ఇట్లనెను. "నా నోటికి వచ్చినది నేను మాట్లెడదను. నన్ను విశ్వసించువారెవరు"? అని శ్యామాను ఉత్తరము చదువమనగా దాము అన్నా వ్రాసినదంతా శ్యామా చదివెను.

సాయి ఇట్లనెను. **“అతని గృహమందేమి లోటు లేదని, తనకున్న సగం రొట్టెతో సంతృప్తి చెంది లక్షలార్జించుటకు ఆయాసపడవద్దని చెప్పుము”** అని బాబా పల్కెను. బాబా ఒక్క దాము అన్నాకు మాత్రమే చెప్పిన పలుకులుకావివి. ప్రపంచంలో ప్రతి ఒక్కరికి వర్తించు దివ్యబోధన ఇది. ప్రతి మనిషి ఎత్తులు వేయకూడదని పరమాత్మ ప్రసాదించిన దానికి సంతృప్తి చెందవలెనని మనకున్న సగం రొట్టెతో తృప్తి చెందవలెనని , లక్షల కొరకు పాకులాడకూడదని గమనించవలెను. జాబు అందిన దాము అన్నా చాలా నిరాశ చెంది ఉత్తరము వ్రాయుటకు, స్వయముగా తానేవెళ్ళి మాట్లాడుటకు ఎంతో తేడా కలదని తలంచి దాము అన్నా బాబాను దర్శించి తన మనస్సులో మళ్ళీ తన కోరికను తలంచి **ఒకవేళ బాబా సహాయపడిన వ్యాపారములో కొంత లాభము సాయికి ఇచ్చెదనని మనస్సులో అనుకొనెనట. మనిషి యొక్క మనస్సు ఎంత దిగజారుతుందంటే ధనాపేక్షకై తన కోరికను సద్గురువు కడ చెప్పుకొని జాబు తనకు వ్యతిరేకంగా వచ్చినను ఆ సద్గురువు మాటపై నిలబడక మళ్ళీ అదే సద్గురువుని అడుగుటకు నిర్ణయించుకొనెదరు.** ఒకసారి అడిగిన దానికి ఖచ్చితమైన జవాబు సద్గురువుల నోటి వెంట వెలువడిన తరువాత మళ్ళీ వెనక్కు పోవుటకు అనునటువంటి సంఘటన ఉండనే ఉండదు. కాని సామాన్య మానవులు ఒకసారి అన్న మాటకు మరోనిమిషంలోనే ఆమాట మారిపోయి మళ్ళీ ఇంకొక క్షణమున వేరే మాటగా కన్పిస్తుంది. అటువంటి అత్యాశపరుడైన మానవుడు తాను నమ్ముకున్న సద్గురువు నోటినుండి తన కోరికకు జవాబు వ్యతిరేకముగా వచ్చినందుకు తుదకు వారు ఎంతకు దిగజారుతారంటే **సద్గురువు సహాయపడిన వ్యాపారములో కొంత లాభమును ఆ సద్గురువుకి ఇచ్చెదనని అనుకొందురు. ఇచ్చేవాడు ఆ సద్గురువే అనగా దాత ఆ సద్గురువు. దేహి మానవుడు. ఐనను కోరిక వ్యామోహములతో కళ్ళు బైర్లుకమ్మి తాను సంపాదించినది తానే కర్తని భావించి ఆ సంపదలో కొంత లాభము నిజమైన దాత అగు భగవంతుడికే ఇచ్చెదనని అహంభావముతో తలంచెదరు. శ్రీసాయి సర్వం తెలిసినవారు. కావున దాము అన్నా మనస్సును కనిపెట్టి ఇట్లనెను.**

“ప్రపంచ విషయములలో తగుల్కొనుటకు నాకిష్టము లేదు” అనెను. ఆయన పరమాత్మ కాబట్టే ప్రపంచ విషయములతో ఆయనకెట్టి సంబంధము లేదు. మనము సామాన్య మానవులము అజ్ఞానముతో ప్రపంచ విషములలో తగుల్కొని కోరి కష్ట, నష్ట దుఃఖములను తెప్పించుకొని కామ క్రోధాదులతో ఇంద్రియ సుఖములు అనుభవించుచు ఆ ఇంద్రియ సుఖానుభవమే సుఖమని భ్రమించి జీవితమంతా సుఖదుఃఖములనే ఆటుపోట్లతో ఆటలాడుకుంటూ జనన మరణమనే చక్రములో తిరుగుతూ జన్మిస్తూ నశిస్తూ మళ్ళీ జన్మిస్తున్నారు. ఎట్టకేల దాము అన్నా బాబా యొక్క సలహాను పాటించెను. కొన్నాళ్ళకు మళ్ళీ అదే దాము అన్నాకే ధాన్యము వ్యాపారము చెయవలెనని తలపెట్టెను. శ్రీసాయి తన భక్తులలో ఆశ ఉన్న భక్తుడైనను ఆ భక్తుణ్ణి ఆపదల నుండి కాపాడుటకు

అడ్డుగా నిలిచెదరు. సాయి దాము అన్నాకు “ఈ వ్యాపారము కూడా తగదని” ఆతనిచే మాన్పించెను. ఇది జరిగిన రెండు మాసముల వర్షములు బాగా కురిసెను. ధరలు హఠాత్తుగా పడిపోయెను. ధాన్యము చేయు వ్యాపారస్తులందరును నష్టపడిరి. అలాగే ప్రత్తి వ్యాపారము కూడా కూలిపోయెను. ఈ విధంగా శ్రీసాయి తన భక్తుడగు దాము అన్నాను రెండుసార్లు నష్టము నుండి తప్పించెను.

ఒకసారి బాబాకు మామిడి పండ్లు గోవా నుండి ఒక భక్తుడు పంపగా అందులో నాలుగు పళ్ళను దాము అన్నాకిచ్చి తన చిన్న భార్యకు ఇమ్మని ఆశీర్వదించెను. దీనికి గల కారణం దాము అన్నా జాతకం ప్రకారం తనకు ఇద్దరు భార్యలున్నప్పటికి సంతాన యోగం లేదు. దాము అన్నా బాబా సలహా ప్రకారం తన చిన్న భార్యకు తినిపించెను. ‘అల్లా అచ్ఛా కరేగా’ ఆ అల్లా సాయి ఆశీస్సులు ఫలించి దాము అన్నాకు నల్గురు కుమారులు, నల్గురు కుమార్తెలు కల్గిరి. **బాబా మాట ముందు జ్యోతిష్యం ఎంత ?**

శ్రీసాయి ఒకసారి ఇట్లనెను, “సమాధి చెందినప్పటికీ నా సమాధిలో నుంచి నా ఎముకలు మాట్లాడును. అవి మీకు ధైర్యమును, విశ్వాసమును కల్గించును. మనఃపూర్వకంగా నన్ను శరణు జొచ్చిన వారితో నా సమాధి కూడా మాట్లాడును. వారి వెన్నంటి కదులును. నేను మీ వద్ద ఉండనేమో అనే ఆందోళన పడవద్దు. నా ఎముకలు మాట్లాడును. మీ క్షేమం కనుగొనును. ఎల్లప్పుడు నన్నే జ్ఞప్తియందుంచుకొనును.”

ఈ అమూల్యమైన పల్కులు ఎంతో గొప్పవి. సాయి సామాన్య ఫకీరు కాదని, అసమాన్యమైన పరమాత్ముడని తెల్పుచున్నది. సామాన్యముగా ప్రతి మనిషి తన పంచేంద్రియములతో శ్రీసాయిని మూడున్నర మూరల మనిషిగా మాత్రమే తలంచెదరు. శ్రీసాయి మహా సమాధి చెందిన తరువాత అశరీరులు. కావున మానవుడు సామాన్యముగా శరీరము వదిలిన తరువాత ఏమీ చేయలేరని తలంచెదరు. తాను అనుకున్న ప్రకారము శరీరంలో ఉన్నప్పుడే మహాత్ములు వారి లీలలను, చమత్కారములను చూపెదరని, శరీరము చాలించిన తర్వాత వారు ఏమి చేయగలరని అనే ఒక అపనమ్మకం ఆవహించుట వలన పొరబడెదరు. కాని బాబా చెప్పినది అక్షరాలా నిజమవుచున్నది. శ్రీసాయిని పరిపూర్ణముగా నమ్మిన వారికి సాయి సమాధి చెందినప్పటికి వారి ఎముకలు శరీరముతో సంబంధము లేనటువంటివి ఆ సమాధినుండియే మాట్లాడును. అవి ధైర్యాన్ని విశ్వాసాన్ని ఆ నమ్ముకున్న వానికే ప్రసాదిస్తున్నది. నిజంగా మనస్ఫూర్తిగా శరణువేడే వారికి సాయి సమాధి మాట్లాడుచున్నది. ఎందరెందరో అనుభవములు కలిగి ఉన్నవారు కలరు. అట్లు సమాధినుండి మాట్లాడుటేగాక బాబా తనను నమ్ముకున్న వారి వెన్నంటి కదులును. కావున బాబా మన వద్ద ఉండరని అనుకొనవద్దు. బాబాను నమ్మిన భక్తులకు బాబా ఎముకలు మాట్లాడి వారి యోగ క్షేమములను కనుగొనుచున్నవి. కావున

శ్రీసాయి భక్తులు తెలియ చేయవలసిందే ఒక్కటే. **ఏ సమస్య అయిననూ ఏ సలహా తీసుకొనవలెననినను బాబా మహాసమాధి వద్ద లేదా బాబా పటము వద్ద మనస్సులో భక్తి విశ్వాసములతో తలంచి మనస్ఫూర్తిగా శరణువేడి బాబాకు చెప్పుకొనిన సాయి తన సమాధి నుండి తప్పక జవాబు ఇచ్చి పరిష్కరించెదరు.** ఇది అక్షర సత్యం. స్వయంగా సాయి భగవానుడు ప్రమాణము చేసినట్లుగా చెప్పిన అక్షర సత్యములు.

## 26వ అధ్యాయము

సద్గురు సాయినాథుడు తన దర్శనమునకు వచ్చినవారికి ఊదీనిచ్చి ఆశీస్సులు ఇస్తూ ఉండేవారు. పరమాత్మ ఒక్కడే. కాని ఒక్కొక్కరికి ఒక్కొక్క రూపమున భక్తుణ్ణి ఆకర్షించి భక్తుని యొక్క నమ్మకాన్ని కుదుర్చుటకు ఏ భక్తుడు ఏ రూపమును పూజించెదరో ఆ రూపమున ఆ పరమాత్మ తన కోరికలను తాను తలచినవి నెరవేర్చుచున్నారు. కొందరికి రాముడనిన కొందరికి కృష్ణుడనిన కొందరికి శివుడనిన కొందరికి విష్ణువనిన కొందరికి శ్రీ సాయిబాబా అనిన ఇలా వేరు వేరు రూపములలో వేరు వేరు నామములతో ఆ నమ్ముకున్న వారిని యోగ క్షేమములను చూచెదరు. శ్రీసాయి ఎప్పుడు చెప్పునది ఏమనగా **ఎవరు ఏ గురువునందు విశ్వాసముంచినారో ఆ గురువునే పట్టు తప్పకుండ నిలకడగా వారినే ఎల్లప్పుడు ధ్యానించవలెనని అలాంటి భక్తులు అనగా వేరు గురువులను నమ్ముకొని శిరిడీకి వచ్చి బాబాను దర్శించినపుడు శ్రీసాయి తన రూపముతో వారిని ఆకర్షించక ఆ భక్తుడు ఏ గురువుని యొక్క శిష్యుడో గ్రహించి ఆ గురు రూపమునే దర్శనము ఇచ్చేవారు.**

పంత్ అనుభక్తుడు మరొక సద్గురుని శిష్యుడు. అతను అయిష్టముతోనే శిరిడీకి వచ్చెను. ఎందుకనగాతాను వేరే గురువు యొక్క శిష్యుడని ఉద్దేశ్యము వలన ఇచ్చలేకున్నను అనేకులు బలవంతము పెట్టగా తన గురువుని దర్శించిన పిదప షిరిడీకి వచ్చి బాబాను మశీదులో చూసెను. ఒక్కసారిగా పంత్‌కు మూర్ఛ వచ్చి క్రింద పడిపోయెను. మశీదులో ఉన్న జనులకు భయము కలిగి కొన్ని నీళ్ళను పంత్ ముఖముపై చల్లగా అతడు మేల్కొనెను. సర్వజ్ఞుడగు సాయి ఇట్లనెను. “ఏమైనను కానిండు పట్టు విడువరాదు. నీ గురునియందే ఆశ్రయమును నిలుపుము ఎల్లప్పుడు నిలకడగా ఉందుము” అని అనెను. పంత్, బాబా పలికిన పలుకులకు ప్రాముఖ్యతను గ్రహించి బాబాకు నమస్కరించెను.

శ్రీసాయి ఈ విధముగా ఇంకొకని గురువు యొక్క శిష్యుడు తనను దర్శించుకొనుటకు వచ్చినపుడు ఆ శిష్యునికి తాను నమ్ముకున్న గురువునందు పట్టు విడువ వద్దని జ్ఞప్తి చేస్తూ ఉండేవారు. ఒక్క బాహ్యరూపమునేకాక కొందరు భక్తులు ఏదైనా ఇష్టదైవము యొక్క నామ స్మరణము చేయవలెనని తలంచినప్పుడు శ్రీసాయి ఆకార్యమును

కూడా సఫలీకృతము చేసెడివారు. ఉదాహరణకు హేమాడ్‌పంత్ ఒక గురువారం రామ నామ స్మరణంతో ఆ దినమంతా కాలము గడపవలెనని అనుకొనెను. గురువారం తెల్లువారు ఝామున బాబాను పూజించుటకు పోవుచుండగా బూటీవాడా దాటగనే ఒక చక్కని పాట వినబడెను. అది మశీదు నుండి వచ్చుచున్నది. హేమాడ్‌పంత్ పోయి చూడగా ఒక భక్తుడు శ్రీరామునిపై పాటపాడుచుండగా సాయి వినుచుండెను. ఆ పాటలోని భావము గురుకృప అంజనము లభించుట వలన అతని కళ్ళు తెరువబడి లోన, బయట నిద్రాజాగ్రత్ స్వప్న అవస్థలలోను మరియు అన్ని చోట్ల ఆ శ్రీరామచంద్రుని చూచితినని అర్థము. మరి ఆ గురువారం శ్రీసాయి ఆ భక్తుని చేత రాములవారి పాటనే పాడించుట సాక్షాత్ శ్రీ సాయి చేసిన ఏర్పాటు ఎందువలననిన తన ఇంకొక భక్తుడగు హేమాడ్‌పంత్ ఆనాడు రామస్మరణంతో కాలము గడుపవలెనని కోరుట వలన అతని సంకల్పము నెరవేర్చుటకై బాబా ఆ పాటను పాడించెను. సాయి ఎంత ఔన్నత్యముగల మహనీయులు వారి కొరకు వారి గొప్ప తనమును వారి మహిమలు వారొక్కరే పరమ్మాత అని సద్గురువని చాటి చెప్పలేదు.

హరిశ్చంద్ర పితళే అనునతనికి మూర్ఛ రోగముతో బాధపడుచున్న కొడుకు కలడు. ఎన్ని మందులు వాడినా నయముకాలేదు. శిరిడీకి ఆ దంపతులు బిడ్డనీ తీసుకుని వచ్చిరి. బాబా పాదముల వద్ద ఉంచెను. సాయి తదేక దృష్టితో ఆ బిడ్డవైపు చూడగనే పిల్లవాడు స్పృహతప్పి నోట చొంగకారుతూ క్రిందపడెను. తల్లిదండ్రులు భయపడిరి. బాబా ఆ దంపతులిరువురికి ధైర్యము చెప్పెను. కొంతసేపటికి ఆ పిల్లదాడికి చైతన్యము వచ్చెను. దంపతులు సంతసించిరి. శ్రీసాయి ఇట్లనెను, “ఎవరికైతే నమ్మకము ఓపిక కలదో వారిని భగవంతుడు రక్షించును”. వారు తిరిగి ఇంటికి వెడలిపోయిరి. వారు శిరిడీని విడిచేముందు బాబా అతనికి మూడు రూపాయలిచ్చెను. దానిని పూజలో ఉంచుకొని పూజించమని చెప్తూ ఇదివరకు కూడా రెండు రూపాయలు పితళేకి ఇచ్చియుంటినని గుర్తు చేసెను. తాను ఇంటికి తిరిగి వచ్చిన తరువాత బాబా చెప్పిన రెండు రూపాయల సంగతి తన తల్లికి చెప్పగా ఆ తల్లి పితళేతో ఇట్లనెను, “నీ తండ్రి నిన్ను తీసుకొని అక్కల్‌కోట్‌కర్ మహారాజుగారి వద్దకు పోగా ఆ సిద్ధ పురుషుడు నీ తండ్రికి రెండు రూపాయలిచ్చి వారు కూడా శ్రీసాయి వలె నాణెములను పూజలో పెట్టి పూజించమనిరి. నీ తండ్రి గతించిన తరువాత పూజ ఆగిపోయి ఆ రెండురూపాయలు పోయినవి. కావున అక్కల్ కోట్‌కర్ మహారాజు శ్రీసాయినాథుని రూపములో కన్పించి నీ కర్తవ్యమును జ్ఞాపకము చేసెను.

గురుచరిత్రలో అక్కల్ కోట్‌కర్ మహారాజు సాక్షాత్తు దత్తావతారమని, శ్రీ దత్తుని యొక్క నాల్గవ అవతారము మరియు ముందు చెప్పిన అధ్యాయములలో కూడా అక్కల్‌కోట్‌కర్ మహారాజు తన భక్తునికి సమాధి చెందిన తరువాత స్వప్న దర్శనమిచ్చి తాను శిరిడీలో ఉన్నానని చెప్పిరి. అలాగే అక్కల్‌కోట్‌కర్ మహారాజు భక్తుడు

బాబాను దర్శించుటకు వచ్చినపుడు అక్కల్‌కోట్‌కర్ వెడలుచుండగా శ్రీసాయి **"అక్కల్ కోట్‌లో ఏమున్నది. అక్కడి మహారాజు ఇక్కడే, ఆ మహారాజు నేనే అని నిర్ధారించిరి. కావున శ్రీసాయి అక్కల్‌కోట్‌కర్ మహారాజు అవతారమే. అంటే శ్రీ దత్తుని అవతారము. శ్రీ దత్తుడు విష్ణువు అవతారములో ఏడవ అవతారము.** శ్రీ మహావిష్ణువు 27 అవతారములెత్తిరి. (1) వరాహము (2) ఆదిపురుషుడు (3) సనకాది కుమారులు (4) నారదుడు (5) నరనారాయణులు (6) కపిలుడు (7) దత్తాత్రేయుడు (8) యజ్ఞమూర్తి (9) ఉరీక్రముడు (10) పృధువు (11) మత్స్యమూర్తి (12) కూర్మము (13) ధన్వంతరి (14) మోహిని (15) నృశింహుడు (16) వామనుడు (17) పరశురాముడు (18) వ్యాసుడు (19) శ్రీరాముడు (20) కృష్ణుడు (21) బలరాముడు (22) కల్కి (23) బుద్ధుడు (24) ధృవుడు (25) వృషభుడు (26) హయగ్రీవుడు (27) మనువు. కావున శ్రీసాయినాథుడు మహావిష్ణువు అవతారమగు శ్రీ దత్తాత్రేయులవారు. అల్లా అచ్ఛా కరేగా ఎవరో తెలిసింది కదా!

శ్రీ సాయి దత్తాత్రేయుని అవతారమగు అక్కల్‌కోట్‌కర్ మహారాజు అని నిర్ధారించుటకు మరియొక సంఘటన కూడా కలదు. గోపాలనారాయణ అంబాడేకర్ అనునతడు నిరుద్యోగి. చాలా కష్టములలో మునిగి ఉద్యోగము ప్రయత్నించినను దొరకక 7 సం.లు గడిచిపోయెను. తన బాధను ప్రతి సంవత్సరము శిరిడీకి పోయి బాబాకు విన్నవించుకొనేవాడు. ఒకసారి శిరడీలోనే అతను ప్రాణత్యాగము చేయవలెనని నిర్ణయించుకొని ఒకరోజు రాత్రి నూతిలో పడి ఆత్మహత్య చేసుకొనవలెనని పోగా కొంత దూరమున ఉన్న ఒక హోటల్ యజమాని అగు సగుణమేరునాయక్ అనే బాబా భక్తుడు అంబాడేకర్‌కు అక్కల్‌కోట్‌కర్ మహారాజు గారి చరిత్ర పుస్తకమునిచ్చి చదువమనెను. పుస్తకము తెరుచుసరికి అక్కల్‌కోట్‌కర్ మహారాజుగారి కాలములో చాలాకాలమునుండి రోగముతో బాధపడునట్టి ఒక భక్తుడు నిరాశచెంది బావిలో దుమికెను. ఆ మహారాజ్ అక్కడకు వచ్చి బావి నుండి తన భక్తుడను బైటకు తీసి ఇట్లనెను **"గత జన్మ పాపపుణ్యములను అనుభవించక తప్పదు. కర్మానుభవము పూర్తికాకున్నచో ప్రాణత్యాగము తోడ్పడక నీవింకొక జన్మము నెత్తి బాధ అనుభవించవలెనని కావున చచ్చుటకు మునుపే కొంతకాలమేల నీ కర్మ అనుభవించరాదు. దానిని శాశ్వతముగా పోవునట్లు చేయుము."** ఇట్టి సంఘటన గల కథను అంబాడేకర్ అక్కల్‌కోట్‌కర్ మహారాజు గారి చరిత్రలో చదివిన తర్వాత ఆశ్చర్యపడి శ్రీసాయి యొక్క సర్వజ్ఞతను సమయోచితముగా తనను ఈ కథను చదివించి తన కళ్లు తెరిపించెనని ఆనందించి అంబాడేకర్ తన ప్రాణత్యాగమును విరమించి శ్రీసాయిపై అచంచలమైన భక్తిని దృఢపరిచి సాయి ఆశీర్వాదము పొంది జ్యోతిష్య శాస్త్రము చదివి ప్రావీణ్యత సంపాదించి సాయికృపచే తన పరిస్థితి బాగుపడెను. శ్రీసాయి బ్రహ్మ విష్ణు పరమేశ్వరులగు శ్రీ దత్తాత్రేయులే.

## 27వ అధ్యాయము

శ్రీ సాయి నాథుడు శిరిడీలో ఉన్నప్పుడు కొన్ని పవిత్ర గ్రంథములను తన భక్తుల చేత నిత్య పారాయణము చేయించుచుండేవారు. అందులో ముఖ్యమైనవి ఏకనాథ భాగవతము, భావార్థ రామాయణము, జ్ఞానేశ్వరి, విష్ణు సహస్రనామము, భగవద్గీత. కొందరు భక్తులు శ్రీ సాయి తమ స్వహస్తములలో స్పృశించి వారి చేతుల మీదుగా తీసుకొనవలెనని ఆకాంక్షలో శిరిడీకి వచ్చి ఆ గ్రంథములను బాబా చేతికిచ్చి వారి ఆశీస్సులను తీసుకొనివారు. ఇది బాబా మహాసమాధి చెందక పూర్వము వారు సజీవముగా ఉన్నప్పుడు జరిగినది. ఐతే మహాసమాధి చెందిన తరువాత శ్రీ సాయి భౌతికంగా లేకపోయినను ఇప్పటికి కూడా సాయి చేతుల మీదుగా ఎవరైనా పవిత్ర గ్రంథమును పఠనము చేయవలెనన్న శ్రీ సాయి అనుగ్రహము ప్రాప్తిస్తుంది. ఏ విధముగానంటే బాబా పటము ఎదురుగా నిలబడి ఆ పవిత్ర గ్రంథమును బాబా పటము వద్ద ఉంచి మనసారా సాయి తన ఎదుట ఉన్నారని భావించి తన మొరను వినుచున్నారని వేడుకొనగా శ్రీసాయి  మహాసమాధి చెందక పూర్వము ఏ విధముగా తన స్వహస్తాలతో మత గ్రంథములను తాకినప్పుడు శ్రీ సాయి అభయ హస్తమునుండి ఆధ్యాత్మిక శక్తి రేఖలు ఆ పుస్తకమున చోటుచేసుకొని చదివే ఆ భక్తుడు ఎంతటి అనుభూతిని పొందుచున్నాడో అంతటి అధ్యాత్మిక శక్తి రేఖలు శ్రీ సాయి సమాధి తదనంతరం తనను భక్తి విస్వాసములతో నమ్ముకున్న భక్తులకు ఇప్పటికీ అలాగే ప్రసరింపచేయుచున్నారు. దీనిని ఎవరికైనా సరే ఈ విధముగా ప్రయత్నించి ఏ మతగ్రంథమునైనను సాయి అనుగ్రహము పొందిన తరువాత ప్రారంభించినచో ఎటువంటి విఘ్నములు లేకుండా సాఫీగా అర్థమవుతూ పారాయణము పూర్తియగును. ఇది అక్షరసత్యం.

ఐతే శ్రీ సాయి మసీదులో ఉన్నప్పుడు కొంతమంది భక్తులు వారు ఏదో ఒక గ్రంథమును చదువలెననుకొని ఆ గ్రంథమును సాయి చేతుల మీదుగా తీసుకొనవలెనని భావించి వచ్చిన వారే శ్రీ సాయి చేతిలో ఉంచగా ఆ పరమాత్మ సాయి ఆ గ్రంథమును తెచ్చిన వారికి కాక ఇంకొకరికి ఇచ్చేవారు. ఒక్కొక్కసారి తెచ్చిన వారికే ఇచ్చేవారు. ఇలా ఎందుకు చేయుదురో ఆ పరమాత్మకే ఎరుక. ఎవరికి ఏ గ్రంథము మేలు చేయునో ఆ గ్రంథమును మాత్రమే వారికి ప్రసాదించేవారు.

ఒకసారి కాకా మహాజని ఏకనాథ భాగవతమును శ్రీ సాయి చేతిలో పెట్టినప్పుడు బాబా ఆ పుస్తకములోని కొన్ని పుటలను త్రిప్పి శ్యామాకు ఇచ్చి వేసెను.  శ్యామా ఆ పుస్తకము తనది కాదని చెప్పినప్పుడు బాబా ఇట్లనెను "నేను నీకు  ఇచ్చితిని జాగ్రత్తగా ఉంచుము. అది నీకు పనికి వచ్చును. శ్రీ సాయి శ్యామాకు మేలు

చేయదలచి ఆ భాగవత పుస్తకమును ఈ విధముగా ప్రసాదించెను. అలాగే శ్యామాకు విష్ణు సహస్ర నామము ప్రసాదించుటకై ఒకరోజు ఒక గొప్ప నాటకము ఆడిరి. ఒక రామదాసు శిరిడీలో ప్రతిరోజూ విష్ణు సహస్రనామము శ్రద్ధగా చదువుచుండెడివారు. ఆ పుస్తకమును బాబా తన ప్రియభక్తుడగు శ్యామాకు ఇవ్వదలచి ఆ రామదాసితో తనకు కడుపు నొప్పిగా నున్నదని ఔషధమును తీసుకొని రమ్మనెను. బాబా ఆజ్ఞను శిరసావహించుటకై ఆ రామదాసి బజారుకు వెళ్ళెను. వెంటనే శ్రీ సాయి ఆ విష్ణు సహస్రనామ పుస్తకమును శ్యామాకిచ్చెను. ఇస్తూ శ్రీ సాయి ఒక ముఖ్యమైన విషయమును చెప్పిరి. "శ్యామా ఈ గ్రంథము విలువైనది ఫలప్రదమైనది. నీకిది బహుకరించుచున్నాను. నీవు దీనిని చదువుము. ఒకప్పుడు నేను మిగుల బాధపడితిని. అట్టి సందిగ్ధస్థితియందు ఈ పుస్తకము నా హృదయమునకు హత్తుకొంటిని. అది నాకు గొప్ప మేలు చేసేను. అల్లాయే స్వయంగా వచ్చి బాగుచేసెనని అనుకొంటిని. దీనిని ఓపికగా చదువుము. రోజున ఒక్క నామము చదివినను మేలు కల్గును" అనెను. శ్యామా ఆపుస్తకము తనది కాదని రామదాసిదని పైగా అతను (శ్యామా) అనాగరికుడు కావున దైవానికి సంబంధించిన అక్షరములు చదువలేనని అనెను. అయినను బాబా శ్యామాకే బలవంతముగా ఇచ్చెను. రామదాసి అక్కడికి రానే వచ్చాడు. జరిగినదంతయు అణ్ణాచించిణీకర్ రామదాసికి చెప్పెను. రామదాసు శ్యామాపై విరుచుకు పడి శ్యామాయే బాబాకు కడుపునొప్పి అనే నాటకమాడి ఇదంతా చేసెనని తిట్టుట ఆరంభించెను. సాయి వెంటనే ఇట్లనెను "అనవసరంగా వానినేల తిట్టెదవు. శ్యామా మన వాడు కాదా ఎందుకు జగడము ప్రేమతో మాట్లాడ లేవా ఈ పవిత్ర గ్రంథమును నిత్య పారాయణం చేస్తున్నప్పటికీ నీ మనస్సు అపవిత్రముగాను ఉన్నది. సమస్త విషయము అందు నీవు నిర్మలవుడుగా ఉండవలెను. ఒక పుస్తకము కొరకు శ్యామాతో పోరాడుతున్నావు. ధనమిచ్చిన పుస్తకము లనేకము వచ్చును. కాని మనుష్యులు రారు. నేను దానిని తీసుకొని వానికిచ్చితిని అని అనిరి. ఇందులో గమనించవలసిన విషయము ఏమనగా ఎవరైనను ఆ సంఘటన చదువగనే ఒక ఆలోచన మనస్సున లేచును. అది ఏమనగా బాబా అంతటి మహాత్ముడే తమ భక్తుని కోసం దొంగ నాటకమాడి లేని కడుపునొప్పి కల్పించుకొని ఇంకొక భక్తుడైన రామదాసిని మోసపుచ్చాడు ఏల ? దీనికై లోతుగా చూసిన బాబాకు శ్యామా ఎక్కువ కాదు. రామదాసి తక్కువ కాదు. రామదాసి విష్ణుసహస్రనామాన్ని అనునిత్య పారాయణము చేసినారు. శ్యామాకు ఆ విష్ణు సహస్రనామము గురించి ఎరుకలేదు. బాబా శ్యామాకు మేలు చేయదలచి ఈ విధమైన నాటకమాడినారు. శ్యామాకు విష్ణు సహస్రనామముయొక్క ప్రావీణ్యత గూర్చి చెప్పుతూ అది ఫలప్రదమైనదని కనుక దానిని బహుకరించుచున్నాని బాబా పల్కెను. అనగా విష్ణు సహస్రనామములను బహుకరించుచున్నాను. అనే పదములో విష్ణు సహస్రనామములో మొదటి శ్లోకం "విశ్వం విష్ణు ర్వషట్కారో"... అనే శ్లోకమును విశ్వ అనే పదముతో ప్రారంభమౌతుంది. విశ్వ

అంటే ఆ పరమాత్మయే అనగా సర్వవ్యాప్తి అయిన భగవానుడు విశ్వమంతా ఉన్నప్పుడు ఆయనకి విశ్వమనే పేరు సార్థకము. **విశ్వమంతా తానై యున్నప్పుడు ప్రతీది ఆపరమాత్మునిదే ఇచ్చుట విష్ణుయొక్క సహస్రనామాల హారము భగవాన్ శ్రీసాయే ఆ మాల శ్రీ సాయిదే.** రామదాసి కాదు. కావుననే ఆ మాలను శ్యామాకు బహుకరించుచున్నాను అని అనెను. శ్రీసాయి ఆ విష్ణు సహస్రనామ పుస్తకం దొంగిలించి శ్యామాకు ఇచ్చుట అంటే ఆ పుస్తకం సాయిదే, శ్యామా బాబాకు అనన్య భక్తుడగుటచే బాబా మాటలకు ప్రాధాన్యమిచ్చువాడు కనుక శ్యామాకు బాబా తాను ఒకప్పుడు హృదయము కొట్టుకున్నప్పుడు తన జీవితమపాయములోనుండినప్పుడు ఆ విష్ణు సహస్రం హత్తుకొంటిని" అని బాబా చెప్పుటలో కూడా ఇంకొక రహస్యం కూడా ఉన్నది. తన భక్తుని నమ్మించుటకు బాబా బహుశా ఈ విధముగా చెప్పి ఉండవచ్చును. **ఇతరుల బాధలను మోసే వానికి పరమాత్మ సాయికి బాధపడుట, హృదయము కొట్టుకొనుట, జీవిత మపాయములో ఉండుట అనునవి ఆ పరమాత్మ సాయికి అవి సందిగ్ధ స్థితులు కావు.** ఆ మాటలు విన్నచో మనకే సందిగ్ధ స్థితి కలుగుతుంది. ఇక్కడ శ్రీ సాయి సామాన్యుని వలే చూపుటకై ఆడిన నాటకము మాత్రమే. అయితే "ఈ పుస్తకమును నా హృదయమునకు హత్తుకొంటిని అది నాకు గొప్ప మేలు చేసెను" అనుటలో శ్యామా అనాగరికుడని దైవ అక్షరములను చదువలేనివాడని అంటాడని ఉద్ధేశ్యములో అన్న మాటలవి. **విష్ణు సహస్రనామాన్ని చదువలేని వారు ఎవరైనా కనీసం మనసారా ఆ విష్ణువుని ఆలింగనము చేసుకొనినట్లు ఆ విష్ణు సహస్రనామ పుస్తకాన్ని హృదయమును హత్తుకొన్నను చాలునని భావము.** బాబా ఇంకను ఇట్లనెను. "ఓపికగా చదువుము రోజున ఒక్క నామము చదివినను మేలు కలుగ చేయును" ప్రతి రోజు 1,000 నామములు చదువలేక పోయినను కనీసం ఒక నామమైనను చదువమనెనను. దీనిని బట్టి శ్రీ సాయి నాధుడు ఆడిన నాటకం విష్ణు సహస్రనామము యొక్క గొప్పతనాన్ని గురించి తన భక్తుడగు శ్యామాకే కాక ప్రపంచమంతటికై చాటి చెప్పుటకై చేసిన నాటకము". ఐతే శ్యామా విషయమున సరే వీరి సాయి భక్తుడగు రామదాసి విషయమున అన్యాయము జరిగినది అని అనుకొన్న దానికి ఎవ్వరైనను సరే ఏ పవిత్ర గ్రంథమైనను నిత్య పారాయణం చేసిన వానికి కోపము జగడమాడుట మనస్సు స్థిరముగా లేకుండుట సమత లేకుండుట ఉండిన నిష్ప్రయోజనము అని చూపుటకై బాబా ఆడిన నాటకము రామదాసి విష్ణు సహస్రం నిత్య పారాయణం చేసినప్పటికి ఒక పుస్తకముకోసం శ్యామాను తిట్టి జగడమాడెను. కావుననే బాబా రామదాసిని ధనమిచ్చిన పుస్తకము వచ్చును. కాని మనుష్యులు రారు అని చెప్పి శ్యామాకూడా మనవాడే కదా అని పలికెను. పైగా శ్యామావద్ద నున్న పంచరత్న గీతను రామదాసికిచ్చి దానికి బదులుగా విష్ణు సహస్రనామము శ్యామాకు ఇవ్వమని రామదాసికి చెప్పి వారిరువురిని శాంతింప జేసెను. బాబా చివరకు రామ దాసితో "నేనే దానిని తీసుకొని వానికిచ్చితిని" సత్యమునే చెప్పెను. పంచరత్న

గీత రామదాసి చదువవలెనని ఉద్దేశ్యములో కూడా బాబా అట్లు చేసెను. అతనులోనున్న భగవంతును తెలుసుకొనుటకు చేసెను. రామదాసి బాబాకు ఔషధము తెచ్చుటకై వెళ్ళినప్పుడు మశీదులో జరిగినదంతయు అణ్ణాచించిణీకర్ రామదాసి వచ్చిన తరువాత ఉన్నది ఉన్నట్లుగా చెప్పెను. తన గురువైన బాబా పై ఈ విధమైన నిందమోపుట కూడా తప్పుకదా అని భావించవచ్చు మరియు సాయి చేసిన పనిని రామదాసికి చెప్పకుండా ఉండవలెనని కూడా అనుకోవచ్చు. ఎందుకంటే సాయి అందరి యజమాని కాబట్టి వారిని గురించి ఇంకొకరికి చెప్పకూడదని ఇటువంటి ఆలోచనలు కూడా మనస్సులో మనకు రావచ్చు. ఇదంతా శ్రీ సాయి ఆ అణ్ణాచించిణీకర్‌పై మాయా ప్రభావముచే జరిగిన దంతయు చెప్పేటట్లుగా శ్రీ సాయే అట్లు చేసెను. **అణ్ణాచించిణీకర్ చెప్పకపోతే రామదాసుకు అజ్ఞానము వీడేది కాదు. శ్యామాకు విష్ణు సహస్ర నామ జ్ఞానబోధ కల్గేదికాదు.**

ఒకసారి బాపు సాహెబ్ జోగ్‌కు శ్రీ బాల గంగాధర్ తిలక్ వ్రాసిన గీతా రహస్య పుస్తకములు పార్శిల్ రాగా ఆ పుస్తకములను తీసుకొని బాబా వద్దకు తెచ్చి వారి చేతిలో పెట్టెను. శ్రీ సాయి ఆ పుస్తకములోని పేజీలను త్రిప్పి ఒక రూపాయి తీసి దక్షిణగా పుస్తకముపై పెట్టి జోగ్‌నకు ఇస్తూ “దీనిన పూర్తిగా చదువుము. నీకు మేలు కలుగునని” ఆశీర్వదించిరి.

అమరావతిలో గొప్ప ప్లీడరగు దాదా సాహెబ్ కపర్దే తన భార్యతో శిరిడీకి వచ్చెను. కపర్దే గారి భార్య బాబాను మిక్కిలి భక్తి శ్రద్దలతో పూజించెడిది. ప్రతిరోజు బాబా కొరకై నైవేద్యం తెచ్చేది. ఒకసారి బాబాకొరకై నైవేద్యం మశీదునకు తేగా అప్పటివరకు ఊరకనే ఉన్న బాబా వెంటనే ఆమె తెచ్చిన నైవేద్యమును ఆరగించెను. మశీదులో ఉన్నవారు బాబాకు ఆమెపై గల పక్షపాతమును గురించి ప్రశ్నించగా బాబా దానికి జవాబిట్లు చెప్పెను. “గత జన్మలో ఆమె ఒక ఆవు. తరువాత ఒక తోటమాలి ఇంట్లో, ఆ తరువాత ఒక క్షత్రియుని ఇంట్లో, ఆ తరువాత ఒక బ్రాహ్మణుని ఇంట్లోకి జన్మించెనని చాలా కాలము తరువాత ఆమెను చూచితిని” అని చెప్పగా అక్కడున్న వారందరు ఆశ్చర్యపడిరట. శ్రీ సాయి ఆమె భక్తి శ్రద్దలకేమెచ్చి “రాజారామ్” అను మంత్రమును జపించమని అభయమిచ్చెను. బాబాకి ఒక్కొక్క భక్తునియొక్క పుట్టు పూర్వోత్తరములు వెనుకటి జన్మలతో సహా తెలిసి యున్నవని నిదర్శనము. శ్రీ సాయి పరమాత్మయే.

## 28 వ ఆధ్యాయము

శ్రీ సాయి ఎల్లప్పుడు ధునిలో కాలిన బూడిదను ఊదీగా ఉపయోగించి తన దర్శనానికి వచ్చిన వారికి ఊదినిస్తూ "అల్లా అచ్ఛాకరేగా" అంటూ కొంతమందికి గుప్పిటలోనూ కొంతమందికి నుదుటపైనను ఊదినిస్తూ ఆశీర్వదించేవారు. వారు శివరూపానికి చాలా దగ్గర సంబంధముతో కన్పించేవారు. నిజానాకి శ్రీసాయి త్రిమూర్తులగు బ్రహ్మ విష్ణు శివరూపులు. వారు శివరూపానికి దగ్గర సంబంధముతో నున్నట్లు కనిపించేవారనుట సమాంజసము కాదు కాని సామాన్యమానవులు వేరు వేరు దేవుళ్ళని కొలుస్తూ ఎవరికి ఇష్టమైన రూపము ఉన్నదో ఆ రూపమును సాయిని భావించేవారు. హరిభక్తులు సాయిని హరి రూపమున దర్శించి శ్రీ సాయిని హరిగా భావించేవారు. అలాగే శైవభక్తులు శ్రీ సాయిని శివరూపముగా భావించేవారు కనుక శివరూపానికి దగ్గర సంబంధం ఉన్నదని సంభోదించుట తప్పదు. శివుడు ఒక బైరాగి వలే ఏ ఆడంబరములు లేక ఒంటిపై బూడిదను రాసుకొని తిరుగుచూ ఉండేవారు. మనసాయి కూడా ఫకీరుగా బైరాగి వలే విభూదిని వాడుతూ ఎల్లప్పుడు శివునివలే ధ్యాన నిమగ్నులై ఉండెడి వారు. శిరిడీ గ్రామ దేవుడు ఖండోబా అనగా శంకరుడు. బాబా పేరు ప్రఖ్యాతులు పొందిన తరువాత శిరిడీ గ్రామంలోని ప్రజలు శ్రీ సాయిని ఖండోబా దేవుడిగానే భావించేవారు. కొంతమంది భక్తులు సాయి సాక్షాత్తు ఖండోబా అవతారమని కూడా తలచెడివారు.

హరి వినాయక సాథేగారి వంట బ్రాహ్మణుడు మేఘశ్యాముడు. అతను అమాయకపు శివ భక్తుడు. ఒక్క ఓం నమఃశ్శివాయ అనే నామము తప్ప మరి ఏ పూజా పునస్కారములు తెలియవు. సాతే సాయిబాబా సాక్షాత్తు శంకరుని అవతారమని మేఘాకు చెప్పి శిరిడీకి పంపించెను. కాని సాయి మహమ్మదీయుడని ఎవరో చెప్పగా మేఘా మనస్సు చింతించి బలవంతముగా శిరిడీకి చేరెను. మశీదులో బాబాను చూడగనే శ్రీ సాయి "ఈ వెధవను తన్ని తరిమి వేయండి. నీవు గొప్ప జాతి బ్రాహ్మణుడవు నేను తక్కువ జాతి మహమ్మదీయుడను. నీవు ఇచ్చటకే వచ్చినచో నీ కులము పోవును" అని బాబా మేఘునిపై శివుడు మూడవ కన్ను తెరచిన వానివలే కోపగించెను. కొత్త భక్తులు లేక కొత్త వ్యక్తులు శిరిడీకి వచ్చినప్పుడు బాబా ప్రవర్తనను చూసిన భయపడి బాబా తిట్లకు ఆశ్చర్యపడి బాబాని ఒక పిచ్చి ఫకీరుగనే తలిచేవారు. ఇక్కడ మేఘ శ్యాముడు తన మనస్సులో బాబా ఒక మహమ్మదీయుడని అనుకొనిన విషయము సాయి ఎట్లు గ్రహించి చెప్పునో కదా! అని ఆశ్చర్యపడెను. మేఘ శిరిడీనుండి త్రయంబక్ పోయి అక్కడ ఆరు మాసములు ఉండి తిరిగి శిరిడీకి వచ్చెను. సాయి భక్తుడు కేల్కర్ మేఘా తరపున సాయిని వేడుకొనగా బాబా మేఘాను శిరిడీలో ఉంచుటకు అనుమతించెను. శ్రీ సాయి మేఘాకు ఎటువంటి ఉపదేశము లివ్వలేదు. కాని మేఘాలో మార్పు చెందునట్లు చేసి బాబాకు అతనికి మేలు

చేసెను. మేఘా సాయిబాబాను సాక్షాత్తు శంకరునిగా భావించి ప్రతిరోజూ బిల్వపత్రములకై ఎన్నోమైళ్ళకాలి నడకతో వెళ్ళి బిల్వ పత్రములు తెచ్చి బాబాను పూజించి శ్రీసాయి పాదములను ఒత్తుతూ బాబా పాదతీర్థమును స్వీకరించెడివారు. వెనుకటి ఒక ఆధ్యాయములో దాసగణు మహారాజు ప్రయాగ వెళ్ళదలచినప్పుడు బాబా శిరిడీలోనే ప్రయాగ కలదని శ్రీ సాయి తన బొటన వ్రేలినుండి గంగాయమునల ధార చూపించెను. దాసగణు మహారాజుకి ఎంతో గొప్ప అవకాశము ఎవ్వరికి రాని అవకాశము వచ్చినను దాసగణు మహారాజు ఆ పాదతీర్థమును స్వీకరించలేదు. శ్రీసాయి మహా సమాధి తదనంతరం దాసగణు కొన్ని పుణ్యక్షేత్రములకు వెళ్ళి కొందరి యోగుల దర్శనము చేసుకొనెను. అందులో ఒక యోగి దాసగణు మహారాజ్‌ను లోనికి రానీయక తిట్టెనట. కారణం దాసగణు మహారాజుకి వచ్చిన అవకాశం శ్రీ సాయి పాదతీర్థమును స్వీకరించక పోవుట చాలా పొరపాటని దాసగణుకు చెప్పెను. మేఘ శ్యాముడు శ్రీ సాయిని బిల్వ పత్రములతో పూజించుటే కాక సాయి పాదములను ఒత్తి సాయి పాద తీర్థమును త్రాగుచుంచెడివారు. మేఘుని జన్మ ధన్యం. అందుకే మేఘుడు మరణించిన తరువాత శ్రీ సాయి మేఘ శ్యాముని శవం వెంట వెంబడించి మేఘుని శవంపై పువ్వులు చల్లి దహన సంస్కారమున పాల్గొనెను, పైగా శ్రీ సాయి వాని కళేబరముపై చేతులు పెట్టి “ఇతడు నా నిజమైన భక్తుడు ” అనెను. బాబా తన సొంత ఖర్చులతో బ్రాహ్మణులకు భోజనములు కూడా పెట్టించేనట. దాసు గణుక వచ్చిన అవకాశం సద్వినియోగం చేసుకొనలేదు. కాని మేఘ శ్యాముడు ఆ అవకాశాన్ని వినియోగించుకొనెను. మేఘ శ్యాముడు బాబాను ఒక మహమ్మదీయుడని భావనతో శిరిడీకి వచ్చి ఆ తరువాత శ్రీ సాయి శివ అవతారమని గ్రహించి తన మనసులోని అన్ని ఆలోచనలకు స్వస్తి చెప్పి మహమ్మదీయుడు అని అనకున్న ఆ మేఘ శ్యాముడే సాయి పాద తీర్థమును ఎటువంటి సంకోచము లేకుండా స్వీకరించెను. అందుకే కాబోలు శ్రీ సాయి ఇతడు నా నిజమైన భక్తుడనెను.

ఒకసారి శిరిడీలోని ఖండోబా మందిరం మూసి ఉండుటచే బాబా వద్దకు మేఘుడు వచ్చినప్పుడు సాయి అతని పూజను అంగీకరింపక తిరిగి పంపివేసెను. పైగా ఖండోబా దేవాలయం తెరచి ఉన్నదని చెప్పి పంపించెను. ఒక మకర సంక్రాంతి నాడు మేఘశ్యాముడు శ్రీ సాయి దేహానికంతా చందనముపూసి గంగానది జలములో అభిషేకము చేయదలిచెను. శ్రీ సాయికి ఇష్టంలేక పోయినను మేఘశ్యాముని కోరిక తీర్చుటకు అంగీకరించెను. కాని శ్రీసాయి ఫకీరగుట చేత గంగా నది జలముతో వారికి ఎట్టి సంబంధము లేదని ఐనను ఇట్లనెను. “శరీరమునకు తల ముఖ్యముకావున తలపైన నీళ్ళుపోయము, శరీరమంతటిపైన పోసినట్లే అని బాబా తన భక్తుణ్ణి కోరెను. మేఘ శ్యాముడు శివభక్తి పారవశ్యంచే సాయి శరీరమంతటిపై నీళ్ళను పోయగా ఆ

పరమాత్ముడగు సాయికి తలమాత్రమే తడిసి శరీరమంతయు పొడిగాయుండెను. బాబా తల మాత్రమే తడుచుట అది తలనా లేక శివలింగమా! బాబా ఆ శంకరుని అవతారమే అని ఋజువు చేసెను. మేఘశ్యాముడు వాడాలో బాబా పటమును పూజించు చుండెడివారు. 12 నెలలు శ్రీ సాయిని భక్తితో పూజింపగా శ్రీసాయి ఒక స్వప్నమును చూపెను. "మేఘ త్రిశూలము గీయుము అని అక్షింతలు చల్లి అదృశ్యమయ్యెను. చిత్రమేమిటంటే మేఘశ్యాముడు కళ్ళు తెరిచి చూచే సరికి అక్కడ అక్షింతలు పడియున్నవి. వెంటనే మశీదుకు పోయి సాయిని అడగగా శ్రీ సాయి ఇట్లనెను. "అది దృశ్యము కాదు, స్వయముగా నేను వచ్చి చెప్పితిని" అనగా మేఘ శ్యాముడు తలుపులన్నీ వేసి ఉండుటచే అది ఒక కల అనుకుంటిని అనగా దానికి బాబా ఇట్లు జవాబు చెప్పెను. "నాకు రూపము లేదు, నేను అన్నిచోట్ల నివసించుచున్నాను. ప్రవేశించుటకు నాకు వాకిలి అవసరము లేదు. నన్ను ధ్యానించువారు పనులకు నేనే సూత్రదారున్నై నడిపించెదను. శ్రీ సాయి ఆజ్ఞప్రకారము మేఘశ్యాముడు తాను నిత్యం పూజించే బాబాను పటము వద్ద గోడపై త్రిశూలము ఎర్రరంగుతో గీసెను. ఆ మర్నాడే ఒక రామదాసి భక్తుడు ఒక లింగమును బాబాకు ఇవ్వగా ఆ లింగమును బాబా మేఘునకిస్తూ "శంకరుడు వచ్చినాడు. జాగ్రత్తగా పూజింపుము." శ్రీ సాయి, త్రిశూలము గీయమని చెప్పి శంకరుణ్ణి తెప్పించిన ఆ పరమేశ్వరుడే శిరిడీలోని శ్రీ సాయి నాథుడు. మేఘ శ్యాముడు పూజ చేయుచున్న పెద్ద పటము వద్ద ఆ లింగమును ప్రతిష్ఠించిచెను.

లాలా లక్ష్మీచంద్ అనునతనికి క్రిస్మస్ పండుగకు ముందు స్వప్నములో గడ్డముతో ఉన్న ఒక ముసలివానిని చుట్టు భక్తులు ఉన్నట్లు దర్శించెను. ఇది జరిగిన కొన్నాళ్ళకు దాసగణు కీర్తన చేయుచున్నప్పుడు లాలా లక్ష్మీచందు అక్కడ ఉన్న బాబా పటమును చూసి తన స్వప్నములో వచ్చిన ఆ గడ్డపు మనిషి శ్రీ సాయి అని గ్రహించి శిరిడీకి పోవలెనని వారి బంధువులు వద్ద అప్పుపుచ్చుకొని మశీదునకు వచ్చెను. శ్రీ సాయిని చూసి సంతసించి పాదములపై పడగా సాయి ఇట్లనెను. అప్పులు తీసుకొని శిరిడీ దర్శనము చేయవలసిన అవసరమేమి ? దారిలో భజన చేసి నన్ను గురించి ఇతరులను విచారించనేల **మనకళ్ళతోను సమస్తము చూడవలెను** అని అనిరి. నిజానికి లాలా లక్ష్మీచంద్ శిరిడీకి వస్తున్నప్పుడు రైలులో తన తోటి ప్రయాణీకులను బాబాను గురించి అడిగెను. అది గ్రహించిన లాలా లక్ష్మీచంద్ సిగ్గుపడి ఆశ్చర్యముతో బాబాను తిరిగి క్షమాపణ వేడెను. ఇందు గమనించవలసిన ముఖ్య విషయము బాబా దర్శనము కొరకు గాని, పండగ చేసుకొనుటకు గాని, తీర్ధయాత్ర పోవుటకు గాని, అప్పుచేయరాదు. మశీదులో ఒకసారి లక్ష్మీచంద్ కు సాంజాని ప్రసాదముగా ఇచ్చెను. ఆ సాంజా అతనికి ఎంతో నచ్చినది. మరునాడు కూడా దానినే ఆశించినను అది దొరకలేదు.

మూడవ రోజు నైవేద్యమునకై భక్తులు బాబాను అడుగగా లక్ష్మీచంద్ కోరికను తీర్చుటకై సాంజా తీసుకొని రమ్మని బాబా చెప్పెను. శ్రీ సాయి చమత్కారములను కళ్ళారా చూసిన లక్ష్మీచంద్ ఒక గొప్ప కోరిక అడిగెను. ఆ కోరికను మనమందరము కూడా ఎల్లప్పుడు జ్ఞాప్తియందుంచుకొని సర్వేశ్వరుడగు సాయిని వేడుకొనవలెను. **అది ప్రపంచములో ఉన్న దేనితోను సమానమైనదికాదు. దానికి మించినది యావత్ ప్రపంచంలో ఎక్కడ పొందలేనటువంటిది ఆనందము, శాంతి, నిర్మలత్వము లభించేది అదే అటువంటి కోరిక ఏమనగా "నాకీ ప్రపంచంలో నీ పాదములు తప్ప ఇతర దైవము లేదు. నా మనస్సు ఎల్లప్పుడు నీ పాదపూజయందు, నీ భజన యందు ప్రీతి చెందునుగాక. నీ కటాక్షముచే నన్ను ప్రపంచ బాధలనుండి కాపాడదురుగాక, ఎల్లప్పుడు నీ నామములను జపించుచు, సంతోషముతో ఉండనీ గాక అని ప్రార్థించెను.** ప్రహ్లాదుడు శ్రీమన్నారయణుని ఈ విధముగాను కోరెను. ఇటువంటి సత్పురుషుల భావనలను అనుగుణముగా తీసుకొని వారు సత్ప్రవర్తన అడుగు జాడలలో మనము కూడా వారిని ఆదర్శముగా తీసుకొని ప్రవర్తిద్దాం. అప్పుడే మనము కూడా భాగవతులు అనే నిరూపిద్దాం. మనము యావత్ ప్రపంచంలో దేనిని ఆశించక ఒక్క సాయి పాదములను సాయి పూజను సాయి భజనపై, మనసుని లగ్నం చేసి అనునిత్యం సాయి నామ స్మరణలో జపించుచు కాలము గడుపుటయే గొప్పవరం.

బురహాన్ పూర్‌లో ఒక మహిళకు శ్రీ సాయి కలలో దర్శనమిచ్చిరి. కిచిడీ కావలెనని కోరెను. కొన్నాళ్ళకు ఆ భార్యా భర్తలకు అకోలాకు బదిలీ అయినది. వారు అక్కడినుండి శిరిడీకి వచ్చి బాబాకు కిచిడీ సమర్పించవలెనని ఉద్ధేశ్యముతో ఉన్నప్పటికినీ వారి కోరిక 14 రోజుల వరకు తీరలేదు. చివరకు 15 వ రోజున మధ్యాహ్నము 12 గంllలకు ఆమె మసీదుకు వెళ్ళిన సమయానికి అందరూ భోజనాలకు కూర్చొనియుండగా ఆమె అడ్డుగా ఉన్న తెరను తొలగించి లోనికి ప్రవేశించి బాబాను చూడగా బాబా ఆరోజు కిచిడీ కొరకు కనిపెట్టుకొనియున్నట్లు తోచెను. కిచిడీని పెట్టగనే శ్రీనాయి ఆతురతతో సంతోషముతో కిచిడీని స్వీకరించెను.

ఈ విధముగా బాబా ఒక్కొక్క భక్తునికి వారి కోరిక అనుసరించునట్లుగా ప్రవర్తించి భక్తులను ఆశీర్వదించెను. మరియు బాబా అనేకసార్లు ఈ విధముగా అనెను. "నా మనుష్యుడు ఎంత దూరమున ఉన్నప్పటికి పిచ్చుక కాళ్ళకు దారముకట్టి ఈడ్చినట్లు అతనిని శిరిడీకి లాగెదనెను. అటువంటి భక్తులే ఈ మేఘ శ్యాముడు లాలా లక్ష్మీచంద్, బురహాన్‌పూర్ మహిళ. **వీరేకాదు బాబాను సజీవంగా ఉన్నప్పుడు దర్శించిన వారందరూ మహాసమాధి చెందిన తరువాత దర్శించిన వాళ్ళదరూ కేవలం బాబా యొక్క అనుగ్రహం వలన శ్రీ సాయి చేతితో లాగబడిన దారములో చిక్కుబడిన పిచ్చుకలు ఎందరెందరో శ్రీ సాయిని ధర్శించినారు.**

29 వ అధ్యాయము

**గత అధ్యాయములో మేఘశ్యామాకు బాబా సాక్షాత్తుగా హరుడని నిరూపించారు. ఈ అధ్యాయములలో శ్రీ సాయి హరి రూపమును చూపుతున్నారు.** సామాన్యముగా తండ్రికొడుకు, భార్యాభర్త, అన్న తమ్ముడు, ఇలా ఇద్దరిలో ఏ ఒక్కరికో భక్తి ఉంటుంది. రెండవవారు నాస్తికులుగా ఉండెదరు. ఎక్కడో ఒక్కచోట ఇద్దరు భక్తులే ఉండెదరు. ఉదాహరణకు తండ్రికొడుకుల విషయంలో హిరణ్యకశిపుడు ప్రహ్లాదుడు తీసుకొన వచ్చును. అన్నదమ్ములతో రావణుడు, విభీషణుడు అలాగే భార్యాభర్తలతో రామదాసి పంథాకు చెందిన భజన సమాజములో ఒక పురుషుడు అతని భార్య సంఘటన సాయి చరిత్రలో పరిగణిద్దాం. వీరు కాశీకి వెళ్తూ సాయిని గురించి తెలుసుకొని వారు భక్తులకు ప్రతిరోజు ద్రవ్యం పంచిపెట్టెదరని ఉద్దేశ్యంతో శిరిడీకి వచ్చి భజన చేసిరి. వారిలో ముగ్గురు ఆత్యాశ కలవారు.యజమానురాలు మాత్రము బాబాయందు భక్తి ప్రేమ గౌరవములు కలది. ఆమె ఇష్టదైవం రఘురాముడు. ఆమెయొక్క భక్తి విశ్వాసములను మెచ్చుకొని శ్రీసాయి ఆమెకు ఒకరోజు మధ్యాహ్న హారతి సమయమున శ్రీరాముని వలే కన్పించెను. బాబా ఇదివరకు చెప్పిన కొన్ని అధ్యాయములలో కూడా రామదర్శనము చూపి కొందరి భక్తులను ప్రసన్నం చేసారు. ఒకసారి సాయి నాథుడు మశీదులో ఉన్నప్పుడు "శ్రీరాముడు లంకా ప్రయాణం చేయు సమయమున సముద్రముపై వారధి కట్టుటకు వానరులు ఎంతో మంది భూమిపై జాగా లేనంత వానరులు రామ కార్యము సఫలము చేయుటకై సేవ చేయుచుండిరి." అని బాబా చెప్పుతుండగా ఒక భక్తుడు మీరు ఆ వానరుల గుంపును స్వయముగా చూసినట్లు చెప్తున్నారు. మీరు ఆ సమయమున అక్కడ ఉన్నారా? అని అనగా శ్రీసాయి "ఔను నేను అక్కడే ఉన్నాను. అని అన్నారు. **శ్రీసాయి నాథుడు శ్రీ రాముడే అని చెప్పుటకు ఇంతకన్నా నిదర్శనమేది ?** అలాగే ఈ రామదాసి పంథాకు చెందిన మదరాసు భజన సమాజములోని ఆమెకు బాబా శ్రీరామదర్శనము చూపెను. తన ఇష్టదైవమును చూచి ఆమె ఆనందము చెంది జరిగినది తన భర్తకు చెప్పగా అతను అది ఒక భ్రమ అని అందరు బాబాను చూడగా శ్రీరామ దర్శనము కల్గుట అసంభవమని చెప్పెను. ఆమెకు శ్రీరామదర్శనము అప్పుడప్పుడు కల్గుతూనే ఉండేది. ఒకరోజు రాత్రి ఆమె భర్తకు స్వప్నములో అతనిని పోలీసులు బంధించి ఒక పంజరములో నెట్టినట్లు ఆ పంజరము బయటే సాయి నిలబడుట చూచెను. పంజరములో నున్న అతను బాబాను తనకు వచ్చిన ఆపద నుండి రక్షింపమనగా బాబా ఇట్లనెను. "నీవు చేసిన కర్మఫలితము నీవే అనుభవించవలెను". అనగా అతను

నేను ఏ పాపము చేయలేదు అనేను. దానికి సాయి ఈ జన్మలో కాకున్నను గత జన్మలో చేసి ఉండవచ్చుకదా. మంచి వారికి కష్టాలు దుఃఖములు కల్గినప్పుడు వారి కుటుంబ సభ్యులుగాని బంధుమిత్రులుగాని ఏపాపము చేయని వాడికి ఈ కష్టములేమిటి? దేవుడు ఏమి చేయుచున్నాడు. అనే అజ్ఞానపు మాటలకు సరియైన సమాధానము బాబా చెప్పినట్లుగా ఈ జన్మలో కాకున్నా గత జన్మలో పాపము చేసి ఉండవచ్చుకదా! ప్రతిరోజు ప్రతి మనిషి ఏదోఒక కార్యములను చేస్తు ఉంటాడు. ఆ కార్యములే కర్మలు. ఆ కర్మలు చేయుట వలన వాటికి ఫలితం వస్తుంది. ప్రతి కర్మకూడా ఫలితాన్నిస్తుంది. కర్మలు మూడు విధాలుగా విభజించ వచ్చును. ఆగామి, సంచిత, ప్రారబ్ధ కర్మలు. ఇప్పుడు చేసే కర్మలన్ని ఆగామి కర్మలు. కొన్ని వెంటనే ఫలిస్తాయి. కొన్ని కూడ బెట్టుకొని ఉంటాయి. గత జన్మలో చేసి ఎప్పుడో ఫలితాన్నివ్వటానికి కూడబెట్టిన ఒక జన్మమునుండి మరొక జన్మకు వస్తూ వున్న కర్మలను సంచిత కర్మలుంటారు. అలాగే అటువంటి సంచిత కర్మలు జీవితో ప్రయాణం చేస్తూ ఆ జీవి శరీరము విడిచిపెట్టు సమయాన ఏకర్మలైతే పండుతాయో వాటినే ప్రారబ్ధ కర్మలంటారు. అంటే ప్రారబ్ధకర్మల ఫలితాన్ని అనుభవించటానికి తగిన శరీరాన్ని వెతుక్కుంటూ వెళ్ళి మళ్ళీ ప్రపంచములోకి అడుగిడుతాడు. ఆ జీవికి ప్రారాబ్ధ కర్మ ఫలాలు అనుభవించేంత వరకు శరీరము ఉండి కర్మఫలాన్ని అనుభవించి పూర్తయిన మరుక్షణమే శరీరము ఒక్క క్షణము కూడా ఉండదు. కాబట్టి మనము చేసే ప్రతికర్మ అనుభవించి తీరవలిసిందే.

సాయి చెప్పిన మాటలు గత జన్మలో పాపము చేసి ఉండవచ్చు అనే దానికి ఆ యజమాని అటువంటి ఆ పాపములను నీ చెంతన ఉన్నచో వాటిని కాల్చి వేయరాదా! అని వేడుకొనగా బాబా అతనిన కళ్ళుమూసుకొనమనగా అతని కళ్ళు మూసి తెరవగనే పోలీసు వారు రక్తము కారుచూ పడియుండిరి. అతను బంధ విముక్తుడై యుండెను. అతను ఇంకను భయపడి వణుకుచుండగా సాయి “నీవు ఇంకా పట్టుబడితివి” అని చెప్పగా అతను నీవు తప్ప రక్షించు వారు లేరు అనగా మళ్ళీసాయి కళ్ళుమూయమనెను. అతను కళ్ళుమూసి తెరచునంతలో అతను బాబా పక్కన ఉన్నట్లు బాబాకు మ్రొక్కుతున్నట్లు కనబడెను. సాయి ఇట్లనెను “ఈ నమస్కారములకు ముందు నమస్కారమనకు తేడా కలదా అనగా ఆతను ఈ నమస్కారమునకు నిన్ను దేవునిగా భావించి చేసితిని. నీవు మహమ్మదీయుడవని హిందువులను మభ్యపెడుతున్నావని అనుకొంటిని. బాబా అతనిని క్షమించి ఏమి కావలెనని కోరగా అతడు తనగురువగు రామదాసుని దర్శింపమనగా శ్రీసాయి రామదాసస్వామిని చూపెను. తన స్వప్నము నుండి మేల్కొని ఆశ్చర్యపడిన ఆ యజమాని ఆ క్షణము నుండీ తన సంశయములు తీరి బాబాపై భక్తి మళ్ళెను. మానవుని నైజము అవసరము వచ్చినప్పుడు ఆపద కల్గినప్పుడు దేవుడు గుర్తుకు

వస్తాడు. తన పరిస్థితి అనగా తన కడుపు నిండుగా ఉన్నప్పుడు ఏదేవుడు గుర్తుకురాడు. ఈ యజమాని విషయము అంతే తన భార్య రాముణ్ణి బాబాలో చూసెనని చెప్పినప్పుడు ఎగతాళి చేసిన ఆ పెద్ద మనిషి స్వప్నములోనే ఆపద కలిగినంత మాత్రమున గజగజవణికి బాబా కాళ్ళపై బడి కాపాడమని వేడుకొని బాబాను తన గురువగు రామదాసస్వామిని దర్శనము కోరగా బాబా అతని కోర్కెను స్వప్నములోనే తీర్చెను. శ్రీసాయి జాగ్రత్, స్వప్న, సుషుప్తులలోను తన భక్తులకు బోధనలను చేసి దర్శనాన్ని కల్గించే అతీతమైన గొప్ప అవతారం ఆ దైవమే మానవ రూపమున వచ్చి శిరిడీలో తిష్ట వేసినారు. ఆ పరమాత్ముడే శ్రీసాయిగా.

బాంద్రాలో తెండూల్కర్ కుటుంబము వారు ఎల్లప్పుడు బాబాను పూజించేవారు. సావిత్రిబాయి టెండూల్కర్ కుమారుడు బాబూ టెండూల్కర్ వైద్య పరీక్షకు కూర్చొనవలెనని అనుకొనగా జ్యోతిష్యులు అతని జాతకం ప్రకారం ఆ సంవత్సరం వద్దని సలహానిచ్చిరి. అతని తల్లి ఈ విషయము సాయి ముందుకు తేగా బాబా ఇట్లనెను. నాయందు నమ్మకము ఉంచి జాతకములు వాని ఫలితములు పక్కకు పెట్టి చదువు కొమ్మని సలహానిచ్చెను. బాబా ఆజ్ఞప్రకారం ఆమె కొడుకు శ్రద్ధగా చదివి పరీక్షలో ఉత్తీర్ణుడయ్యెను. పైగా నోటి పరీక్షకు కూడా రావలెనని కబురు వచ్చెను. బాబా దివ్య ఆశీస్సులచే రెండింటిలో ఉత్తీర్ణులయ్యెను. **బాబాపై అనన్య భక్తి ఉన్నచో జాతకము వాటి ఫలితాలు వ్యతిరేకంగా ఉన్నా శ్రీసాయి అటువంటి చెడు గ్రహములను కూడా తారుమారు చేసి జాతకాన్ని త్రిప్పిరాసి జరుగనిది జరిగించి చూపించే శక్తి స్వరూపులు శ్రీసాయి సమర్ధులు.** ఈ అబ్బాయి తండ్రి వృద్ధుడగుటచే ఉద్యోగమునుండి విరమించుకొనెను. కంపెనీ వారు అతనికి ఫింఛన్ ఇచ్చి విరమణము చేయించదలచిరి. ఐతే ఎంత పింఛనివ్వవలెను అనేది సమస్య. టెండూల్కర్ భార్యకు బాబా స్వప్నములో కన్పించి "వంద రూపాయలు పింఛన్ ఇచ్చిన చాలునా" ? అని అడిగెను. అతనికి పింఛన్ కంపెనీ వారు 110 రూపాయలనీ నిర్ధారించి ఇచ్చిరి. దీనిని బట్టి బాబా తన భక్తుడు అనుకున్న ప్రతి వానియింట ఏ సమస్యనైనను కళ్ళారా చూస్తూ వాటికి మేలు చేయువాడని ఋజువైనది. ఆహా ఆ పరమాత్మ ఎవరోకాదు. శిరిడీ శ్వరుడు –ఈశ్వరుడు –సర్వేశ్వరుడు–పరమేశ్వరుడు–సాయి.

## 30 వ అధ్యాయము

బాబా తన భక్తులను ప్రేమ, దయ, కరుణతో చూచేవారు. ఎవరైనా భక్తులు ఏదైనా మ్రొక్కుబడులు ఉన్నచో ఆ మ్రొక్కు తీర్చమని ఏ దేవునికి మ్రొక్కుకున్నారో ఆ దేవుని కడకు పంపించి మ్రొక్కు తీర్చమని చెప్పేవారు. కొందరు వారిమ్రొక్కులను ఇతర దేవతలకు మ్రొక్కుకున్నను, బాబాయే సకలదేవతాస్వరూపుడని భావించి వారు మ్రొక్కుకున్న మొక్కులను బాబా కడకు వచ్చి వారి పాదముల వద్ద తీర్చుకొనవలెనని తలచినను

బాబా దానికి అంగీకరించక ఏ దేవతకు మ్రొక్కుకున్నారో ఆ దేవత కడకు పంపించేవారు. ఐతే దేవతలు తనను పూజించే భక్తులకు స్వప్న దర్శనము ఇచ్చి తన భక్తులను శిరిడీకి పోయి బాబాను దర్శించమని చెప్పేవారు. బాబా తన భక్తులను ఏ దేవతకు మొక్కుకున్నారో ఆ దేవత వద్దకు పంపించేవారని చెప్పిన దానికి ఉదాహరణకు తన భక్తుడగు శ్యామా విషయమున చూపెను. దేవతలు తనను నమ్ముకున్న భక్తులకు సాయి దర్శించుకొనమని చెప్పిన విషయములో ఉదాహారణకు కాకాజీ వైద్య విషయములో నిరూపించెను. ఈ కాకాజీ వైద్య సప్తశృంగి దేవతపూజారి అతడు అనేక కష్టాలలో మునిగి శాంతి లేక నిస్సహాయుడై తనను నమ్ముకున్న ఆ సప్త శృంగి దేవతను మనసారా వేడుకొనగా ఆ దేవత తన స్వప్నమున కనిపించి బాబా వద్దకు పొమ్మని అజ్ఞాపించెను. **ఇక్కడ తనను నమ్ముకున్న దేవత రక్షింపక ఇంకొకరివద్దకే పంపుటఏలా? అనే ప్రశ్న వస్తుంది.** శ్రీ సాయి సద్గురువు సప్తశృంగి ఒక దేవత సద్గురువునకు దేవతకు ఎటువంటి భేదము లేదు ఇరువురు ఒక్కరే. గురువే దైవము, దైవమే గురువు సామాన్యమగు మనము గురువు వేరే దేవుడు వేరే అనే భావన ఉంటుంది. ఇటువంటి భేదాభిప్రాయములను తారతమ్యములను తొలగించుటకై దేవతలు గురువులవద్దకు తమ భక్తులను పంపించెదరు. ఏ దేవతలైనా, సద్గురువులైనా చేయని కార్యములు లేవు. ఒకరు ఒకచోట ఇంకొకరు ఇంకొకచోట ఉండెదరు. నామాలలో రూపాలలో వేరుగా చూపిస్తారే కాని అందరూ ఒక్కరే ఈ కాకాజీ విషయమున తనునమ్ముకున్న సప్తశృంగి దేవత బాబా వద్దకు పొమ్మనుటకు **రెండు కారణములై ఉండవచ్చును. ఒకటి గురువు దైవము వేరు కాదని నిరూపించుటకు. రెండవది కాకాజి యొక్క కష్టాలను తీర్చువాడు శ్రీసాయివంతు అనే ఉద్ధేశ్యముతోనే అనగా కొందరి కార్యములను కొందరు మోసి తీర్చుటకై ముందే లిఖితమై ఉండును.** ఆ గురువులే కాని దేవతే కాని ముందుగానే ఫలానావారి కార్యము ఒకరిదని ఇంకొకరిది మరియొకరిదని ముందుగానే నిర్ధారించుకొందురు, కావుననే కాకాజి యొక్క కష్టాలను తొలగించువాడు శిరిడీలో ఉన్న శ్రీసాయినాథుదుని ఎరిగి ఉండుట వలన ఆ సప్త శృంగి దేవత అతనిని బాబా వద్దకు పంపెను. ఈ కాకాజీకు బాబా ఎవరో తెలియదు. శివుడని భావించి త్రయంబకానికి వెళ్ళి అక్కడ 10 రోజులు ఉండెను. అయినను అక్కడ శివునికి పూజలు చేసినప్పటికి తనకు మనశ్శాంతి లభించలేదు. తమాషా ఏమిటంటే ఆ త్రయంబకేశ్వరుడు కూడా తన వద్దకు వచ్చిన కాకాజి యొక్క పరిస్థితిని బాగు పరుచలేదు. కారణం **ఆ శివుడికి కూడా తెలుసు ఆ కాకాజీయొక్క కష్టాలను తీర్చువాడు శిరిడీలోని సాయే అని. అది సాయికి చెందినది కావుననే ఆ పరమేశ్వరుడు ముట్టుకొనలేదు.** కాకాజి తన స్వగ్రామమునకు తిరిగి వచ్చిన తరువాత మళ్ళీ సప్తశృంగి దేవత స్వప్న దర్శనమిచ్చి బాబా అనగా శిరిడీ సాయి అని చెప్పి అదృశ్యమయ్యెను. అప్పటి నుంచి కాకాజీకి శిరిడీకి ఎట్లా పోవలెనో శ్రీ సాయిని ఎట్లా చూడవలెనో అని తలంచు చుండెను. ఏదైనా సమయము రానిదే భగవంతుడు సంకల్పించనిదే ఏదీ

జరుగదు. మన వంటిపై చీమపాకినను లేదా ఒక తేలుపాకినను ఆ పరమేశ్వరుని ఆజ్ఞ ఉంటేనే కాని ఆ చీమకాని, తేలు కాని కుట్టకనే వెళ్ళి పోవును. అందుకే శివుడాజ్ఞ లేనిదే చీమైనా కుట్టదు. కాకాజీ విషయములోను అంతే ! ఈ విధముగా సాయి దర్శనము కోసం భక్తితో వేదన పడుతున్న భక్తుని పరిస్థితిని నాసిక్ జిల్లాలో ఉన్న తన భక్తుడగు కాకాజీ పరిస్థితిని మశీదులో కూర్చొని వున్న ఆ యోగిరాజు సాయి చూసి సమయాన్ని కటాక్షించెను. తన భక్తుడగు కాకాజీని రప్పించుటకై ఇంకొక భక్తుడగు శ్యామాకి తన తల్లి పూర్వం మ్రొక్కుకున్న మ్రొక్కులను ఈ సమయములో గుర్తుచేసి ఆ మ్రొక్కు ఆ సప్తశృంగి దేవతకు చెందినది. కావున శ్యామాను కాకాజీ వద్దకు ఎట్లు పంపించెనో చూడుడు. **అక్కడ సప్తశృంగి దేవత భక్తుణ్ణి ఇక్కడకు (శిరిడీకి) రప్పించుట ఇక్కడ (శిరిడీ) భక్తుణ్ణి (శ్యామా) సప్త శృంగి దేవత వద్దకు పంపించుట చూస్తుంటే శ్రీసాయి మశీదులో కూర్చొని చదరంగం ఆట ఆడుతున్నట్లు అనిపిస్తుంది.**

కాకాజీ శిరిడీకి ఎట్లు పోవలెనో అని యోచించే సమయమున శ్యామాశిరిడీ నుండి కాకాజీ ఇంటికి వచ్చెను. కారణం శ్యామా చిన్నతనములో జబ్బుపడినప్పుడు వారి తల్లి సప్తశృంగి దేవతకు జబ్బు నయమైతే ఆ దేవత పాదములపై తన బిడ్డను పెట్టెదనని మ్రొక్కుకొనెను. అలాగే ఆ తల్లి కుచములపై తామర లేచినప్పుడు రెండు వెండి కుచములను తగ్గితే చేయించెదనని వాటిని ఆ సప్తశృంగి దేవతకు సమర్పించెదనని ఈ రెండు మ్రొక్కులు మ్రొక్కుకొనగా ఆ మ్రొక్కులు చాలాకాలము నుండి మరచుటచే మళ్ళీ జ్ఞాపకము వచ్చిన తరువాత ఆ రెండు మ్రొక్కులను తీర్చుటకై శ్యామా తన సప్త శృంగి దేవత శ్రీసాయినాథుడే అని తలంచి మశీదుపోగా బాబా దానిని అంగీకరించక స్వయముగా 'వణి'లోని ఆ దేవతకు మ్రొక్కు చెల్లించి రమ్మని పంపుటచే శ్యామా సప్తశృంగి దేవతకు పూజారియైన కాకాజీ ఇంటికి వచ్చెను. ఎంతటి అద్భుత కలయికో కదా. కాకాజీ నమ్మిన దేవత భక్తుడు శిరిడీకి పోవలెనని సాయిని దర్శించి తన కష్టమును చెప్పుకొనవలేనని సప్తశృంగి దేవత ఆజ్ఞ, అలాగే సాయిబాబా భక్తుడు శ్యామా తన చిన్నతనము నాటి తనతల్లి మ్రొక్కుకున్న రెండు మ్రొక్కులను వణిలోని దేవతకు చెల్లించుటకై రావడం ఇవి భగవంతుని లీలలు. కాకాజీ శ్యామాయొక్క వివరములన్ని తెల్సికొని ఆనందించి ముందు శ్యామామ్రొక్కులను సప్తశృంగి దేవతకు చెల్లించి ఇరువురు శిరిడీకి వచ్చి శ్రీసాయిని దర్శించుకొనిరి. కాకాజీ కేవలం మశీదులో శ్రీసాయిని కూర్చొని వుండుట చూసి వారి దర్శన మాత్రములోనే అనంతమైన శాంతిని పొంది ఆనందముతో ఉప్పొంగి పోయెను. నోట మాట రాక సాయిపాదములపై పడెను. తన బాధలన్ని మర్చి పోయెను. బాబా ఆశీర్వచనము పొంది 12 రోజులు శిరిడీలోనే ఉండి ఆనందముగా తిరిగి తన స్వగ్రామమునకు చేరెను. శ్రీసాయి తన వాళ్ళను రప్పించుటకు పిచ్చుక కాళ్ళకు దారము కట్టి

లాగుదురు అనే దానికి ఈ కాకాజీ ఇంకొక పిచ్చుక అని ఋజువైనది.

బాబా తన భక్తుణ్ణి చూడవలెనని అనుకొనినప్పుడు ఏదో రూపేణా తన భక్తుడికి ఆ సందేశమును అందింపజేసి తనవద్దకు పిలిపించుకొనేవారు. ఒక్కొక్కసారి స్వప్నములలో కూడా కన్పించి రమ్మనేవారు. బాబాకి భక్తులంటే అంత ఇష్టం. ఆ స్వప్నములు రాత్రిగాని తెల్లవారు జామునగాని మధ్యాహ్నముగాని అనే కాల నియమములు శ్రీసాయి బాబాకు ఉండవు. ఒకసారి బాబా మశీదులో ఉన్నప్పుడు కుశాల్‌చంద్‌ను చూడాలని అనిపించింది. ఆ కుశాల్‌చంద్‌ను రహతాలో ఉంటారు. కాకాసాహెబ్‌ను తీసుకొని రమ్మని బాబా ఆజ్ఞాపించెను. మరో తమాషా ఏమిటంటే మశీదులో బాబా జనులముందు ఈ విధముగా చెప్పిన వారై కాకా సాహెబ్ దీక్షిత్ రహతా వెళ్ళక పూర్వమే సాయి రహతాలో ఉన్న కుశాల్ చంద్ స్వప్న రూపములో ముందుగానే వెళ్ళిపోయి కుశాల్ చంద్‌కు స్వప్న దర్శనమిచ్చి శిరిడీకి రమ్మని చెప్పెను. కుశాల్‌చంద్‌ను తీసుకురావటానికి వెళ్ళిన కాకా సాహెబ్ దీక్షిత్‌కు కుశాల్ చంద్ ద్వారా స్వప్నము గురించి తెలుసుకొని అలాగే కుశాల్‌చంద్ తనను తీసుకొని రమ్మని బాబా కాకా దీక్షిత్‌ను పంపించినాడని గ్రహించి ఆ ఇరువురు భగవంతుని లీలకు ఆనందించి తిరిగి శిరిడీకి చేరి సాయిని దర్శించెను.

ఇలాగే బొంబాయిలో ఉన్న రామ్‌లాల్ అనునతడు పంజాబీ బ్రాహ్మణుడు. ఇతనికి కూడా శ్రీసాయి స్వప్నదర్శనమిచ్చి వానికి మహంతు వలే కన్పించెను. ఆ రామ్ లాల్ సాయిని చూడవలెనని కాని చిరునామా బాబా రూపు రేఖలు శిరిడీకి ఎట్లు వెళ్ళుట తెలియకుండెను. ఆ మర్నాడే దుకాణములో బాబా ఫోటోను చూసి స్వప్నములో చూసిన మహంతు ముఖలక్షణములు పోలియుండుట గమనించి శిరిడీ వివరములు కనుక్కొని శిరిడీకి వెళ్ళి శ్రీసాయిని దర్శించెను.

బాబా తన భక్తులు ఎక్కడున్నా తూర్పు, పడమర, ఉత్తర, దక్షిణ దిక్కులలో ఏమూల దాగియున్నను వారికి సమయము వచ్చినప్పుడు తనవాడు అని భావించినప్పుడు శ్రీసాయి తన భక్తులను ఏదో రూపేణా శిరిడీకి ఈడ్చి వారిని ఆశీర్వదించేవారు.

## 31వ అధ్యాయము

అంతకాలే చ మామేవా స్మరన్ ముక్త్వా కలేవరమ్

యః ప్రయాతిస మద్భావం యాతి నా స్త్వత్ర సంశయః

అంత్యాకాలమున నన్నే స్మరించుచు దేహత్యాగము చేసినవారు నన్నే పొందుదురు. ఇందులో సందేహము

లేదు. ఈ భగవద్గీత శ్లోకములోని అర్థాన్ని చూసినట్లయితే మరణ కాల సమయమునందు మన మనస్సునందు ఏ కోరిక ఉంటుందో ఆ కోరికను బట్టి ఆ వ్యక్తి యొక్క భవిష్యత్తు నిర్ణయించబడివుంటుంది. కావున శ్రీ కృష్ణ పరమాత్ముడు అంత్యకాలసమయమున  నన్నే స్మరించమని చెప్పారు. ఐతే ప్రతి మనిషికి అంత్యకాలములో ఒక్కసారిగా దైవనామ స్మరణము చేయాలని అనిపించదు. దానికి గల కారణం మొదటినుండి ఏ పూజా దైవనామస్మరణము లేకుండా ఒక్కసారిగా అంత్యకాల సమయమున గుర్తుకు రావాలంటే ఆ సమయమున రాదు. మొదటినుండి అభ్యాసము చేస్తేగాని కుదురదు. చిన్న పిల్లవాడిని మొదటి, రెండు ఇలా తరగతులలో కూర్చోపెట్టి శిక్షణ ఇవ్వకుండా ఒక్కసారిగా 10 వ తరగతి పరీక్షకు కూర్చోనిస్తే ఏమౌతుంది. కావున అభ్యాసము ఎంతో అవసరము. కొందరు భగవద్గీతలోని ఈ 8వ అధ్యాయములో 5వ శ్లోకం అగు(అంత్యకాలేచ..) అనే శ్లోకం చదివిన పిదప తప్పుగా అర్థం చేసుకుంటారు. అది ఎలా అంటే మనిషి చివరిదశలో అనగా తన అంత్యకాల సమయం సమీపించినప్పుడు మాత్రమే భగవంతుణ్ణి స్మరిస్తే చాలనుకొని ఉత్తప్పుడు అవసరము లేదనుకొని భావిస్తారు. అది ముమ్మాటికి తప్పు. ఈ పైశ్లోకంలో అంత్యకాలేచ ... ఈ 'చ' అనే అక్షరమునకు చాలా ముఖ్యమైన అర్థాన్ని సూచిస్తుంది. శ్రీ కృష్ణపరమాత్ముడు చెప్పినది అంత్యకాలము నందు కూడా అని సూచించారు. కాని అంత్యకాలము నందైనను అనికాదు. దీనిని దీనిని బట్టి ప్రతి మనిషి అనునిత్యం భగవన్నామ స్మరణముతో కాలాన్ని గడిపినా అంత్యకాలమున ఆ పరమాత్మణి జ్ఞప్తియందుంచుకొని స్మరణము చేసినచో వారు దైవానికి దగ్గరగా చేరెదరు. అట్లుకాక మరొక దానిని ధ్యానించెదరో వారు దానినే పొందెదరు. నిజానికి అంత్యకాలము ఎవరికి ఎప్పుడు వస్తుందో తెలియదు. కావున అంత్యకాలము నందు స్మరించుకొందము అని అనుకొనుట మూర్ఖత్వమే. అను నిత్యం దైవనామస్మరణములో కాలము గడిపిన ఎప్పుడు ఏ క్షణమైనాను ఏమి జరిగిననూ అది మంచిదే.

బాబా సమీపమున కొందరు భక్తులు బాబా భోదలను జీర్ణించుకొని వారినెల్లప్పుడు స్మరించుతారు. అంత్యకాలమునందు సాయిని స్మరిస్తూనే దేహమును ఒదలి సద్గతిని పొందినారు. ఒక మనుష్యులే కాదు. ఒక పులి కూడా సాయి సన్నిధిలో సాయిని చూస్తూ తన ప్రాణాల్ని విడిచింది. శ్రీసాయి మహాసమాధి చెందుటకు 7 రోజులు ముందు ఒక పెద్దపులిని ఒక బండిలో తీసుకొని వచ్చారు. వారు ఆ పులిని ఊరూరా తిప్పుతూ డబ్బును సంపాదించుకొనుచూ ఆ వచ్చిన డబ్బుతో వారు జీవనం గడిపేవారు. వారి జీవనోపాధికి కారణమైన పులి నయముకాని రోగముచే బాధపడుచుండగా వారు బాబా కీర్తిని విని మశీదు వద్దకు తెచ్చారు. శ్రీసాయిని, ఆ పులి చూసి ఎంతో ప్రేమతో తన తోకను నేలపై మూడుసార్లు కొట్టి చనిపోయినది. ఆ పులి తన అంత్య

కాలమున శ్రీ సాయిని తలచి ఉన్నది కాబట్టి ఎక్కడో ఊరూరా తిరుగుతూ ఉండే ఆ పులి బాబా చరణాల వద్దకు వచ్చి తన బాకీని తీర్చి ప్రాణములను విడిచినది. నిజానికి అది రోగముతో బాధ పడుచూ ఏ క్షణమునైనా చచ్చుటకు సిద్దముగా నున్న ఆ పులి తనప్రాణాలను గుప్పెట్లో పెట్టుకొని చివరిక్షణములలో రోగంతో బాధపడుతూనే శిరిడీ వరకు వచ్చి సాయిని దర్శించి సాయి కళ్ళలోనికి చూస్తూనే తన కళ్లను మూసివేసెను. సద్గురు సాయి తనముందు అవతారము అగు అక్కల్‌కోట్‌కర్ మహారాజుగారు పెద్ద పులులతో కూడా మట్లాడేవారట. ఒకసారి అక్కల్‌కోట్ మహారాజ్ గారు కొండ వద్ద ఇద్దరు వ్యక్తులతో మాట్లాడుతున్నప్పుడు అకస్మాత్తుగా ఒక పెద్దపులి వచ్చి స్వామి ముందర నిలబడెనట. ఆ స్వామి వారి ప్రక్కనున్న ఇద్దరి భక్తులు ఒణికి పోవుచుండగా వారిరువురి ముందు ఆ పెద్దపులితో స్వామి మట్లాడటమేకాక దాని పూర్వజన్మ వృత్తాంతం పేరు ఊరుతో సహాచెప్పినారు. ఈ అవతారములో కూడా పూర్వవతారము యొక్క వాసనలు ఎక్కడికి పోతాయి అన్నట్లుగా శ్రీసాయి ఆపెద్దపులిని తన దృష్టితోనే ఆశీర్వదించి దానికి సద్గతి కల్గించారు. ఆ పులి ఎంత పుణ్యము చేసుకొనినదో కదా !

మద్రాసులో విజయానంద్ అనే సన్యాసి యాత్రులకు బయలుదేరెను. మార్గమున శిరిడీలో దిగి సాయిని దర్శించవలెననుకొనెను. బాబాను, మశీదును చూసి నమస్కరించగా సాయి “ఈ పనికి మాలిన సన్యాసిని తరిమివేయుడువాని సాంగత్యము మనకుపయుక్తముగాదు” అనిరి విజయానంద్ చాలా నిరుత్సాహ పడిరి. అయినను శిరిడీ వదలక అక్కడే ఉండెను. రెండు రోజుల తరువాత బాబా వద్దకు వెళ్ళి తన తల్లికి జబ్బుగా ఉన్నదని ఉత్తరము చూపించి ఆజ్ఞను, వెళ్ళుటకు కోరెను. సాయి ఇలా అనిరి “నీ తల్లిని అంత ప్రేమించు వాడవైతే సన్యాసము ఎందుకు పుచ్చుకొంటివి. కాషాయ వస్త్రములు ధరించు వానికి దేనియందు అభిమానము చూపుట తగదు. నీ చోటికి పోయి హాయిగా ఉండుము. వాడాలో దొంగలు కలరు. వారు దోచుకొని పోయెదరు. ఇహపరలోక వస్తువులన్నింటి యందు అభిమానం విడిచిపెట్టుము. హరిపాదములను శరణువేడుము నీ పూర్వ పుణ్యఫలముచే నీవు ఇక్కడకు రాగలిగితివి. రేపటి నుండి భాగవతమును మూడు సప్తాహములను చేసిన నీ విచారములు తొలగును” అనిరి. బాబా తన అమృతతుల్యమైన వాక్కులు పలికిరి. ఈ భోదన ప్రతి మనిషికి ఎంతో మేలు చేసే పలుకులు. వీటిని జాగ్రత్తగా అర్థము చేసుకొని పాటించిన వారు సాయి సన్నిధికి చేరెదరు. ఇది ఒక గొప్ప అవకాశము. శ్రీసాయి అందరికి కల్పించిరి. అది ఏవిధముగా అనగా **సన్యసించుట అనగా కాషాయ వస్త్రములు వేసుకొని మెడలో రుద్రాక్షమాల, చేతిలో కమండలములు, కాళ్ళకు చెప్పులు లేకుండా తిరుగుట మాత్రమే అని అనుకొనుట అజ్ఞానమే.** ఇక్కడ సాయి చెప్పినది సన్యసించుట అనగా **విషయములను**

**వాటిపైగల వ్యామోహములను వదులుకొనుట** అంటే ధనం ఐశ్వర్యం ఇహపరలోక వస్తువులన్నింటియందుగల మమకారములను బంధములు మొ॥ సన్యసించవలెనని అనగా అవి నిత్యముకావు. కాబట్టి వాటిపై అభిమానమును విడిచిపెట్టుటయే సన్యాసికి అసలైన అర్థము. ఇటువంటి ప్రవర్తనతో ఉండువారు ఏ బంధాలకు లొంగి ఉండరు. ఒక్క హరి యొక్క పాదములను ఎల్లప్పుడు శరణువేడుతూ హరినామస్మరణతోనే కాలమును గడిపి ఆ హరి పాదముల వద్దనే చేరెదరు. విజయానంద్ బాహ్యముగా కాషాయ వస్త్రములను ధరించి సన్యసించితిని అని అనుకున్నారు. కాని తన తల్లికి బబ్బుగా ఉన్నదని తెల్సినా వెంటనే, తల్లిని చూచేందుకు బయలు దేరటానికి సిద్ధమైనారు. ఆయన బాహ్యంగా సన్యసించారే కాని ఆంతరికముగా సన్యసించలేదని బాబా మన అందరిని కూడా ఆ విధంగా ఉండకూడదని చెప్పుటకై ఇదంతా నడిపించారు. మరియు బాబా వాడలో దొంగలున్నారు. దోచుకు పోవుదురు అనే హెచ్చరిక చేశారు. దానికి గల కారణము ఆ దొంగ ఎవరోకాదు. మృత్యు దేవతే. ఆ మృత్యు దేవత తన దేహాన్ని దోచుకు పోవుటకు వస్తున్నారని కారణముచే పరీక్షిత్తు మహారాజు. తాను 7 రోజులలో శాపము వలన మరణించు చున్నాడని తెల్సుకొని శుక మహర్షి ద్వారా భాగవతమును చెప్పించుకొని సద్గతి పొందినాడు. అటువంటి భాగవతమునే శ్రీసాయి విజయానంద్ 3 సప్తాహములు చేయమని చెప్పి ఆశీర్వదించినారు. **ధనము ఐశ్వర్యము మరి ఏ ఇతర వస్తువులు సత్యములు కాదని ప్రపంచంలో సత్యమైనది ఆ పరమాత్ముడు ఒక్కడే అని ఋజువు చేయుటకై భాగవత పారాయణం ఆ విజయానంద్‌కి ప్రాప్తము కల్పించినారు.** విజయానంద్ సాయి ఆజ్ఞను శిరసావహించి రెండు పారాయణాలు పూర్తిచేసి మూడవ రోజున బడే బాబా తొడపై తన ప్రాణములను వదిలెను. శ్రీసాయి విజయానంద్‌కు ఈ విధముగా సద్గతిని ప్రసాదించారు.

బాలారామ్ మాన్‌కర్ బాబా భక్తుడు అతని భార్య చనిపోయిన పిదప విరక్తితో శిరిడీకి వచ్చిసాయితో నుండెను. బాబా అతనిని మచ్ఛింద్రగఢ్‌లో నుండమనెను. సాయిని విడిచి ఇంకొక చోటికి వెళ్ళుటకు అతనికి ఇష్టం లేకుండెను. అయినా బాబా ఆజ్ఞను జవదాటక వచ్చి మచ్ఛింద్రగడ్‌కు వెళ్ళి ధ్యానము చేసెడివారు. కొన్ని రోజులకు అతనికి సాయి దివ్య దర్శనము లభించినది. మాన్‌కర్‌కు ఎంతో ఆనందము కల్గినది. బాబాను తనను అచ్చటికి ఎందుకు పంపితిరని అడుగగా శ్రీసాయి ఇట్లుచెప్పెను. "నీవు పంచేంద్రియములతో మూడున్నర మూరల మనిషిగా నన్ను భావించితివి. నేనెల్లప్పుడు శిరిడీలోనే వుండెదననుకొంటివి. ఇప్పుడు నీవిక్కడ చూసిన నా రూపము శిరిడీలో చూచిన రూపము సమానముగా ఉన్నదా లేదా. ఇందుకే నిన్నిచ్చటికి పంపితిని అని అనెను. బాబా భక్తులు శిరిడీకి వెళ్ళి సాయిని దర్శించిన పిదప వారి స్వగృహములకు లేదా వారి స్వగ్రామమునకు

తిరిగి వెళ్తున్నప్పుడు ఎవరు దుఃఖించరాదు. **శిరిడీని వదలి వేరే ఊరికి వెళ్తుంటే సాయిని వదిలి వెళ్తున్నానని భావం తప్పే ఔతుంది. పరమాత్మ సాయి లేనిచోట ఏది** పైగా శ్రీసాయి "నేను శిరిడీలోనే ఉన్నానని అని అనుకుంటే పొరపాటు అని స్వయముగా చెప్పినారు. పరమాత్మ సాయి సర్వాంతర్యామి కావున సాయి ఒక్క శిరిడీలోనే ఉన్నారనే భ్రమను తొలగించిన సాయి ఎక్కడ ఉన్నను వారి దర్శనము కల్గిస్తారు. కనుకనే మాన్‌కర్ విషయమున మచ్ఛీంద్రగడ్‌కు పంపి అక్కడే వారి దర్శనము కల్గించారు. ఈ మాన్‌కర్ విషయం అందరూ శ్రద్ధా భక్తులతో గ్రహించిన ఆ సర్వాంతర్యామి అగు సాయి ఎక్కడున్నను వారి దర్శనం లభిస్తుంది. కొంత కాలానికి మాన్‌కర్ మచ్ఛీంద్ర గడ్‌ను విడిచి బాంద్రాకు ప్రయాణమయ్యెను. అయితే అతనికి దాదర్‌కు దొరకలేదు. ఆ సమయమున కంబళి కప్పుకున్న ఒక అనాగరికుడు తన దాదర్ టిక్కెటును మాన్‌కర్‌కు ఇచ్చి మాన్‌కర్‌పైకం ఇచ్చినంతలోనే ఆ పల్లెటూరివాడు మాయమయ్యెను. బాబా చూపిన అద్భుత లీల ఇది తిరిగి మాన్‌కర్ శిరిడీకి వచ్చి శిరిడీలోనే ఉండి బాబా సముఖమున తన ప్రాణములను విడిచెను. శ్రీసాయి ఈ విధంగా మాన్‌కర్‌కు సద్గలు కల్గించెను.

తాత్యా సాహెబ్ పండరీపురంలోని సబ్‌జడ్జీ. వారికి యోగులపై నమ్మకము లేదు. నానా సాహెబ్ అతని స్నేహితుడు వారు చెప్పగా శిరిడీకి వచ్చి బాబాను దర్శించెను. మొదట యధావిధంగా సాయి వారిని కోపించినను తర్వాత వారికి అంత్యదశ వరకు శిరిడీలోనే ఉండుటకు అవకాశము కల్పించెను. వారి చివరి సమయములో మత గ్రంథముల పారాయణము వినిరి. **మేఘశ్యామునివలే తాత్యాసాహెబ్ నూల్కర్ బాబా పాద తీర్థమును స్వీకరించిన మహాఅవకాశమును పొందిన రెండవ భక్తుడు.** అంత్యకాల సమయమున బాబా పాద తీర్థము అతనికిచ్చిరి. అతని మరణ వార్త వినిన బాబా "తాత్యాకి పునర్జన్మనము లేదు" అని నిర్ధారించిరి.

అల్లా అచ్ఛాకరేగా ఆహా కిత్‌నా అచ్ఛాకరే బాబా తన భక్తులకు ఎంతో మేలు చేసిరి. ఒకరికి సన్యాసము గురించి వివరించిరి. భాగవతపారాయణము చేయించి సద్గతి కల్గించిరి. ఇంకొకరికి బాబా శిరిడీలోనే ఉన్నారనే భ్రమను తొలగించి ఎక్కడో మచ్ఛీంద్రగడ్‌లో కూడా తన రూపాన్ని చూపించి సద్గతి కల్గించిరి. మరియొకరికి యోగులపై నమ్మకము లేనివానికి శిరిడీకి రప్పించి సద్గురువుపై గురి కల్పించి మతగ్రంథ పారాయణముల ప్రవచనముల ద్వారా మరియు బాబా పాద తీర్థము అనుగ్రహము ద్వారా పునర్జన్మనము లేకుండా చేసిరి. నోరులేని మూగజీవి క్రూరమైన పులికి కూడాతన సాన్నిధ్యమున కేవలం సాయి తన దివ్య దృష్టితో సద్గతి కలిగించిరి. ఇన్ని చేసినా ఆ ఫకీర్ ఏమిచేయని వానివలే ఏమీ ఎరుగని వానివలే తాము భగవంతుడు కాదని భగవంతుని యొక్క సేవకుడనని చెపుతూ సబ్‌కా మాలిక్ ఏక్ అంటూ అల్లా మాలిక్, అల్లా అచ్ఛాకరేగా

అంటూ మశీదులో ఒక మూల కూర్చుని ప్రపంచాన్నంతా ఆడిస్తూ జగన్నాటక సూత్రధారయై తన ఆటను చూస్తూ మౌనముగా పిచ్చి ఫకీరుగా ప్రపంచానికి కన్పిస్తాడే కాని వారి నిజరూపము వారు చేసే లీలలు ఒక్కొక్కటి చూస్తూ ఉంటే వారేమిటో బైట పడింది. వారే పరమాత్మ వారే అల్లా వారే రామ్ వారే రహీమ్ సకల దేవతా స్వరూపుడు శ్రీసాయే.

## 32 వ అధ్యాయము

మానవుడు ఎంత పండితుడైనప్పటికీ జ్ఞానసంపన్నుడైనప్పటికీ ఒక గమ్యాన్ని చేరటానికి తాను ఒంటరిగా ఆ గమ్యాన్ని చేరుకోలేడు. మార్గములో అనేకమైనటువంటి అడ్డులు వచ్చును. ఆ అడ్డులను తొలగించుకొని పోలేడు.కావున ఒక గమ్యస్థానాన్ని చేరాలి అంటే ఆ గమ్యానికి తీసుకు వెళ్ళటానికి మార్గదర్శి అవసరము. ఆ మార్గదర్శియే గురువు. **గురువంటే అజ్ఞానాన్ని తొలగించి జ్ఞానమను వెలుగును చూపేవాడు.** అటువంటి గురువు మార్గదర్శిగా ఉంటే మనమెంచుకున్న గమ్యస్థానము సురక్షితముగా పోవచ్చును. ఎటువంటి అడ్డులు వచ్చిన గురుసహాయమున వాటిని దాటి సునాయాసముగా గమ్యస్థానాన్ని చేరుకొనవచ్చును. ఈ విషయమనే సాయిబాబా తన అనుభవమును స్వయముగా తానే చెప్పెను. బాబాయే సద్గురువు అయినను వారు గురు ఆవశ్యకత ఎంతో ముఖ్యమని మార్గదర్శి ప్రతివానికి అవసరమని చెప్పుటకై కాబోలు బాబా తన అనుభవము ఈ విధముగా చెప్పియున్నారు.

“ఒకసారి మేము నల్గురం మత గ్రంథములు చదువుచూ వాటిలోని మర్మములను చర్చించుకొని మాలో ఒకరు ఇతరులపై ఆధారపడే అవసరములేదని రెండవ వారు మనస్సును స్వాధీనము నందుంచుకొనవలెనని మూడవ వారు సత్యా సత్యా విచక్షణ అవసరమని ఇక నేను (బాబా) పుస్తక జ్ఞానమెందుకు పనికి రాదని మనకు విధింపబడిన కర్మను పూర్తి చేసి పంచ ప్రాణములను గురువు పాదములపై పెట్టి శరణు వేడవలెను. ఎందుకనగా గురువే దైవము.

ఇలా మేము వాదించుకొని పరమాత్మను వెదుకుటకు అడవులలో తిరిగినాము. మార్గమున ఒక బంజారా కలసి ఎక్కడికి పోవుచున్నారని అడుగగా మా జవాబును మరలించి అడవులు వెదుకుటకని జవాబునిచ్చితిని. కాని ఆ బంజారా మీ వెంట ఒక మార్గ దర్శియే ఉండవలెను. మీరు భోజనము చేసి మీ అన్వేషణను కొనసాగించమని మమ్ములను వేడెను. మేము వారిని నిరాకరించితిమి. మా నడక ముందుకు సాగినను దారి తప్పి ఎక్కడినుండి బయలుదేరితిమో అక్కడకే చేరితిమి. బంజారా తిరిగి మమ్ములను కలిసెను. మళ్ళీ మమ్ములను చిన్నదానికైనను పెద్దదానికైనను మార్గము చూపుటకు మార్గదర్శి ఉండి తీరవలెను, ఉత్త కడుపుతో అన్వేషణ

జయముకాదని పరమాత్ముడు తెలువనిదే మనకు దారిలో ఎవరు కలవరు. పెట్టిన భోజనం వద్దనకూడదు. అది అశుభానికి సూచన. ఇట్లు బంజారా మమ్ములను బతిమాలినను నా ముగ్గురు మిత్రులు బంజారా మాటలను లక్ష్యపెట్టలేదు. ఆ బంజారా పెట్టిన భోజనమును తినక వారి ప్రయాణము కొనసాగించుటకు సిద్ధమైరి. నేను మాత్రము (బాబా) బంజారా పెట్టిన భోజనాన్ని స్వీకరించి నీళ్ళు త్రాగితిని మా గురువుగారు మా ఎదుట నిలిచిరి. మా గురువుకి జరిగిన దంతయు చెప్పితిని. మా గురువు నాతో వచ్చుటకు ఇష్టపడెదరా, మీకు కావల్సినది నేను చూపెదను అని అనిరి. తక్కిన ముగ్గురు మాగురువుగారి మాటలు వినక వెళ్ళిపోయిరి. మాగురువుగారు నన్ను ఒక బావి వద్దకు తీసుకొనిపోయిరి. నా కాళ్ళను తాడుతో కట్టి తలక్రిందులుగా ఒక చెట్టుకు కట్టి బావిలోని నీళ్ళకు 3 అడుగులు పైన నన్ను వ్రేలాడ దీసిరి. అది ఎటువంటి పరిస్థితి అంటే నా నోటితో కాని నా చేతులతో కాని ఆ బావిలోని నీళ్ళను అందుకొనలేను. వారు అలా కట్టి ఎక్కడికో వెళ్ళిపోయిరి. 5 గంటలు అలాగే వ్రేలాడితిని. ఆ 5 గంటల తరువాత మా గురువు గారు వచ్చి నన్ను భావిలో నుంచి బైటకు తీసి ఎలా ఉన్నానని అడిగిరి. నేను అనందముతో మునిగియుంటినని సమాధానమిచ్చితిని. నా జవాబుకి గురువు గారు సంతసించి వారు నన్ను చేరతీసి తమ బడిలో చేర్చుకొనిరి. నేను నా తల్లితండ్రులను మరచితిని. వారిని తదేక దృష్టితో చూస్తూ ఉండితిని. అటువంటి బడిలో చేరే వారికి వట్టి చేతులతో బైటకురారు. నా సంపద, ఇల్లు, తల్లిదండ్రులు సర్వం నా గురువే నేను కోరేది ఏమియు లేకుండెను. తక్కిన ముగ్గురు వెళ్ళిన వారు కష్టాలపాలైనారు. నేను గురువే దైవమని తెలుసుకొంటిని.

ఈ పైన వివరించిన దానిలో బాబా పరబ్రహ్మ స్వరూపులైనను మిగిలిన ముగ్గరితో పరమాత్మను వెదుకుటకు వెళ్ళుట చిత్రముగా అందరికి కన్పిస్తుంది. వారే పరబ్రహ్మ వారెల్లప్పుడు చెప్పునది సర్వ జీవులలో పరమాత్ముడు ఆత్మరూపేణా ఉంటాడని అటువంటి ఆత్మజ్ఞానాన్ని ఆత్మసాక్షత్కారము గూర్చి చెప్పగల యోగిపుంగవుడు మరి పరమాత్ముని బైట వెదుకుటకు కారణమేమై ఉంటుంది. దానికి గల కారణాలు.

1. బాబా స్నేహితులు ముగ్గురిలో ఒకడు కర్మలను నమ్మువాడు. రెండవవాడు తనకున్న జ్ఞానమునకు గర్వించువాడు. మూడవవాడు భగవంతుణ్ణి శరణు వేడేవాడు. వారు తమకు తెలిసిన విధ్యపై వెదుకుతూ ప్రయాణించిరి.

- నాల్గవ వారైన శ్రీసాయి ఒక సాధారణమైన బంజారా కనిపించినపుడు గౌరవించి బంజరు పెట్టిన అన్నమును పరబ్రహ్మముగా తలచి ఆ బంజరేను గౌరవించిరి.

2. శ్రీసాయి తాను పరబ్రహ్మమైనప్పటికి మిగిలిన ముగ్గరికి గుణపాఠం చెప్పుటకై అట్లు చేసిరి. వారికొక

ఉదాహరణముగా చూపుటకై చేసిరి.

3. శ్రీ సాయికి నిజానికి పరమాత్మ బైట ఉంటాడని ఆ పరమాత్ముని వెదకాలని చేసినదికాదు. వారు మహాజ్ఞానులు తనతో ఉన్న ముగ్గురికి ఏదైనా ఒక అన్వేషణకు వెళుతున్నప్పుడు మనకున్న జ్ఞానము ఏ పాటికి పనికి రాదని మన మార్గాన్ని చూపించేందుకు ఒక గురువు అవసరమని ఆ ముగ్గురితో పాటు యావత్ ప్రపంచములోని ప్రతి జీవికి తెలియపరుచుటకై ఆడిన నాటకము ఆ మార్గదర్శియైన గురువు వలనే పరమాత్మ అందరిలోనూ ఉంటాడని జ్ఞానం కల్గుతుంది.

4. దారిలో కలిసిన బంజారాను కూడా బాబా నిరాకరించలేదు. ఎందుకనగా భగవంతుడు సంకల్పించనిదే ఎవరూ ఇంకొకరిని దారిలో కలువరు. వారు కలిశారు అంటే దైవ సంకల్పన అనే భావము కలిగియున్న మహాత్ముడు శ్రీసాయి కావున ఆ బంజారా చెప్పిన దాన్ని ఆమోదించి, ఆ బంజారా పెట్టిన భోజనాన్ని, నీళ్ళను త్రాగిరి. ఆ బంజారాను కూడ ఒక గురువుగానే భావించిరి.

5. ఆ నల్గురికి గురుదర్శనము కల్గినప్పుడు, వారిని తమ గురువుతో వచ్చుటకు ఇష్టపడెదరా అనినప్పుడు వారి గురువు వారికి కావల్సినది చూపెదననినప్పుడు, తక్కినవారు ఆ గురు మాటలను నిర్లక్ష్యముచేసి వెళ్ళిపోయిరి. శ్రీ సాయిమాత్రము ఆ గురువు గారితో వెళ్ళిరి. గురు దర్శనము నలుగురికి కల్గినది గురు అనుగ్రహఅవకాశం ఆ నలుగురికి కలిగినది. కాని తక్కిన ముగ్గురు తమకున్న జ్ఞానమే గొప్పదని అహంకారపూరితులై గురువుని లక్ష్యంచేయక అవకాశము వచ్చినను గురువుని పొందలేక అవకాశాన్ని జారవిడుచుకొనినారు. **నిత్య జీవితంలో ఇలాంటి అవకాశాలు అంటే గురువు ఏదో రూపేణా మనకు కనిపించే ఉంటారు. మనకున్న అజ్ఞానముతో అహంకారముతో గుర్తించలేక ఎంతమంది ఇలా మార్గదర్శిని పోగొట్టుకున్నారో కదా !**

6. శ్రీసాయి ఆ గురువుని నమ్మకుని గురువు తనను తాళ్ళతో కట్టి తలక్రిందులుగా ఒక చెట్టుకు వ్రేలాడతీసి బావిలో నీళ్ళను అందకుండా కట్టి 5 గంటల తరువాత బాబాను బయటకుతీసి ఎట్లా ఉందని అడుగగా బాబా నోటినుండి 'ఆనందము' అనే మాట వచ్చినది. గురువులు శిష్యునిగా స్వీకరించుట మునుపు ఇటువంటి కఠిన పరీక్షలు పెట్టెదరు. ఆ కఠిన చర్యలలో కూడా ఆనందాన్ని చూసినప్పుడే ఆ గురువునికి నిజమైన శిష్యుడు అవుతాడు. అందుకే బాబాను వారిబడిలో చేర్చుకొనిరి అంత ప్రేమను పంచెను. బాబా సర్వము మరిచెను. ఒక్క గురువునందే దృష్టిని మరల్చెను. గురువే దైవమని గ్రహించెను. ఇదంతా కూడా శ్రీసాయి మనందరికి గురువుపై ఎటువంటి భక్తి కలిగి ఉండవలెనని గురువాజ్ఞ ఎలా శిరసావహించాలని గురువుపెట్టే కఠిన పరీక్షలలో దుఃఖము కూడా మరచి ఆనందము కలిగినవాడు నిజమైన శిష్యుడని అటువంటి శిష్యుడే ఆ గురుకులాలలో

ప్రవేశానికి అర్హుడని తరువాత ఆ శిష్యుడు తన ఆస్థిపాస్తులను, తల్లిదండ్రులను అందరిని మరచి గురువుమీదే ధ్యాసనిలిపిన ఎట్టి శ్రమలేకుండా ఆ గురువు తాను నమ్ముకున్న శిష్యునకు ఆత్మసాక్షాత్కారము కలుగ జేయును. శిష్యుడు గురువేదైవమని తెలుసుకొనును అని బాబా మన అందరికి సూచించుటకై తన స్వనుభావమును చెప్పిరి.

7. పరమాత్మను వెదుకుటకు అడవులపాలైన ఆ ముగ్గురు కష్టాలపాలైనారు. శ్రీసాయి బంజారాను గౌరవించి, గురువాజ్ఞను శిరసావహించి గురువే దైవంగా భావించి గురువేదైవమని తెలుసుకొని ఆ పరమాత్మను దర్శించిరి.

ఇంకొక ముఖ్యమైన ప్రశ్నపైన బాబా చెప్పిన తన స్వానుభవమును తెలుసుకొనిన తరువాత అందరికి కల్గునది ఏమనగా **బాబాకు ఒక గురువు ఉండిరా** ? వారు ఆ గురువు దగ్గరినుండి శిక్షణ పొంది నేర్చుకొనిరా? అనే ప్రశ్న సహజంగా అందరికి కల్గుతుంది. **బాబాయే సద్గురువు కదా మరి వారికి గురువు ఏమిటి** ? దీనికి సమాధానం శ్రీ సాయి దత్తాత్రేయులవారి అవతారమని అందరికి తెలుసును. శ్రీ దత్తాత్రేయుల వారికి 24 మంది గురువులు ఉన్నారని వారు 1 భూమి 2. వాయువు 3. ఆకాశము 4. జలము 5. అగ్ని 6. సూర్యుడు 7. చంద్రుడు 8. పిచ్చుకలు 9. అజగరము 10. సముద్రము 11. మిణుగురు పురుగు 12. తేనెటీగ 13. ఏనుగు 14. తేనెపోగు చేసేవాడు 15. లేడి 16. చేప 17. పింగళ 18. పక్షి 19. పిల్లవాడు 20. కన్య 21. విలుకాడు 22. సర్పం 23. సాలీడు 24. కీటకం.

ప్రతి ఒక్కరి నుండి విలక్షణమైనటువంటి విజ్ఞాన తత్వాన్ని అవగాహన చేసుకొన్నారు ఆ దత్తుడు ఈ 24 మందిలో కీటకము, పిల్లవాడు, పిచ్చుక, చేప ఇలా చిన్న చిన్న వాటిని కూడా వాటిలోని విజ్ఞానతత్వాన్ని అవగాహన చేసికొనిన దత్తాత్రేయ అవతారముగు శ్రీసాయి ఆ నలుగురు ముందు గురువు ప్రత్యక్షమైనప్పుడు ఆ గురువు నుండి కూడా విజ్ఞాన తత్వాన్ని అవగాహన **చేసుకొని వారిని కూడా గురువుగా స్వీకరించారు అనటంలో ఏ మాత్రము తప్పులేదు.**

సాయి ఇట్లు అనిరి. మానవుడిచ్చినది ఏదైనను తరిగిపోవును అంటే అది అశాశ్వతము. కానీ దైవం ఇచ్చునది ఎల్లప్పుడు చెదరక శాశ్వతంగా నిలుచును. బాబా ఇట్లు అనెను “నా ప్రభువు తీసుకో, తీసుకో అనును కాని ప్రతివారు నా వద్దకు వచ్చి తేతే అనుచున్నాడు. నేనేమి చెప్పుచున్ననో గ్రహించువాడు ఒక్కడు లేడు. నా సర్కారు యొక్క ఖజానా (ఆధ్యాత్మిక ధనం) నిండుగా నున్నది. అది అంచువరకు నిండి పొంగి పోవుచున్నది. నేను త్రవ్వి ఈ ధనమునుబండ్లతో తీసుకపోండు. సుపుత్రుడైనవాడు ఈ ద్రవ్యమునంతయు దాచుకొనవలెను అనుచున్నాను.

సాయి పలికిన పలుకులలోని అంతరార్థము మానవుడిచ్చినది ఏదైనా అనగా ధనం వస్తువు మొ॥ అశాశ్వతములైనవి ధనం కరిగి పోవును. వస్తువులు పాడైపోవును. దైవం ఇచ్చునది శాశ్వతం. అంటే దైవం ఇచ్చేది ఆధ్యాత్మిక బోధ, ఆ బోధలలో ప్రాపంచిక విషయాలపై వైరాగ్యం గల్గి అంతరంగిక ఆత్మావలోకనకల్గి తద్వారా ఆత్మ సాక్షారాన్ని కల్గిస్తుంది. సాయి "నా ప్రభువు తీసుకో తీసుకో!" అనుచున్నారు. అన్నది ఆ అధ్యాత్మిక సంపదను ఇంకా తెలుసుకోమంటున్నారని మళ్ళీ సాయి ఇట్లు అనిరి "కాని ప్రతివారు నా వద్దకు వచ్చి తేతే అనుచున్నాడు". అనునది, మనం సాయిని కోరునది ధనం, పుత్రప్రాప్తి, ఇల్లు, వ్యాపారాభివృద్ధి, ఉద్యోగం ఇలాంటి కోరికలని, కావున శ్రీసాయి చెప్పునది గ్రహించువాడులేదని అర్థం. సాయి ఇట్లు అనిరి. 'నా సర్కారు ఖజానా నిండుగా నున్నది ఆ ద్రవ్యమును తీసుకొని దాచుకొనుము అన్నది. **కోరితే ఆధ్యాత్మిక ధనాన్ని కోరమని, సంపాదించిన ఆ ఆధ్యాత్మిక ధనాన్ని పదిలంగా దాచుకొని వుండమని చెప్పారు. సాయి ఎన్నో భోధనలు చెప్పారు. అవన్ని ఆధ్యాత్మిక సంపదలే వాటిని అనగా విన్నవి జాగ్రత్తగా దాచుకొని అలా అబలంబించమని** చెప్పారు. ఆధ్యాత్మిక బోధనలు సంపదలు ఎన్నో సాయి చెప్పారు. సాయి చెప్పిన అధ్యాత్మిక సంపదలో ఒకటి. గోఖలేగారి భార్య ఉపవాస దీక్ష. ఆవిడ బాబా పాదముల వద్ద 3 రోజులు ఉపవాసించి ఉండాలని వచ్చెను. కాని బాబా ఆమెను ఉపవాసం చేయవలసిన అవసరం లేదని దాదా భట్ ఇంటికిపోయి బొబ్బట్లు చేసి అతని పిల్లలకు పెట్టి తననుకూడా తిని రమ్మనెను. బాబా ఆజ్ఞా ప్రకారం గోఖలేగారి భార్య అట్లేచేసెను. భగదద్గీతలో ఉపవాసము కాని, మితిమీరిన ఆహారముగాని భుజించుట మంచిది కాదని కృష్ణుడు సూచించెను. ఆ మశీదులోని సాయి కృష్ణుడు భగవంతుని కళ్ళారా చూడటానికి తన అవయములన్ని శక్తితో మంచి స్థితిలో ఉన్నప్పుడు మాత్రమే భక్తిగా ఆ పరమాత్ముని చూడగలమని చెప్పెను. ఉపవాసమున్నచో మనస్సు స్థిరముగా ఉండదు. శక్తిలేని ఖాళీ కడుపుతో భగవంతుణ్ణి చూడలేము. కావున ఆత్మను శాంతింప జేయమని చెప్పిరి. శ్రీసాయి ఎవ్వరిని ఉపవాసము చేయనిచ్చువారు కాదు. తన భక్తుడు ఏకాదశిరోజున ఉపవాసం ఉండునను ఆ ఉపవాస దీక్షను విరమించుకొనేటట్ల బాబా చేసేవారు. శ్రీ సాయి కూడా ఎన్నడు ఉపవశించలేదు. ఉపవాసం అనగా భగవంతునికి దగ్గరగా ఉండటమే అని అర్థం. మరి ఆ భగవంతుని దగ్గరగా ఉండటమే అని అర్థం. మరి ఆ భగవంతుని దగ్గరగా చేరాలంటే కడుపును కాల్చుకుంటే దగ్గర అవ్వము కదా! ఇంకా దూరమే ఔతాము. **భగవంతునికి ఉపవశించేది మనం తినే అహారం కాదు. ఉపవశించేది మన యింద్రియసుఖములను అప్పుడే** భగవంతుని అనుగ్రహం మోక్షము కలుగును.కాబట్టి మనమందరము మన ఇంద్రియాలను నిగ్రహించుటకు ప్రయత్నించే ఉపవాసాన్ని చేద్దాము. కడుపునిండా ఆహారాన్ని యధావిధంగా తిందాము.

## 33వ అధ్యాయము

యోగులు సర్వజ్ఞులు వారికి తెలియనిదంటూ ఏమీలేదు పేరుకు ఒక చోట తిష్టవేసి ఉండెదరుకాని వారి చూపు యావత్ ప్రపంచంములోని నలుమూలలా పడును. వారు భక్తులను ఎక్కడ ఉన్నను, ఏమి చేస్తున్నను చూచెదరు. తన భక్తుల కష్టములను రక్షించుటకు వారే ఏ రూపమునైనను తరలి వెళ్లి ఆ భక్తునికి సమయానికి రక్షించెదరు కావున భక్తుల నిరాశ చెందరాదు. **ఎక్కడో కూర్చొని ఉన్న నా స్వామి నన్ను చూడునా అనే సంశయం పెట్టుకొనరాదు. కొందరి భక్తులకు వారిని నమ్ముకున్న యోగులను స్వయముగా దర్శించి మ్రొక్కక పోయినను వారు తమ ఇంటిలో నున్న యోగి ఫోటోను నమస్కిరించినను ఎక్కడో ఉన్న ఆ యోగికి నమస్కారములు అందును.**

బాలబువా సుతర్ బొంబాయిలో ఉండేవారు. అతను ప్రఖ్యాత సంకీర్తనాకారులు – మొదటిసారిగా వారు శిరిడీకి వచ్చినప్పుడు బాబాకు నమస్కరించగా బాబా ఇట్లనెను. "నేనితనిని 4సం॥ల నుండి ఎరుగుదును" అనిరి. బాలబువా ఆశ్చర్యపడి బాబా పలికినవి అసంభవమని ఎందుకంటే తాను శిరిడీకి వచ్చినది మొదటిసారిగా తలంచెను. కాని ఆలోచింపగా అతడు బొంబాయిలో ఉన్నప్పుడు 4సం॥ల క్రిందట బాబా ఫోటోకు నమస్కరించినట్లుగా గుర్తుకు వచ్చేను. వెంటనే ఆ యోగి రాజగు సాయి సర్వజ్ఞులను గ్రహించెను. వారి ఫోటోను చూచుట వారిని దర్శించినట్లుగా భావాన్ని బాబా బోధించెనని ఆ బాలబువా గ్రహించెను. దీనిని బట్టి సాయి తన భక్తుడు ఎక్కడ ఉన్నను ఏమి చేయుచున్నను తన భక్తుణ్ణిచూసెదరని నిరూపించెను.

సాయి తన భక్తుల కోసం ఏరూపేణానైనా వెళ్ళి తమ భక్తుల కష్టాలను తొలగించి రక్షించెదరు. శ్రీసాయి నానాసాహెబ్ చందోత్కర్ కుమార్తె శిరిడీకి 100 మైళ్ళ దూరములో నున్నను. ఆమెకు ఆపద సమయము వచ్చెనని గ్రహించి తన భక్తుని కుటుంబాన్ని ఏ విధంగా రక్షించెనో చూచెదము. నానాసాహెబ్ చందోత్కర్ కుమార్తె మైనతాయి ప్రసవవేదన పడుచుండగా బాబా శిరిడీ మశీదులో కూర్చొని ఒక్కసారిగా రామ్‌గిరిబువా (బాపుగిర్‌బావా) పిలిచి అప్పటికే ఆ రామ్‌గిరిబాబు తన స్వగ్రామమునకు బయలు దేరుటకు సిద్ధముగా ఉండెను. బాబా ఆ విషయమును ఎట్లుగ్రహించెనో ఎవ్వరికీ తెలీదు. బాబా అతనిని మార్గమధ్యమున జామ్నేర్‌లో విశ్రాంతి తీసుకొని నానాసాహెబ్‌కు ఊదీని హారతిని ఇమ్మనెను. కాని రామ్‌గిరిబువా తన వద్ద రెండురూపాయలు ఉన్నవని కాబట్టి అంత దూరము వెళ్ళుటకు కష్టమని చెప్పిరి. శ్రీసాయి అతనిని ఎటువంటి కలత చెందనవసరము లేదనిచెప్పెను. బాబా ఆజ్ఞప్రకారము రామ్‌గిరి బువా జలగాం చేరెను. అక్కడ దిక్కులు చూస్తుండగా ఒక అతను బాపుగిర్ బువా ఎవరు అని అతనినే అడుగెను. బువా తన సమాచారము చెప్పెను. ఆ వచ్చిన

బం(ట్రోత్తు బువాతో నానా సాహెబ్ పంపించినారని చెప్పి టాంగా పై ప్రయాణము కొనసాగించిరి. వారిరువురు తెల్లవారు సరికి ఒక సెలయేరు వద్ద చేరిరి. బం(ట్రోత్తు బువాకు ఫలహారము ఇవ్వగా బువా ఆ బం(ట్రోత్తు మహమ్మదీయుడని ఉద్దేశ్యంతో ఆ ఫలహారమును ముట్టలేదు. కాని ఆ బం(ట్రోతు అతని సంశయము తీర్చుటకై తాను హిందువుడని గలవార్ దేశపు క్షత్రియుడని బైగా నానాసాబెబ్ చే ఆ ఫలహారము పంపెనని చెప్పితినిపించెను. శ్రీసాయి ఎక్కడో 100 మైళ్ళ దూరములో ఉన్న భక్తుడి కూతురిని రక్షించుటకై ఎలా పాట్లు పడ్డారో అలాగే ఇంకొక భక్తుణ్ణి పంపించినప్పుడు ఆ భక్తుడు (రామ్‌గిరి బువా) యొక్క యోగక్షేమములను ఆకలిని కూడా కనిపెట్టి ఆ భక్తునికి దగ్గర ఉండి ఫలహారము తినిపించెను. వారిరువురు జామ్నేర్ చేరిరి. కాని బం(ట్రోతుకాని, టాంగాకాని ఆ రామ్‌గిరి బువా ఒంటికి పోసుకొని వచ్చుసరికి కనిపించలేదు. బువా నానాసాహెబ్ గారి ఇంటికి వెళ్ళి బాబా ఊదిని హారతి పాటను ఇచ్చిరి. నానా సాహెబ్ బాబా ఆశీర్వదించి పంపిన ఊదీని నీళ్ళల్లో కలిపి తన కుమార్తే కిచ్చి బాబా పంపిన హారతిని పాడిరి. చిత్రం అంతవరకు ఆందోళనకరముగా ఆపాయస్థితిలో ఉన్న ఆతల్లి బాబా ఊదినీళ్ళు త్రాగి హారతి వినగానే సుఖముగా ప్రసవించినది.బాపూగిరి బువా తనకు బం(ట్రోతునీ ఫలహారమును, టంగాను పంపినందుకు నానా సాహెబ్ గారికి కృతజ్ఞత తెలిపిరి. నానాసాహెబ్ ఒక్కసారిగా ఆశ్చర్య పడిరి. బువాతో తనకు శిరిడీ నుంచి ఎవ్వరు వచ్చుచున్నది తెలియదని తానేమియు పంపలేదని చెప్పిరి. ఈ అద్భుత సంఘటనలే బాబా ఎక్కడో 100 మైళ్ళ దూరములో మశీదులో కూర్చొని తన భక్తుడి కూతుర్ని ప్రసవవేదన నుండి రక్షించుటకే ఇంకొక భక్తుడగు రామ్‌గిరి బువాను తన వద్ద రూ॥ 2/–లు మాత్రమే ఉన్నవని తెలిసినను ఆ భక్తుడికి ఎటువంటి కష్టము, ప్రయాణములో అసౌకర్యము కలిగించక 100 మైళ్ళ ప్రయాణమును సుఖమంతముగానే నడిపించి జాల్నాలో ఆ భక్తుడు కాలు పెట్టగనే ఏ కష్టములేక తన భక్తుడి కోసం మనియు నానాసాహెబ్ కుటుంబరక్షణ కోసం ఒక బం(ట్రోత్తు రూపమున టాంగాను తెచ్చి బువాను ఎక్కించుకొని మార్గ మధ్యమున తన బిడ్డ ఆకలిని గ్రహించి ఒక తల్లి వలే బువాకు ఫలహారము తినిపించి నానాసాహెబ్ ఇంటి వద్ద దింపి మాయమాయ్యెను. నాన సాహెబ్ కూతురుని బాబా ఆశీర్వదించి విభూదితో రక్షించెను. శ్రీసాయి తన భక్తుడి రక్షణకై తప్పక ఏదో ఒక రూపమున కాపాడును అని నిరూపించెను. ఇలాంటిదే ఇంకొక తమాషా లీలలు చూచెదము అప్పాసాహెబ్ కులకర్ణి బాబాను అను నిత్యం ఫోటో రూపమున పూజించెడివారు. ఒకసారి భీవండి పోవలసి వచ్చినది. అతడు లేని సమయమున ఒక రోజు మధ్యాహ్నం 12గం॥లకు కులకర్ణి ఇంటికి ఒక ఫకీరు వచ్చెను. కులకర్ణి భార్యా పిల్లలు ఆ ఫకీరు ముఖలక్షణములు వారు రోజూ పూజచేయు బాబాఫోటోలోని ముఖ కవళికలను సమానంగా ఉన్నవని తలంచి వారు ఫకీరుని మీరు శిరిడీ సాయి బాబానా అని అడిగిరి. అప్పుడు ఆఫకీరు లేదు నేను భగవంతుణ్ణి సేవకుడను మీ క్షేమమును

కనుగొనుటకు వచ్చితిని అని పలికి ఆ ఫకీరు ధక్షిణ అడిగెను. ఆమె ఒక రూపాయి ఇచ్చెను. ఆ ఫకీరు ఒక పొట్లాంతో ఊదినిచ్చి పూజలో ఉంచుకొనమని చెప్పిరి. అప్పా సాహెబ్ తన పర్యటన కొన్ని పరిస్థితుల వలన మానుకొని అదేరోజు ఇంటికి తిరిగి వచ్చెను. తన ఇంటివాళ్ళ వల్ల ఫకీరు రాకను గ్రహించి ఆ ఫకీరుకు ఒక్క రూపాయి బదులుగా 10 రూ॥లు ఇచ్చినచో బాగుండెనని తాను ఇంట ఉండినచో అట్లే చేసి ఉండెడివాడను అని చెప్పెను. వారు ఆ ఫకీరును వెతుకుటకై బయలు దేరిరి. కొద్దిదూరము వెళ్ళగా వారి వైపే ఆ ఫకీరు ఎదురయ్యి దక్షిణ అడిగెను. వారు ఒక రూపాయి ఇచ్చెను. తిరిగి అడుగగా రెండు మళ్లీ మూడు ఇచ్చిరి. ఆ ఫకీరు తృప్తి చెందక ఇంకా అడుగగా అప్పాసాహెబ్ వారిని తన ఇంటికి తీసుకవెళ్ళి 10రూ॥లు దక్షిణ ఇచ్చిరి. అప్పాసాహెబ్‌కు ఊది పొట్లాము నిచ్చెను. అప్పా సాహెబ్ కోరుకున్నట్లుగా బాబా 10 రూ॥లు మాత్రమే తీసుకొనెను. శ్రీసాయి ఈ విధంగా ఫకీరు రూపమున అప్పా సాహెబ్ ఇంటికి వెళ్ళి అనుగ్రహించిన పిదప అతను మంచి పలుకుబడి మరియు అధికారము లభించినది.

బాబా ఊదీ దక్షిణ ద్వారా వివేకము వైరాగ్యములను భోదించుచుండెడివారు. అందుకే బాబా వచ్చిన నారిన దక్షిణ అడిగి ఊదీని ప్రసాదముగా ఇచ్చేవారు. ఊదీ వలన యావత్ ప్రపంచములోని సమస్త వస్తువులు అసత్యమని మన శరీరము సుఖములను అనుభవించిన పిమ్మట కాలి బూడిద అగునని ఈ విషయాన్ని అనుక్షణం ప్రతి మానవునికి తన అజ్ఞానమును తొలగుటకై జ్ఞప్తికి తెచ్చుటకై బాబా ఆ విధముగా తనవద్దకు వచ్చిన భక్తులకు ఊదినిచ్చేవారు. ఒక్క పరమాత్ముడే సత్యమని జగత్తు ఆశాశ్వతమని ఏ బంధువులు మనవారు కారని బాబా ఎల్లప్పుడు జ్ఞప్తి చేసేవారు. బాబా ఆశీర్వదించి ఇచ్చిన ఊదీతో అనేకమైనటువంటి రోగములు నయమవుతూ ఉండేవి. అలాగే దక్షిణతో వైరాగ్యమును భోదించెను. దక్షిణవలన మానవుడు తన వద్ద నున్న ధనమును దక్షిణ అడుగు వాని చేతిలో పెట్టెదరు. దాని వలన దానము చేయుట తెలియును. ఎప్పుడైతే దానము చేయగా వైరాగ్యము ఆవహించును.

బాబా ఊదే ఒక్కొక్కసారి సమయానికి తనభక్తునికి అందక పోయినను నామ జపముతో గాని సాయి ధ్యానముతో గాని రాలిపడిన అగర బత్తి బూడిదఅలాగే రోడ్డుపైన మట్టికుడా ఎప్పుడైతే బాబాను శ్రద్ధా భక్తితో ధ్యానించి నామ జపముతో వాటిని ఉపయోగించగా బాబా ఊదికి గల శక్తి సామర్ధ్యములు సమానముతో ఆ అగరబత్తి బూడిద మరియు రోడ్డుపైన మట్టికి కూడా కలుగును. నారాయణ రావు అను అతని స్నేహితునికి తేలు కుట్టినప్పుడు ఊదీ లేనప్పుడు బాబా పటం ముందర అగర బత్తి రాలి పడిన బూడిదను తీసుకొని బాబాను స్మరించి రాయగా నొప్పి తగ్గిపోయెను. అలాగే బాంద్రాలో ఉండు బాబా భక్తునికి తన కుమార్తె వేరొక

గ్రామమును ప్లేగు ద్వరముతో బాధపడుతున్నప్పుడు అతను ఊదీని పంపమని నానాసాహెబ్‌ను కోరగా ఆ సమయమున నానాసాహెబ్ తన భార్యతో ఊరికి పోవుచుండెను. నానా సాహెబ్ రోడ్డుపైన మట్టిని తీసుకొని నామ జపము చేసి తన భార్య నుదుటిపై రాయగా ఎక్కడోఉన్నా బాబా భక్తుని కుమార్తెకు గల ప్లేగు జ్వరం నయమైనది.

ఈ విధముగా సాయి తన భక్తులను ఎక్కడ ఉన్నను ఏమి చేయుచున్నాను. వారి యోగ క్షేమములను గమనిస్తూ వారిని రక్షించుటకు తానే స్వయంగా వేరే రూపమున వెళ్ళుట, లేదా తాను ఆశీర్వదించి పంపిన ఊదివల్ల ఊదీ సమయానికి లేని భక్తులకు ఆ భక్తులయొక్క నమ్మకం వల్ల బాబా, కాలిన అగరబత్తి బూడిత సహా లేదా చివరకు నేలపైన మట్టితో సహా బాబా యొక్క అన్నంతమైన శక్తి వాటిలో ప్రసరింప చేసి తనని నమ్ముకున్న భక్తులను రక్షించెడివారు శిరిడీలోని శ్రీ సాయినాథుడు.

## 34వ అధ్యాయము

గత అధ్యాయములో బాబా ఈ జగత్తు అశాశ్వతమని ప్రపంచములో కన్పించు ఏ వస్తువైనను సత్యముకాదని తుదకు మన శరీరము సుఖములు అనుభవించున తర్వాత బూడిద అగునని ఈ సంగతిని సర్వజనులకు జ్ఞప్తి చేయుటకై బాబా మశీదులోని ధుని వెలిగించేవారు. ఆ ధునివలన కాలిన కట్టెలవలన బూడిదను బాబా ఊదివలే ఉపయోగించేవారు. ఈ ఊదివలెననే బ్రహ్మము నిత్యమని చెప్పేవారు. మశీదుకు వచ్చిన భక్తులకు ఊదీని ప్రసాదించి ఆశీస్సులతో పంపెడివారు. ఈ ఊదే కనిపించుటకు బూడిద వలసే ఉన్నప్పటికి ఆ పరబ్రహ్మసాయి చేతిని తాకగానే ఆ ఊదే దివ్య ఔషదముగా పనిచేసి అనేక విధములైన శారీరక, మానసిక రోగములను బాబా తగ్గించిరి. బాబా భక్తులకు ఊదీ ప్రసాదముగా ఇచ్చి ఆ భక్తుల నుదుటిపై ఊదీని రాసేవారు. బాబా ఊదీపై ఒక పాట కూడా పాడెడివారు. ఆ పాట "కళ్యాణ రామ రారమ్ము! గోనెలతో ఊదీని తేతెమ్ము!". ఈ అధ్యాములో శ్రీసాయి అభయహస్తమునుండి వెదచల్లిన ఊదీవల్ల భక్తుల బాధలు ఏ విధముగా నివారణ అయినదో చూడుడు.

ఇరానీ వాని కుమార్తెకు ప్రతి గంటకు మూర్ఛరోగముతో బాదపడుచుండెను. ఎంతో మంది డాక్టర్లు ఎన్నో ఔషధముల ద్వారా ఉపయోగించినను ఆ మూర్ఛ రోగము తగ్గలేదు. అతని స్నేహితుడు బాబా ఊదీని ఉపయోగించమనెను. అతను ఊదీని నీటిలో కలిపి తన కుమార్తెకు తాగించగా కొన్ని రోజులలో రోగం పూర్తిగా తగ్గెను.

హర్దాపురములో ఒక వృద్ధుడు మూత్రకోశములో రాయితో బాధపడెను. వైద్యులు దానికి నివారణయు ఆపరేషన్ చేయవలెననెను. ఆ గ్రామపు ఇనాముదారు బాబా భక్తుడు. అతను కొద్దిగా ఊదీని ఆ వృద్ధునికిచ్చి నీళ్ళలో కలిపి త్రాగించమనెను. అట్లు చేయగా బాబా కరుణతో ఊదీ ప్రభావముతో రాయి కరిగి మూత్రము నుండి బైటపడెను.

సాయి ముఖ్య భక్తుడు శ్యామా మరదలుకు ప్లేగు తగిలెను. దాని ప్రభావముచే చంకలో రెండు బొబ్బలు కూడా లేచెను. శ్యామా బాబాను శరణువేడగా సాయి ఇట్లనెను. "ఊదీ పంపుము. జ్వరమును బొబ్బలను లక్ష్యపెట్టకు. ఈ రాత్రి నీవు వెళ్ళవద్దు రేపు ఉదయం వెళ్ళుము" అని అనెను. బాబా ఆజ్ఞను జవదాటని శ్యామా ఊదీని బాపాజీ ద్వారా తనతమ్ముని ఇంటికి పంపెను. బాబా ఊదీని బొబ్బలపై రాసి నీళ్ళు త్రాగించిరి. ఇక్కడ శ్యామా బాబా చెప్పినట్లు మరునాడు ఉదయం తమ్ముని ఇంటికి వెళ్ళగా తన మరదలు తేనీరు తయారుచేయిచుండుట చూసి ఆశ్చర్యము పొందెను.

బొంబాయి స్త్రీ ఒకామె ప్రసవ సమయమున బాధపడుచుండెను. ఆమెను శిరిడీకి తీసుకువచ్చిరి. యోనిలో అడ్డు కనిపించెను. బాబా ఊదీని నీళ్ళతో కలిపి ఇచ్చిరి. ఎట్టి కష్టము లేక ప్రసవించెను. కాని చనిపోయిన బిడ్డపుట్టెను. బాబా ఊది పెద్ద ప్రాణాన్ని రక్షించినది.

మాలేగాంలో ఒక డాక్టర్ తన మేనల్లునికి నయము కానట్టి రాచకురుపుతో బాధపడుచుండెను. ఆపరేషన్ చేసినను ఉపయోగము లేకపోయెను. వారి తల్లిదండ్రులు బాబా మహిమను విని శిరిడీకి వచ్చి బాబాను వేడెను. సాయి ఇట్లనెను. ఎవరైతే ఈమశీదుకు వచ్చెదరో వారెన్నడు ఈ జన్మలో ఏ వ్యాధి చేతనుబాధ పడరు. కురుపుపై ఊదీని వ్రాయుము. ఒక వారములో నయమగును. దేవునియందు నమ్మకముంచుము. ఇది మశీదు కాదు ద్వారావతి. ఎవరు ఇందు కాలుమోపెదరో వారు ఆరోగ్యమును ఆనందమును పొందెదరు అని బాబా ఆ కురుపు మీద తమ చేతితో త్రిప్పెను. ఊదీని వ్రాసెను. కొద్దిరోజులలో నయమయ్యెను. బాబా దేవునియందు నమ్మకముంచుడు అని ఒక ప్రక్క అంటూనే ఆ రోగి యొక్క కురుపు మీద సాయి తమ చేతిని త్రిప్పెను. అంతే కొన్నాళ్లకు ఆ కురుపు మటుమాయ మయ్యెను. **ఇంకెక్కడి దేవుడు ఆ దేవుడే శిరిడీ సాయినాథుడు.**

ఈ సంగతి తెలిసిన ఆ కుఱ్ఱవాని మామయగు డాక్టర్ ఆశ్చర్యపడి సాయిని చూడవలెనని తలచెను. కానీ జనులు కొందరు బాబా గురించి వ్యతిరేకంగా చెప్పుట చేతని శిరిడీ ప్రయాణం మానుకొనెను. బొంబాయిలో 3 రాత్రులు వరుసగా ఇంకను నన్ను నమ్ముమా! అని స్వరం వినిపించగా అతను శిరిడీకి పోవలెననుకొనెను.

ఒక రోగికి నయము కానట్టి జ్వరముతో బాధపడుచుండు అతనికి చికిత్స చేయుచూ ఆ డాక్టర్ తన

మనస్సులో సాయిని పరీక్షించదలచి “ఆ రోగి యొక్క వ్యాధి ఈ నాడు దగ్గిన, రేపే శిరిడీకి పోయెదని” మ్రొక్కుకొనెను. వెంటనే ఆ రోగికి జ్వరం తగ్గెను. డాక్టర్ శిరిడీకి వెళ్ళి బాబాను దర్శించెను. అతను బాబా భక్తుడై, బాబా ఊదితో తిరిగి ఇంటికి వచ్చెను.

శ్రీసాయి తన భక్తుల బాధలను పది జన్మల వరకు బాధ పడవలసియున్నది అనుకున్న భక్తుల బాధలను శ్రీసాయి పదిరోజులలో నివారించినారు. అటువంటి భక్తుని బాధ వినెదము. డాక్టర్ పిళ్ళే బాబాకు భక్తుడు అతనికి గినియాపురుగులచే బాధపడుచుండెను. ఆ బాధను తట్టుకోలేక చావును కోరుచుండెను. బాబాకు తన బాధను తెలపవలసినదిగా మరియు ఆ బాధను రాబోయే పది జన్మలకు పంచిపెట్టవలసినదిగా శ్రీసాయికి చెప్పమని కాకాసాహెబ్ దీక్షిత్‌ను బాబా కడకు పంపెను. దీక్షిత్ ద్వారా బాబా పిళ్ళే బాధను విని ఇట్లు పలికెను ? అతడేల పదిజన్మల వరకు బాధపడవలెను? పదిరోజులలో గత జన్మ పాపమును హరింపజేయగలను. నేనిక్కడ ఉండి ఇహపరసౌఖ్యము ఇచ్చుటకు సిద్దముగా ఉండగా అంతడేలా చావును కోరవలెను. ఎవరైనా అతనిని తీసుకరండు బాధను నిర్మూలించెదను అని పలికిరి. ఇక్కడ సాయి సూటిగా తాను భగవంతుడని సూచించినారు. పది జన్మల బాధను 10 రోజులలో హరింప చేస్తానన్నారు. ఇది కేవలం ఆ పరమాత్ముడికి తప్ప మరెవ్వరికి సాధ్యంకాదు. మరియు ఇహానికి పరానికి సౌఖ్యము ఇవ్వటానికి ఉన్నానన్నారు. ఇహపర సౌఖ్యము లిచ్చునది పరమాత్మయే మీ బాధను శాశ్వతముగా నిర్మూలించెదనన్నారు. అంత నిక్కచ్చగా బాబా తాను స్వయముగా పరమాత్మయే అని సూచించినారు. అయితే పిళ్ళేను తీసుకవచ్చిన తరువాత ఆయన బాధను చాలా చిత్రముగా బాబా ఏమీ కల్పించుకొనకుండా చూచే వాళ్ళకి ఇంకెవరి ద్వారానో నివారణ అయినట్లుగా చూపించినారు. అదెట్లనగా నానా సాహెబ్ డాక్టర్ పిళ్ళెకు కట్టు కట్టుచుండగా బాబా ఆ కట్టు కట్టవద్దని కట్టినచే చచ్చెదడని మరియు బాబా ఇట్లనెను. “అప్పుడు ఒక కాకి వచ్చి పొడచును. అప్పుడు నీ కురుపు నయమగును” అనిరి. సాయి పలికిన పలుకులు వింటే ఒక పిచ్చివాని పలుకులవలే అనిపిస్తాయి. మశీదులో కాకి రావడమేమిటి పైగా ఆ కాకి పిళ్ళే ఈ యొక్క కురుపును పొడవడమేమిటి అని అందరూ ఎవరి పనిలో వారు ఉండగా అబ్దుల్లా అనే అతడు మశీదును తూడుస్తూ అతని కాళ్ళు పిళ్ళే కురుపుమీద పడెను. అందులో నుండి ఏడు పురుగులు బైటకు వచ్చెను. తట్టుకోలేక బాధచే పిళ్ళే ఏడువగా సాయి ఇట్లనెను. చూడండి మన అన్న జబ్బు కుదిరినది. అనగా పిళ్ళే కాకి ఎప్పుడు వచ్చును. అని ప్రశ్నింపగా బాబా నీవు కాకిని చూడలేదా. అబ్దుల్లాయే ఆకాకి అని అనెను. బాబా ప్రవర్తన చాలా చిత్రముగా ఉండును, అనుటలో ఇది ఒక ఉదాహరణ సాయి ఎటువంటి చికిత్స పిళ్ళేకు చేయలేదు. కనీసం ఆ రోగిని తాకనైనా తాకలేదు. మశీదులో

ఉన్న జనులకు మాత్రం అబ్దుల్లా చూడకుండా తనకాలును పిళ్ళే కురుపుపై పడి ఒత్తుట వలన తనకు రోగము నివారణమైనదని 7 పురుగులు బైటకు వచ్చెనని తలంచేరే కాని అబ్దుల్లా రావటము, అతని కాలు పిళ్ళే కురుపుపై పడటము, పురుగులు బైటకు రావటము, ఇవన్నీ సాయి అక్కడే మౌనముగా ఉండి నడిపించినది. అందుకే సాయి ముందుగానే ఒక కాకి వచ్చి పొడుచును. నీ కురుపు నయమౌను. అని జరగబోయేది ముందుగా తెలియపరచి తన భక్తుడగు పిళ్ళేకి బాధ నివారణ చేసెను. పిళ్ళే ఆ గాయాలపై ఊదీ పూయటంతో తన వ్యాధి పూర్తిగా నయమయ్యెను.

సాయి భక్తులెల్ల బాబా యొక్క ఊదీమహిమను తెల్సుకున్న తరువాత శిరిడీకి వెళ్ళిన వారందరు సాయి ఊదీని తప్పకుండా తెచ్చుకొని ప్రతిరోజు ఉదయం మరియు రాత్రి ఊదీని పెట్టుకొని నీళ్ళలో వేసుకొని త్రాగిన ఎటువంటి రోగములైనను తప్పకుండా నివారణ ఔతుందని సంపూర్ణమైన నమ్మకముతో ఈ అధ్యాయము చెప్పిన బాబా భక్తుల లీలలను బట్టి తెలుసుకుని ఊదీని అనునిత్యము సాయి మహా ప్రసాదముగా భావించి స్వీకరించ వలెను.

## 35వ అధ్యాయము

యోగులను పరీక్షించేదుకు కూడా కొంతమంది శిరిడీకి వెళ్ళేవారు. అసలు ఒక మహాయోగికి ఒక సామాన్యునికి నింగికి నేలకు మధ్య ఉన్నంత వ్యత్యాసం కలదు. ఎవ్వరైనను ఎదుటి వానిని పరీక్షించుటకు సిద్ధమైనపుడు ఆ పరీక్షించువాడు ఆ పరీక్షింపబడే వానికంటే ఒక మెట్టు ఎక్కువగా యోగ్యత కల్గిఉన్నప్పుడే అటువంటి పరీక్షలు చేయవచ్చును. ఆ యోగ్యత లేనప్పుడు అటువంటి మహాకార్యములకు సిద్ధపడరాదు. అట్లు చేసిన సామాన్యుడు ఒక మహా పర్వతమును ఢీకొనినట్లు, సముద్రకెరటాలను ఆపుటకు ప్రయత్నించినట్లు నేలపై నుండి ఆకాశంలోని మబ్బును తాకుటకు ప్రయత్నించినట్లుండును. కావున ఇటువంటి పరీక్షలు తగదు. సామాన్యముగా యోగులను పరీక్షంచుటకు ముఖ్య కారణం ఈ యోగి అయిన వారు ధనాన్ని ఎందుకు దక్షిణగా అడిగి దాచుకొందురని ధనముపై ఆశకల్గినవారు. యోగి గుణములు ఎట్లు ఉండునని ఇలాంటి ఆలోచనలతో ఉండేవాళ్ళు శ్రీసాయిని కూడా ఇలాంటి సంఘటనలను పరీక్షించుటకై శిరిడీకి వెళ్ళిన వారు కలరు. బాబా ఒకసారి ఇట్లనెను, “నేను ఒక రూపాయి దక్షిణ ఎవరివద్దనుంచి తీసుకొనినచో దానికి పదిరెట్లు ఇవ్వవలెను. నేను ఊరక ఏమియు తీసుకొనను. ఫకీరు ఎవరిని చూపునో వారి వద్దనే అడిగెదను. గత జన్మలో బాకీయున్న వాని వద్దనే పుచ్చుకొందును” అని అనెను. బాబా చెప్పిన వాక్యములను కొంతమంది స్వార్థముతోను, అపార్థముతోను తీసికొని సాయికి ఒక రూపాయి దక్షిణ ఇస్తే పోలే, లేదా సాయిగుడిలో వెళ్ళినప్పుడు హుండీలో

10రూ॥లు వేస్తే సాయి చెప్పినట్లుగా వేసిన వానికి 10 రెట్లు బాబా ప్రసాదిస్తాడని ఉద్దేశ్యముతో ఉన్నవారు కలరు. గీతలో కృష్ణ పరమాత్ముడు ఫలాపేక్ష లేకుండా ఉండమని పదేపదే చెప్పినారు. బాబాను ఆకర్షించుకొనుటకు కొంత మంది ధనమును ప్రయోగించి తనను బాబా ఆకర్షించుకుంటాడని ఉద్దేశ్యముతో ఉన్నవారు కలరు. కాని బాబా ఒక ఫకీరని తనకు ధనము, ఇల్లు, వాకిలి, బంధువులు, వస్తువులు, రుచిగల ఆహారము ఆఖరికి త్రాగునీరు వీటితో ఎటువంటి సంబంధము లేదు. మన కోర్కెలు కోసం బాబాను ధనముతో లొంగదీసుకొనవలెనని భావన నిజముగా మూర్ఖమైనది **ధనానికి లొంగేవాడు మానవుడు. భక్తికే లొంగేవాడు భగవంతుడు.** లక్షలు, కోట్లు, రత్నాలు ఇలా ఎన్నెన్నో లెక్కలేని ఆభరణములు కొండంతగా సాయి ముందర కుమ్మరించినను సాయి వాటిని తాకనైనా తాకరు. సాయి చెప్పినది ఒక్కటే. ఫకీరు ఎవరిని చూపునో వాని వద్దనే తీసుకొనెదని అనగా ఆ ఫకీరు గత జన్మలో ఎవరైనా బాకీయున్న ఎడల ఆ వ్యక్తినే ఆ ఫకీరు (భగవంతుడు) చూపునని అర్థము. మరి ఆ ఫకీరు ఈ ఫకీరుకి (బాబాకీ) చూపే అటువంటి వారి వద్ద ధనమును తీసుకొనమని చెప్పగా ఈ ఫకీరు బాబా వారి వద్దనుండి దక్షిణ పుచ్చుకునేవారు. ఇక్కడ కూడా బాబా తానే భగవంతుడైనప్పటికీ గత జన్మలో బాకీ పడిన వారిని గుర్తించి దక్షిణను అడుగునప్పటికిని ప్రపంచానికి మనలాంటి సామాన్య జనులకి బాబా తన యజమాని భగవంతుడని ఆ భగవంతుడని వేరుగానే చూపిస్తూ తాను ఆ భగవంతుని సేవకుడనని నమ్మిస్తూ ఉన్నారు. ఐతే దక్షిణ కోరుటకు ముఖ్యముగా గల కారణము ఎవ్వరైనను ధనము సంపాదించినప్పుడు దానము లేక ధర్మము చేయవలెనని ఆ దాన ధర్మముల కొరకే ఆ ధనములను సంపాదించవలెనని ధానము చేయకుండా మన స్వార్థానికి ఉపయోగించకూడదని బాబా చెప్పేవారు. ఈ జన్మలో అనుభవించే ప్రతివ్యక్తికి కూడా తన గత జన్మలో దానము లేక ధర్మము చేస్తేకాని ఈ జన్మనందు అట్లు అనుభవించలేడు. ఇతరులకిస్తేగాని ధనమును సంపాదించలేము. కావున దానము చేస్తేనే ధనము సంపాదించగలమని ఆ ధనములేక ధర్మము చేయుట వలన వైరాగ్యము చెంది భక్తి కల్గును. కావుననే బాబా దక్షిణ అడిగేవాయి. ఇలా యోగులను పరీక్షించుటకు వచ్చిన వారిలో కాకా మామాజుని స్నేహితుడు ఒకరు. అతడు సాకారాన్ని నమ్మడు. నిరాకారమునే నమ్మును. పైగా వింతల కోసం సాయిని దర్శించవలెనని కాకా మహాజనితో శిరిడీకి వచ్చెను. ద్వారకామయి మశీదు మెట్టెక్కిన ఎందరో భక్తులకు బాబా వారు నమ్ముకున్న దేవుళ్ళ రూపములను, గురువుల రూపమును చూపించినారని ముందు అధ్యాములలో కూడా ఋజువు చేయబడినది. ఇక్కడ కాకా మహాదని స్నేహితుడు మశీదు మెట్లు ఎక్కగనే సాయి ప్రేమ పూర్వక మాటలతో ఆహ్వానించెను. ఆ కంఠము కాకా మహాజని స్నేహితుని యొక్క తండ్రి కంఠమువలే ఉండెను. అతను ఆశ్చర్యము పొంది బాబాకు సాష్టాంగము పడిరి. సాయి కాకా మహాజనిని రెండు మూడుసార్లు దక్షిణ అడిగెను. అతని స్నేహితుని అడుగలేదు. గల కారణము అడుగగా బాబా "నీకు

ఇచ్చుటకు ఇష్టము లేకుండెను. కనుక అడుగలేదు. నీకిష్టమైన ఇవ్వవచ్చును అని అంటూ మనకు మధ్యనున్న అడ్డును తీసివేయుము.అప్పుడు మనం ఒకరినొకరు చూసుకొనగలము అని బాబా పలికెను. కాకా మహాజని స్నేహితుని సంశయములు తొలగిపోయెను. బాబాను పరీక్షించుటకై వచ్చి బాబా యొక్క మహిమాన్వితము తెలుసుకొని సిగ్గుపడెను. బాబా వారిని ఆశీర్వదించి తిరిగి ప్రయాణమునకు ఆజ్ఞ ఇచ్చెను. ఇంటికిపోయి తలుపులు తీయగా రెండు పిచ్చుకలు చచ్చి పడియున్నవి. ఇంకొక పిచ్చుక కిటికీనుండి ఎగిరిపోయెను. బాబా మూడవ పిచ్చుకను రక్షించుటకై అక్కడకు పంపెనని వారు గ్రహించెను. కాకా మహాజని శిరిడీకి అనేకసార్లు పోవుట తన యజమానియగు రక్కర్ గ్రహించి బాబాను పరీక్షించుటకై ఇంకొకరిని వెంబడి పెట్టుకొని కాకా మహాజనితో శిరిడీకి వచ్చెను. వారు ఎండు ద్రాక్ష పళ్ళుపైగా ఆ పండ్లలో గింజలు ఉన్నవి బాబాకు ఇచ్చిరి. అక్కడే బాబా సాహెబ్ తర్కడ్ ఉండెను. ఎండు ద్రాక్ష పళ్ళను బాబా పంచి పెట్టగా కాకా మహాజనియొక్క యజమానియగు రక్కర్ కొన్ని ఇవ్వగా అతనికి శుచి శుభ్రత ఉండుటచే తినలేదు. బలవంతముగా నోట్లో వేసుకొనెను. నోటిలోని గింజలను జేబులో వేసుకొనెను. సాయి అతని అవస్థను గ్రహించి మరికొన్ని పండ్లను ఇచ్చెను. మళ్ళీ బలవంతముగా అతన నోట్లో వేసుకొనగా ఆశ్చర్యకరముగా వానిలో గింజలు లేకుండనే తాను వింతలు చూచుటకై వచ్చినాడు. కాబట్టి బాబా అతని మనస్సును కనిపెట్టి వింత చూపెను గాని సాయి సామాన్యముగా వింతలు చూపరు – అయినను ఇంకా చంచల మనస్సుగల రక్కర్ తన ప్రక్కనున్న తర్కడ్‌కు ఎట్టి ద్రాక్షలు దొరికినవని అడుగగా తర్కడ్ గింజలతో ఉన్నవని చెప్పెను. బాబాను పరీక్షించుటకు వచ్చిన ఆ కాకా మహాజని యజమాని ఓడిపోయినను మళ్ళీ బాబా నిజమైన యోగి అయిన ద్రాక్షపళ్లను ముందు కాకా మహాజనునికి ఇవ్వవలెనని మనస్సులో అనుకున్న క్షణమునే బాబా నిదర్శనము చూపెను. శ్యామా రక్కర్‌ను బాబాకు పరిచయం చేస్తూ ఇట్లనెను. "కాకా మహాజని యొక్క యజమాని ఇతను" వెంటనే బాబా అద్భుతమైనటువంటి మాట పలికెను. అది ఏమనగా **"అతడెట్లు వానికి యజమాని కాగలడు. అతని యజమాని వేరొకరు కలరు"** బాబా పలికిన పలుకులు ప్రతివానికి వర్తించును. **మనందరికి యజమాని భగవంతుడే ఆ పరమాత్ముడు తప్ప ఎవ్వరికి యజమాని అనే వారుండరు. ఎక్కడ ఎవ్వరి దగ్గర ఏపనినైనా ధనంకోసం పనిచేస్తున్నా ఆ పనిచేయువాని అధికారికి కూడా యజమాని భగవంతుడే కాని పనిని కల్పించిన వారు ఆ పనికి ధనము ఇచ్చువాడు యజమాని కాడు.** రక్కర్ బాబాను పరీక్షించుటకు వచ్చి బాబాయొక్క సర్వజ్ఞతను గ్రహించిన వాడై సాయి ఒక గొప్పయోగి అని ఎరిగి బాబాకు 15రూ॥లు దక్షిణ ఇచ్చి తిరిగి వెళ్ళి పోయెను. యోగులను పరీక్షించవలెన్న ఎన్ని జన్మలైనను చాలవు కదా!

## 36వ అధ్యాయము

**మాలా కమండలు రధః కరపద్మయుగ్మే**

**మధ్యస్థ పాణియుగళే ధమరు త్రిశూలే**

**యస్యస్త ఊర్ధ్వకరయోః శుభ శంఖు చక్రే**

**వందేత మత్రివరదం భుజ పట్కయుక్తమ్**

బాబా శ్రీదత్తుని 5వ అవతారమని ముందు అధ్యాయములలో చెప్పబడినది. ఈ అధ్యాయములో సాయి తాను దత్తాత్రేయుడే అని ఋజువు చూపబడినది. బాబాను దర్శించుటకై గోవానుండి వచ్చిన ఇద్దరు పెద్ద మనుష్యులు బాబా ఒకరిని 15రూ॥లు దక్షిణ అడిగెను. అతను ఇవ్వగా ఇంకొకరు బాబా అడుగక పోయినను. 35రూ॥లు దక్షిణ ఇవ్వగా సాయి నిరాకరించెను. శ్యామా ఈ విషయమును బాబాను ప్రశ్నింపగా సాయి ఇట్లనెను. బాకీ ఉన్నవాడు చెల్లించవలెను. నాకు ఏమీ అక్కరలేదు "నేనెప్పుడూ స్వతంత్రుడను ఋణము శతృత్వము, హత్య చేసిన దోషము చెల్లించియే తీరవలెను. దానిని తప్పించుకొనలేము" అని పలుకగా శ్యామాకు ఏమీ బోధపడలేదు. తరువాత ఆ ఇద్దరు పెద్దమనుష్యులలో15 రూ॥లు దక్షిణ ఇచ్చినావారు శ్యామాతో తన గురించి ఈ విధముగా చెప్పెను. "నాకు ఉద్యోగము లభించినచో నా మొదటి జీతమునంతయు దత్తా దేవునికిచ్చెదనని మ్రొక్కుకుంటిని. దత్త అనుగ్రహముచే నాకు ఉద్యోగము దొరికెను. మొదట నా నెల జీతం 15 రూ॥లు క్రమముగా పెరిగి 700రూ॥లు అయినది. నా మొక్కును మరచితిని. కావున బాబా నావద్ద 15 రూ॥ తీసుకొనిరి. అదిపాత బాకీ" అని చెప్పిరి. తన ఇష్ట దేవుడగు దత్తాత్రేయుల వారిని మ్రొక్కుకున్నారు. **శ్రీదత్త అవతారమగు శ్రీసాయి అతని మ్రొక్కును మరచినను బాకీయున్నవారు కనుక ఋణము విమోచనమునకై శ్రీదత్తసాయి పాత బాకీ యగు 15రూ॥లు మాత్రమే (మొదటి నెలజీతం) దక్షిణ అడిగెను. అతను మ్రొక్కుకున్నది దత్తాత్రేయునికి అడిగిన వారు శ్రీసాయినాథుడు బాబా ఖచ్చితముగా దత్తాత్రేయుడే అని బాబా ఋజువైనది.**

బాబా అడగకుండా 35రూ॥లు దక్షిణ ఇచ్చినవాడు శ్యామాతో బాబా తన దక్షిణను నిరాకరించుటకు గల కారణమును ఈ విధముగా తెలిపెను. నావెంట మనిషి ఎప్పటి నుండో నావద్ద పని చేయుచుండెను. వాని మనస్సు మారుట వలన నా ద్రవ్యమును దొంగిలించెను. 30 వేల రూ॥లు దొంగిలించి పారిపోయెను. ఒక ఫకీరు నా స్థితిని గమనించి శిరిడీ సాయికి మ్రొక్కి ప్రియమైన ఆహారమును విడువమని చెప్పగా నేను అన్నము తినుట మానినాను. 15 దినముల తరువాత నావంటవాడు నాడబ్బును తిరిగి ఇచ్చెను. నేను నా మ్రొక్కును మరచితిని. ఒకసారి బాబా స్వప్న దర్శనము ఇవ్వగా నామ్రొక్కు జ్ఞప్తికి వచ్చి స్టీమర్‌పై రాదలచి ఆ స్టీమర్‌లో

జాగా లేకుండుటచే కెప్టెన్ ఒప్పుకొనలేదు. అప్పుడు పరిచయములేని ఒక వ్యక్తి చెప్పగా నన్ను ఎక్కించుకొని ఇక్కడకు తెచ్చిరి. ఈ ఇద్దరి విషయములు గ్రహించిన బాబా భక్తుడగు శ్యామా మిక్కిలి ఆశ్చర్యము చెందిరి. శ్రీసాయి సర్వజ్ఞుడగుటచే వీరిరువురు శ్యామాకు వారియొక్క కథలు చెప్పక పూర్వమే బాబా ఆ రెండు కథలను మసీదులో ఉన్నవారి ముందు చెప్పిరి. ఐతే అవి సూటిగా 15 రూ॥లు దక్షిణ ఇచ్చిన వారి కథను తాను మొక్కుకున్న మొదటినెల జీతం తన ఇష్టదైవమునకు ఇచ్చెదనని మొక్కిన మొక్కు మరచుటచే తాను (బాబా) 15 రూ॥లు దక్షిణ అడిగినానని చెప్పి రెండవ కథ మాత్రము సాయి తన దగ్గర ఉన్న సొమ్ము 30 వేల రూ॥లు తన నౌకరు దొంగిలించినాడని రెండవ వాని వృత్తాంతమును తనకు (బాబాకు) జరిగినట్లుగా చూపిస్తూ బాబా ఆ ఇరువురి గతవృత్తాంతము చెప్పకమునుపే చెప్పినారు. సాయికి కావలసినది ధనము కాదు. భక్తుని మాట ముఖ్యము. తన భక్తుడు మొక్కిన మొక్కు చెల్లించుట ముఖ్యము. అందుకే ఆ బాకీ తీర్చుటకై బాబా ఆ విధమున నాటకము ఆడెను.

శ్రీసాయి ఈ జన్మలో తన భక్తులయొక్క బాగోగులు వారు మొక్కుకున్న మొక్కులు అవి తీర్చుటకై తన భక్తులను మశీదునకు లాగి బాబా చేయిచాపి దక్షిణ అడిగి ఋణముకాని, శతృత్వముకాని, హత్య చేసిన దోషముకాని చెల్లించవలెనని ఉద్దేశ్యముతో భక్తులనుండి అడిగేవారు. బాబా తన భక్తుని బాగోగులు ఈ జన్మమునందే కాదు. మరెన్నో జన్మలలోనివి కూడా సాయికి క్షుణ్ణముగా తెలుసు. ఉదాహరణకు శ్రీసాయి తన ముఖ్య భక్తుడగు శ్యామాతో ఇట్లనెను. "72 జన్మలనుంచి నీవు నాతో ఉన్నప్పటికి నీ బుగ్గను నేను గిల్లలేదు". దీనిని బట్టి **బాబా ఒక్కొక్క భక్తుని యొక్క జన్మ జన్మల బంధంఎక్కడినుండి మొదలై ఎక్కడకు అంతమౌతుందో పరమాత్మ అగు ఆ సాయికి ఎరుక.** ఈ విషయాన్ని అప్పుడు పరిశీలిద్దాం.

షోలాపూర్‌లో సఖారాం భార్యకు సంతానం లేదు. ఆమె శిరిడీకి వచ్చి శ్యామాకు ఈ సంగతి తెలిపి బాబాకు తన తరపున వేడుకొనమని చెప్పగా శ్యామా ఆమెను భోజన సమయమున మశీదు వాకిట కొబ్బరి కాయ అగరవత్తులతో సిద్ధము చేసుకొని సమయము చూసుకొని తాను సైగ చేసిన పిదప మశీదులోనికి రావలెనని శ్యామా చెప్పెను. మశీదులో మధ్యాహ్నము భోజనాంతరము శ్యామా బాబా చేతులు తువ్వాలుతో తుడుచు చుండగా, బాబా శ్యామా బుగ్గను గిల్లెను. శ్యామాకోపించి "మా బుగ్గలు గిల్లునట్టి పెంకి దేవుడు మాకు అక్కరలేదు. మేము నీ పై ఆధారపడియున్నామా"? అన్న సందర్భమున సాయి ఇట్లనెను. శ్యామా 72 జన్మలనుంచి నీవు నాతో ఉన్నప్పటికి నేను నిన్ను గిల్లలేదు. ఇన్నాళ్ళకు నేను నిన్ను గిల్లగా కోపం వచ్చినది అని బాబా పలికెను. వీరిరువురి ప్రేమాను రాగములు ఈ జన్మలోనివేకావు. 72 జన్మలనుంచి అపారముగా

కొనసాగుతున్న బంధం. ఆ కారణముచే సాయి శ్యామాను చాలా ప్రేమానురాగములతో చూచుచు శ్యామాకు మేలు కోరిన వారై శ్యామాచేత పవిత్ర గ్రంథములను చదివించుటకై కొన్ని ముఖ్య గ్రంథములను బాబా శ్యామావద్ద ఉంచుటేకాక అనాగరికుడైనను శ్యామా మెడలో సాయి ఆశీర్వదించి విష్ణు సహస్రనామ మాలను వేసెను. శ్యామా అంటే బాబాకు ఒక ప్రత్యేక అభిమానం. బాబాకు తెలుసును శ్యామాకి బాబాకి 72 జన్మల బంధము కలదని కావుననే బాబా ఎవ్వరిని చనువుగా ప్రవర్తించుట చూడనివిధముగా బాబా శ్యామాను బుగ్గ గిల్లుట దృశ్యమున బాబా ఎంత చనువుగా శ్యామాతో ప్రవర్తించెనో చూడవచ్చును. శ్యామాకు 72 జన్మల నుండి బాబాతో సాంగత్యము ఉన్నదని తనకు తెలియదు. అయినప్పటికి తన జన్మ జన్మల సాంగత్య బలముచే బాబాని "మా బుగ్గలు గిల్లునట్టి పెంకి దేవుడు మాకక్కరలేదు. మేము నీపై ఆధారపడియున్నామా? అని తెలియకుండానే పలికెను. అతనికి ఎన్నో జన్మల బంధము ఉన్నందువలననే తన గురువునే పెంకి దేవుడు అని సంభోదించినారు. అన్ని జన్మల సాంగత్యం ఉన్నందువలననే శ్యామాకు ఆ చనువు చేతనే బాబాను పెంకి దేవుడు అని సంభోదించినాడు. శ్యామాకు తన 72 జన్మల బంధం బాబాతో కలదని తెలియక పోయినను శ్యామా నోటి నుండి వచ్చిన మాటలవి. ఆ చనువు వలన పలికిన మాటలవి పైగా శ్యామా "మేము నీపై ఆధారపడి యున్నామా " అని తెలియకనే పలికినాడు. తనకు 72 జన్మల నుంచి బాబాపై ఆధారపడే ఉన్నాడు. ఆ నిజం తెలియదు కావుననే బాబా వారిరువురి మధ్యగల బంధమును బైటపెట్టినారు. ఆ సమయములోనే శ్యామా సఖారం భార్యను సైగ చేసి రమ్మనెను. ఆమె బాబాకు నమస్కరించి టెంకాయలను అగరవత్తుల నిచ్చెను. బాబా ఆ టెంకాయను చేతితో పట్టుకొని ఆడించగా అది ఎండుది కావున లోపల శబ్దం వినిపించెను. బాబా ఆ శబ్దము విని అది ఏమి చెప్పుచున్నదని శ్యామాను అడుగగా శ్యామా సఖారం భార్యను చూపిస్తూ ఆమె తన గర్భమందు ఒక బిడ్డ అటులే ఆడవలెనని వేడుచున్నది కావున అదే టెంకాయని ఆశీర్వదించి ఆమెకు ఇవ్వమని శ్యామా కోరగా బాబా టెంకాయ బిడ్డను ప్రసాదించునా ? ప్రజలెంత అమాయకులు "అనే మభ్య మాటలు చెప్పగా శ్యామా "నీ మాటల మహిమ ఆశీర్వాద ప్రభావము నాకు తెలియును" అని చాలా దృఢముగా నమ్మకముగా తన దేవుడు అగు సాయి ఎంత గొప్పవాడు అని తెలుసు గనుకనే అంత గట్టిగా పలికెను. బాబా ఆ టెంకాయను కొట్టమనెను. శ్యామా దానిని ఆమెకివ్వమనెను. తుదకు బాబా శ్యామా కోరిక నెరవేర్చుటకై దానికి ఆమెకు సంతానము కలుగును. 12 మాసములలో అని టెంకాయను పగులగొట్టి ఒక చిప్ప గురు శిష్యులగు బాబా, శ్యామా, తినెను. రెండవ చిప్పను సుఖారం భార్యకిచ్చెను. మళ్ళీ ఇక్కడ శ్యామా తన గురువు సాయితో 72 జన్మల నుంచి కలిసి ఉన్నాడని తెలియకనే ఆ పూర్వపు సాంగత్య వాసనచే తెలియకుండానే చనువుతో శ్యామా ఆ స్త్రీతో ఇట్లనెను. "అమ్మా నీవు నా మాటలకు సాక్షివి. నీకు 12 మాసములలో సంతానము

కలుగనిచో ఈ దేవుని తలపై ఒక టెంకాయను కొట్టి ఈ మసీదు నుంచి తరిమి వేసెదను. ఇందుకు తప్పినచో నేను మాధవుడనే కాను. "శ్యామా తనకున్న చనువు ప్రభావముచే ఆ చనువు జన్మజన్మలనుండి వచ్చినది కావుటచే బాబాని చూపిస్తూ" ఈ దేవుని తలపై ఒక టెంకాయను కొట్టి ఈ మశీదు నుంచి తరిమి వేసెదను". ఈ మాటలు విన్న వారికి చాలా భయంకరముగా అనిపించును. పైగా ఆవిధముగా బాబాని తిట్టుట పాపమని లేదా శ్యామాకి అహంకారమని అనుకొనెదరు. శ్యామా ఇంత కఠినముగా తిట్టుటకు కారణములు రెండు. 1 తనకోసము కాకుండా ఇతరుల సుఖంకోసం, ఇతరులకి సంతానము కలుగుట వలన ఆనందించుట కోసము ఇతరుల కోసం బాబాను కోరి వరమున పొంది ఒకవేళ అట్లు కాని యెడల బాబాను పై విధముగా శిక్షించెదనని తన కోసము కాక ఫలాపేక్ష లేని కోరికతో కోరిన నిస్వార్థ, నిజమైన సాయి భక్తుడు. 2 ఇది ముఖ్యమైన కిరణం శ్యామాకు బాబాతో ఉన్న జన్మజన్మల బంధం అది 72 జన్మ॥ల నుండి ఉన్నదని ఆ 72 జన్మల సాంగత్య చనువుచే శ్యామాకు తెలియకుండానే పూర్వ జన్మల వాసనచే పలికిన పలుకులు.

ఇది జరిగిన సంవత్సరానికి సఖారం భార్య కొడుకును కనెను. తరువాత 5 నెలలు గడిచిన పిదప ఆమె తన భర్తతో కొడుకుతో శిరిడీకి వచ్చి బాబాకు సాష్టాంగ నమస్కారము చేసిరి. ఆమె భర్త 500 రూ॥లు బాబాకు ఇవ్వగా సాయికడ ఉన్న గుఱ్ఱముగా శ్యామ కర్ణకు శాల కట్టించెను. కాబట్టి సాయి తన భక్తుల వృత్తాంతము అంతయు ఈ జన్మలో నైనను మరెన్ని జన్మలలో నైనను బాబాకు క్షుణ్ణముగా తెలుసును. ప్రపంచమంతటలో ప్రతి జీవి యొక్క పుట్టు పుర్వోత్తరాలు సాయికి తెలుసును.

## 37 వ అధ్యాయము

గత అధ్యాయములో సాయి తన భక్తులయొక్క వృత్తాంతము ప్రస్తుత జన్మలోనే కాకా గత జన్మలోనివే కాక మరెన్ని జన్మలలోని వైనను వారికి తెలుసు. అనగా సాయి ఎన్నో జన్మల నుండి తన భక్తులను కాపాడుతూ వారి యోగక్షేమములు చూచుచుండేడివారు. బాబా తాను పరమాత్మయని లోకానికి ఎన్నడు చాటి చెప్పలేదు. జనులు సాయిని పరమాత్మ అని భావించే లోపలే అతిసామాన్యుని వలే ఇతరులపై ఆధారపడు వారి వలే నటించెడివారు. శ్యామాతో తనకు 72 జన్మల నుంచి తనకు సంబంధం కలదని చెప్పినప్పటికిని అంటే తన భక్తుడుని 72 జన్మల నుండి కాపాడుతున్నప్పటికిని బాబా తన మాయచే ఒక్కొక్కసారి అతి సామాన్యునివలే జనులకు తాను పరమాత్ముడని గ్రహించకూడదనే ఉద్దేశ్యముతో బాబా ఇతరులపై ఆధారపడువానివలె నటించెడివారు. ఉదాహరణకు ఇతరులపై ఆధారపడువానివలె ప్రతిరోజు బాబా శయనించు సమయమున తాత్యా అను భక్తుడు తన యింటికి పోవుటకు సాయి అనుజ్ఞ కోరగా బాబా అతనితో ఇట్లనెడివారు. "నన్ను

కాపాడుము. నీకిష్టమున్నచో వెళ్ళుము. కాని రాత్రి ఒకసారి వచ్చి నాగురించి కనుగొనుచుండుము" అని సామాన్యుని వలే పలికెడివారు. ఈ పలుకులు వినుచుంటే చాలా చిత్రముగా తమాషాగా ఉంటాయి. **యావత్ ప్రపంచాన్ని కాపుకాచే యోగిపుంగవునికి నిద్రఏమిటి? ఎన్నో జన్మలనుండి ప్రతి భక్తునియొక్క పూర్వ వృత్తాంతము బాగుగా తెలిసిన సాయికి మరియు ఎన్నో జన్మలనుండి సాయికి తన భక్తులకి గల సాంగత్యము తన భక్తులను ప్రతిజన్మలో కాపాడువారు అగు "సాయి మహారాజు" నన్ను కాపాడుము" అని అనుట సాయి యొక్క మాయకాక మరి ఏమిటి ?** ప్రతి జీవి సాయిపై ఆధారపడి ప్రతిక్షణము సాయి ఆశీర్వాదము కోరి తన సంసారమున అడుగువేస్తూ నడిచే జీవుడని బాబా నా గురించి కనుగొనుము" అని అనుటలో విడ్డూరము కాక మరేమిటి ఇదంతా ఆ జగన్నాటక సూత్ర ధారియగు బాబాయొక్క నటన కాక ఇంకేమిటి.

శ్రీసాయి ఒకనాడు ద్వారకామయిలో (మశీదులో) మరియొకనాడు చావడిలో నిద్రించు చుండెడివారు.మసీదు ప్రక్కనే చావడి కలదు. అసలు యోగులు కళ్ళు తెరచి పడుకొనెదరు. వారు మనలాగా కళ్ళు మూసుకొని స్పృహలేకుండా నిద్రపోరు. వారి నిద్ర సమాధిస్థితి కళ్ళు తెరిచే ప్రపంచాన్ని చూస్తూనే, భక్తులయొక్క యోగ క్షేమాన్ని గమనిస్తూనే శయనించెదరు. డిసెంబర్ 10 వ తేదీ 1910వ సం॥ము నుండి చావడిలో భక్తులు వైభవముగా పూజలు జరిపి బాబా చావడిలోనే నిద్రించుచుండెడి వారు. ఆ చావడి యొక్క ఉత్సవము ఇప్పుడు కనుల పండుగగా చూద్దాము. ఈ మహోత్సవమును ప్రతిరోజు మనము నిద్రించుటకు ముందు మన మనస్సులో కళ్ళకు కట్టినట్లుగా సాయిబాబాను చిత్రించుకొని వారు మశీదు నుండి రావడం చావడికి నడవడం చావడిలో నిద్రించటం ఇప్పుడు చెప్పబోయే చావడి ఉత్సవమును పూర్తిగా స్మరించుకొని నిద్రించవలెనని సాయి భక్తులందరికి మనవి.

మశీదులో మొట్టమొదటి బాబా కూర్చొని ఉండెడివారు. అనేక భక్తులు ఆ మశీదులో బాబా ముందు భజన చేసేవారు. మశీదులో రథం సిద్ధముగా ఉండెడిది. మరియు మశీదులోనే కుడివైపున తులసి మాత బృందావనం కలదు. ఈ రథము, తులసీ బృందావనం ముందర బాబా దీని మధ్య భజన జరుగుచుండెను. కొందరు భక్తులు పల్లకీని అలంకరించెడివారు. కొందరు సాయి మహారాజుకి జేజేలు పలికేవారు. మరికొందరు దివిటీ సరిచేయు చుండెడి వారు. మశీదు అంతా రకరకాల పూలమాలలోనే పచ్చని తోరణములతోనే వెలుగుచున్న దీపములతోను అలంకరించెడి వారు బాబాకు ప్రియమైన శ్యామకర్ణ గుర్రము మశీదు బైట బాబారాకకై కనిపెట్టుకొని ఉండెడిది. సాయి భక్తుడు తాత్యాపాటిల్ మరికొందరి భక్తులతో మశీదులోనికి బాబా ముందర వచ్చి బాబా చంకలో చేయివేసి లేవనెత్తేవారు బాబా తనకుడి పాదము బొటన వ్రేలితో ధునిలోని కట్టెలను

ముందుకు త్రోసి కుడి చేతితో మండుచున్న దీపమునార్పి మశీదుకు ప్రక్కనున్న చావడికి బయలుదేరేవారు. బాబా పాదం మశీదునుండి బైటకి వచ్చుచున్నారనే ఆనందముతో అన్ని రకాల వాయిద్యాలు రకరకాల మందుగుండ్ల సామాన్లతో స్వాగతం పలికే వారు. కొందరు ఆడేవారు. మరి కొందరు భక్తితో పాడేవారు. మరికొందరు ఆనందమును తట్టుకోలేక నాట్యము చేసేవారు. జండాలు పట్టుకొని బయలు దేరేవారు. బాబాకి ఇరు ప్రక్కల చామరలతో విసురుచుండేడి వారు. ప్రతి ఇంట ఈరోజు కూడా చావడి ఉత్సవ ఫోటో మనము గమనించే ఉంటాము. బాబాకు ఎడమ చేతిని తాత్యా కుడి చేతిని భక్త మహల్సాపతి మరియు బాబాను శిరస్సుపై  సాహెబ్ జోగ్ ఛత్రమును పట్టుకొనెడివారు. ఈ ప్రకారముగా బాబా చావడికి కదిలెడి వారు. బాబాకు ప్రియమైన శ్యామకర్ణ గుర్రము ముందు నడుచును. చావడి సమీపిస్తుండగా ఆ సాయి నాథుని ముఖమున దివ్య ప్రకాశము వెలిగెడిది. సాయి అటు ఉత్తరము వైపున ముఖమును పెట్టి సాయి అటునుండి ఎవరినో పిలుస్తున్నట్లుగా ప్రవర్తించేవారు. పైగా తన కుడిచేతిని క్రిందికి మీదికి ఆడించెడివారు. కాకా సాహెబ్ దీక్షితో సాయిపై గులాల్ చల్లెడివారు. మహల్సా ఆనందముతో నృత్యము చేసేవారు. ఇంత కల్లోలము జరుగుతున్న వాయిద్య ధ్వనులతో మారుమ్రోగుతున్నా బాణ సంచా మందుల చప్పుళ్ళతో మారు మ్రోగుతున్నా భక్తుల జేజేల అరుపులతో ప్రతిధ్వనించుచున్నా ఆ యోగి రాజు సాయినాధుని యొక్క ధ్యానము మాత్రము చెదరక ఉండేది. తాత్యా బాబాకు ఎడమ ప్రక్కన మహల్సా కుడివైపున సాయి యొక్క సెల్లా అంచును పట్టుకొని నడిచేవారు. ఈ పల్లకి ఉత్సవం చూచుటకు చిన్నా పెద్దలతో సహా ఆకాశము నుండి దేవతలు కూడా చూసి ఆనందముతో పుష్పావానలు కురిపించేవారు. చావడి చేరిన బాబా వద్ద తాత్యా వచ్చి  ఒక ఆసనము వేసి బాలీసు నుంచి బాబాను కూర్చుండబెట్టి ఆ పకీరు తలపై కిరీటము పెట్టి పూలమాలలు వేసి మెడలో నగలు పెట్టి సాయి దివ్యముఖమును కస్తూరి నామమును మధ్య బొట్టు పెట్టి పూజించెడివారు. **ఫకీరు సాయికి సెల్లా అంచు, కిరీటము, పూలమాల, మెడలో నగలు ఇటువంటి ఆడంబర ఆభరణాలతో సంబంధము లేదు. కాని ఆ ఫకీరు సాయికి భక్తులంటే ప్రేమ. వారు కోరుకునే విధంగా ఎటువంటి అభ్యంతరపెట్టక భక్తుల ప్రేమకు లొంగువాడు.** బాపూ సాహెబ్ జోగ్ వెండి పళ్ళెములో బాబా పాదములను కడిగి సాయి చేతులకు గంధం పూసెడివారు. బాబా చావడిలో కూర్చొని యుండగా శ్యామా చిలుమును తయారు చేసి తాత్యాకు ఇచ్చి అతను పీల్చిన తరువాత బాబా కిచ్చి బాబా పీల్చిన తరువాత మహల్సా ఇచ్చెడివారు. పువ్వుల గుత్తులను కూడా బాబా చేతికిచ్చెడివారు. **భక్తుల సంతృప్తి కొరకు సాయి కిష్టము లేక పోయినా ఇష్టపడినట్లు కనిపించేవారు.** బాపూ సాహెబ్ జోగ్ బాబాకి హారతిచ్చే వారు. హారతి అయిన పిదప ఒక్కొక్కరు సాయికి నమస్కరించి తమ ఇండ్లకు వెళ్ళిపోయేవారు. తాత్యా బాబాకు చిలుము అత్తరు పన్నీరు సమర్పించిన పిదప తన ఇంటికి వెళ్ళుటకే ఆజ్ఞను

బాబాను వేడగా సాయి "నన్ను కాపాడుము. రాత్రి ఒక్కసారి వచ్చి నా గురించి కనుగొనుము." అనగా తాత్యా వెళ్ళలేక తన యింటికి వెళ్ళే వారు. సాయి తన పరుపుని తానే అమర్చుకునేవారు. సుమారు 60 దుప్పట్లు ఒక దానిపై ఇంకొకటి వేసి దానిపై నిద్రించేవారు. ఈ చావడి ఉత్సవం బాబా మహాసమాధి చెందిన తరువాత కూడా శిరిడీలో ప్రతిరోజు బాబా ఫోటోను పల్లకిలో పెట్టుకొని బాజా బజంత్రీలతో గాన భజనలతో, ఆటలతో పాటలతో ఆనందముతో నేటికి కూడా మశీదు నుండి పల్లకి బయలుదేరి చావడికి వచ్చి చావడిలో బాబా ఫోటోను సింహాసనముపై పెట్టి వింజామరలు వీచి సాయికి హారతినిచ్చి శయనసేవ నేటికి జరుగుచూనే ఉన్నది. బాబా సజీవముగా లేక పోయినను బాబా ఫోటోరూపమున ప్రతిరోజు మశీదు నుండి బయలుదేరి చావడికి వచ్చి యదావిధముగా నిద్రించుచున్నారు. **యోగులకు జననమరణములు ఉండవు. కావున బాబా మరణించలేదు. నేటికి చావడి ఉత్సవంలో పాల్గొనుచున్నారు.** శిరిడీకి వెళ్ళిన ప్రతి సాయి భక్తుడు ఈ చావడి ఉత్సవంలో పాల్గొని బాబా ఆశీస్సులను పొందవలిసినదిగా కోరుతున్నాము ప్రతిరోజు రాత్రి పడుకునేముందు ఆ చావడి ఉత్సవం జ్ఞప్తికి తెచ్చుకుని బాబాకి నమస్కరించి నిదురించవలెనని ప్రార్ధన.

## 38 వ అధ్యాయము

గత అధ్యాయములో చావడి ఉత్సవము ఎంత కన్నుల పండుగగా ప్రతిరోజు జరుగునో తెలుసుకుంటిమి. ఈ అధ్యాయములో సాయి మాత తన బిడ్డలకు ఏవిధముగా వంటచేసి పెట్టెడివారో తెలుసుకుందాము. ఈ అధ్యాయమున సాయి ఒక తల్లిగా కన్పిస్తారు. సాయి ఒక్కొక్కసారి అందరికి భోజనం పెట్టవలెననుకున్నచో బాబా స్వయముగా వంటకు కావలసిన ఏర్పాటులన్నియు వారే స్వయముగా చూచేవారు. వారే బజారుకు వెళ్ళి వంట సామాన్లు తెచ్చుకునేవారు. స్వయంగా బాబానే బియ్యం పప్పులను విసిరేవారు. ఎవరి సహాయము తీసుకొనక మశీదున పొయ్యి వెలిగించి వంట పాత్రను పెట్టేవారు. బాబా వద్ద రెండు వంట పాత్రలు ఉండేవి. ఒకటి పెద్దది. ఒకేసారిగా వంద మందికి సరిపోవునది. రెండవది 50 మందికి మాత్రము సరిపోవునది. ఒక్కొక్కసారి చక్కెర పొంగలిని ఇంకొక్కసారి మాంసపు పులావ్‌ను వండెడివారు. మసాల వస్తువులన్ని బాబాయే నూరి చాలా రుచిగా చేసేవారు. ఒక్కొక్కసారి పప్పుచారు ఉడకబెట్టి గోధుమ పిండి బిళ్ళలను అందులో

వేసేవారు. అంబలి కూడా వండేవారు. సాయి మాత ఈ విధముగా తన బిడ్డలకోసం వారికి కడుపునిండా అన్నము పెట్టుటకై ఎంతో శ్రమ తీసుకొనేవారు. పొయ్యి పైనున్న పెద్ద వంట పాత్ర మరుగుచున్నప్పుడు బాబా అన్నం ఉడికినదో లేదో చూచుటకై మరుగుచున్న ఆ వంటపాత్రలో తన చేతిని పెట్టి అన్నమును గరిటతో కాకుండా తమ చేతితో కలుపుచుండెడివారు. బాబా మండే ధునిలో ఒకసారి తనచేతిని పెట్టి ఎక్కడో ఉన్న తన భక్తుని బిడ్డను కొలిమిలో పడకుండా ఇక్కడ మశీదున కాలే మంటలో బాబా వారి చేతిని పెట్టి ఆ బిడ్డను రక్షించినారని పూర్వపు అధ్యాయమున తెలుసుకుంటిమి. అటువంటి సాయికి అగ్నిలో చేయిపెడితేనే ఏమీ కానప్పుడు వారు మరుగుచున్న డేగిసాలో అన్నం ఉడికినదో లేదో చూచుటకై తన చేయిని పెట్టి కలిపినచో ఆ పరమాత్మే సాయికి ఏమగును. వంట పూర్తి కాగానే ఆ పాత్రను మశీదుకు తెచ్చి మొదట మహల్సాకు, తాత్యాకు ప్రసాదముగా ఇచ్చి మిగతా దానిని బీదవాళ్ళకు అన్నం పెట్టేవారు. ఆ పరమాత్ముని చేతుల మీదుగా స్వయముగా వారే కష్టపడి ఎవ్వరిపై ఆధారపడక వంటచేసి ఆ వంటను వారే స్వయముగా వడ్డించగా ఆ మహాప్రసాదము తీసుకున్నవారు ఎంత పుణ్యాత్ములో కదా! సాయి శాఖాహార మాంసాహారాలను కలిపి భోజనము పెట్టెడివారు కాదు. శాఖాహారులకు వేరుగా మాంసహారులకు మరియొక వైపుగా వడ్డించేవారు. ఒక్కొక్కసారి బాబా తన శిష్యులను పరీక్షించేవారు. గురువు ఆజ్ఞాపించినది. శిష్యుడు గ్రహించునా లేదా అనే పరీక్ష పెట్టెడివారు. ఒక ఏకాదశి నాడు బ్రాహ్మణుడగు దాదా కేల్కర్‌కు బాబా మాంసము కొనితెమ్మని కొన్ని రూపాయలు ఇచ్చినారు. దాదా కేల్కర్ గురువాజ్ఞానుసారం బజారుకు బయలుదేరెను. దాదా కేల్కర్ తన గురువాజ్ఞ పాటించుటయే శిష్యుని యొక్క కర్తవ్యం అని తెలిసినవాడై యుండుట వలన దాదా కేల్కర్‌ను పోనివ్వకుండా ఆపి సాయి ఆనాడు మాంసము వండుట మానుకొనెను. అలాగే ఒకసారి బాబా మాంసపు పులావ్ వండుచుండిరి. దాదా కేల్కర్‌ను మళ్ళీ పరీక్షించదలచి పొయ్యిమీదున్న పులావ్ ఉడికినదో లేదో చూడమనగా కేల్కర్ పరీక్షించకయే బాగున్నదని చెప్పగా సర్వజ్ఞుడగు బాబా "నీవు కనులతో దానిని చూడలేదు. నాలుకతో రుచిచూడలేదు. మరి

రుచిగా ఉన్నదని ఎట్లు చెప్పితివి" అని బాబా పల్కి మూత తీసి అతని చేతిని పట్టుకొని మరుగుచున్న డేగిసాలో పెట్టెను. సాయి ఇట్లనెను, "నీ చేయిని తీయుము. నీ ఆచారము ప్రక్కకు పెట్టి కొంచెము ప్లేటులో వేసుకొని సరిగ్గా ఉన్నదీ లేనిదీ తెలుసుకొనుము". ఈ విధంగా సాయి తన భక్తులను పరీక్షించేవాడు. శిష్యుడు తన గురువును మనసావాచా కర్మేణా నమ్మకమున్నప్పుడు గురువు చెప్పిన దానిని అక్షరాల పాటించుటయే ఉత్తమ శిష్యుని యొక్క లక్షణము. వారు గురువాజ్ఞను నెరవేర్చుటకై దేనికీ వెనుకాడ కూడదు. సర్వం గురువే అని నమ్మకమున్నప్పుడు జాతి, మత, కుల ఆచారములన్నియు ప్రక్కకు పెట్టి గురువు చెప్పినది అక్షరాల పాటించవలెను. బాబా తన శిష్యులను ఏనాడు చెడుమార్గమున తీసుకొని వెళ్ళరు. ఉదాహరణకు శాఖాహారిని మాంసము తినునట్లుగా ఎన్నడు చేయలేదు. వారు తన శిష్యులు ఎంత వరకు గురువు యొక్క ఆజ్ఞను పాటించెదరో అనే విషయమును గ్రహించుటకై పరీక్షపెట్టెడి వారే కాని ఆ సందర్భములలో శిష్యుడి గురువాజ్ఞను అక్షరాల పాటిస్తున్నప్పుడు వెంటనే బాబా తానే పెట్టిన పరీక్షను విరమించుకునేవారు. ఈ విధముగా సాయి ఒక్కొక్కప్పుడు వారే ద్వారకామాయిలో ద్వారకా మాతగా తన బిడ్డలకు ఆకలి తీర్చుటకై స్వయముగా వంట వండి తల్లి ప్రేమను పంచేవారు. కొద్ది కాలము తరువాత బాబా యొక్క పేరు ప్రతిష్టలు నలుమూలలా వ్యాపించుటచే ఎందరో భక్తులు సాయి దర్శనమునకై వచ్చి రకరకాల ఆహారములను నైవేద్యముగా బాబాకు పెట్టి బీదలకు పంచిపెట్టెడివారు.

బాబా తన భక్తులు ఎవరైనా తమ ఇష్ట దేవతలను అగౌరవ పరిచినప్పుడు బాబా ఊర్కొనక వారిని మందలించేవారు. నానా సాహెబ్ చందోర్కర్ ఒకసారి గోదావరిలో స్నానము చేసి బైటకు వచ్చు చుండగా ఒక ముల్లు తన పాదములో గ్రుచ్చుకొని తనని బాధపెట్టెను. అతని ప్రక్కన తన బంధువు కూడా కలరు వారిరువురి అక్కడి నుండి శిరిడీకి వచ్చి బాబాను దర్శించగా బాబా ఇట్లనెను. "నా సహవాసము ఇన్నాళ్ళు చేసినను ఇట్లేల చేసితివి". అని అనెను. నానా బాబా మాటలు గ్రహించలేకుండెను. తరువాత తన తప్పును తెలుసుకొనెను.

అది ఎలా అనగా తాను సాధారణముగా శిరిడీకి వచ్చేటప్పుడు కోపర్గాంలో దిగి దత్తుని చూసి వచ్చేవాడు. ఈసారి ఆలశ్యమగుటచే దత్తుని దర్శించక నేరుగా శిరిడీకి రావడం వలన బాబా తనను కోపించినారని తన తప్పును ఎరుంగుటకై గోదావరిలో స్నానము చేస్తున్నప్పుడు నానాకు ఒక ముల్లుకూడా గుచ్చుకున్నదని ఎరింగి అది కొంత ప్రాయశ్చిత్తముగా తలంచెను.

బాబా తన పవిత్ర స్వహస్తములలో ఒకసారి శ్రీసాయి సచ్చరిత్ర గ్రంధకర్తయగు హేమాండ్ పంత్‌కు గిన్నెడు మజ్జిగ తాగుటకు ఇచ్చెను. సాయి సంపూర్ణ ఆశీర్వచనము ఆ విధముగా హేమాడ్ పంత్‌కు లభించునదని మనమెల్ల గమనింప తగిన విషయము.

## 39వ అధ్యాయము

ఆ అధ్యాయమున బాబాయే శ్రీకృష్ణపరమాత్ముడని ఋజువగుట చూచెదము. సాధారణముగా అజ్ఞానంతో నిండియున్న జీవునికి దైవానుగ్రహము వలన గురువు లభించునప్పుడు ఆ శిష్యునియొక్క అజ్ఞానమనేడి చీకటిలో గురు కటాక్ష ప్రభావముచే జ్ఞానజ్యోతి వలన ఆ శిష్యుని అజ్ఞానపు చీకటి రోజురోజుకి తరుగుచు వెలుగును చూస్తూ ఉంటారు. గురువు తన శిష్యునికి ఏదీ రహస్యమని తలంచక సర్వం భోదిస్తూ ఉంటారు. కాని శిష్యులు ఒక సమయమున తాను పొందిన జ్ఞానమంతయు తన గురువ వలన అని ఎరింగి కూడా త్రిగుణములకు లోనై ఉండుటచే తన అహంకారముతో తనకు బోధించిన గురువునకు కొన్ని విషయములు తెలియవని తనకీ (శిష్యునికి) తెలుసుననే అహంభావముతో కళ్ళు మూసుకొని ప్రవర్తించెదరు. ఉదాహరణకు మన విషయమే తీసుకొనిన ఏదైన ఒక గొప్ప గ్రంధమును చదువుతున్నప్పుడు గ్రంధకర్త ఇలా రాస్తే బావుంటుంది. లేదా ఒక సంఘటన ఈ విధముగా వివరిస్తే బాగుంటుందని మనకున్న పరిజ్ఞానముతో అహంకారంతో అనుకుంటూ

ఉంటాము. ఇది తప్పు. ఏది మనము మనంతగా చేసేదికాదు. సర్వం దైవము కర్తగా ఉండి నడిపించును. ఏది జరిగినా దైవముయొక్క ఇచ్ఛచే జరిగినదని భావించి మనము నిమిత్త మాత్రులమని తెలుసుకొనవలెను. నా మనవి ఏమనగా హేమాడ్ పంత్ గారు వ్రాసిన సాయి సచ్చరిత్ర ఎంతో అద్భుతమైన గ్రంథము. వారు ఎంతో విపులముగా ఆధ్యాత్మికతతో అందు తత్త్వ జ్ఞానమును బాబా యొక్క లీలలను మన కళ్ళముందు కనిపించునట్లుగా బాబా సంపూర్ణ ఆశీస్సులు పొంది వ్రాసిన గ్రంథమిది. ఆ గ్రంథమును నేను తిరిగి వ్రాయుటకు సంకల్పించటము హేమాడ్ పంత్ గారు రాసిన గ్రంథమును మళ్ళీ మళ్ళీ చదువుట ద్వారా ఆనందాన్ని పొంది ఆ సచ్చరిత్రను నాకు ఏమాత్రము అవగాహన అయ్యిందో అని తెలుసుకొనుటకు రాసినదే గాని హేమాడ్ పంత్ గారు వ్రాసిన గ్రంథాన్ని నాయొక్క మిడి మిడి జ్ఞానముతో సరిదిద్ది వ్రాసినది కాదని ఆ భావన కలలో కూడా లేదని నా మనవి. బాబా యొక్క ఆశీర్వచనము ప్రేరణ సంకల్పము చేత రాసినది. నేను కర్తను కాదు శ్రీసాయి యొక్క ఇచ్ఛాను సారమే జరిగినది. చివరకు గ్రంథము పేరు “అల్పా అచ్ఛాకరేగా” అనే నామము కూడా శ్రీసాయి ప్రసాదించినదే. వారి ఆజ్ఞానుసారమే ఆ పేరు. శిష్యుడు పై విధముగా తాను సర్వం తన గురువునుండి జ్ఞానమును పొందుచున్న వాడైనను తన అహంకారముచే కొన్ని సందర్భములలో తన గురువునకు కొన్ని విషయములు తెలియవని తానే (శిష్యుడు) జ్ఞానియని తలచెదరు. ఒకసారి నానా సాహెబ్ చందోత్కర్ భగవద్గీతలోని శ్లోకాన్ని తన నోటిలో చదువుతో బాబా కాళ్ళను ఒత్తుచుండెను. అతను వేదాంతమును భగవద్గీతను క్షుణ్ణముగా చదువినవాడు. తనకున్న పాండిత్యమునకు గర్వించుచుండెడివాడు. పరశురాముడు, శ్రీరాముడు శివధనస్సును విరచినప్పుడు జనక మహారాజు సభకు పరశురాముడు వచ్చి తమ ప్రగల్భములను తానే పొగడుకొని తన యొక్క బలపరాక్రమములను కోపమును గురించి విశ్వామిత్రునికి ఆ సభలోని వారికి చెప్పమని పరశురాముడు విశ్వామిత్రునికి చెప్పగా లక్ష్మణ కుమారుడు ఇట్లనెను. “ఓ మునీశ్వరా నీ కీర్తిని మీరే పొగడుకొనుచుండగా ఇతరులతో పని ఏమి ? మీ ఘనకార్యముల గూర్చి మీ నోటి ద్వారా అనేక మార్లు

చెప్పితిరి. ఇంకా తృప్తి లేనిచో మరికొన్నిటిని చెప్పమని" లక్ష్మణుడు అనెను. అలాగే నానా సాహెబ్‌కు తనకున్న పాండిత్యమును తానే గర్వించుచు తనకు సంస్కృతము బాగా వచ్చునని అనుకొనుచుండెను. ఇంతలో పసిగట్టిన బాబా నానాను ఏమి గొణుగుకొనుచున్నావని అడిగెను. నానా భగవద్గీతలోని శ్లోకమని బాబాకు చెప్పగా సాయి ఏ శ్లోకమో చదువమనెను. నానా సాహెబ్ భగవద్గీతలోని నాల్గవ అధ్యయము 34వ శ్లోకమును చదివెను.

"తద్విద్ధి ప్రణి పాతేనా పరిప్రశ్నేన సేవయా

ఉపదేక్ష్యంతితే జ్ఞానం జ్ఞానిన స్తత్వ దర్శినః"

సాయి ఆ శ్లోకము యొక్క ప్రతిపదార్థమును చెప్పమనెను. నానా సాహెబ్ యొక్క ఉద్దేశ్యము బాబాకు సంస్కృతము తెలియదని నానా, బాబా ఆజ్ఞ పాటించి ప్రతి పదార్థము చెప్పెను. అధ్యాత్మికచార్యుని అనగా గురువుని ఆ గురువు సన్నిధి సత్యమని తెలుసుకొనుట ప్రయత్నించవలెనని గురువును వినయ పూర్వకముగా ప్రశ్నించి గురువు ద్వారా సత్యాన్ని గ్రహించి ఆ గురువుకి సేవ చేయవలెను. ఆత్మ సాక్షాత్కారము పొందినవారే జ్ఞానాన్ని ఉపదేశించెదరు.

గీతలో ఏమి చెప్పెనంటే అధ్యాత్మికత చాలా కష్టమైనది. శ్రీకృష్ణ పరమాత్ముడు భగవద్గీతలో ఒక గురువుని సమీపింపమని ఐతే ఆ గురువు తన (కృష్ణుని) నుండియో శిష్యపరంపరగా వచ్చిన వారై ఉండవలెనని అర్జునునకుపదేశించెను. భగవంతుడు పరమ గురువు. అటువంటి భగవంతుని నుండి శిష్యపరంపరగా వచ్చిన వారిని శిష్యుడు సంప్రదింపకుండా వేరే అతనిని గురువుగా ఎంచుకొనుచో అతడు అధ్యాత్మికాచార్యుడు కాడు. గురుశిష్య పరంపరలో వచ్చిన గురువు మాత్రమే ఆ పరమ గురువు అయిన పరమాత్ముని సందేశమును తనను నమ్ముకున్న శిష్యునికి ఏమాత్రము రహస్యము లేకుండా ఉన్నది ఉన్నట్లుగా శిష్యునికి బోధించును. కాని

శిష్యుడు అట్టి గురువు వద్ద సత్యమును తెలుసుకొనుటకై ప్రయత్నించి ఆ శిష్యుడు ఆ గురువుకి సంపూర్ణమైన వినయముతో ప్రవర్తించి ఆ గురువు ఎదుట ఎట్టి అహంకారము చూపక గురువుని సేవించవలెను. శిష్యుడు గురువుని ప్రశ్నించవచ్చును. ఐతే ఆ ప్రశ్న ఆధ్యాత్మిక జ్ఞాన ప్రాప్తికి సంబంధించిన ప్రశ్నయై ఉండవలెను. ఆ ప్రశ్న కూడా వినయముతో అడిగి గురువునుండి జవాబుని పొందవలెను. అంతేకాని గురువును ఊరక ప్రశ్నించుట కాదు. లేదా దుర్బుద్ధితో ప్రశ్నించకూడదు. ఈ శ్లోకము యొక్క అర్థము ఇది.

బాబా, నానా ప్రతి పదార్థము చదివిన తర్వాత ప్రణిపాత అనే పదానికి అర్థము చెప్పమనగా నానా ప్రణిపాత అనగా సాష్టాంగ నమస్కారమని చెప్పెను. దానికి బాబా వట్టి సాష్టాంగ నమస్కారము చేసినచో చాలునా అని అనెను. నానా ప్రణిపాత అను పదమునకు మరియొక అర్థము తెలియదనెను. అలాగే సాయి శ్లోకములోని పరిప్రశ్న అనగానేమి అని నానాను అడిగెను. నానా దానికి ప్రశ్నలడుగుట అని జవాబు చెప్పెను. మళ్ళీ బాబా పరిప్రశ్న అను పదములో ప్రశ్న అనగానేమి అని అడిగెను. నానా దానికి ప్రశ్నించుట అని జవాబు చెప్పెను. సాయి వెంటనే పరిప్రశ్న, ప్రశ్న అన్నను రెండు ఒక్కటైనప్పుడు వ్యాసమహర్షి పరి అని ప్రశ్నకు ముందు ఏల ఉపయోగించెను అని నానాను అడుగగా నానా తనకు అర్థము తెలియదనెను. సంస్కృతములో పాండిత్యుడు అని అనుకున్న నానా, బాబా ప్రణిపాత, పరిప్రశ్న అనే రెండు పదముల గురించి నానాను అడుగుగా ఆ రెంటికి జవాబు ఇవ్వలేక పోయెను. తన అహంకారము అణిగెను. బాబాకు సంస్కృతము తెలియదని అతని అభిప్రాయము. బాబా ఆ శ్లోకము యొక్క అంతరార్థమును నానాకు ఈ విధముగా చెప్పెను. జ్ఞానుల ముందు సర్వశ్య శరణాగతి చేయవలెనని సాష్టాంగ నమస్కారము చేసినచో చాలదని బాబా చెప్పెను. గురువుని ఆశ్రయించిన శిష్యుడు సత్యాన్ని తెలుసుకొనుటకు అధ్యాత్మికాభివృద్ధి కొరకు శిష్యుడు గురువుని ఈ రెండు సందర్భములలో ప్రశ్నలు అడుగ వచ్చని కాని ఊరికే గురువుని ప్రశ్నంచి దుర్బుద్ధితో గురువు యొక్క తప్పులను చూపుటకు శిష్యుడు గురువుని ప్రశ్నించరాదని బాబా చెప్పెను. అలాగే గురువుని

మనసావాచా ఏ ఫలాపేక్ష లేకుండా శిష్యుడు తన శరీరము గురుసేవకై ఉన్నదని భావించి గురువునకు సేవచేయువలెనని శిష్యుడు తనకున్న శరీరము తనది కాదని ఆ శరీరము తను నమ్ముకున్న గురువు గారిదేనని తలంచి గురువును సేవించవలెను. అంతేకాని సేవ చేయుట అనగా మనకు ఇష్టం ఉన్నప్పుడు సేవచేయుట, లేనిచో మానుట అనునది కాదు. మరియు బాబా జ్ఞానమనేది మానవుని అజ్ఞానము ఎప్పుడైతే నశించునో ఉన్నదే జ్ఞానమని అజ్ఞానమును నశింప చేయుటయే జ్ఞానమని చెప్పెను. ద్వైతమును నశింపచేయుట అద్వైతము. చీకటిని తరుముటయే వెలుతురు. అలాగే జ్ఞానమనగా అజ్ఞానమును నశింప చేయునది. బాబా అజ్ఞాన లక్షణములు కూడా నానాకు చెప్పెను. అజ్ఞాని నేను జీవినని, శరీరమని దేవుడను కాను అని, భగవంతుడు, ప్రపంచము, జీవుడు ఈ మూడింటిని వేరుగా చూచుట ఈ విధమైన లక్షణములు కలిగియున్నవాడు అజ్ఞాని. ఈ విధముగా బాబా నానాసాహెబ్ చందోత్కర్‌కు భగవద్గీతలోని శ్లోకానికి అర్థమును విశదీకరించి చెప్పిరి. బాబాకు సంస్కృతమే కాదు. అన్ని బాషలు తెలుసును. వారు సాక్షాత్తు పరమాత్మ. వారు సృష్టించనిది ఏదీలేదు. ఈ ప్రపంచమున సర్వం వారే నిబిడీ కృతమైయున్నారు. ఏ బాషయైన కర్తవారే. వారికి తెలియక పోవుట అనునది ఏదీ లేదు. ఈ విధముగా శ్రీకృష్ణ పరమాత్ముడు గీతలో అర్జునునికి శ్లోకములను భోదించిన రీతిగా మశీదున సాయి క్రిష్ణ పరమాత్ముడు తన భక్తుడగు నానాసాహెబ్‌కు భగవద్గీతలోని శ్లోకాన్ని బోధించి బాబాయే మురళీధరుడని ఋజువు చేసెను.

బాబాయే మురళీధరుడని అనుటకు మరో నిదర్శనము. ఒకసారి బాబా తన భక్తుడగు బాపూ సాహెబ్ బూటీ మరియు శ్యామాకు ఒకేరోజు ఒకే సమయమున స్వప్నములో కనబడి ఒక వాడను మందిరముతో సహా నిర్మించమని చెప్పెను. ఆ ఇరువురు నిద్రనుండి మేల్కొని వారిద్దరికి దివ్య స్వప్నములు ఒక్కటని గ్రహించి ఆనందముతో ఆ సంఘటనను చర్చించుకొని బూటీ ధనవంతుడగుటచే వాడను మందిరముతో సహా నిర్మించుటకు సంసిద్ధుడయ్యెను. శ్యామా దానికి ఒక ప్లాను గీసి బాబా ఆజ్ఞను పొంది కార్యమును సకాలములోని పూర్తి

చేసిరి. బాపూ సాహెబ్ బూటీకు ఒక ఆలోచన కలిగి చుట్టుతా గదులుండి మధ్యలో ఒక పెద్ద హాలులో మురళీధరుణి విగ్రహమును ప్రతిష్ట చేయవలెననుకొనెను. బాబాకీ సంగతి చెప్పగనే బాబా ఇట్లు చెప్పెను. “దేవాలయము పూర్తి కాగానే నేనే అచ్చట నివశించుటకు వచ్చెదను. మన మందరము అచ్చట ఉందుము. కలసి మెలసి ఆడుకొందుము” అని బాబా పలికెను. శ్రీకృష్ణుని విగ్రహము తయారయ్యెను. ఇంతలోనే బాబాకు జ్వరము వచ్చి తన శరీరమును విడుచుటకు సిద్దముగా ఉండెను. బూటీ నిరాశ చెందెను. బాబా తనవాడాలో పాదం మోపలేదని ఇంతలోనే విడిచిపోవుదురని ఆందోళన చెందుచుండగా సాయి సమాధి చెందకముందు ఇట్లు పలికెను. “నన్ను రాతి వాడలో నుంచుము” సాయి మహా సమాధి చెందిన తరువాత వారి పవిత్ర శరీరమును బూటీ కట్టిన వాడలోనే కృష్ణుని ప్రతిమ ప్రతిష్ట చేయవలెనని అనుకొన్న చోటున పెట్టి సమాధి చేసిరి. బాబాయే మురళీధరుడని మళ్ళీ ఋజువైనది.

## 40 వ అధ్యాయము

ఈ అధ్యాయములో బాబా తనను నమ్ముకున్న భక్తులకోసం ఏ రూపకమునైనా తప్పక వెళ్ళి వారిని ఆశీర్వదించెనని  అనుదానిని గూర్చి చెప్పబడినది. సాయి పరమాత్ముణ్ణి పూజించే ప్రతి భక్తుడు సాయిపై సంపూర్ణ నమ్మకమును ఉంచి బాబాను తనఇంటికి రావలెనని అనుకున్న సాయి తన భక్తుల కోసం తప్పకుండా వారి యింటికి వెళ్ళెదరు. ఏవైనా ఒక శుభకార్యము యింటిలో జరుగుతున్నప్పుడు బాబాను ఆహ్వానించి చూడండి బాబా తప్పకుండా ఏదో ఒక రూపమునైనా  చివరికి ఒక ఫోటో రూపమునైనా ఇంటికి విచ్చేసి ఆశీర్వదించును. సాయి ఇట్లు చెప్పెను. “నన్నే గుర్తుంచుకొనువారిని నేను మరువను. నాకు బండి కాని టంగా కాని రైలు కాని విమానము కాని అవసరము లేదు. నన్ను ప్రేమతో పిలుచు వారి వద్దకు పరిగెత్తి పోయి

ప్రత్యక్షమయ్యెదను". దీనిని బట్టి భక్తుడు ఎంత ప్రేమగా తలచి ఆర్తితో పిలచినచో బాబా తనను ఆహ్వానించిన భక్తుని యింట టాంగా, రైలు, విమాన వేగము కంటి ముందుగా తన భక్తుని యింట ప్రత్యక్షమయ్యెదరు.

బి.వి. దేవ్ గారి యొక్క తల్లి నోములు చేసి ఉధ్యాపనకై బ్రాహ్మణులకు భోజనం పెట్టదలచిరి. ఈ విషయం శిరిడీలోని బాపూ సాహెబ్ జోగ్‌కి ఉత్తరము వ్రాసి బాబాను ఆ శుభకార్యమునకు తప్పక రావలసినదిగా వ్రాసెను. జోగ్ మసీదులో బాబా ముందు ఉత్తరము చదువగా బాబా "నన్నే గుర్తుంచుకొను వారిని నేను మరువను. నాకు బండి, టాంగా, రైలు, విమానములు కాని అవసరము లేదు. నన్ను ప్రేమతో పిలుచు వారి వద్దకు నేను పరుగెత్తి పోయి ప్రత్యక్షమయ్యెదను. అతనికి జవాబు వ్రాయుము. నీవు, నేను, ఇంకొకరు సంతర్పణకు వచ్చెద"మని బాబా పలికెను. బాబా ఆజ్ఞప్రకారము జోగ్ ఉత్తరము వ్రాసెను.

ఉధ్యాపనకు కొన్ని రోజులు ముందుగా ఒక సన్యాసి దహన్‌లో నున్న బి.వి. దేవ్ గారిని కలిసి చందాల వసూలు కోరెను. దేవ్ గారు అదే వూరిలో మరొకరు వేరే చందా వసూలు చేయుట వలన రెండూ లేక నాలుగు మాసముల తరువాత బి.విదేవ్ గారు ఆ సన్యాసిని రమ్మనెను. ఆ సన్యాసి వెళ్ళిపోయెను. ఇది జరిగిన నెల తర్వత సరిగ్గా బి.వి. దేవ్ గారి ఇంట సంతప్పణ జరుగుతున్న రోజున అదే సన్యాసి దేవ్ గారింటికి వచ్చెను. ఉధ్యాపన పనులలో నున్న దేవ్‌గారు ఆ సన్యాసిని చూసి చందాలకు వచ్చెరని అనుకొనిరి. ఆ సన్యాసి తాను చందాలకు రాలేదని భోజనము చేసి వెళ్ళుటకువచ్చితినని చెప్పితిరి. బి.వి. దేవ్ గారు ఆ మాటలు విని సంతసించిరి. సన్యాసి తనతో పాటు మరో ఇద్దరు కుర్రవాళ్ళు ఉన్నారని చెప్పగా దేవ్‌గారు ఇంకా సమయము ఉన్నది కనుక వారి కొరకు ఎచ్చుటకు పంపెవలెనని అడుగగా ఆ సన్యాసి ఎవ్వరిని పంపనవసరము లేదని, వారే స్వయముగా వచ్చెదరని చెప్పిరి. దేవ్‌గారు సరిగ్గా 12 గంటలకు రమ్మని చెప్పెను. ఆ సన్యాసి మరో ఇద్దరితో సరిగ్గా 12 గంటలకు వచ్చి సంతర్పణలో భోజనము చేసి వెళ్ళి పోయిరి. ఉధ్యాపన పూర్తి కాగానే దేవ్ గారు శిరిడీలోని జోగ్ కు ఉత్తరం వ్రాసెను. అందులో బాబా ఇచ్చిన మాట తప్పెనని వ్రాసెను. జోగ్ బాబా

ముందుఆ ఉత్తరము తెచ్చి తెరువబోవు చుండగా బాబా ఇట్లనెను. “వాగ్ధానము చేసి దగా చేసితిననుచున్నాడు. సంతర్పణకు నేను మరిఇద్దరిలో సహా హాజరైతిని. కాని నన్ను పోల్చుకొనలేక పోయెను అట్టి వాడు నన్ను పిలువనేల? అతని సంశయము తొలగుటకై మరి ఇద్దరితో వచ్చితిని. నా మాట నిలబెట్టుకొనుటకు ప్రాణములైనా విడిచెదను. నా మాటలను ఎప్పుడు పొల్లు చేయును”. అని బాబా జోగ్ ముందర పలుకగా అక్కడ జరిగిన సంఘటన అంతయు జోగ్ తిరిగి బి.వి. దేవ్ గారికి జవాబు వ్రాయగా దేవ్ గారు బాబా పలికిన పలుకులు విని పశ్చాత్తాపడి తానెట్లుమోసపోయెనో అని బాధపడిరి. పరమాత్ముని మాయ ఈ విధముగానే అంతు పట్టనివ్వగా నుండును. భక్తుడగు దేవ్‌గారు బాబాను తన కార్యమునకు ఆహ్వానించినప్పుడు బాబా తాను వచ్చెదనని మొదట జవాబు వ్రాసెను. ఆ జవాబులోనే సాయి మరి ఇద్దరితో పాటు వచ్చెదనని వ్రాసెను. సరిగ్గా ఉధ్యాపన రోజున ఒక సన్యాసి రూపమున బాబా తన భక్తుడగు దేవ్ గారింట వెళ్ళి తాను చందాళకు రాలేదని భోజనానికి వచ్చినానని సూచన ఇచ్చెను. భక్తుడు బాబాను భోజనానికి రమ్మని ఆహ్వానించినాడు. కాని పరమాత్ముని మాయచే గుర్తించలేక పోయినారు. బాబా అంతటి తో ఆగక సరిగ్గా 12 గంటలకి మరి ఇద్దరితో సహా వచ్చి భోజనము చేసి వెళ్ళెదనని ఆ సన్యాసి రూపములో ఉన్న బాబా మాట ఇచ్చి సరిగ్గా 12 గంటలకు ముగ్గురు వచ్చి భోజనము చేసి వెళ్ళిపోయిరి. సాయి దేవ గారికి రాసిన జవాబులో కూడా ముగ్గురు సంతర్పణకు వచ్చెదమని వ్రాసిరి. ఈ సూచన ప్రకారము కూడా బి.వు. దేవ్ గారు బాబాను పోల్చుకొనలేక పోయెను. భగవంతుని లీల మాయా విలాసము ఎంతో చిత్రముగా ఊహించని విధముగా ఉండును. దేవ్ గారికి నిజం తెలిసిన తరువాత తాను ఎలా మోసపోయెనో అని యోచించి ఎంతో బాధపడెను. **మన నిత్య జీవితంలో కూడా బాబాను సంపూర్ణముగా నమ్ముకున్న భక్తులకు బాబా ఏదో రూపేణా ధర్శనము ఇచ్చే ఉంటారు.మనము కూడా పోల్చుకోలేక మోసపోయే ఉంటాము. పైగా ఇంకా బాబా మనల్ని కరుణించలేదని నిందారోపణ వేస్తూ ఉంటాము. కావున ఇటువంటి మాయనుంటి తప్పించుకొనుటకై మనమెంతో జాగృతతో ఉండి శ్రీసాయిని**

**పూజిస్తూ మన యింట జరిగే ఏ కార్యముకైనను బాబాను ఒక్కసారి మనసున తలచి ఆహ్వానించిన బాబా ఏదో రూపేణా రాగలడని నమ్మి ఆ వచ్చిన రూపాన్ని మనము గుర్తించేటట్లు శ్రీసాయిని మనకా శక్తిని ప్రసాదించమని వేడుకోని సాయి రాకకై వేచి ఉందాం.**

బాబా ఫోటో రూపమున వచ్చి భక్తుని కోరిక నెరవేర్చును. అది ఏల అనగా హోలీ పండుగనాడు హేమాడ్ పంత్‌కు ఒక దృశ్యము వచ్చెను. అందు బాబా ఒక సన్యాసి వలే కన్పించి ఆనాడు వారింట భోజనమునకు వచ్చెదనని చెప్పెను. "హేమాడ్‌పంత్ వెంటనే మేల్కొని తన భార్యకు జరిగిన దంతా చెప్పెను. ఆ రోజు మధ్యాహ్నం భోజన ప్రయత్నములు చేసిరి. హోమాడ్ పంత్ వారి ఇంటిల్లి పాది బంధువులతో సహా రెండు పంక్తులలో కూర్చుండిరి. బాబాకోసం ఆరెండింటి మధ్య ఒక పీట అమర్చిరి. సరిగ్గా 12 గంటలయినది. భోజనము ప్రారంబించుచుండగా ఎవరో తలుపు తట్టిరి. హేమాడ్ పంత్ తలుపు తీయగా అలీఅహమ్మద్, మౌలానా ఇస్మ ముజాఫర్ అను ఇద్దరు వ్యక్తులు వచ్చి ఒక పెద్ద పటము తెచ్చి దానిపై కప్పియున్న వార్తా పత్రికను విప్పి ఇచ్చిరి. ఆ పటము సాయిబాబా గారిది. హేమాడ్ పంత్ కళ్ళ నుండి నీరు కారినది. వారిరువురు ఆ పటము యొక్క వివరాలను తరువాత చెప్పెదమని చెప్పి హేమాడ్ పంత్ భోజనమునకు వెళ్ళమని వారిరువురు వెడలి పోయిరి. హేమాడ్ పంత్ బాబా కొరకు వేసిన పీటపై ఆ బాబా ఫోటోను పెట్టి వండిన పదార్ధములన్ని వడ్డించి నైవేధ్యము చూపి అందరూ భోజనములు చేసిరి. బాబా స్వప్నములో చెప్పిన మాటలను స్వయముగా వారే రాకపోయినను ఒక ఫోటో రూపము వలన తన భక్తుని యింట హోలీ పండుగ పర్వదినమున వచ్చి ఆశీనులై వారితో సహా భోజనము చేసిరి అనే సత్యాన్ని గ్రహించ వలెను. మనమందరము కూడా బాబాను అను నిత్యము నిస్వార్ధముతో పూజిస్తూ బాబా ఏదో ఒకనాడు లేదా ఒక పండగ పర్వ దినము నాడు మన యింట కూడా ఫోటో రూపమున వచ్చి మనతో పాటు భోజనము చేయవచ్చు. కొందరి నిజభక్తులకు ఇటువంటి అనుభవము కలిగే ఉండవచ్చును. కావున ముఖ్యమైన రోజులో **మనకు అనుకోకుండా శిరిడీనుండి పోస్ట్**

**ద్వారానో లేదా ఒక మనిషి ద్వారానో బాబా ప్రసాదమో లేదా ఫోటోనో లేదా బాబా సచ్చరిత్ర ఇలా వచ్చినచో మనల అటువంటి విషయములను తక్కువగా భావించక శ్రీసాయి నాథుడే స్వయముగా మన తింటికి వచ్చారని తలంచవలెను. ఇటువంటి అవకాశము వచ్చినవారి జన్మ ధన్యము, వారెంతో పుణ్యాత్ములు. శ్రీ సాయి సంపూర్ణ అనుగ్రహము కలిగి ఉంటేనే ఇటువంటి నిధర్శనములు. మన నిత్య జీవితంలో జరుగును.**

## 41 వ అధ్యాయము

గత అధ్యాములో బాబా ఒక పెద్ద ఫోటో రూపమున తన భక్తుడగు హేమాడ్ పంత్ ఇంటికి అలీ మహమ్మద్ మరియు ఇస్మ ముజాఫర్ ద్వారా హోలీ పండుగ రోజున వచ్చెనని తెలుసుకొంటిమి. ఈ అధ్యాయములో ఆ ఫోటోను హేమాడ్ పంత్‌కు ఇచ్చుటకు గల కారణము తెలుసుకుందాం. ఒకసారి బొంబాయిలో సాయిబాబా పటమును ఆలీ మహమ్మద్ కొనెను. దానిని ఫ్రేమ్ కట్టించి బాంద్రా ఇంటిలో గోడకు తగిలించెను. ఈ బాబా ఫోటో **హే**మాండ్ పంత్ ఇంటికి రానున్న 3 నెలల ముందు ఈ అలీ అహమ్మద్ కు కాలుమీద కురుపుతో బాధపడుచుండెను. అతడు బొంబాయిలో తన భావమరిది నూర్ అహమ్మదు పీల్ బాయ్ ఇంటిలో బస చేసెను. 3 మాసములు తన బావమరిదింటిన ఉండుటచే బాంద్రాలో తన ఇల్లు మూయబడి వుండెను. తన ఇంటిలో బాబా ఫోటో పాటు మరెన్నో గొప్ప యోగుల పటములు కూడా కలవు. అలీ మహమ్మద్ యోగి యగు అబ్దుల్ రహమాన్ బాబా చిన్న పటమును తన బావ మరిదికి చాలా ఏళ్ళ క్రితం ఇచ్చెను. ఒక నాడు అతడు దానిని చూచి పెద్దదిగా చేయించి దాని కాఫీలను బంధువులందరికి ఇచ్చి ఒక్కటి అలీ మహమ్మద్‌కు కూడా ఇచ్చెను. ఆ ఫోటో కూడా బాంద్రాలో తన ఇంటిలో పెట్టెను. తన బావమరిది నూర్ అహమ్మద్ యోగి యగు అబ్దుల్ రెహమాన్ గారి శిష్యుడు. ఒక సారి అబ్దుల్ రహమన్ గారు దర్బారులో ఉన్నప్పుడు నూర్

మహమ్మద్ గురువు గారికి ఈ పెద్ద ఫోటోను కానుకగా ఇవ్వగా ఆ యోగికి కోపము వచ్చి తన శిష్యుడగు నూర్ మహమ్మద్ అచ్చటినుండి తరిమివేసెను. గురువుగారి అయిష్టతను గమనించిన నూర్ ముహమ్మద్ సముద్రములో ఆ పెద్ద చిత్ర పటమును ముంచి వేసెను. వాని బంధువుల వద్దనుండి స్నేహితుల వద్దనుండి పటములను తెప్పించి మరీ బాంద్రా సముద్రములో ముంచివేసెను. ఆ గొడవ జరుగు సమయమున అలీ మహమ్మద్ తన బావ మరిది నూర్ మహమ్మద్ ఇంటిలోనే ఉండెను. తన బావమరది అలీ మహమ్మద్ తో యోగులు పటములను సముద్రములో ముంచిన తన కాలుమీద కురుపు బాద నివారణమగునని నూర్‌మహమ్మద్ అలీ అహమ్మద్‌తో చెప్పి తన మేనేజరును బాంద్రా యింటికి పంపి అక్కడున్న యోగుల పటములన్నిటిని సముద్రములో ముంచివేయించెను. అలీ అహమ్మద్ తన ఇంటికి రెండు మాసముల తరువాత తిరిగి రాగా బాబా పటము ఎప్పటి వలె గోడమీద ఉండెను. ఈ అధ్భుత సంఘటన ఊహించరానిది. ఎందరో యోగుల పటములు ఇదివరకు బాంద్రా ఇంటిలో ఉన్న వన్నీ సముద్రపాలైనప్పుడు యోగిరాజగు సాయినాథుని పటము యదావిధముగా తన మింటిలో గోడపై ఉండెను. పటములకు జనన మరణములున్నట్లు ఉండెను. కాని సాయినాథుని పటము కాలచక్రమునే తప్పించుకొనెను. బాబా కాలతీతుడు. అలీ అహమ్మద్ ఆ పటమును ఇంకా ఇక్కడ ఉంచిన తన బావ మరిది ఆ పటమును పాడుచేయుననే ఉద్దేశ్యముతో అలీ అహమ్మద్ ఆ బాబా పటమును హేమాడ్ పంత్‌కు హోళీపర్వదినమున తెచ్చి యిచ్చెను. అది బాబా నిర్ణయించిన సమయము. ఎందుకంటే బాబా హేమాడ్‌పంత్‌కు స్వప్న ధర్శనమిచ్చి ఆ రోజు (హోలీ) తన ఇంటికి వచ్చుచున్నాడని ముందుగానే చెప్పెను. ఈ ఫోటోరూపమున బాబా సరియైన సమయమున తన భక్తుని యింటకు వచ్చెను. మనమేదైనా ఒక గ్రంథము చదువుతున్నప్పుడు ఒక్కొక్కసారి ఆ గ్రంథము బోదపడదు. అటువంటి సమయాలలో మనము నమ్ముకున్న గురువగారి ద్వారానో ఆ గ్రంథమును చదువుటకు ఆజ్ఞ తీసుకొని చదివినచో బాగా అర్థమౌతుందని భావించి అట్లు చేయుదుము. బాబా మహా సమాధి చెందక ముందు ఇటువంటి సంకల్పములు

తలచి బాబా ఆజ్ఞను తీసుకొని గ్రంథములు చదువున వారెందరో కలరు. మరి మహాసమాధి చెందిన తరువాత ఇటువంటి కార్యములు చేయవలెనన్న మరి ఎలా? దీనికి ఒకటే జవాబు. బాబా ఇట్లనెను. **"చదువునప్పుడు నీవు తొందర పడుచున్నావు. నా ముందర చదువుము. నా సమక్షమున చదువుము"** అని అన్నారు. బాబా సజీవముగా లేరని భావములను తుడిచి వేసి బాబా మన ఇంటిలోనే మన ప్రక్కనే కూర్చొని ఉన్నాడని దృఢ నమ్మకముతో గ్రంథము చదువుట ప్రారంబించిన అది ఎంతటి కష్టమైనను సులువుగా అర్థమగును. **అలాగే ఏ ప్రశ్నకైనను సమాధానము ఇచ్చుటకు బాబా స్వయముగా తాము సిద్దముగా ఉన్నారని ఎరింగి ఇతరుల నెవ్వరిని అడుగకుండా ఏ చిన్న ప్రశ్ననైనను, ఎటువంటి బాధనైనను చివరికి సంతోషమైనను బాబాకే సర్వం తెలుపుకొనవలెను. ఇంకెవ్వరిని ఏ ప్రశ్నలు అడిగినా బాధలను చెప్పినా అతి నిష్ప్రయోజనమే.** ఉదాహరణకు బి.వి. దేవ్‌గారు జ్ఞానేశ్వరి భగవద్గీతను చదువవలెనని వారి కాంక్ష. ఇతర గ్రంథములు పారాయణము చేయుచుండెను కాని జ్ఞానేశ్వరి విషయమున అడ్డులు వచ్చుచునిడెను. పారాయనము కొనసాగుకుండెను. అతను శిరిడీకి వచ్చెను. బాబా తనకు ఆ జ్ఞానేశ్వరి యందు శ్రద్దను కల్గించి నపుడే పారాయణం మొదలు పెడతానని అనుకొనెను. సాయి భక్తుడగు జోగ్ ఒక పుస్తకమునిచ్చి (జ్ఞనేశ్వరి) బాబా చేత ఆశీర్వాదం పుచ్చుకొని చదువమని దేవ్ గారికి సలహానిచ్చెను. కాని బాబాకు తన ఉద్దేశ్యము తెలియును. కనుక తానట్లు చేయునని దేవ్ చెప్పెను. దేవ్ బాబాను ధరిశ్శించెను. బాబా 20రూ॥ దక్షిణ అడుగెను. దేవ్ చెల్లించెను. దేవ్ గారు బాలకరాముడని వానిని కలిసి అతనికి బాబాపై గల భక్తిని వారి అనుగ్రహమును ఏ విధముగా సంపాదించెనో అని అడుగగా మరునాడు దాని వివరణ చెప్పెదనని బాలక రాముడు చెప్పెను. దేవ్ బాబా మరునాడు మళ్ళీ ధర్శించెను. మళ్ళీ బాబా 20రూ॥లు దక్షిణ అడుగగా చెల్లించెను. మళ్ళీ దేవ్‌గారు బాలక రాముని అడిగిన ప్రశ్ననే మళ్ళీ అడిగెను. అతను జవాబు చెప్పేలోగా మశీదులో నుంచి దేవ్ గారికి కబురు వచ్చెను. అతను బాబా దగ్గరకు పోగా బాబా 25రూ॥లు దక్షిణ అడిగెను. అతను చెల్లించెను. ఒక్కసారిగా బాబా ఇట్లనెను. "నా

గుడ్డ పేలికలను నాకు తెలియకుండా దొంగిలించితివేల"? అనగా దేవ్‌గారు ఆ విషయమేమి తెలియదనెను. మళ్ళీ బాబా కోపగించి ఇట్లనెను. ఇక్కడ ఇంకెవ్వరూలేరు. నీ ఒక్కడివే దొంగవు. దొంగిలించుటకు వచ్చితివా అని బాబా పిచ్చ వానివలే దేవ్‌ను తిట్టుట ప్రారంబించెను. అతను వెళ్ళి పోయెను. అదే సాయంత్రం బాబా దేవ్ గారికి మళ్లీ కబురు పెట్టెను. బాబా దర్శనమునకై రాగా బాబా మళ్ళీ 12 రూ॥లు దక్షిణ అడిగెను. దేవ్‌గారు చెల్లించెను. అప్పుడు బాబా ప్రతి రోజు జ్ఞానేశ్వరి చదువుము. నేను నీకు జల్తారుసెల్ల ఇచ్చుటకు ఇచ్చట కూర్చొని యున్నాను. ఇతరుల వద్దకు పోయి దొంగిలించదవేల? బాబా ఈ విచిత్ర సంఘటనలో చాలా ముఖ్యమైన విషయమును తెలియపరిచెను. అది ప్రతీ సాధకునికి వర్తించును. ఈ సంఘటనను ఎల్ల వేళలా ఎంత కష్ట పరిస్థితిలో నప్పటికి జ్ఞప్తియందుంచుకొన్నచో మన సమస్యకు పరిష్కారం బాబాయే తీర్చును. దేవ్ గారి కోరిక ప్రకారం ప్రతిరోజు జ్ఞానేశ్వరి చదువుము అని బాబా నోటి వెంట వచ్చి బాబా ఆశీస్సులు పొందినాడు. రెండవది ముఖ్యమైనది. బాబా ఇట్లు పలికెను. "నేను నీకు జల్తారు సెల్లా ఇచ్చుటకు ఇచ్చట కూర్చొని యున్నాను. ఇతరుల వద్దకు పోయి దొంగలించుదువేల"? అనే బాబా పలుకులలో ఎంతో గుడార్ధము దాగియున్నది. నా గుడ్డ పేలికలు నాకు తెలియకుండా దొంగిలించి వేల అనే బాబా తిట్లల్లో బాబాను గురించి ఎవరివద్దనుండి కనుక్కొని తెలుసుకొనకూడదని బాబా ఉద్ధేశ్యము. ఇక్కడ దేవ్‌గారు బాలకరాముని కలిసి అతడు బాబా యందు భక్తుని వారి అనుగ్రహమును ఎట్లు సంపాదించెనని ప్రశ్నించుటయే తప్పు. బాలక రాముని ప్రశ్నించుటయే గుడ్డపేలికలు దొంగలించుట. ఎందుకంటే బాబా స్వయముగా వారే సిద్దముగా ఉన్నారు. జల్తారు సెల్లా నిచ్చుటకు. కనుక మనము ఇతరుల వద్దకు పోయి దొంగ తనమునకు అలవాటు పడరాదు. **ఎవ్వరికైనను ఎప్పుడైనను ఏ ప్రశ్న ఎదురైనా క్లిష్ట పరిస్థితులు వచ్చినా వాటిని పరిష్కరించుట ఇతరుల నెవ్వరిని అడుగక ఆ ప్రశ్నకు సమాధానము ఇచ్చుటక బాబా సిద్దముగా ఉన్నారని గ్రహించవలెను.** బాబాయే స్వయముగా చెప్పారు. తాను సమాధి చెందినప్పటికి తన మనాధియే సమాధాన మిచ్చును. అంత

గట్టి విశ్వాసముతో ప్రమాణముగా చేసి చెప్పినటువంటి బాబా మాటలు సర్వజనులు సర్వ వేళలా జ్ఞప్తియందుంచుకొని ఎటువంటి కష్టమైనను, ప్రశ్నయైనను బాబానే అడుగవలెను. సర్వ బాబాకే వదిలి వేయ వలెను. ఇంకెవ్వరికి చెప్పినను అది నిష్ప్ర యోజనమే. ఈ సంగతి మరీ మరీ గుర్తునిచుకొని సాధకుడు సాయిని సంపూర్ణముగా నమ్ముకొని ముందుకు సాగవలెను.

దేవ్ గారికి పై సంగటన జరిగిన కొన్నాళ్ళకు ఒక గురువారం బాబా స్వప్న ధర్శనమిచ్చి జ్ఞానేశ్వరి బోధపడుచున్నదా అని కనుగొనెను. దానికి దేవ్‌గారు లేదనగా బాబా మరొక ముఖ్యమైన విషయమును బోధించెను. “చదువు తున్నప్పుడు నీవు తొందరపడుచున్నావు. నా ముందర చదువుము. నా సమక్షమున చదువుము అని పలికి అదృశ్యమయ్యెను. బాబా చెప్పినది ఒక్క దేవ్ గారికి కాదు. సాధకులందరికి అది వర్తించును. బాబా ఉన్నారు. ఎల్లప్పుడు ఉంటారు. మన ప్రక్కనే ఉంటారు. కావున సాధకుడు గ్రంథములు చదువుచున్నప్పుడు పూజ చేయునపుడు, ధ్యానము చేయుచున్నప్పుడు హారతి చేయుచున్నప్పుడు బాబా తన సమక్షములోను ఉన్నారని, మన ప్రక్కనే ఉన్నారని భావించినచో సాధకుడు చేసే ప్రతికార్యమును బాబా స్వీకరించి ఆశీస్సులనిచ్చును.

## 42వ అధ్యాయము

ఈ అధ్యాయములో బాబా తన భౌతిక శరీరమును ఏ విధముగా వదిలెనో తెలుపబడినది. ఈ అధ్యాయము చదివిన బాబా భక్తులు ఎంతో బాధ పడెదరు, గల కారణం బాబా తన దేహాన్ని వదిలివేసి వెళ్ళిపోయారని యోగులు ఒక కార్యమును నెరవేర్చుటకై భువిపైకి దిగి ఆ కార్యము నెరవేరిన తరువాత వారు వెళ్ళిపోయెదరు. బాబా ఒక శరీరాన్ని ధరించి మనలాగానే దేహము వదలి వెళ్ళిపోయారనే భావన ఉన్న వాళ్లకి బాధ తప్పదు.

ఎందుకంటే బాబాని వారు ఒక మానవ రూపముగా చూస్తూ మానవునిలాగా భావిస్తూ వున్నారు. ఒక శరీరులు అనే ఉద్దేశ్యంతో ఉన్నవారికి మరియు బాబా మనకి మల్లే వారు, తన చివరి దశలో జ్వరము తగిలి అనారోగ్యముతో పోయినారు కాబట్టి వారు కూడా సామాన్య మానవుడనే భావన కలిగిన వాళ్ళు అటువంటి వాళ్లకు దుఃఖము తప్పదు. బాబా మరణించినారని బాధతో ఉండెదరు. నిజానికి బాబా ఆశరీరులు. వారు నిర్గుణ స్వరూపమగు పరమాత్మయే  వారు. లోక కళ్యాణమునకై శరీరమును దాల్చి కొన్ని మంచి కార్యములు చేయుటకై సగుణ స్వరూపులై భువిపైన అవతరించిన పరమాత్మయే  వారి జన్మ వృత్తాంతము. ఎవ్వరికీ తెలియదు. ఎప్పుడు ఎక్కడ పుట్టారో తెలియదు. కులమతములు లేవు. ఒక్క సారిగా శిరిడీలో ప్రత్యక్షమయ్యారు. ఫకీరుగా కనపడి వైద్యుడిగా తన లీలలతో అనేక రోగాలను నివారించి చివరికి శిరిడీలోని ప్రజలందరు  మొదట పిచ్చి ఫకీరు అన్నవాళ్ళు తరువాత హకీమ్ (వైద్యుడు) గను బాబా లీలలను చూచిన తరువాత ఆ ప్రజలే బాబాయే భగవంతుడని నిర్ధారించిరి. మళ్ళీసాయి తన మాయను కప్పి వారికి చివరి దశలో జ్వరము తగిలి తన దేహాన్ని ఒక సామాన్య మానవుడి మరణము చెందినట్లుగా వదిలేశారు. శిరిడీ జనులనే కాక యావత్ ప్రపంచాన్నే దుఃఖ సముద్రములో ముంచేశారు. నిజానికి జన్మమే లేనివానికి మరణము ఎక్కడిది. బాబా ఏనాడు తన శరీరానికి ఏమాత్రమూ ప్రాధాన్యత ఇవ్వలేదు. అసలు తను ఒక శరీరమని భావింపలేదు. ఎల్లప్పుడు, ఆత్మ నిమగ్నులై ఉండేవారు. తన శరీరము వానకు తడిసినా, ఎండకు మాడినా ఏమీ పట్టనట్టే ఉండేవారు. మనలాగా ప్రతిరోజు స్నానము చేయుట, శరీరానికి పౌష్టికమైన ఆహారమును స్వీకరించుట శరీర అలంకారమునకు ప్రాధాన్యత ఇచ్చుట, మంచి దుస్తులను ధరించుట, ఇటువంటివి ఏమీ బాబా ఎరుగరు. ఎప్పుడు తిన్నారో, ఎప్పుడు పడుకున్నారో ఎవ్వరికీ తెలియదు. అసలు ఆకలి దప్పికలు వారికి ఉన్నాయా అని అనిపిస్తుంది. బాబా ఎన్నడూ “నేను” అని అనుకొనలేదు. బాబా ఉద్దేశ్యములో “నేను” అంటే బాహ్యంగా కనిపించే తన శరీరము కాదని ఆత్మ అనే భావనతో ఉండేవారు. అసలు వారు తమ పేరుకూడా చెప్పలేదు. శిరిడీకి వచ్చినప్పుడు మహల్సా “ఆవో

సాయి" అని సంభోదించినారు. కాబట్టి బాబాని సాయి అని పిలిస్తే పలికేవారు. గీతలో కృష్ణ పరమాత్ములు దేహానికి చావు కానీ ఆత్మకు చావులేదని, ఆత్మ అగ్నిలో కాలదని, నీటిలో తడవబడదని, ఇంద్రియ విషయములు శరీరమునకేగానీ ఆత్మకుకాదని చెప్పినారు. బాబా సాక్షాత్ పరమాత్మ చావు పుట్టుకలు లేనివారు. అయోనిజ సంభవుడు. కావున వారికి మరణము లేనపుడు మనము దుఃఖించకూడదు. బాబా నిర్గుణ పరమాత్మ. కావున వారిని గురించి మనము దుఃఖ పడరాదు. వారికి పేరుగాని, వారి తండ్రిపేరుగాని, వారి కులమతములుగాని వారి వయస్సుగాని ఎవ్వరికి తెలియదు. దీనికి ఒక ఉదాహరణ ఒకసారి ఒకడు సొమ్ములను దొంగిలించినపుడు అతనిపై ధులియా మెజిస్ట్రేట్ కోర్టులో నేరము ఆమోదింపబడినది. అతను ఆ మెజిస్ట్రేట్‌కు ఆ దొంగ సొమ్ములన్నీ శిరిడీలోని సాయిబాబాగారు వానికి ఇచ్చినారని చెప్పగా ఆ మెజిస్ట్రేట్ బాబాను ధులియా కోర్టుకు రావలసినదిగా వారెంట్ పంపెను. మొదట వచ్చిన సమన్లను బాబా ధునిలో పారవేసెను. తరువాత వచ్చిన వారెంట్‌ను కూడా పారవేసెను. ఆ మెజిస్ట్రేట్ ఒక కమీషనర్‌ను నియమించి శిరడీకి ఆ కమీషనర్‌ను పంపించి సాయి సాక్ష్యాన్ని తీసికొనమన్నప్పుడు బాబా ఇచ్చిన వాంగ్మూలములో బాబా కొన్ని రహస్యములను బైటపెట్టిరి. ఆ రహస్యములేమనగా కమీషనర్ బాబాని తమ పేరు ఏమని అడిగినపుడు సాయి తనని సాయిబాబా అని పిలుచుచుందురని చెప్పేరేగాని అసలు తమ పేరు ఏదో చెప్పలేదు. వారి తండ్రి పేరు కూడా కమీషనర్ అడిగినపుడు బాబా వారి పేరు కూడా సాయిబాబా అని చెప్పిరి. ఈ రెండింటిలో ఆయన పరమాత్ముడని ఆతని అసలు పేరులేదని **మనము సాయిబాబా అని పిలిచాము కాబట్టి సాయి అంటే పలికే వారు** పరమాత్మునికి తల్లితండ్రులు ఎక్కడ ? కాబట్టి తన తండ్రి పేరు కూడా సాయిబాబానే అని బాబా చెప్పినారు. ఆ కమీషనర్ కులమతము లడిగినపుడు కులము దైవమని, మతము కబీరని చెప్పినారు. కమీషనర్ బాబా యొక్క వయస్సు నడిగినపుడు లక్షల సంవత్సరములని చెప్పారు. బాబా పరమాత్మ అని నిర్ధారించుటకు ఇంతకంటే నిదర్శనము ఏమియున్నది ? కమీషనర్ **ఆ దొంగిలించిన వానిని చూపించి అతనిని ఎరుగుదురా అని బాబాని అడిగినపుడు**

**సాయి "నేను ప్రతి వ్యక్తిని ఎరుగుదును".** కమీషనర్ మీరతనికి ఆ సొమ్ములు ఇచ్చినారా? అని అడిగినపుడు **బాబా ప్రతి వస్తువు నాదే అని అన్నారు.** మరి ఇంత సూటిగా సాయి తాను పరమాత్మ అని తన సాక్ష్యము ద్వారా చెప్పారు. కావున పరమాత్మకు మరణము లేదు. వారు అశరీరులు. ఎల్లప్పుడు ఉండేవారు. ఇప్పుడు కూడా బాబా ఉన్నారు. మన మనసు నుండి వారు మరణించారనే భావాన్ని పూర్తిగా తుడిచివేయాలి. ఏ మాత్రము దుఃఖపడకూడదు. బాబా తనను నమ్మి వచ్చిన వాళ్ళకి నా ఎముకలు నా సమాధి నుండి సమాధానం పలుకుతాయి అని అన్నారు. కావున వారు సమాధిలో నిదురించుచున్నారు. వచ్చిన వారికి సమాధానము ఇస్తున్నారు. ఇది అక్షర సత్యం.

భగవద్గీతలో శ్రీ కృష్ణుడు ప్రతి జీవి ఆత్మయని ఆ ఆత్మయే తానని ఆత్మవలోకన కలిగిన వారికి దేహము దానిపైన వ్యామోహము ఉండక అనునిత్యం ఆత్మనిమగ్నులై ఉండెదరని చెప్పినారు. ఎవరైతే దేహమే శాశ్వతమని దేహముపై మమతానురాగము మమకారము పెంచుకొనినవారు నేను, నీవు, తాను అను భేదము చూసి తల్లి, తండ్రి, భార్య, భర్త, పిల్లలు అను సంబంధముతో బద్ధుడై సంసారములో చిక్కొకొని సుఖదుఃఖములలో ఈదులాడుచు శరీరాన్ని పెంచి పోషించి చివరకు ఆ శరీరానికి రోగము వచ్చి నొప్పి, బాధ ఇవన్నీ ఎరింగి బ్రతికి ఉన్ననాళ్ళు ఏదో ఒక కోరికతో జీవిస్తూ కాలము గడుపుతూ చివరికి మరణము పొంది మళ్ళీ కాలచక్ర ప్రభావముతో మరల పుట్టి బాధలను అనుభవిస్తూ మరణిస్తూ పుడుతూ ఉంటారు. **దేహము అని ఒక్కమాట అనుకోవటం వల్ల ఇంత రాద్ధాంతం** జరుగును. కావున కృష్ణుడు చెప్పినట్లుగా ప్రతిజీవి ఆత్మ అని శరీరము కాదని ఆత్మయే ఆ పరమాత్మ అనే సత్యమును ఎరిగినచో ఏ బాధా ఉండదు. ఈ సత్యాన్ని మళ్ళీ యోగి అవతరామున ఉద్భవించిన శ్రీసాయి నాథుడు ప్రతి జీవి పరమాత్మయని ప్రతి జీవిని ప్రేమించమని ఈగ, చీమ, కుక్క, పంది, పిల్లి, కాకి ఇలా ఏ జీవికైనా అన్నం పెట్టినచో బాబాకు ఆకలి తీర్చినవారగుదురని సాయి అనేక పర్యాయములు గుర్తు చేసెను. ఏ జీవిని కూడా భేదభావముతో చూడలేదు. మరియు బాబా

అనేకసార్లు ప్రతి జీవిలోను పరమాత్ముని చూడమని చెప్పేవారు. భగవద్గీతలో శ్రీకృష్ణుడు చెప్పిన ప్రతి విషయము అనగా ఆత్మతత్త్వము గురించి యోగి రూపమున అవతరించిన సాయి నాథుడు పాటించి అందరికి చూపించినారు. మన అందరికి తెలియాలని చేశారు. ఇలా సద్గురువులు తమ ఆచరణలో చూపించి మనకి బోధ చేయుటకై ఆ పరమాత్ముడు గురువు రూపేణా వచ్చి బోధించెదరు.

**కావున మనము కూడా మరణము ఎవరికైనా సంభవించినపుడు దుఃఖించరాదు. ఆత్మావలోకనము తెలిసిన వారై ఆత్మకు చావులేదని గ్రహించి నిబ్బరముగా ఉండవలెను.** బాహ్యముగా శరీర రూపము కనిపించనంత మాత్రమున మనల్ని వదిలి మన తల్లిదండ్రులేకాని, సోదరులేకాని, భార్యాభర్తలేకాని, కొడుకులు, కుమార్తెలు అయినను మరెవ్వరైనను శరీరాన్ని వదిలి వెళ్ళిపోయినంత మాత్రాన వారికి మరణము సంభవించినదని మనలో లేరని అనుకోరాదు. బాబా చెప్పినవి పాటించి ధైర్యముతో ఉండవలెను. ఆత్మకు బంధుత్వము లేదు. ఈ జన్మలో ఒకరు ఫలానా పేరుగల తల్లియో, తండ్రియో, భర్తో, భార్యో అయి ఉండవచ్చు. కాని మన పూర్వ జన్మలో ఇంకో పేరుతో మన తల్లిదండ్రి మొదలగుగా ఉండెదరు. కాని మనకు ఆ పూర్వ జన్మలో ఎవరు మన తల్లిదండ్రులో, ఎవరు భార్యాభర్తలో, ఎవరు కొడుకులో ఇలా మనకు తెలియదు. అదేవిధంగా రాబోయే జన్మలో మనకు తల్లిదండ్రులు, భార్యాభర్తలు ఇంకెవరో ఇంకో పేర్లతో రావచ్చును. కావున ఇవన్నియు శాశ్వతమైనవికావు. **ఏ జన్మకు సంబంధించిన బంధుత్వము ఆ జన్మ వరకే సంబంధించి ఉంటుంది.** ఇది మనం మన దేహము, మన బంధుత్వము అని కల్పించుకున్న బంధములే. నిజానికి ఎన్నో జన్మల నుండి పరంపరగా వచ్చునది ఆత్మ మాత్రమే. ఆత్మ ఒక దేహము నుండి మరియొక దేహమునకు పోవుచుండును. గీతలో చెప్పినట్లు మనుజుడు చిరిగిన వస్త్రమును వదిలి నూతన వస్త్రములు ధరించునట్లు ఆత్మ ఒక దేహమును విడిచి మరో దేహము పట్టుకొనును. కావున ఆత్మయే సత్యము. ఆత్మయే పరమాత్మ. బాబా చెప్పినట్లుగా ప్రతిజీవి పరమాత్మయే కావున **మరణమనేది ఈ ప్రపంచములో ఎవ్వరికీ లేదని గ్రహించవలెను.**

బాబా తన శరీరాన్ని విజయదశమి రోజున వదిలి వెళ్ళుటకు నిశ్చయించినారు. దీనిని సూచిస్తూ బాబా మహాసమాధి చెందక పూర్వము 2 సం॥ల పూర్వము అనగా 1916 వ సం॥ము ఒక విజయ దశమి రోజున శిరిడీ గ్రామంలోని వారందరు సీమోల్లంఘన చేసి తిరిగి వచ్చుచుండగా బాబా ఒక్కసారిగా తన వంటిపైనున్న బట్టలను చింపి ధునిలో విసిరినారు. దిగంబరుడై దర్శనమిచ్చినారు. "నేను హిందువునో మహమ్మదీయుడనో చెప్పండి. ఈరోజు నా సీమోల్లంఘనము" అని బాబా ఉగ్రరూపుడై గడగడ లాడించారు. సాయి తాను విజయదశమి రోజున శరీరమును విడుచుచున్నారని సూచించారు. సాయి చెప్పిన దానిలో దిగంబరుడై నిలిచియున్న సాయి నేను హిందువుడనో, మహమ్మదీయుడనో చెప్పుమని మనల్ని ప్రశ్నించారు. కులమతములు నామరూపములు శరీరానికేనని దిగంబరుడై నిలచి తాను శరీరము కాదని పరమాత్మయేనని ఋజువు చేశారు. ఇది జరిగిన 2 సంవత్సరముల తరువాత రామచంద్ర పాటిల్ అనే బాబా భక్తునికి జబ్బు చేసినది. బాబాను ప్రార్థింపగా బాబా అతని చావు చీటీ తీసివేసి తాత్యాకోటే పాటిల్‌కు చావు చీటీ ఉన్నట్లుగా 1918 విజయదశమి రోజున తాత్యా మరణించెదనని చెప్పెను. బాబా వాక్కు బ్రహ్మవాక్కు. కావున రామచంద్ర పాటిల్ రోగమునుండి విముక్తుడై మామూలు స్థితికి వచ్చెను. బాబా చెప్పినట్లుగా తాత్యా జబ్బు పడెను. విజయదశమి రోజున తాత్యా తన శరీరమును బాబా చెప్పినట్లుగా నిజానికి వదిలివేయవలెను. కాని హఠాత్తుగా ఒక వింతను బాబా చూపెను. తన భక్తుడగు తాత్యా కోసం బాబా తమ దేహమును అక్టోబర్ 15వ తేదీ మంగళవారం మధ్యాహ్నం గం. 2.30 ని.లకు విజయదశమి మహా పర్వదినమున భౌతిక శరీరము విడిచి రామచంద్రపాటిల్ చావు చీటీని తప్పించిన వారు శ్రీసాయి. తాత్యా చావు చీటీని కూడా తీసివేసెను. బాబా తమ భౌతిక శరీరమును విజయదశమి రోజున విడిచెదనని సూచించుటకై బాబా తాత్యా పేరు చెప్పెను. చివరి శ్వాస విడుచునంత వరకు సాయి సంపూర్ణ చైతన్యులుగా ఉండిరి. వారు తమ భక్తురాలగు లక్ష్మీబాయి శిందేకి 9 రూ॥లు దానము చేసిరి. ఒకసారి బాబా లక్ష్మీబాయితో వారికి చాలా ఆకలిగా ఉన్నదని చెప్పగా ఆ

లక్ష్మీబాయి రొట్టె కూరను తీసుకునివచ్చి బాబాకివ్వగా దానిని కొంచెమైనా తినక కుక్కకు వేసిరి. లక్ష్మీబాయి తనకు అనవసరంగా శ్రమను కల్గించినారని బాబాను ప్రశ్నింపగా సాయి “కుక్క ఆకలి తీర్చుట నా ఆకలి తీర్చుట వంటిది. కుక్కకు కూడా ఆత్మ కలదు. ప్రాణములు వేరు కావచ్చును. కాని అందరి ఆకలి ఒక్కటే బాబా ఆత్మావలోకనం అందరికి తెలియజేయుటకై ఈవిధంగా చేసిరి. లక్ష్మీబాయి శిందే ఆనాటినుండి బాబాకు రొట్టె పెట్టుచుండెను. కావుననే ఆమె యొక్క సేవను గుర్తించి సాయి ఆమెకు తన జేబులోనుండి 9 రూ॥లు తీసి ఇచ్చెను. బాబా పక్కన కూర్చొనియున్న భక్తులను భోజనమునకై పంపెను. వారు భోజనము పూర్తి చేయక మునుపే శ్రీసాయి బయాజీ అప్పా కోటేపై తమ దేహమును ఒరిగియుండెను. తమ చేతితో దానము చేయుచూ శరీరమును విడిచెను. చివరి దశయందు కూడా బాబా మనకి వైరాగ్యమును గుర్తు చేసెను. వారు దానము చేస్తూ తమ దేహమును వదిలినారు. యోగులకు అవధులు ఉండవు. అందుకేవారు అవధూతలు. అవధులే లేనప్పుడు మరణము ఎలా అడ్డుపడును. జనన మరణములకు అతీతులైనవారు కావున బాబా ఒక్కసారిగా జ్వరమను నెపముతో తమ దేహమును వదిలినంత మాత్రమున సాయి ఇక మనకులేరు, మనను రక్షించువారు ఎవరు అన్న బాధలను ఎవరికి చెప్పుకొనవలెను. ఇలాంటివన్ని తుడిచి వేసి **సాయి అసలు మరణించలేదు. యావత్ ప్రపంచమంతా నిండి ఉన్నారు** అని తెల్సుకుని ఈ అధ్యాయమును చదివిన తరువాత దుఃఖము ఎవ్వరు పొందకూడదని సాయి మరణించలేదనే సత్యాన్ని మటుకు గ్రహించవలెనని నా ప్రార్థన.

## 43, 44 అధ్యాయములు

గత అధ్యాయమున బాబా తన భౌతిక శరీరమును విడిచినారని కాని సాయికి మరణము లేదని వారు అమరులని చెప్పుకుంటిమి. మహాసమాధి చెందిన తరువాత కూడా తన భక్తులను కాపాడుతూ ఉన్నారు.

ఉదాహరణకు – భక్త నారాయణరావు బాబా సమాధి చెందిన తరువాత శిరిడీకి పోవలెను అనుకొనినను పోలేకపోయెను. అతను జబ్బు పడెను. బాబాను అనునిత్యము ధ్యానము చేస్తూ కాలం గడిపేవారు. ఒకరోజు బాబా అతనికి స్వప్న దర్శనమిచ్చి ఇట్లు పలికెను, “ఆందోళన పడవద్దు, రేపటినుంచి బాగగును. వారం రోజులలో నడువగలవు”. బాబా చెప్పిన ప్రకారం నారాయణరావుకు వారం రోజుల లోపల రోగము తగ్గిపోయెను. దీనిని బట్టి బాబా శరీరము ఉన్నన్నాళ్ళు బ్రతికి ఉండిరా లేదా ? శరీరము పోయినది కదా మరణించిరా, దీనికి జవాబు పైన చెప్పిన ఉదాహరణ తీసుకొనినచో బాబా ఎల్లప్పుడు జీవించియే ఉన్నారు. వారు అమరులు. మరణానికి అతీతులు. ఏ రూపములోనైనను సాయిని నమ్ముకున్న భక్తులను తప్పక కాపాడెదరు.

సాయి, తన దేహ త్యాగము త్వరలో చేయుచున్నారని తెలిసినవారు అగుటచే ‘రామ విజయం’ అను గ్రంథమును వజే అనునతనిచే పారాయణ చేయించిరి. బాబా అక్టోబర్ 15 ముందు రెండు మూడు దినముల నుండి బయటికి పోవుట, భిక్షాటన చేయుట మానుకొనిరి. అక్టోబర్ 15న హారతి అయిన పిదప భోజనములకు అందరినీ బాబా పంపించిరి. కానీ లక్ష్మీబాయి శిండే, భాగోజీ, బాయాజీ, లక్ష్మణ్, బాల షింపీ, నానా సాహెబ్ నిమోన్‌కర్ మరియు శ్యామా బాబా వద్ద కూర్చొని ఉండిరి. బాబా **తొమ్మిది రూపాయలు** లక్ష్మీబాయికి ఇచ్చి తనకు ఆ స్థలము బాగాలేదని బూటీ కట్టించిన రాతి మేడలో తీసుకువెళ్ళమని చెప్పి బయాజీ తాత్యా కోతేపై సాయి ఒరిగి తమ ప్రాణమును విడిచెను. శిరిడీలోని ప్రజలు బాబా మరణ వార్త విని బిగ్గరగా ఏడవసాగిరి. బాబా శరీరమును ఎట్లు సమాధి చేయవలెనని గొప్ప వివాదము జరిగెను. కొందరు ఆరుబయట చేయవలెనని, మరికొందరు బూటీ కట్టించిన రాతి మేడలోనే చేయవలెనని వాదించుకొనిరి. ఈ విధముగా 36 గంటలు కాలము గడిచిపోయినది. బాబాకు మరణము లేదని రుజువు చూపుటకై మరియొక సంఘటన, బాబా తమ దేహమును వదలిన మరునాడే చూపెను. లక్ష్మన్ మామ జోషీ శ్యామాకు మేనమామ వారికి సాయి స్వప్నదర్శనము ఇచ్చి ఇట్లనెను. “లెమ్ము బాపూ సాహెబ్, నేను మరణించితిని అనుకొనుచున్నారు. అందుచే అతడు రాడు,

నీవు పూజచేసి కాకడ హారతిని ఇమ్ము" అని బాబా పలుకగా, లక్ష్మన్ మామ పూజా ద్రవ్యములు తీసుకుని బాబా కడకు వెళ్ళి అక్కడున్నవారు అందరూ ఆటంక పరచినను పూజను చేసి, హారతిని ఇచ్చి పోయెను. దీనిని బట్టి బాబా మరణించలేదని బాబాయే స్వయముగా లక్ష్మణ్ మామాకు స్వప్నదర్శనము ఇచ్చి తాను మరణించలేదని స్వయముగా చెప్పిరి. కావున, బాబా మరణించినారని ఎవ్వరూ అనుకోవద్దు. వారు శరీరాన్ని దాల్చి శిరిడీకి వచ్చి ఎన్నో లీలలను చూపి తమ కార్యమును నెరవేర్చిన తరువాత తమ శరీరాన్ని మాత్రమే భౌతికముగా వదిలారు కానీ ఆ పరబ్రహ్మ అగు సాయి మాత్రం ప్రపంచమంతా నిబిడీకృతమై ఉన్నారని సాయి సర్వాంతర్యామిని, సాయి సర్వవ్యాపియని తెలుసుకొనవలెను.

ప్రజలు బాబా శరీరమును ఎట్లు సమాధి చేయవలెనని రెండు వర్గములుగా విడిపోయిరి. కొందరు బైట సమాధి చేయవలెనని మరికొందరు బూటీ వాడాలో సమాధి చేయవలెనని పట్టుబట్టిరి. చివరికి ఎన్నికలు వేసేదాకా వచ్చినది. కాని సాయికృపతో చివరకు ఎన్నికలు వేయకుండానే ప్రజలందరూ ఏకగ్రీవముగా బూటీ కట్టించిన రాతి వాడాలోనే కృష్ణుని విగ్రహం స్థాపించవలెనని అనుకున్న స్థలములోనే బాబాను సమాధి చేసిరి. బుధవారం సాయంకాలం సమాధి చేసిరి. బాబాయే మురళీధరుడు. ఆనాటి నుండి బూటీవాడా దేవాలయమయ్యెను. అనేకమంది భక్తులు అక్కడకు వెళ్ళి సాయిని దర్శించి తమ బాధలను, కష్టములను ప్రశ్నలను బాబా సమాధికి చెప్పుకొని బాబా తమ సమాధానము తన సమాధినుండియే ఎందరో భక్తులకు ఈనాటికి తీర్చుచున్నారు. బాబా శరీరము మంగళవారం నాడు విడిచిరి. బుధవారం సాయంత్రం బాబాని సమాధి చేసిరి. ఈ గడిచిన 36 గంటలలో బాబా శరీరములో ఎటువంటి మార్పు అంటే శరీరము బిగిసిపోవుట అవయవములు పాడైపోవుట జరుగలేదు. వారు వేసుకున్న కఫ్నీ కూడా ఏ మాత్రము చింపకుండా తేలికగా తీసివేసిరి. అసలు బాబా ఒక శరీరము ఐతే కదా ! మనకోసం శరీరము దాల్చి వచ్చినవారు వారు పరమాత్ముడు.

సాయి తమ భౌతిక శరీరము విడువక మునుపు ఒక అపశకునము మశీదున జరిగినది. బాబా

ఎప్పుడు ఒక పాత ఇటుక దగ్గర పెట్టుకొని దానిపై చేయివేసి కూర్చునేవారు. ఒకసారి బాబా లేనపుడు ఒక బాలుడు మశీదును తుడుచుచుండగా ఆ ఇటుక క్రిందపడి రెండు ముక్కలయ్యెను. బాబా ఇట్లనెను, "ఇటుక కాదు, నా అదృష్టమే ముక్కలు ముక్కలు అయ్యెను. అది నా జీవితపు తోడునీడ. ఈ రోజు అది విడిచినది". ఈ పలికిన పలుకులు వింటే బాబా మహా జ్ఞాని కదా! ఆ యిటుకపై అంత మమకారము దేనికని మామూలు మనకిమల్లే బాబా పలుకుచున్నారేమిటి ? అనే సందేహం ఎవ్వరికైనా వచ్చును. బాబా మన అందరిని కాపాడుటకు అవతరించిరి. అందరితో కలసిమెలసి సామాన్యుని వలె జీవించి నటించిరి. ఆనందము వచ్చినపుడు నవ్వుట పిల్లలతో ఆడుట విచారమైన పలుకులు పలుకుట. బాహ్యముగా కావాలనే నటించిరి. కాని వారు ఆంతరంగికముగా శుద్ధ చైతన్యులు. ఇది కేవలం వారు తమ దేహాన్ని వదులుచున్నారని ముందుగానే సూచించుటకై ఆ ఇటుక విరుగుట జరిగినది. దేనికైనా కర్త బాబాయే. ఆ పిల్లవాడు చేసినదికాదు. బాబాయే అట్లు చేసిరి. ముందుగా మనందరికి వారు తమ దేహాన్ని వదిలివేస్తున్నట్లు సూచించిరి.

బాబా నిజానికి 1918 అక్టోబర్ 15 నాడు కంటే ముందుగా 32 సం॥లకు పూర్వం అనగా 1886 సం॥న వారు మరణించి తిరిగి 3 రోజుల తరువాత బ్రతికి మనందరిని ఆశ్చర్యపరచి మరల 1918 అక్టోబర్ 15 మంగళవారం నాడు విజయదశమి పర్వదినమున మరణించిరి. ప్రపంచములో ఇటువంటి విషయము ఎక్కడైనా జరిగినదా ? మనిషికి రెండుసార్లు మరణముంటుందా ? అందులోని ఒకసారి మరణించిన తర్వాత మరల 3 రోజుల తర్వాత శ్వాస యధావిధముగా ఆడుట జరుగునా ? ఆ జగన్నాధుడు అగుసాయి ఆడిన ఆట తప్ప మరేమిటి ? ఈ విషయాన్ని ఇప్పుడు చూద్దాం. 1886 సం॥న ఒక మార్గశిర పౌర్ణమినాడు సాయి ఉబ్బస వ్యాధితో బాధపడుచుండగా దానిని నివారించుటకై తమ ప్రాణములను పైకి తీసుకుని పోవలెనని తలంచి భక్త మహల్సాతో ఇట్లనిరి, "నా శరీరమును 3 రోజుల వరకు కాపాడుము. నేను తిరిగి వచ్చినట్లయితే సరే లేనియెడల నా శరీరము ఎదురుగా ఉన్న ఖాళీ స్థలములో పాతిపెట్టి గుర్తుగా రెండు జండాలను పాతుము" అని రాత్రి 10

గం॥లకు సాయి ఊపిరి నిలిచిపోయెను. నాడి ఆగిపోయెను. బాబా తన శరీరమును మహల్సా ఒడిలో వాల్చెను. ఊరిలోని వారందరు విచారణచేసి బాబాను సమాధి చేయవలెనని తలువగా భక్త మహల్సాపతి తన దేవుడిపై నమ్మకముతో బాబాను సమాధి చేయకుండా అడ్డుపడి తన ఒడిలో బాబా శరీరమును బాబా ఆజ్ఞ ప్రకారము బాబాపై తనకున్న అపారమైన నమ్మకముతో రెప్పవాల్చక కదలక నిద్రాహారములు లేక తన సద్గురువును తన ఒడిలో 3 రోజులు అట్లే కాపాడెను. ఎంతటి మహా భాగ్యము. ఎంతటి పుణ్యమో కదా! సాయి వాక్కుపై ఎంత దృఢవిశ్వాసము కలిగియున్న మహాభక్తుడో కదా! **అందుకే కాబోలు, మహల్సాపతి వద్ద భక్తి అపారముగా పొంగుతూ ఉండేది. ధనము మాత్రము ఎప్పుడు నిండుకుండేది.** తాను జీవితమంతా దారిద్ర్యముతోనే బాధపడ్డాడు. ధనము లేక ఒక్కొక్కసారి తన ఇంటిల్లిపాది పస్తులున్న రోజులు ఎన్నో. అయినా తాను నముకున్న దేవుడగు సాయిని ఎన్నడు మహల్సా నిందించలేదు. ధనము లేదని బాధపడలేదు. ఒకసారి ఒక భక్తుడు కొంత ద్రవ్యమును మహల్సాకు ఇవ్వవలసినది అని ఉద్దేశ్యముతో పంపించినపుడు బాబా ఆ ధనమును మహల్సాను ముట్టనీయలేదు. ఐనను మహల్సా తన భక్తిని ఏమాత్రము లోటు చేయక సంపూర్ణముగా బాబాను నమ్మెను. శ్రద్ధ, ఓర్పు రెండు రెండు కాసులుగా ఆ మహల్సాకు ఉండడంచేతనే బాబా తన శరీరాన్ని 3 రోజులు కాపాడమని ఒక్క మహల్సానే ఎంచుకొని తమ శరీరాన్ని అప్పగించినారు. ఆ దేవునికి తన భక్తుడిపై ఉన్న విశ్వాసము అలాగే ఆ భక్తుడికి తన దేవునిపై ఉన్న విశ్వాసము రెండునూ సరిసమానము. కావుననే మహల్సా ఆ కార్యములో సఫలీకృతుడయ్యెను. 3వ రోజు తెల్లవారుఝామున 3 గం॥లకే శరీరములో ప్రాణమున్నట్లు అగుపించెను. ఊపిరి ఆడటం ప్రారంభించెను. మెల్లగా బాబా కళ్ళు తెరిచి లేచెను. ఈ లీలలు వింటుంటే బాబా ఒక శరీరమా ? లేదా ఆత్మయా ? అనే సందేహము కల్గును. శరీరము అశాశ్వతమని లోనున్న ఆత్మయే శాశ్వతము, సత్యము, అమరమని ఆ ఆత్మయే బ్రహ్మమని ఆ నిర్గుణ రూపమే సాయి అని సర్వవ్యాపి అని సర్వాంతర్యామి అని తెలిసికొనవలెను. కావున సాయికి మరణం లేదు. వారు శాశ్వతులు. అమరులు.

ఈ విధముగా బాబా చెప్పినట్లు ఋజువుతో చూపినట్లు వారు చేసి చూపించినవి గ్రహించి ఆత్మ సత్యమని తెలుసుకుని ఆత్మ నాశనము లేనిదని, శరీరమే వదిలిపోయిరని తెలుసుకుని మరణము లేని దాని గురించి, చింతించి మరణమంటే భయపడి బ్రతకకుండా అసలు మనకు మరణమే లేదని ధైర్యముతో జీవిస్తు అనునిత్యము సాయి నామాన్ని లోన జపిస్తూ ఆ నామధ్యానముతోనే శరీరమును విడిచి బాబా సాన్నిధ్యానికి చేరుకొనటమే మోక్షమని గ్రహించవలెను. ఎవ్వరు ఏ ప్రాణి అయినను మరణించిన దుఃఖించనవసరము లేదు. ఏ ప్రాణి అయినను ఆత్మ స్వరూపమే. కావున ఆత్మ ఎన్నడూ మరణించదు. ఆ నిజాన్ని గ్రహించి ఆత్మావలోకనంతో కలిగియుండవలెనని నా ప్రార్థన.

## 45వ అధ్యాయము

ఈ అధ్యాయము చాలా ముఖ్యమైనది. ఇది మరొక కలకండ. ప్రతీ సాధకుడు ఈ అధ్యాయము శ్రద్ధాభక్తులతో చదివి ఈ అధ్యాయములోని చెప్పబడిన సారాంశమును మనస్సున శాశ్వతముగా స్థిరపరచుకొని ఉండవలెను. గురువు లభ్యమగుట ఎంతో పుణ్యం చేస్తేకాని జరుగదు. అట్టి గురువు యొక్క పలికిన పలుకులను ఎప్పటికీ మరువరాదు. గురువుని సర్వశ్య శరణాగతి వేడుచూ నిరంతరము భక్తితో గురుపాదములను నమ్ముకొని హృదయపూర్వకముగా గురువుని ప్రేమించవలెను. హరినామ స్మరణము, గురునామ స్మరణము రెండును ఒక్కటే. ఈ రెండింటిలో ఏది స్మరించినను మోక్షము ప్రాప్తించును. **ఒక్కసారి గురువు లభించిన వానికి తన జీవితములో ఎటువంటి నిరాశగాని, విచారముగాని పడకూడదు.** తాను నమ్ముకున్న, పూజించిన, సేవించిన, గురువు తనను భవసాగరమును దాటించునని దృఢ విశ్వాసముతో ఉండవలెను. **తాను నమ్ముకున్న గురువు శరీరముతో ఉన్నను లేదా సమాధి చెందినను ఆ గురువునే నిరంతరము ధ్యానించి ఎటువంటి సంఘటనలోనైనా**

**తన గురువును మించినది ప్రపంచములో ఏదీలేదని గురువే ఆనందమని పరబ్రహ్మమని శాశ్వతమని శాంతి అని ఎరింగి తన జీవితములో ఏది ఎదురైనను అది గురువు తరువాతనేనని తనకు గురువు ఉన్నాడని నిశ్చలమైన విశ్వాసమును కలిగియుండవలెను.**

శిరిడీ సాయినాథుడు భౌతికముగా లేకున్నను వారిని నమ్ముకున్న భక్తులను ఎప్పటిలాగ కాపాడుచున్నారని గ్రహించవలెను. **బాబాను శరీరులుగా మహా సమాధి చెందక ముందు ఎవరైతే తమ కళ్ళతో చూశారో నిజముగా వారంత అదృష్టవంతులు లేరని చెప్పవచ్చును. అట్టి అదృష్టవంతులలో ఎవరైనా క్షణికమైన ప్రపంచ సుఖములందు వస్తువులయందు ఇంద్రియలోలుడై మమకారమును పోగొట్టుకొనినచో వారంత దురదృష్టవంతులు ఈ ప్రపంచములో లేరని చెప్పవచ్చు.** అయితే బాబాను శరీరులుగా చూడనివారి గతి ఏమిటి ? దీనికి కూడా సమాధానము ఇదే. బాబా అశరీరులు. నిర్గుణ స్వరూపుడు. పరమాత్ముడు నామరూప ఆకారములు లేనివాడు. అనంతుడు. సర్వవ్యాపి. అటువంటి పరమాత్మను ఎవ్వరూ చూడలేరు. ఆ పరమాత్మ కొన్ని కార్యములను చేయుటకై శరీరములను దాల్చి అవతరించి తన కార్యమును నిర్వర్తించిన తరువాత తనువు చాలించి అదృశ్యులగుదురు. కావున బాబాను చూడలేదు అని అనుకొనినవారు ఎటువంటి సంకోచమును విచారమును పెట్టుకోనక్కరలేదు. పరమాత్మను శరీరరూపములో చూడకపోయిననూ బాబా స్వయముగా తాను మహా సమాధి చెందిన తరువాత కూడా తనను నమ్ముకున్న భక్తులను కాపాడుతానని తన భక్తుల ప్రశ్నకు సమాధానము తాను సమాధి నుండియే ఇస్తానని తనను నమ్మిన వారి ఇంట కొలువై ఉంటానని చెప్పినారు. కావున బాబాను సమాధి చెందక పూర్వము వారిని చూడనివారు కూడా అదృష్టవంతులే. బాబాను నిరంతరము ధ్యానిస్తూ బాబా పలికిన పలుకులను జ్ఞప్తియందుంచుకొనిన వారు బాబాపై పూర్తి విశ్వాసము నమ్మకముతో జీవించువారు బాబాను శరీరులుగా ఉన్నప్పుడు చూడకపోయినను అట్టివారు చూసిన వారితో సమానమే.

బాబాను సంపూర్ణముగా నమ్మిన తరువాత ఎవరైనను ప్రపంచములోగల ఐహిక సుఖముల కొరకు,

అశాశ్వత వస్తువుల కొరకు మమకారము చూపిన అట్టివారు తమ మనస్సులను భగవంతునికి అర్పించకుండా ఉన్నవారు దురదృష్టవంతులు. కాకా సాహెబ్ దీక్షిత్ ప్రతీరోజు ఏకనాధ్ భాగవతము, భావార్ధరామాయణము బాబా ఆదేశానుసారం చదువుచుండెను. బాబా సమాధి చెందిన తరువాత కూడా ఆ పారాయణము కొనసాగుచుండెను. ఒకసారి కాకా సాహెబ్ దీక్షిత్ కాకా మహాజని యింటిలో ఏక్‌నాధ్ భాగవతము చదువుచుండగా బాబా ముఖ్య భక్తులు కూడా ఆ పారాయణమును వినుచుండిరి. అతను వృషభ కుటుంబములోని నవనాథులు భాగవత ధర్మ సూత్రములను జనక మహారాజుకు చెప్పు సంఘటనలను చదువుచుండెను. జనకుడు వేసే ప్రశ్నలకు ఒక్కొక్కరు సంతృప్తికరమైన సమాధానములు ఇచ్చు విధానమును నవనాథుల జవాబులను చదువుచుండెను. పారాయణము ముగిసిన పిదప కాకా సాహెబ్ దీక్షిత్ బాబా ముఖ్య భక్తుడైన శ్యామాతో నవనాథుల భక్తి ఎంతో గొప్పదని దానిని ఆచరించుట కష్టమని ఆ నవనాథులు సంపూర్ణ జ్ఞానులని అటువంటి జ్ఞానులచే మూర్ఖులైనటువంటి మనము భక్తిని పొందుటకు వీలగునా అని అది కష్టతరమని అనేక జన్మనెత్తినను పొందలేమని కావున మోక్షమునకు మనము అర్హులముకామని అట్టి దానికోసము కాంక్షించకూడదని కాకా సాహెబ్ దీక్షిత్ శ్యామాతో చెప్పెను. శ్యామా వెంటనే ఇట్లనెను, **“ఎవరైతే వారి అదృష్టముచే బాబావంటి ఆభరణమును పొందిరో అట్టివారు నిరాశచెంది ఏడ్చుట విచారకరమైన సంగతి. వారికి బాబాయందు నిశ్చలమైన విశ్వాసమే ఉన్నచో వారు నిరాశ చెందనేల”** అని నొక్కి చెప్పెను. **శ్యామా పలికిన ఈ పలుకులు రత్నాల కొండ కుమ్మరించినను, కోట్లాదికోట్లు ధనమును కుప్పపోసినను ఆ పలుకుల యొక్క విలువ ఈ ధనరత్నముల కంటే ఎంతో అమూల్యమైనవని గుర్తుంచు కొనవలెను.** కాకా సాహెబ్ దీక్షిత్ బాబా యొక్క ప్రేమానురాగములను పొందినవాడు. బాబాతో ఉన్నవారు అటువంటి అవకాశము వచ్చినవారికి బాబా మహాసమాధి చెందినంత మాత్రమున నిరాశ చెంది ఒక సంఘటన ఏకనాధ్ భాగవతములో చదివి నవనాధాల యొక్క భక్తి మెచ్చుకొని ఆ భక్తుని ఆచరించుట కష్టమని తాను మూర్ఖుడని, తానేకాక మనవంటి మూర్ఖులకు అని సాయి భక్తులను

కూడా కలిపి అటువంటి నవనాధుల భక్తిని పొందుటకు వీలుకాదని అనేక జన్మలు ఎత్తినను సంపాదించలేమని కావున మోక్షమునకు అనర్హులని నిర్ణయించిన తాను బాబా భక్తుడని మరచెను. నవనాధుల భక్తిలాగా బాబా వద్దనున్న భక్తులందరు అందరికి అనన్యమైన భక్తి కలదని నవనాధుల భక్తి ఆచరించుట ఎంత కష్టమో సాయినాధుని భక్తి ఆచరించుట కూడా అంతే కష్టమని, నవనాధులు పూర్ణ జ్ఞానులే మరి మన సద్గురుసాయినాధుడు కూడా సంపూర్ణ జ్ఞాని. అనేక జన్మలెత్తినను నవనాధుల భక్తిని సంపాదించలేమని అలాగే ఎన్ని జన్మలెత్తినను బాబా యొక్క సాంగత్యము పొందలేము. **బాబాను పూజిస్తూ సేవిస్తూ ధ్యానించడమే మోక్షము.** అంటే ఇంద్రియములను నిగ్రహించి సద్గురు సాయిని నిరంతరము ధ్యానించుటయే మోక్షము. ఒక్కో కాకా సాహెబ్ దీక్షిత్ విషయమే కాదు. ప్రతి సాధకుడు తన నిత్య జీవితములో ఇటువంటి సంఘటనను చూస్తారు. ఒక సాధకుడు తాను నమ్ముకున్న దైవమును లేదా గురువును ఒక పరిస్థితిలో తన మనస్సు వికలము చెంది ఇంకొక దైవాన్నో, గురువునో పట్టుకునేలా చేస్తుంది. కారణం తాను నమ్ముకున్న గురువుగాని, దైవముగాని అతనితో ఉన్నప్పుడు మాత్రమే లేదా అతను వారిని శరీరులుగా ఉన్నప్పుడు చూసిన సంఘటనలు, వారు పలికిన పలుకులు సత్యమని వారు సమాధి చెందిన తరువాత ఇక లేరుకదా అనే భావన రావటం వలన ఇతరుల కోసం మనస్సు పరిగెడుతుంది. అలాంటి పరిస్థితిలోనే మన మనస్సును ముందుకు పోనీక వెనక్కి లాగి అదుపులో ఉంచి మనము మొట్ట మొదటగా నమ్ముకున్న గురువు లేదా దైవమునే పట్టుకొని ఇతర విషయములు ఇంకేమైనను ఆ గురువు లేదా దైవము తరువాతే అని గ్రహించవలెను. కాకా సాహెబ్ దీక్షిత్ అట్టి నిరాశలో కొట్టుమిట్టాడుతున్న సమయమున శ్యామా అద్భుతమైన ఈ పలుకులు పలికెను, “ఎవరైతే వారి అదృష్టముచే బాబావంటి ఆభరణమును పొందిరో అట్టివారు నిరాశచెంది ఏడ్చుట విచారకరమైన సంగతే. వారికి బాబా యందు నిశ్చలమైన విశ్వాసమే ఉన్నచో వాడు నిరాశ చెందనేల ? నవనాధుల భక్తి బలమైనదే అయి ఉండవచ్చును. కాని మనది మాత్రము ప్రేమానురాగములతో నిండియుండలేదా ? హరినామస్మరణము, గురునామస్మరణము మోక్ష ప్రదమని బాబా

నొక్కి చెప్పియుండలేదా ? అట్లయిన భయమునకు కాని, ఆందోళనకుకాని అవకాశమేది" అని శ్యామా దృఢ విశ్వాస నమ్మకములతో కాకా సాహెబ్ దీక్షిత్‌కు చెప్పెను.

ఆనందరావు పాఖాడే అను భక్తుడు ఆ మరుసటి రోజున భాగవతం పారాయణం చేయుచుండగా శ్యామా వద్దకు వచ్చి అతని చెవిలో మెల్లగా తాను కాంచిన స్వప్నమును వివరించు చుండెను. శ్యామా వెంటనే కాకా సాహెబ్ దీక్షిత్‌తో ఇట్లనెను, "బాబా పాఖాడేకు ఒక స్వప్న దృశ్యము చూపెను. ఆ దృశ్యముతోనిన్న నీ సంశయమునకు సరియైన సమాధానము చెప్పెరని" ఆ స్వప్నమును పాఖాడే ఈ విధముగా చెప్పెను.

"సముద్రములో నడుము వరకు దిగి అచ్చట ఉండగా ఆ సముద్రమున సింహాసనముపై సాయిబాబా కూర్చుని ఉండుట చూచితిని. కాని వారి దివ్య పాదములు నీటిలో మునిగి ఉండెను. శ్యామా కూడా అక్కడే కలదు. శ్యామానన్నా బాబా పాదములపై పడమని చెప్పగా నేను వారి పాదములు నీటిలో ఉన్నవి కనుక నేను నిస్సహాయుడను అని అనుటచే శ్యామా బాబాను నీటిలో ఉన్న తన పాదములను బైటకు తీయమని వేడగా సాయి తమ పాదములను బైటకు తీసిన వెంటనే నేను ఒక్క క్షణమైనా ఆలశ్యము చేయక వారి పాదములకు మ్రొక్కితిని బాబా నన్ను దీవించి భయముగాని, ఆందోళనకాని అవసరము లేదని క్షేమము పొందెదవని ఆశీర్వదించి శ్యామాకు ఒక పట్టుపంచె దానము చేయమని" స్వప్నములో చెప్పెనని పాఖాడే చెప్పెను. ఈ స్వప్నము యొక్క అర్థము గురుని పాదములు భక్తితో ధ్యానించిన చాలునని బాబా చెప్పియున్నారు. స్వప్నములో బాబా రత్నములతో కూడిన సింహాసనముపై కూర్చుని ఉండుట ఆనందరావుకు కనపడినది. కాని బాబా పాదములు మటుకు నీటిలో ఉన్నవి. అవి కనబడుటలేదు. సాయి తన భక్తునికి ఎంతో ఆనందమైన సౌందర్యమైన దర్శనాన్ని శిరస్సునుంచి పాదములపై వరకు రత్న సింహాసనముతో దర్శనము కలిగించెను. కాని సద్గురుని పాదములు మటుకు నీటిలో మునిగియున్నవి. **సద్గురుని పాదములు మించినవి ఏదీ లేదని ఆ సద్గురుని పాదములు భక్తితో ధ్యానించిన చాలునని పరీక్షించుటకై బాబా తన పాదములను కనిపించకుండా మిగతా తన శరీరము**

**కన్పించునట్లు భక్తునికి దర్శనమివ్వగా బాబా ముఖ్య భక్తుడు.** ఆనందరావును బాబా పాదములపై పడమని సలహా ఇవ్వగా పాఖాడే కూడా తన శిరస్సును బాబా పాదములపై ఉంచుటకు కోరికతోనున్నప్పటికీ సాయి పాదములు నీటిలో మునిగియుండుటచే బాబాను నీటిలోనున్న వారి పాదములను తీయమని వారి పాదముల కొరకే వేచియుండిరి. బాబాను వేడుకొనిరి. అటువంటి భక్తికి సంతసించిన సాయి తమ పాదములను బైటకి తీయగా క్షణమైనా ఆలస్యం చేయక ఆనందరావు పాఖాడే బాబా పాదములకు మ్రొక్కిరి. ఈ స్వప్నము మరియొక ముఖ్యమైన విషయము సాధకులకి సూచిస్తున్నది. బాబా మహాసమాధి చెందిన తరువాత వారు ఇక కనిపించరు అని అనుకున్న భక్తులు ఈ స్వప్నమును లోతుగా భావాన్ని గ్రహించినచో ఒక ముఖ్య విషయము తెలియును. బాబా స్వప్నములో ఆనందరావుకు కనిపించెను. పాక్షికముగనే దర్శనము కలిగించెను. తమ పాదములను నీటిలో కన్పించకుండా ఉంచెను. భక్తులు బాబా సమాధి చెందిన తరువాత కనిపించుటలేదు అను దానికి నిదర్శనముగా సాయి పాక్షికముగనే దర్శనము పాఖాడేకు చూపించెను. కాని తన భక్తుడు భక్తి విశ్వాసములతో తన సద్గురువు పాదములే రక్షకమైన భక్తి అని భావించి సద్గురువు పాదములను భక్తితో ధ్యానించిన ఆ సద్గురువు తమ పాదములు చూపించునని నిదర్శనముగా పాఖాడే బాబా పాదములను కోరగా సాయి తమ పాదములను నీటినుండి బైటకు తీసి చూపించెను. సాయి భక్తులు కూడా ఆ పర బ్రహ్మసాయి యొక్క పాదములను భక్తితో నిరంతరము ధ్యానించినచో సాయి తప్పక తనను సర్వవేళలలో సాయి తన భక్తులను తప్పక చూచెదరు. శ్యామా కాకా సాహెబ్ దీక్షిత్‌తో చెప్పినట్లుగా మన అదృష్టవశంచే సాయి వంటి మహాపురుషుని పొందినాము ఇట్లు పొందిన తరువాత మనము నిరాశచెంది విచారముతో ఉండుట నిజముగా శోచనీయమని అటువంటి సాయియందు నిశ్చలమైన భక్తి విశ్వాసమున్నచో మనము ఏనాటికి నిరాశ చెందము. ఎటువంటి భయమునకు ఆందోళనకు అవకాశము ఉండదు. గురుపాదములు భక్తితో ధ్యానించిన ఆ భక్తిముందు ఇక ఏ భక్తికూడా సరిసమానము కాదని మనము ఎరుంగవలెను.

బాబా ఒక్కొక్కసారి మనల్ని మోసగించుటకై వారు అతి సామాన్యునివలె వస్తువులపై వ్యామోహము కలవారి వలె ప్రవర్తించెదరు. మాయా ప్రభావము ఇది వరకు అధ్యాయములలో బాబా ఒక కొయ్యబల్ల మీద నాలుగు చివరల నాలుగు దీపములు పెట్టుకొని ఆ కొయ్య బల్లపై పడుకొనే వారని తరువాత ఆ దృశ్యమును చూచుటకై అనేకులు వచ్చి చూచుచుండగా ఆ బల్లను విరిచి పారవైచెనని చెప్పుకుంటిమి. ఇది జరిగిన కొన్నాళ్ళకు బాబా ఆ కొయ్యబల్లను గురించి కాకా సాహెబ్‌కు చెప్పుచుండగా కాకాసాహెబ్ బాబా పలికిన మాయ మాటలలో పడి బాబాకు ఆ కొయ్యబల్లపై ఇంకా మమకారము పోలేదని తప్పుగా భావించిన సందర్భమున మరియు కాకా సాహెబ్ మరియొక కొయ్యబల్లను మశీదులో వేసెదనని చెప్పగా బాబా ఇట్లనెను, “మహల్సాను విడిచి నేనెట్లు పైన పడుకొనెదను” అనగా కాకా సాహెబ్ మహల్సాకు మరియొక బల్లను ఇచ్చెదననగా బాబా వెంటనే ఇట్లనెను, “బల్లమీద అంత ఎత్తున పడుకొనుట సులభమైన పనికాదు. ఎవరు పుణ్యాత్ములో, ఎవరు కండ్లుతెరచి నిదురించెదరో వారికే ఇది సాధ్యమని సాయి చెప్పెను. అప్పటి వరకు బాబా తన మాయచే ఆ కొయ్య బల్లపై మమకారమున్నట్లుగా చూపి వెంటనే ఆ కొయ్యబల్లపై పడుకొనుట సామాన్యులకు సాధ్యము కాదని అంటే పరమాత్మునికే అటువంటి చర్యలు సాధ్యమని నిరూపించెను.

## 46వ అధ్యాయము

40 వ అధ్యాయములో బాబా బాంద్రాలోని హేమాడ్ పంత్ ఇంటికి హోలీ పండుగ రోజున ఫోటో రూపమున వచ్చిరని తెలుసుకుంటిమి. ఈ అధ్యాయమున బాబా ఫోటో రూపముననే తన భక్తుడగు శ్యామా కాశీ, గయా, ప్రయాగ యాత్రలకు వెళ్ళుటకు సిద్ధపడగా బాబా ఫోటో రూపముననే అతనికంటే ముందు వెళ్ళెను. దీనిని బట్టి బాబా తను నమ్ముకున్న భక్తుని ఇంటకు తానై వచ్చి తన భక్తుని కుటుంబము యొక్క

సంరక్షణమును చూసేవారు. అలాగే తన భక్తుడు ఏ యాత్రకు వెళ్ళినపుడు తనకంటే ముందుగా బాబా అక్కడ ప్రత్యక్షమై తన భక్తుని ఆశ్చర్యచకితుని చేసేవారు. ఉదాహరణకు మన నిత్యజీవితములో మనము కూడా గమనిస్తూనే ఉంటాము. ఏదైనా ఒక కార్యమునకై మనము ఆందోళనతో బయలుదేరినపుడు బైట మనకు ఏదోరూపేణా బాబా యొక్క చిత్రము వాహనాల మీదనో లేదా 'వై ఫియర్ వెన్ ఐ యామ్ హియర్' అనే కొటేషన్స్ వాహనాల మీదనో లేదా బోర్డుల మీదనో కనపడుతూ ఉంటాయి. అటువంటి విషయములను తేలికగా మనము తీసుకోరాదు. సాయి మన కార్యక్రమాలలో వారూ పాలుపంచుకొని ముందే మనకు ఆ కార్యం విజయం పొందుతుందని ఆశీస్సులు ఇవ్వటానికే ఆ విధమైన సాయి చిత్రములు కాని వాక్యములు కాని మనము పనిమీద బైటికి వెళ్ళినపుడు కనబడుచుండును. ఒకటే గుర్తు అటువంటి సంఘటనలు మన నిత్య జీవితంలో జరిగినప్పుడు మన అంతటి అదృష్టవంతుడు లేరని భావించి ఆనందముతో ఉండవలెను. బాబా తన భక్తులను ఎల్లవేళలా లోపలా బైటా జగమంతయు మనల్ని రక్షిస్తూనే ఉంటారు. మనము గమనించడమే ముఖ్యం.

కాకా సాహెబ్ తన పెద్ద కుమారుడగు బాబు ఉపనయనం నాగపూర్‌లో చేయుటకు నిర్ణయించిరి. అదే సమయమున సాయి భక్తుడగు నానాసాహెబ్ చందోర్కర్ తన పెద్ద కుమారుని వివాహము గ్వాలియర్‌లో నిశ్చయించిరి. వీరిరువురు సాయి భక్తులగుటచే స్వయముగా శిరిడీకి వచ్చి ఆ శుభకార్యములకు బాబా రావలసినదిగా వేడుకొనిరి. సాయి తన ముఖ్య భక్తుడగు శ్యామాను బాబా యొక్క ప్రతినిధిగా తీసుకువెళ్ళమని ఆజ్ఞాపించిరి. బాబా ఇట్లనిరి, "కాశీ, ప్రయాగ యాత్రలు ముగియుసరికి నేను శ్యామాకంటే ముందుగానే గయలో కలిసికొనెదనని చెప్పిరి". శ్యామా మొదట నాగపూర్‌కు వెళ్ళి ఉపనయన కార్యక్రమములో పాల్గొనిరి. అక్కడి నుండి కాశీకి వచ్చిరి. రెండు మాసములు గడచిన పిదప గయకు వెళ్ళిరి. గయలో ప్లేగు కలదని విని గయ స్టేషన్‌లో దిగి ధర్మశాలలో ఉండిరి. మరునాడు పండా వచ్చి యాత్రికులు గయకు బయలుదేరుతున్నారని

గయలో ప్లేగు లేదని చెప్పి శ్యామాను తన యింటికి తీసుకువెళ్ళిరి. పండా యింటిలో సాయిబాబా యొక్క సుందరమైన ఒక పెద్ద పటము శ్యామా చూసిరి. వెంటనే బాబా మాటలు గుర్తుంచుకొని కండ్ల నీరు కార్చిరి. బాబా పలికిన పలుకులు "కాశీ, ప్రయాగ యాత్రలు ముగుయుసరికి నేను శ్యామాకంటే ముందుగానే గయకు పోయెదను" అనే మాటలు బాబా ఋజువు చేసిరి. శ్యామా ఆ బాబా యొక్క పటము ఎక్కడిదని పండాను అడుగగా 12 ఏళ్ల క్రితం శిరిడీకి బాబాను దర్శించి శ్యామా యింటిలో ఉన్న పటమును పండా కోరగా శ్యామా బాబా ఆజ్ఞను పొంది ఆ పటమును తనకిచ్చెనని పండా శ్యామాతో పలికెను. తనకు పటమును ఇచ్చిన ఆ శ్యామాయే తన ఇంట వచ్చినారని గ్రహించి పండా ఆనందించెను. శిరిడీలో శ్యామా ఇంటిలో 12 ఏళ్ళ క్రితం బాబా ఫోటో రూపమున ఉండిరి. బాబా శ్యామాతో కాశీ, ప్రయాగ యాత్రలు ముగియుసరికి నేను శ్యామాకంటే ముందుగానే గయలో కలిసెదను అని చెప్పిరి. శిరిడీలో శ్యామా యింటిలోనున్న ఆ ఫోటోయే గయకు వెళ్ళి పండా యింటికి వచ్చినది. శ్యామా కాశీ ప్రయాగ యాత్రలు ముగించుకుని గయలో పండా ఇంటికి వెళ్ళినపుడు శిరిడీలోని బాబా ఫోటో రూపములో తనకంటే ముందే గయకు వెళ్ళి దర్శనమిచ్చిరి.

ఇలాగే ఖండోబా భక్తుడగు మహల్సా ప్రతి ఏడాది 'జిజూరి'న ఖండోబా దేవాలయమునకు వెళ్ళేవారు. ఈ జిజూరియందు ఖండోబా దేవాలయము శిరిడీ నుండి 150 మైళ్ళున కలదు. ఒకసారి మహల్సా ఆ యాత్రకే వెళ్ళినపుడు గయలో శ్యామా వెళ్ళినపుడు ప్లేగు ఉండునట్లు ఈ జిజూరియందు కూడా ప్లేగు వ్యాధి ఆ సంవత్సరమున వ్యాపించి ఉంది. మహల్సా తన యాత్రకు ఆటంకము కలిగినదని బాధపడి ఏమి చేయవలెనో తోచక బండ్లను ఆపుకొని ఒక మూల కూర్చొనియుండెను. అతని వెనుక ఎవరో ఉన్నట్లుగా భక్త మహల్సాకు తోచెను. మహల్సాపతి వెనుకకు తిరిగి చూడగనే అక్కడ బాబా నిలిచియుండెను. వెంటనే సాయి అదృశ్యమయ్యెను. మహల్సాకు బాబా తన వెంట ఉన్నారని ఒక ధైర్యము పొంది ఆపిన బండ్లను తిరిగి జిజూరి వైపుకు మరల్చిరి. ఎవ్వరికి ఎటువంటి ప్లేగు వ్యాధి సోకక అందరూ క్షేమముగా ఖండోబాను దర్శించి శిరిడీకి వచ్చిరి. మశీదులో

బాబాను దర్శించగా సాయి "భగత్ ఆనందముగా తీర్థయాత్ర గావించితివా ? బండినానుకొని విచారముగా కూర్చొంటివి ఆ సమయమున నేనచ్చటికి వచ్చితిని గమనించితివా?" బాబా యొక్క లీలలు చూచితిరా ? తన భక్తుని కోసం శ్యామాకంటే ముందుగా గయకు వెళ్ళినట్లుగా తన మరియొక భక్తుని కొరకు బాబా మహల్సాపతికంటే ముందుగా జిజూరికి వెళ్ళి కాపాడిరి. అక్కడా ప్లేగువ్యాధి, ఇక్కడ కూడా ప్లేగువ్యాధే. కాని ఎవ్వారికి ఏ బాధ కల్గించకుండా సురక్షితముగా ఆ భక్తులను వారి వారి గమ్యస్థానములకు బాబా చేర్చినారు. ఈ సంఘటనల వలన బాబా పలికిన ఏ మాటనైనను అవి అక్షరాల నెరవేరునని సత్యమని తెలుసుకొనవలెను.

బాబా శ్యామాకు తనకు 72 జన్మల సంబంధమున్నదని వెనుకటి అధ్యాయములలో మనము తెలుసుకుంటిమి. ఇప్పుడు బాబా జంతువుల జన్మ వృత్తాంతమును కూడా తెలిపిరి. ఒకసారి సాయి మేకలమందను చూసెను. 32 రూ॥లకు రెండు మేకలను కొనెను. భక్తులు బాబా మోసపోయారని ఆ రెండు మేకల ధర 8 రూ॥ల కంటే అధికము గాదని నిందించెను. బాబా ఆ మేకల వృత్తాంతమును ఈ విధముగా పలికిరి. గత జన్మలో వారు మానవులు. నా జతగాండ్రుగా ఉండెడివారు. వారొకే తల్లి బిడ్డలు. మొదట ప్రేమతో ఉండిరి. తరువాత శత్రువులైరి. పెద్దవాడు సోమరి. చిన్నవాడు తెలివితో ధనము సంపాదించెను. పెద్దవాడు అసూయ చెందెను. ఒకసారి ఇద్దరు ఒకరినొకరు చంపుకొనిరి. వారి కర్మఫలముచే మేకలుగాపుట్టి నా ప్రక్కనుండి పోవుచుండగా వారిని గుర్తించితిని. వారిని కనికరించి తిండిపెట్టి విశ్రాంతినివ్వదలచి అందుకనే 32 రూ॥లు ఖర్చు పెట్టితిని అని పలికి బాబా ఆ రెండు మేకలను వాని యజమాని వద్దకు తిరిగి పంపివేసెను. బాబాకు గత జన్మలో తన భక్తులుగా ఉన్నవారిపై ఉన్న ప్రేమానురాగములు ఈ జన్మలో వారు మేకలుగా పుట్టినను వాటిని గుర్తించి 32 రూ॥లు ఖర్చు పెట్టి వాటిని కొని ఆప్యాయంగా తల్లివలె దగ్గరకు తీసుకొని వాటికి ఆహారముపెట్టి కొంతసేపు విశ్రాంతి ఇచ్చి మరల వాని యజమాని వద్దకు పంపించివేసెను. **బాబాకు ముఖ్యం ప్రేమకాని ధనముకాదు. మనకు ధనమంటేనే ముఖ్యం.** ఇంత ఖర్చు అయినదని ఆలోచించి బాధపడుతూ

ఉంటాము. ఈ అలవాటుతోనే బాబాను అక్కడున్నవారు 32 రూ॥లు అనవసరముగా మేకలకై ఖర్చు చేసిరని 8 రూ॥ల కంటే ఎక్కువ ఉండవని లెక్కలుకట్టి బాబాను నిందించారు. కాని బాబా తన భక్తులపైనున్న ప్రేమ కారణముచేత 8 రూ॥లకు నాలుగురెట్లు ఖర్చుపెట్టి తన భక్తులకు ప్రేమ పంచి తన ధనము వృధా ఐనను తిరిగి వాటిని వాటి యజమానికి ఇచ్చి వేసినారు. బాబా చూడడానికి ఇంత ఖర్చు చేసినారుకదా నిజంగా ఒక పిచ్చి ఫకీరుగానే అనిపిస్తుంది. కాని ఈ నాటకం వెనుక వేరే జన్మ ఆ జన్మలోని సాయి భక్తులు ఆ భక్తులు ఈ జన్మలో మేకల రూపమున బాబాకి కన్పించి బాబా తన భక్తుల కోసం తన ప్రేమను పంచుటకై అంత డబ్బును ఖర్చు పెట్టెను. **పిచ్చివాళ్ళము మనమా లేక సాయియా అల్లా అచ్ఛా కరేగా. ఆ అల్లా ఎవరో తెలిసింది కదా!**

## 47వ అధ్యాయము

గత అధ్యాయములో బాబా తన భక్తుడగు శ్యామా కంటే ముందుగా గయకు వెళ్ళి ఆశ్చర్యపరిచిన విషయమును గురించి తెలుసుకుంటిమి. ఈ అధ్యాయములో బాబా తన భక్తునికి పూర్వ జన్మలో ఇచ్చినమాట నిలబెట్టుటకై తన భక్తుని ప్రాణములను కాపాడుటకు సాయి చెప్పిన విషయమును తెలుసుకుందము. సాయి చెప్పినదేమనగా ఎవరికైనా ఋణముగాని, శత్రుత్వముగాని ఉన్నచో దానికి తగిన శిక్ష అనుభవించవలెనని కావున బాకీయున్నవాడు బాకీని తీర్చవలెనని శత్రుత్వమున్నవారు దానినుండి విముక్తిని పొందవలెను. బాకీ అనునది ధనమునకు సంబంధించిన బాకీ మరియు మన గురువు అపారమైన దయాదాక్షిణ్యములను మనపై చూపే ఋణము మరియొక బాకీ. సాయినాధుడు ఈ సృష్టిలోని చరాచర జీవకోటి అందరికి తండ్రి ఆ తండ్రి యొక్క ఋణమును ఏ జీవికూడా తీర్చలేనటువంటి బాకీ. **ఎన్ని జన్మలు ఎత్తినను సాయి భక్తుడు సాయి ఋణమును తీర్చుకొనలేడు. ధనానికి సాయి ప్రేమతో ముడిపెట్టకూడదు. సాయి ప్రేమ అనంతమైనది. తరతరాలుగా జన్మజన్మలుగా ప్రవహించుచూ తన ప్రేమ సముద్రమను మనల్ని ముంచి కరుణారసమును త్రాగించే దాక్షిణ్యమూర్తి ఆ సాయినాధుడు. కరిగిపోనిది సాయి ప్రేమ.** కరిగిపోయేది ధనము. ధనము క్షణికము.

దాని వల్ల క్షణిక సుఖము, భోగము అనుభవించవచ్చును. ధనముతో వస్తువులను, బంగారములను కొనవచ్చును. కాని ఎన్ని కోట్లు పెట్టినా అదే ధనంతో ఆ పరమాత్ముని కొనలేము. **ధనానికి లొంగేవాడు మానవుడు. ధనానికి లొంగనివాడు భగవంతుడు.** ఏ వస్తువునైనా కొనవచ్చును ధనముతో. కాని ఆ వస్తువు కూడా శాశ్వతము కాదని ప్రపంచములో శాశ్వతమైనది ఏదీలేదు. ఒక్క పరమాత్మయే శాశ్వతము. కావున **సాధకుడు తన భక్తి ప్రేమలతో పరమాత్మని వశపరచుకోవాలికాని తన కీర్తి, ప్రతిష్ఠ, ధనసంపదలతో భగవంతుడు ఏనాడూ లొంగడు.**

సాయిబాబా ఒకసారి ఇట్లు చెప్పిరి, "ఒకనాడు నది ఒడ్డున విశ్రాంతికై కూర్చొనియుండగా ఒక ప్రయాణీకుడు నా వద్దకు వచ్చి నా ప్రక్కన కూర్చొని చిలము వెలిగించి నాకు ఇచ్చెను. అదే సమయమున ప్రక్కనున్న పొదల నుండి ఒక కప్ప బెకబెకమనుట వినిపించెను. ఆ ప్రయాణీకుడు అది ఏమి అని అడిగెను." బాబా మనుష్యుని యొక్క అంతరంగములో ఏది దాగివున్నదో చెప్పేవాడని తెలుసుకుంటిమి. అదేవిధముగా క్రిములు, కీటకములు, జంతువులు కూడా ఏమి అనుకొనునో బాబాకు తెలుసు. ఉదాహరణకు 15వ అధ్యాయములో గోడపై ఒక బల్లి టిక్ టిక్ అని అనునపుడు బాబా వద్దనున్న భక్తుడు ఆ బల్లి ఏమనుచున్నదో అని అడుగగా బాబా, 'తన చెల్లి ఔరంగాబాద్ నుండి తనను చూచుటకు వచ్చుచున్నదని, కావున అది ఆనందించుచున్నదని' బాబా చెప్పెను. ఇక్కడ కూడా ఈ ప్రయాణికుడు ఆ కప్ప ఏమనుచున్నదని అడిగెను. 'గత జన్మలో చేసిన దాని ఫలము ఈ జన్మలో అనుభవించితీరవలెను' అని సాయిబాబా చెప్పెను. అతను చిలుము పీల్చి ప్రక్కకు పోయి తిరిగి వచ్చి పాముచే పట్టుకొనబడునని 10 నిముషములలో ఆ పాము కప్పను మ్రింగివేయునని చెప్పెను, నేను వెంటనే అట్లా జరగదని దాని తండ్రిని నేనిచ్చట ఉన్నానని నేనెట్లు విడిపించెదనో చూడుమని ఆ ప్రయాణీకునికి చెప్పితిని. నేను ఆ ప్రాంతమునకు పోయి ఓ వీరభద్రప్పా నీ శత్రువు చెన్నబసప్ప కప్ప జన్మమెత్తినను నీవు వానియందు శత్రుత్వము కలిగియున్నావు. మీ ద్వేషములను విడువుము, శాంతించుము" అని పలుకగా ఆ సర్పము కప్పను విడిచి వెడలిపోయెను. ఆ బాటసారి వారిరువురి వృత్తాంతమును చెప్పమని

వేడగా వారి వృత్తాంతము ఈ విధముగా చెప్పితిని. మా వూరి పొలిమేరలో ఒక పురాతన శివాలయం కలదు. దానిని మరమ్మత్తు చేయుటకై కొంత ధనమును ప్రోగుచేసి ఒక ధనవంతుని కోశాధికారిగా నియమించి అతని చేతిలో పెట్టితిమి. అతడు లోభి. చాలా తక్కువ ధనమును దేవాలయమునకై ఉపయోగించి మిగిలిన ధనమును అతను ఖర్చుపెట్టుకొనెను. ఆ దేవాలయ అభివృద్ధి కొరకై తిరిగి గ్రామస్థులు కొంత ధనమును అతని వద్ద పెట్టిరి. అతడు మళ్ళీ అట్లే ధనాన్ని దుర్వినియోగం చేసెను. కొన్నాళ్ళకు అతడి భార్యకు కలలో పరమశివుడు కనిపించి, దేవాలయ శిఖరమును కట్టమని ఖర్చుపెట్టిన దానికి 100 రెట్లు ఇచ్చెదనని పరమ శివుడు స్వప్నములో ఆమెకు చెప్పెను. ఆ స్వప్న వృత్తాంతమును ఆమె తన భర్తకు చెప్పగా అతను ఎగతాళి చేసెను. కొన్నాళ్ళకు పరమశివుడు తిరిగి స్వప్నదర్శనమిచ్చి తన భర్తను బలవంతము చేయవలదని నీ సొంతము ఏదైనా ఇవ్వమని శివుడు ఆమెకు చెప్పెను. ఈ విషయము ఆమె తన భర్తకు చెప్పగా ఆమె తన తండ్రి తనకిచ్చిన బంగారు నగలు దానము చేయుటకు నిశ్చయించెను. ఆమె భర్త లోభియగుటచేత ఆ పరమశివుని మోసము చేయుటకై తన భార్య నగలను తక్కువ ధరకు కట్టి వెయ్యి రూపాయలకు తానే కొని నగదునకు బదులు ఒక పేదరాలగు దుబ్కీ యొక్క పొలమును దేవదేయముగా ఇచ్చెను. ఆ పొలము దుబ్కీ 200 రూ॥లకు కుదువపెట్టి దానిని తీర్చలేక పోయెను. ఈ లోభి తన భార్యను ఆ దుబ్కీని మరియు పరమశివుణ్ణి కూడా మోసగించెను. కొన్నాళ్ళకు ఒక పెద్ద తుఫాన్ రావటంతో ఒక పిడుగు లోభి ఇంట పడి భార్యతో సహా ఆ లోభి మరణించెను. దుబ్కీ కూడా కొంత కాలమునకు మరణించెను. తరువాత జన్మలో ఆ లోభి వీరభద్రప్పగా పుట్టెను. అతని భార్య ఒక పూజారి కుమార్తె గౌరి అను పేరుతో పుట్టెను. దుబ్కి చెన్నబసప్ప అను నామముతో పుట్టెను. ఆ పూజారి నా స్నేహితుడు. అతని కుమార్తె గౌరి నా భక్తురాలు. నా సమ్మతి ప్రకారం గౌరిని వీరభద్రప్పకు ఇచ్చి వివాహము జరిపెను. ఈ జన్మలో కూడా వీరభద్రప్పకు ధనముపై ఆశపోలేదు. తనకెక్కువ ధనము వచ్చునట్లు చేయమని నన్ను వేడుకొనేవాడు. కొన్నాళ్ళకు ధరలు పెరిగెను. గౌరి పొలమునకు ధర పెరిగి కానుకగా ఇచ్చిన పొలము

లక్ష రూపాయలకు అమ్మిరి. శివుడు చెప్పినట్లుగా ఆమె ఆభరణముల విలువకు 100 రెట్లు వచ్చెను. అందు సగం నగదుగా మిగతా సగం వాయిదా పద్ధతిలో ఇచ్చుటకు నిశ్చయించిరి. ధనమునకై తగవులాడిరి. సలహా కొరకు నా వద్దకు వచ్చిరి. ఆ ఆస్తి మహాదేవునిది. కాబట్టి సర్వహక్కులు ఆ పూజారికే మరియు ఆ పూజారికి కొడుకులు లేనందుచే గౌరికి చెందునని ఆమె భర్తకు ఈ పైకముపై ఏ అధికారము లేదని చెప్పితిని. వీరభద్రప్ప నాపై కోపించెను. తన భార్యను తిట్టెను. ఆమె నన్నాశ్రయించి రక్షించమని కోరగా నేనామెను రక్షించుటకు సప్త సముద్రములైనా దాటుదునని వాగ్దానమిచ్చితిని. అదేరోజు రాత్రి గౌరికి ఒక స్వప్న దృశ్యము కనపడి పరమశివుడు ధనమంతయు గౌరిదేనని ఎవ్వరికి ఏమియు ఇవ్వవద్దని మందిర గౌరవ ఇంటిలో పుట్టిన చెన్న బసప్పతో సలహాచేసి దేవాలయపు మరమ్మత్తు చేయమని ఎల్లప్పుడు మశీదులో నున్న బాబా సలహా తీసుకొమ్మని స్వప్నములో చెప్పెను. ఆ మరుసటి దినము గౌరి తన స్వప్న వృత్తాంతమును నాకు చెప్పెను. అసలు తీసుకొని వడ్డీలో సగం మాత్రం చెన్న బసప్పకు ఇవ్వమని వీరభద్రప్పకు ఇందులో జోక్యము లేదని నేను గౌరికి సలహా ఇచ్చితిని. వీరభద్రప్ప చెన్న బసప్ప కొట్లాడుచు నా వద్దకు వచ్చిరి. నేను వారికి పరమశివుని స్వప్న ఆదేశమును చెప్పితిని. వీరభద్రప్ప కోపించి చెన్న బసప్పను నరికెదనని బెదిరించెను. చెన్న బసప్ప పిరికివాడగుటచే నా పాదములుపట్టి నన్నాశ్రయించెను. శత్రుబారినుండి కాపాడెదనని నేను వానికి వాగ్దానము చేసితిని. కొన్నాళ్ళకు వీరభద్రప్ప చనిపోయి పాముగా జన్మించెను. చెన్నబసప్ప చనిపోయి కప్పగా జన్మించెను. చెన్న బసప్ప బెక బెక లాడుట విని నా వాగ్దానమును నిలబెట్టుటకై వచ్చి వానిని రక్షించితిని" అని సాయిపై వృత్తాంతము చెప్పెను. **సృష్టికర్తయగు భగవంతుని మోసం ఎవ్వరూ చేయలేరు. తాను చేసిన పాపం తాను అనుభవించక తప్పదు. మనము ఒక తప్పును చేస్తూ ఎవ్వరు చూడడం లేదుగా అని కళ్ళు మూసుకొని తప్పుచేస్తే మనం కళ్ళు తెరిచేలోగా భగవంతుడు ఆ తప్పును చూస్తాడు.** చేసిన తప్పులు ఎక్కడికి పోవు. ధనంపై ఆశ వున్నవాడు తన ఇంటిల్లిపాదిని మోసం చేయడమేగాక భగవంతుని కూడా మోసగించుటకు ప్రయత్నించును. తాను చేసిన కర్మను తానే అనుభవించక

తప్పదు. **భగవంతుని నమ్ముకున్న వాడిని ఎవ్వరు మోసం చేయలేరు. ఒకవేళ చేయడానికి ప్రయత్నించినా భగవంతుడు రక్షిస్తాడు.** వీరభద్రప్ప బారి నుండి చెన్న బసప్పను సాయి రక్షించడమేకాక తరువాత జన్మలో పాము, కప్పలుగా జన్మించినను పాముగా జన్మించిన వీరభద్రప్ప బారినుండి కప్పగా జన్మించిన చెన్న బసప్పను సాయి రక్షించెను. గత జన్మలో చెన్న బసప్పకు ఇచ్చిన వాగ్దానం సాయి నిలబెట్టెను.

## 48వ అధ్యాయం

సాధారణముగా మానవుని యొక్క నైజము తాను సుఖసంపదలతో ఏ కష్టము లేనప్పుడు భగవంతుడు గుర్తుకురాడు. ఒక్కసారిగా కష్టం వచ్చి పడినప్పుడు "ఓ భగవంతుడా, నీవే దిక్కు" అనుకుంటాడు. కొంతమంది ప్రతీ కార్యమును భగవంతునిపై భారమువేసి తాను నమ్ముకున్న భగవంతుడు తనని రక్షిస్తాడని భావిస్తారు. ఉదాహరణకు, అనారోగ్యంగా ఉన్నవాడు, తన రోగాన్ని తాను నమ్ముకున్న దేవుడు కాపాడుతాడని, ఒక నిరుద్యోగి, తనకు ఉద్యోగం, తాను నమ్ముకున్న దేవుడు తనకి ఇస్తాడని, అలాగే ఒక విద్యార్థి తాను పరీక్షకు వెళ్ళినప్పుడు తాను ఏమీ చదువక పోయినను తాను నమ్ముకొనిన భగవంతుడు కృపతో ఉత్తీర్ణుడవుతాడని, ఇలాంటి భక్తులను మన నిత్య జీవితములో ఎంతో మందిని చూస్తూ ఉంటాం. అయితే ఇలాంటి భక్తులను, నమ్ముకున్న వారిని ఏ కష్టము లేనివాడు సుఖాలతో అనుభవించేవాడు చూసినచో అటువంటి వారిని హేళన చేసెదరు.

సపత్నేకర్ అక్కల్‌కోట్ నివాసి. అతడు, న్యాయపరీక్ష చదువుచుండెను. అతని తోటి విద్యార్థి శేవడె పరీక్ష రోజున అందరూ తమ తమ పాఠముల గూర్చి మాట్లాడుకొనుచుండగా శేవడె పరీక్షకు సరిగ్గా చదువలేదని కానీ తనయందు సాయిబాబా కృప ఉన్నదని కావున తాను ఉత్తీర్ణుడవుతానని చెప్పెను. అప్పటివరకు శేవడె పరిస్థితిని చూసి హేళన చేసిన వారిలో సపత్నేకర్ శేవడె యొక్క నమ్మకానికి ఆశ్చర్యపోయి శిరిడీ సాయిబాబాను

గురించి వివరములను శేవడె ద్వారా సపత్నేకర్ తెలుసుకొనెను. కానీ సపత్నేకర్ తన స్నేహితుడగు శేవడె ధైర్యాన్ని చూసి నవ్వెను. వానిని బాబాను కూడా హేళన చేసెను. సపత్నేకర్ పరీక్షలో ఉత్తీర్ణుడై తన వృత్తిని అక్కల్‌కోట్‌లో న్యాయవాదిగా ప్రారంభించెను. కొన్ని సంవత్సరలా తరువాత సపత్నేకర్‌కు గల ఒక్కగానొక్క కుమారుడు గొంతు జబ్బుతో చనిపోయెను. అతని మనస్సు బాధచెంది ఎన్నో పుణ్యక్షేత్రములకు వెళ్ళినను అతనికి శాంతి లభించలెదు. కష్టమువచ్చినప్పుడు భగవంతుడు గుర్తుకు వస్తాడు అని అనునట్లుగా ఆ విచార సమయమున సపత్నేకర్ 10 సంవత్సరముల క్రితం తన మిత్రుడగు శేవడె బాబాపై తనకు ఉన్న నమ్మకాన్ని చెప్పిన మాటలు సపత్నేకర్‌కు గుర్తుకువచ్చి తన సోదరుడుతో శిరిడీకి వెళ్ళి బాబాకు నమస్కరించగా సాయి ఇట్లనెను, 'బయటకు పొమ్ము'. సపత్నేకర్ బాధపడి సాయి భక్తుడగు బాలాషింపీతో బాబా వద్దకు వెళ్ళుటకు ప్రయత్నించినను అతని కార్యము విఫలమయ్యెను. తన స్వగ్రామమునకు తిరిగి వెళ్ళిపోయెను.

ఒక సంవత్సరము తరువాత సపత్నేకర్ భార్యకు ఒక స్వప్నము వచ్చెను. ఆమె కుండ పట్టుకొని నీళ్ళకు పోవుచుండగా ఎదురుగా ఒక ఫకీరు తన వద్దకు వచ్చి, "అనవసరముగా, శ్రమ పడెదవేల? నేను స్వచ్ఛ జలముతో నీకుండను నింపెదను" అని అనెను. ఆమె భయపడి ఉత్త కుండతో పరిగెత్తగా ఆమె వెంట ఫకీరు వచ్చెను. ఆమె స్వప్నము నుండి మేలుకొని తన భర్తగు సపత్నేకర్‌కు చెప్పగా వారు ఇరువురు శిరిడీకి వచ్చిరి. సపత్నేకర్ భార్య మొట్టమొదటసారిగా సాయిని లెండి తోటలో చూసెను. అచ్చం తనకు స్వప్నములో కనబడిన ఫకీరు రూపము ఉండుటచే మిగుల ఆశ్చర్యపడెను. బాబాకు నమస్కరించగా సాయి ఇట్లనెను, "నా చేతులు పొత్తికడుపు నడుము చాలా రోజులనుండి నొప్పిగా ఉన్నవి. నేను ఎన్నో ఔషధములను పుచ్చుకొనిననూ తగ్గలేదు. కానీ ఇక్కడ నొప్పులన్నీ మాయమైనవి ఆశ్చర్యముగా ఉన్నదని బాబా ఆమెతో పలికెను. నిజానికి ఈ నొప్పులన్నీ సాయికి లేవు. ఈ నొప్పులన్నీ సపత్నేకర్ భార్యకు కలవు. ఆమె బాధను బాబా ఈ ప్రకారముగా చెప్పెను. అప్పటి నుండి ఆమె నొప్పులు తగ్గిపోయెను. సపత్నేకర్ సాయి దర్శనమునకై మశీదుకు వెళ్ళగా మరల బాబా

అతనిని బైటకు పొమ్మనెను. సపత్నేకర్ అప్పుడు గ్రహించెను. ఇది వరకు బాబా భక్తుడగు షేవడేకు మరియు బాబాను హేళన చేసిన విషయము గుర్తుకు తెచ్చుకొనెను. ఎంతో పశ్చాత్తాపపడెను.

ఒకసారి బాబా ఒంటరిగా ఉన్నప్పుడు అతను తన శిరస్సును బాబా పాదములపై పెట్టెను. బాబా అక్కడున్న వారితో ఒక కోమటి గూర్చిన కథను చెప్పెను. వాని జీవితములో ఎన్నో కష్టాలను అనుభవించెనని చివరికి తనకున్న ఒక్కగానొక్క కొడుకు కూడా మరణించెనని చెప్పుచుండగా ఆ కథ తనదేనని బాబాకు అన్ని విషయములు ఎట్లు తెలిసెనో కదా అని సపత్నేకర్ ఆశ్చర్యపోయెను. బాబా ఇట్లు చెప్పుచూ ఒక్కసారిగా సపత్నేకర్ వైపు చూచి "వీడు తన కొడుకును నేను చంపితినని నన్ను నిందించుచున్నాడు. నేను లోకుల బిడ్డలని చంపెదనా ? అదే బిడ్డను వీని భార్య గర్భములోనికి మరల తెచ్చెదను" అని పలికి బాబా సపత్నేకర్‌ను ఆశీర్వదించి తనయందే నమ్మకముంచమనెను. బాబా ఒక టెంకాయను అతని భార్య చీరకొంగులో పెట్టమని సపత్నేకర్‌తో చెప్పి వానినాశీర్వదించి ఇంటికి పంపెను. సరిగ్గా ఒక సం॥రము తరువాత వారికి కొడుకే పుట్టెను. సపత్నేకర్ దంపతులు ఆ పిల్లవాడితో శిరిడీకి వచ్చి బాబాకు సాష్టాంగ నమస్కారము చేసికొనెను.

మొదట సపత్నేకర్ న్యాయవాది పరీక్షను వ్రాస్తున్నప్పుడు తన మిత్రుడగు షేవడే తాను చదివినవి ఏవీ జ్ఞప్తికి లేకపోయినను తనను బాబా ఆశీర్వదించి పరీక్షను ఉత్తీర్ణుడు చేస్తాడని అనినప్పుడు సపత్నేకర్ షేవడే యొక్క నమ్మకాన్ని చూసి హేళన చేయుటేకాక బాబాని కూడా హేళన చేసెను. సపత్నేకర్ న్యాయపరీక్షలో ఉత్తీర్ణుడై న్యాయవాది వృత్తిని అక్కల్‌కోట్‌లో నిర్వర్తించుచూ సుఖసంపదలతో తులతూగు చుండెను. 10 సం॥ల తరువాత తనకు గల ఒక్క కుమారుడు మరణించుట చేత ఒక్కసారిగా కష్టము రావుట వలన ఇదివరకు తాను హేళన చేసిన తనమిత్రుడు షేవడే యొక్క మాటల జ్ఞప్తికి తెచ్చుకొని బాబాయే గతి అనుకొని శిరిడీకి వెళ్ళెను. **ఏ కష్టము లేనప్పుడు భగవంతుడు కనీసం గుర్తుకురాడు. కొద్దిగా కష్టము వచ్చినపుడు దేవుడే దిక్కని మొరపెట్టుకుంటాడు.** సపత్నేకర్ పరిస్థితి దుఃఖమయముగా ఉండెను. కనుక బాబాను నమ్మి బాబా కడకు

వెళ్ళెను. బాబా సపత్నేకర్‌ను చూడగానే బైటకు పొమ్ము అని అరిచెను. ఇది నిజానికి బాబా యొక్క చర్య కఠినముగా కనిపించినను అట్లు చేయుటయే సరియైనది. ఎందుకనగా షేవడేను చూసి ఒకప్పుడు సపత్నేకర్ అహంకారముతో హేళన చేసెను. ఒక్క షేవడేనే కాక బాబాను కూడా హేళన చేసెను. కావుననే సాయి అవసరము లేనప్పుడు దేవుడిని నిందించుట అవసరము. వచ్చినప్పుడు భగవంతుడిని ఆశ్రయించుట తప్పని నిరూపించుటకై బాబా సపత్నేకర్‌ను బైటకు పొమ్మనెను. చాలాకాలము దర్శనమివ్వుటకు అంగీకరించలేదు. పైగా సపత్నేకర్ మనస్సులో తమ కుమారుని కూడా భగవంతుడే చంపెనని దురుద్దేశ్యము కలదు. ఈ కారణముచేత కూడా బాబా అతనికి మశీదులో కాలుపెట్టనివ్వలేదు. కొన్నాళ్ళు తరువాత బాబా అతని భార్యకు మాత్రమే స్వప్న దర్శనమిచ్చి శిరిడీకి వచ్చునట్లుగా అనుగ్రహము కల్పించెను. సపత్నేకర్ మనస్సులో ఉన్నవన్ని బాబా మశీదులో ఇతరులకు చెప్పెను. ఈ విధముగా చెప్పుటలో బాబా యొక్క ఉద్దేశ్యము ఎవరైనా తన దేవుణ్ణి నమ్ముకున్నప్పుడు ఆ నమ్మకాన్ని చూసి నమ్ముకున్న భక్తుణ్ణి మరియు భగవంతుణ్ణి హేళన చేయకూడదని చెప్పుటకై బాబా అందరిలోన సపత్నేకర్ మనస్సులోనివి దాగియున్న సంశయములన్ని బైట పెట్టెను. పైగా బాబా నేను లోకుల బిడ్డలను చంపెదనా ? అని చెప్పి అదే బిడ్డను తన భార్య గర్భములోనికి మరల తెచ్చెదనని చెప్పుటలో బాబా పరమాత్ముడే అని సపత్నేకర్ బాబాను హేళన చేయుట తప్పని ఋజువు చేయుటకై బాబా ఆ ఇరువురి దంపతులను ఆశీర్వదించగా సాయి ఆశీర్వచనముతో ఒక సం॥ము తరువాత వారిరువురికి కొడుకు పుట్టెను. సపత్నేకర్ తాను చేసిన నిందకు పశ్చాత్తాపపడి బాబా సాక్షాత్తు పరమేశ్వరుడే అని గ్రహించి షేవడే యొక్క మాటలు అక్షరసత్యము అని తెలుసుకున్నాడు. ఈ అధ్యాయము ద్వారా ఎవ్వరూ కూడా ఏ సాధకుడినీ తాను నమ్ముకున్న దాన్ని చూచి హేళన చేయకూడుద. అలాగే భగవంతుణ్ణి కూడా ఎట్టి పరిస్థితులలో హేళన చేయకూడదన్న నిజాన్ని గ్రహించవలెను.

## 49వ అధ్యాయము

ఈ అధ్యాయములో బాబాను పరీక్షించుటకై బొంబాయి నుండి హరికానోబా అనే అతను శిరిడీకి వచ్చెను. అతను బాబా యొక్క లీలలు విని బాబాను స్వయంగా తానే పరీక్షించవలెనని వచ్చెను. అతని తలపై జల్తారుపాగా ఉండెను. మరియు క్రొత్త చెప్పులను ధరించి శిరిడీకి వచ్చెను. తన క్రొత్త చెప్పులను మశీదు ముందర ఒక మూలపెట్టి మశీదు లోపలకు వెళ్ళి బాబాను దర్శించి బైటకు వచ్చుసరికి తన చెప్పులు కనిపించలేదు. చెప్పులను వెతికినను దొరకలేదు. తాను పోగొట్టుకున్న చెప్పులను గురించియే చింతించుచుండెను. మానవుని యొక్క నైజము ఏ చిన్న వస్తువు పోయినను తట్టుకొనలేదు. పగలు, రాత్రి దానిని గురించియే ఆలోచిస్తూ మనస్సు వికలము చేసికొనును. అందుకని గొప్ప గొప్ప యోగులు వేటి మీదను అభిమానము, మమకారము ఉంచుకొనరాదని చెప్పెదరు. **ఒకడెంత భక్తి సంపాదించినను జ్ఞానము పొందినను ఒక చిన్న వస్తువు ఇంటిన కన్పించకపోయిన దానికోసం సమయమంతా వృధా చేసికొని ఆ వస్తువు కొరకే వెతుకుచు ఉండును. ఇంద్రియములను అదుపులో ఉంచుకొనిని ఇటువంటి బాధలకు లోనుకారు. అందుకనే వైరాగ్యమనేది ఎంతో ముఖ్యం. ప్రతి మనిషి ఏ వస్తువునైనా లేదా తనకు సంబంధించిన బంధువులపైనా తన వారిపైనా ఎంత మమకారము పెంచుకున్నా దానికి తోడుగనే అంత వైరాగ్యము మనస్సున ఉంచుకొనవలెను. అప్పుడే ఒక వస్తువుగాని, బంగారముగాని, ఒక బంధువుగాని తనవారెవ్వరైననుగాని పోయినచో మనస్సు బాధపడదు. తాను యధావిధిగాను, నిశ్చయముగాను ఉండును.** ఇటువంటి అభ్యాసము ప్రతి మనిషి యొక్క నిత్య జీవితంలో అలవరచుకొని ఉండవలెను.

హరికానోబ తాను పోగొట్టుకున్న చెప్పుల గురించి చింతించుచుండెను. ఒక మరాఠీ కుర్రవాడు తనచేతిలో

ఒక కర్రను పట్టుకొని ఆ కర్ర చివరి భాగమున హరికానోబా చెప్పుల జతను వ్రేలాడు చుండునట్లు కట్టి అతని వద్దకు వచ్చి బాబా అతనిని పంపెనని 'హరికాబేటా, జరీకా ఫేటా' అని అరవమని, ఎవరైతే ఆ చెప్పులు తమవి అన్నచో అతని పేరు హరి అని అతను కానోబా కుమారుడని తలపై జరీపాగ ఉండునని చెప్పెనని ఆ బాలుడు హరికానోబాకు వివరించెను. వెంటనే ఆ చెప్పులు తనవని అతనిపేరు హరి అని తాను కానోబా కుమారుడని మరియు తన తలపైగల జరీపాగాను చూపి ఆ చెప్పులు ఆ పిల్లవాని దగ్గరనుండి హరికానోబా తీసుకొనెను. కాని అతను ఎంతో ఆశ్చర్యము చెందెను. తనకు గల జల్తారు పాగ అందరికి కనిపించును. కాని అతని పేరు హరి అని అతని తండ్రి పేరు కానోబా అని బాబాకు ఎట్లు తెలిసెనని హరి కానోబా సంశయము పడెను. యోగులతో పెట్టుకున్న వారిని ఆశ్చర్యములో ముంచుదురు అను నిదర్శనమిదే. హరి కానోబా మొదటిసారిగా శిరిడీకి రావటం, అందులోను తాను సంశయబుద్ధితో తన స్నేహితుని బంధువులు బాబాను గురించి గొప్పగా చెప్పగా తాను నమ్మక బాబాను పరీక్షించవలెనని వచ్చెను. కనుక బాబా అతను ఊహించని విధంగా తన పేరునేకాక తన తండ్రియొక్క పేరు కూడా బాబా చెప్పగా అతను ఆశ్చర్యచకితుడయ్యెను. **సాయినాథునికి ఒక్క హరికానోబా పేరు తన తండ్రిపేరు కాక యావత్ జగత్‌లోను ప్రతిజీవి యొక్క పేరు వారి తల్లిదండ్రులతో సహా వారు ఎరుగుదురు. వారికి తెలియనదంటూ ఈ ప్రపంచమున ఏదియులేదు.**

హరికానోబా లాగా బాబాను పరీక్షించుటకు మరియొక అతను వచ్చెను. అతను సోమదేవస్వామి. అతను ఉత్తరకాశీకి చెందినవారు. బాబా లీలలు విని శిరిడీకి పోవలెనని కాంక్షించి శిరిడీకి సమీపమున రాగానే మశీదుపైన జెండాలను చూసి "ఈ యోగికి జెండాలయందు ఏల మక్కువ చూపవలెనని అది యోగికి తగదని యోగి కీర్తి కొరకు చేయుచున్నారని" అనుకొనెను. తనతో ఉన్న ఇతర యాత్రికులు ఆ సోమదేవస్వామికి శిరిడీలో రథము, పల్లకి, గుర్రము మొదలగునవి కలవు అని చెప్పగా సోమదేవస్వామి గుర్రములతోను, పల్లకీతోను, జట్కాలతోను గల సాధువులను ఎక్కడా చూడలేదనుకొని శిరిడీకి పోకుండా తిరుగు ప్రయాణమునకు

సిద్ధమయ్యెను. కాని తనతోటి ప్రయాణికులు బలవంతము చేయగా శిరిడీకి వచ్చెను. మశీదులో బాబాను చూడగానే అతని కంటినుండి నీళ్ళుకారి ఎంతో శాంతిని పొందెను. అతను దగ్గరకు పోగా సాయి "మా వేషము మా దగ్గరే ఉండనీ. నీ ఇంటికి నీవు పొమ్ము. మశీదుకు రావద్దు" అని పలుకగా సోమదేవస్వామి ఆశ్చర్యపడెను. తాను బాబాను పరీక్షించుటకై శిరిడీకి వచ్చెనని తాను శిరిడీకి ఆవల ఉన్నపుడు తన మనస్సులో లేచిన చంచలమైన ఆలోచనలను శిరిడీలో మశీదులోనున్న బాబా ఎలా గ్రహించెనని బాబా ఒక సామాన్యమైన యోగి కాదని గ్రహించి సాయి యొక్క కోపమును ఆశీర్వదముగా తీసుకొని తరువాత అతను బాబాకు గొప్ప భక్తుడయ్యెను.

భగవంతుడు సృష్టించిన ఈ అందమైన ప్రపంచమును అందరూ ఆస్వాదించుటకై దానిని చూసి సంతోషించుటకై వున్నవి. కనుక ఇంద్రియములను దాని పనులను చేసికొనవచ్చును. కాని మన మనస్సు మాత్రం స్వచ్ఛముగా ఉండవలెనని మనలో చెడ్డ ఆలోచనలు లేనంత వరకు ఏ తప్పు లేదని ఋజువు చేయుటకు బాబా ఒక చమత్కారము చూపెను. ఒకసారి నానాసాహెబ్ మశీదులో ఇతర భక్తులతో సాయి వద్ద ఉండగా ఘోషా స్త్రీలు బాబాను దర్శించుటకై వచ్చెను. ప్రక్కనున్న నానాసాహెబ్ లేవనెంచెను. కాని బాబా అతనిని నివారించెను. అందులో ఒక స్త్రీ తన ముసుగు తీసి బాబాకు నమస్కరించుచుండగా ప్రక్కనున్న నానాసాహెబ్ ఆమె ముఖసౌందర్యమును చూసి ముగ్ధుడయ్యెను. ఆమెను మళ్ళీ చూడాలని కోరుకొనెను. ఆ ఘోషా స్త్రీలు వెళ్ళిన తరువాత బాబా నానా మనస్సులో దాగిన చాంచల్యమును గ్రహించి ఈ విధముగా పలికెను, "నానా అనవసరముగా చికాకు ఏల ? ఇంద్రియములు వాని పనులను చేసుకోనిమ్ము. మనము వానిలో జోక్యము కలుగుచేసికొనకూడదు. ఈ సుందర ప్రపంచమును దేవుడు సృష్టించినాడు. కావున అందరిని చూచి సంతసించుట మన విధి. క్రమముగా మనస్సు స్థిరపడి శాంతించును. ముందు ద్వారము తెరచియుండగా వెనుక ద్వారము గుండా పోనేల. **మన హృదయము స్వచ్ఛముగా ఉన్నంతవరకు ఏ దోషము లేదు.** మనలో చెడ్డ ఆలోచన

లేనప్పుడు భయపడనేల?” అని బాబా నానాకు బోధించిరి. సాయి చెప్పిన ఈ అమూల్యమైన పలుకులు సామాన్యమైనవి కావు. అవి వినుటకు నానాను ఓదార్చునట్లు కనపడెను కాని సాయి చెప్పినది ఇంద్రియ నిగ్రహము గురించి. ప్రతి జీవికి ఇంద్రియముల వలన చూచుట, వినుట, స్పర్శ గ్రహించుట ఇలాంటివి కల్గును. కాని ఆ ఇంద్రియములు వాటి వాటి పనులు చేసికొనుచుండును. మనము వాటిలో కల్పించుకొని జోక్యము చేయకూడదని ఎందువలనంటే ఈ యావత్ ప్రపంచమును అతిసుందరముగా తీర్చిదిద్దిన వాడు దేవుడే. దానిని అందరూ చూచి సంతోషించుటకై సృష్టించెను. కావున అందరూ దానిని చూచుట విధి. చూచినంత మాత్రమున తప్పులేదని కాని వెనుక ద్వారము గుండా పోకూడదని ముందు ద్వారమునే ఎంచుకొనవలెనని బాబా చెప్పెను. మన హృదయము మాత్రము స్వచ్ఛముగా ఉన్నచో ఏ దోషము లేదని మన ఆలోచనలు చెడ్డవి కాకూడదని అవి ఇట్లున్నచోదేనికీ భయపడనవసరము లేదని మనకున్న కన్నులు ఏవి చూసినను తప్పులేదని బాబా నిరూపించెను. ఇంద్రియములను వాటి వాటి పనులు చేసుకొనినను మనస్సు మాత్రం మన ఆధీనములో ఉండుట చాలా ముఖ్యం. వాటి వెంట మనస్సు పరుగెత్తరాదు. నిగ్రహముగానున్న ఇంద్రియములు ఏమి చూసినను వాటి పనులు అవి చేసికొనినను తప్పులేదని గ్రహించి మన ఇంద్రియనిగ్రహమునకు బాబా అతి సులువైన పద్ధతిని మనమందరికి అర్థమయ్యేటట్లుగా పైచిన్న సంఘటనను బాబాయే కల్పించెను.

## 50వ అధ్యాయము

బాబా గురించి తెలియనివారు ఎవరైనా ఉన్నచో వారు ఒకవేళ బాబాకు దగ్గరవారు అయినచో అతను బాబాను గురించి తెలియకపోయినను అతని కాలికి దారముకట్టి పిచ్చుకను లాగినట్లు బాబా వారి వద్దకు ఈడ్చెదరు. ఒకవేళ వాడు తనవాడు కానిచో అతను సాయిబాబాచే ఆకర్షింపబడడు. పైగా సాయి దర్శనమే

చేయలేదు. ఇది అక్షరసత్యం. కావున **ఈ ప్రపంచములో ఎవరైనా బాబాను పూజించను బాబాకు మ్రొక్కను అనే ప్రగల్భములు పలికేవాడు ఇది వాడి గొప్పతనము వాడి చర్య అనే అనుకోకూడదు. అటువంటి వాడు తనవాడు కాడు. కావుననే అటువంటి వాడు బాబాచే ఆకర్షింపబడడు. ఈ కారణముచే అతను బాబాను తెలుసుకోపోవుట, ఆరాధించక, సేవించక, ధ్యానించక, స్మరించక తన కాలమును వృధాగా గడుపుచుండును.**

కాకాసాహెబ్ దీక్షిత్ న్యాయవాది పరీక్షలో ఉత్తీర్ణుడై న్యాయవాదిగా చేయుచున్న రోజులలో అతని స్నేహితుడు నానా సాహెబ్ చందోత్కర్‌ను కలుసుకొనెను. కాకాసాహెబ్ తాను రైలు బండి ఎక్కుచు కాలు జారిపడుట వలన తన కాలికి నొప్పి, కుంటితనము పట్టుకున్న విషయము నానా సాహెబ్‌కు, కాకాసాహెబ్ చెప్పెను. ఎన్ని ఔషధములు పుచ్చుకొన్నను తగ్గలేదని చెప్పగా నానా సాహెబ్ చందోత్కర్ కాకాసాహెబ్‌ను శిరిడీకి వెళ్ళి సాయిని దర్శించమని సలహా ఇచ్చెను. కాకాసాహెబ్ దీక్షిత్ ఉత్తరోత్తర సాయి భక్తులుగా మారునని ఎరింగిన బాబా ఆ భక్తుని పిచ్చుక కాలికి దారము కట్టి ఈడ్చినట్లు నానా సాహెబ్ చందోర్కర్ ద్వారా బాబానుగురించి చెప్పటం కాకాసాహెబ్ శిరిడీకి రావటం జరిగినది. కాకాసాహెబ్ దీక్షిత్ శిరిడీకి వచ్చి బాబాను దర్శించి ఎంతో ఆనందమును పొందెను. తదుపరి ఎన్నో సం॥లు బాబాతో గడిపెను. శిరిడీలో ఒక వాడాను కూడా కట్టి తన నివాస స్థలముగా చేసికొనెను. బాబా, కాకాసాహెబ్‌తో "అంత్యకాలమున నిన్ను విమానములో తీసుకుపోయెదనని" మాట ఇచ్చెను. బాబా ఆజ్ఞ ప్రకారము ప్రతి నిత్యము అతను ఏకనాథ భాగవతము, భావార్థ రామాయణము చదువుచుండెడివాడు. దీక్షిత్ రేపు మరణించుచున్నాడనగా ఏకనాథ భాగవతము, భావార్థరామాయణము, సుందరకాండ, గజేంద్రమోక్షము చదివెను. ఆ మర్నాడు ఏకాదశి అయ్యెను. కాకాసాహెబ్ దీక్షిత్ తన కుమారుడు విల్లేపార్లేలో ఉండుటచే అతనిని చూచుటకు హేమాడ్‌పంత్‌తో రైలులో బయలుదేరుటకు సిద్ధమైరి. హేమాడ్‌పంత్ మరియు తెండూల్కర్‌లతో కలసి రైల్వే స్టేషన్‌కు కొంచెము ఆలశ్యముగా వచ్చిరి. సాయి కృప వలన ఆ రోజు రైలును ఆలశ్యముగా వచ్చెను, లేనియెడల ఆ రైలు వారికి అందేదికాదు. రైలులో

ఎక్కిన తరువాత కాకా సాహెబ్ దీక్షిత్ ఇట్లనెను, "అన్నా సాహెబ్, బాబా ఎంత దయామయుడోగదా! మనము చేరు వేళకు రైలు వచ్చునట్లుగా బాబా చేసెను. లేనిచో మనకు రైలు అందెడిదికాదు. శ్రీసాయి కరుణ ఇదియే". అని కనులు మూసుకొని నిద్రించుచున్నట్లుండెను. కాని కాకా సాహెబ్ దీక్షిత్ తన ప్రాణములను వదిలివేసెనని హేమాడ్‌పంత్, తెందూల్కర్ గమనించెను. బాబా చెప్పినట్లుగా "అంత్యకాలమున నిన్ను విమానములో తీసుకుపోయెదను" అనే మాటను బాబా నెరవేర్చెను. కాకా సాహెబ్ దీక్షిత్ ఏకాదశినాడు మృతి చెందెను.

శ్రీ వాసుదేవానంద సరస్వతి స్వామి (టెంబేస్వామి) రాజమండ్రిలో ఉన్నప్పుడు వారిని దర్శించుటకు పుండరీకరావు నాందేడ్ నివాసి న్యాయవాది మరికొద్దిమంది స్నేహితులతో టెంబేస్వామిని దర్శించి సాయిబాబా గురించి ప్రస్తావించిరి. టెంబేస్వామి బాబాపేరు వినగానే చేతులు జోడించి ఒక టెంకాయని పుండరీకరావుకు ఇచ్చి ఇట్లనిరి, "దీనిని నా సోదరుడగు సాయికి నా ప్రణామములతో అర్పింపుము. నన్ను మరవవద్దని నాయందు ప్రేమచూపమని వేడుము" అని ఆ స్వామి ఆ టెంకాయను అతనికిచ్చెను. యోగులు అనేకచోట్ల అనేక రూపములతో వివిధ నామములతో అవతరించెదరని ఒకరంటే మరియొకరు అన్నదమ్ములవలె ఉండెడివారు. ఒకనెల తరువాత ఆ టెంకాయను పుండలీకరావు శిరిడీకి కొనిపోవుచుండగా మార్గమధ్యమున వారు అటుకులను తిని పొరపాటున స్వామి ఇచ్చిన టెంకాయను పగులగొట్టి ఆ అటుకులతో తినిరి. శిరిడీకి వచ్చిన పిదప వారు చేసిన పొరపాటు గ్రహించి బాబాకు శిరిడీలో నమస్కరించి వద్దకేగగా అప్పటికే బాబా ఆ విషయమును గ్రహించెను. తన సోదరుడగు టెంబేస్వామి ఇచ్చిన టెంకాయను తెమ్మనెను. పుండలీకరావు తాను చేసిన తప్పును చెప్పి బాబా పాదములపై పడెను. దానికి బదులుగా మరియొక టెంకాయను ఇచ్చెదనని, కాని బాబా అందుకు ఒప్పుకొనలేదు. టెంబేస్వామి ఇచ్చిన టెంకాయ విలువ సాధారణ టెంకాయ కంటే ఎన్నోరెట్లు ఎక్కువని బాబా మరియు ఇట్లనెను, "అది నా సంకల్పముచే నీకివ్వబడెను. దారిలో పగులగొట్టబడెను. దానికి నీవే కర్తవని అనుకొననేల ? మంచిగాని చెడ్డగాని చేయుటకు నీవు కర్తవని అనుకొనరాదు. గర్వాహంకారరహితుడవై ఉండుము. అప్పుడే

నీ పరచింతన అభివృద్ధి చెందును" అని పలికెను. బాబా చెప్పిన విషయము ప్రతి మనిషికి వర్తించును. **ఏ కార్యమైనను మనము కర్తలముకాము. అది మంచి కార్యమైనా చెడుకార్యమైనా చేయుటకు మనము కర్తలము కాదు ప్రతిదీ సాయి యొక్క సంకల్పము ప్రకారమే జరుగును. మనము ఎన్ని ఆలోచనలు చేసినా ఎన్ని పథకములు వేసినా తుదకు జరిగేవి ఆ పరమాత్మ సాయి యొక్క సంకల్పము ప్రకారమే.** ఈ విషయాన్ని ప్రతీవారు గ్రహించి తమ గర్వాహంకారమును వదులుకోవలెను. మన నిత్యజీవితలో జయము కలిగితే ఆ జయము వలన కలిగే సంతోషము ఆ జయానికి కర్తలము మనము కానేకాదు. సాయి భగవానుని వలననే మనకు ఆ విజయము ప్రాప్తించిందని అనునిత్యం గమనింపవలెను. ఇట్లే అపజయము కలిగినా దుఃఖము సంభవించినా అది కూడా బాబా ఇచ్చే అని తలంచి నిబ్బరముతో ఉండవలెను.

బాబా మశీదులో ఉండి తనవారు ఎవరైనా మశీదుకు వస్తుంటే ముందుగానే ఇతర భక్తులకు బాబా సూచించేవారు. బొంబాయిలోనున్న బలరామ్ దురంధర్ కుటుంబములోని వారందరు సాయిభక్తులు. వారు ఆధ్యాత్మిక చింతనలో ఎల్లప్పుడు నిమగ్నులై ఉంటూ ఆధ్యాత్మిక గ్రంథములను చదివేవారు. వారు ఒకసారి శిరిడీకి వెళ్ళి బాబాను దర్శించవలెనని నిశ్చయించుకొనిరి. వారు రాకమునుపే సాయి తోటి భక్తులతో ఇట్లనిరి, "ఈ రోజున నా దర్బారు జనులు వచ్చుచున్నారు'. బలరాం దురంధర్ కుటుంబీకులు మశీదులో అడుగిడిన తరువాత తోటి భక్తుల ద్వారా వారి రాకను గురించి బాబా ముందే సూచించారని తెలుసుకొని ఆనందించిరి. వారందరు బాబాకు పాదనమస్కారములు చేసిరి. మశీదులో భోజనము చేసిన తరువాత బలరామ్ బాబాకు పాదములు ఒత్తుచుండగా బాబా చిలుము త్రాగుచు దానిని బలరామునకిచ్చి పీల్చమనెను. నిజానికి అతనికి చిలుము పీల్చుట అలవాటులేదు. కాని బాబా ఆజ్ఞ ప్రకారము దానిని కష్టముతో పీల్చెను. ఈ దెబ్బతోను 6 సం॥ల నుండి ఉబ్బస వ్యాధితో బాధపడుచున్న ఆ ఉబ్బస వ్యాధి నయము అయినది. పొగ నిజానికి పీల్చినచో ఉబ్బసముతో బాధపడు రోగికి ఆ వ్యాధి అధికమవును. కాని బాబా చేతుల మీదుగా ఇచ్చిన చిలుము బలరామ్

పిల్చగానే వ్యాధి నివారణమైనది. యోగుల యొక్క చర్యలు చాలా విచిత్రముగా ఉండును. దురంధర్ సోదరులు ఆ రోజు గురువారం కావున చావడిలో హారతికి వారందరు హాజరైరి. బలరామ్‌కు బాబా ముఖములో పాండురంగని తేజస్సు గమనించిరి. బలరామ్ 6 సం॥ల తరువాత మరల అతనికి ఉబ్బసము వచ్చెను. అదేరోజున అదే సమయమున బాబా మహాసమాధి చెందిరి.

అవధూతల యొక్క లక్షణములు అగోచరములుగా ఉండును. వారు తమ భక్తులను ఏదో ఒక కారణము ఉండును కనుకనే వారు తమ దర్బారుకు లాగెదరు. వారు తమ భక్తుల యొక్క యోగ క్షేమములు వారే స్వయముగా గ్రహించి తమ భక్తులకు తెలియకుండానే వారిని కాపాడెదరు. వారికి తమ భక్తులంటే అంతటిప్రేమ, శ్రద్ధ కలిగి ఉండెదరు.

## 51 అధ్యాయము

ఈ అధ్యాయము చివరిది. నిజానికి సాయి సచ్చరిత్ర అంటే అంతములేనిది. అనంతమైనది. సాయి లీలలు ఎన్నో కలవు. వారు మహాసమాధి చెందకపూర్వము, సమాధి చెందిన తరువాత కూడా ఎంతో అద్భుతమైనటువంటి లీలలను చూపేవారు. శ్రీసాయి సచ్చరిత్రలోని లీలలను రచయిత శ్రీ హేమాడ్‌పంత్ గారు స్వయముగా చూసి బాబా అనుమతిని పొంది వారి ఆశీర్వచనముచే ఈ మహాగ్రంథాన్ని వ్రాశారు. దత్తాత్రేయుని ఐదవ అవతారమగు శ్రీసాయిబాబా యొక్క లీలలను శ్రీ సాయి సచ్చరిత్రలో వ్రాసినారు. గురు చరిత్రలో శ్రీపాద వల్లభుని మరియు నరసింహ సరస్వతి స్వామి వారి లీలలను వర్ణింపబడినాయి. అలాగే శ్రీ మాణిక్య ప్రభువు మరియు అక్కల్‌కోట్‌కర్ మహారాజు గారి లీలలను కూడా మాణిక్య ప్రభు చరిత్రగా మరియు స్వామి సమర్ధచరిత్రగా మరియు శ్రీగజానన మహారాజాగారి శ్రీగజానన మహరాజ్‌చరిత్రగా వర్ణింపబడ్డాయి.

శ్రీసాయి సచ్చరిత్ర పరమ పవిత్రమైన గ్రంథము. ఈ గ్రంథమును శ్రద్ధాభక్తితో చదువగా ఎన్నో విషయములు తెలియును మరియు ప్రతి భక్తుడు మనసావాచ సాయి పాదముల యందు భక్తి కలుగును. శ్రీసాయి యొక్క ఆనందరూపము మనసున ముద్రపడిపోవును. బాబా లీలలను ప్రతిరోజు చదువవలెను. ఎంతలోతుగా చదివినా లేదా ఎవరైనా చదువుచున్నప్పుడు శ్రద్ధగా వినిన ఎంతో ఆనందము కలిగి ధైర్యము మరియు జ్ఞానము కూడా ప్రతి భక్తునికి కలుగును. ఈ గ్రంథము పారాయణము చేసినచో కొన్ని ఫలితములు కూడా కలుగును. **నిజానికి సాయిని స్మరించుటకంటే ధ్యానించుటకంటే నామస్మరణము చేయుటకంటే శ్రీ సాయి సచ్చరిత్ర పారాయణము చేయుటకంటే వేరే ఫలితములు ఇక అనవసరమని నా భావన. ఎంతో పుణ్యము చేసుకొనిన కాని ఆ సాయి భగవానుని మనము కొలువలేము. కావున సాయికి భక్తుడు అన్నవాడు ఆ అర్హతను అంటే బాబాను అనునిత్యము స్మరించి, పూజించి, ధ్యానించి పారాయణము పఠించుట ఇటువంటి అర్హతలను సాయి వలన పొందినాము. ఇది చాలు ఈ జన్మకు. ఇదియే కైవల్యము. మరెన్ని జన్మలు మనకు ఉన్నను ఆ పరమాత్మ సాయిని ఈ జన్మలో మనకు కలిగించిన ఆ అర్హతను ప్రతిజన్మలో బాబాను పూజించి సేవించి ధ్యానించి, స్మరించి సాయి సచ్చరిత్ర పఠించవలెనని మనసా వాచా కోరుకుందాం.** ఇంతకంటే ఫలితములను ఇంకేమి ఆశిద్దాం. ఐనను ఈ సచ్చరిత్ర పారాయణము చేసిన వారికి ఆధ్యాత్మిక జీవితమునందు శ్రద్ధ కలిగి మనకున్న కష్టములు పాపములు తొలగిపోవును. జనన మరణములనునవి ఒక బండి చక్రము వంటివి. పుట్టుట, బంధములతో బంధించుకొనుట, దాని వలన సుఖదుఃఖములను కోరి తెచ్చుకొనుట చివరికి నశించుట తిరిగి మన కోరికల ప్రభావముచే మళ్ళీ జన్మించుట ఇటువంటి జనన మరణ చక్రముల నుండి విడిపడుటకు బాబా లీలను తప్పక చదవవలెను. సాయి సచ్చరిత్ర భక్తి శ్రద్ధలతో చదివిన ఆత్మ సాక్షాత్కారమునకు దారి చూపును. సంసార బంధముల నుండి కూడా తప్పించుకొందము. ధనము కోరిన వారికి ధనము, వ్యాపారాభివృద్ధి కోరిన వారికి వ్యాపారము అభివృద్ధి యగును, జ్ఞానము ప్రసాదించును ఈ గ్రంథమును ప్రతిరోజు ఒక అధ్యాయమునైనను పారాయణము చేయవలెను.

ఈ గ్రంథమును గురువారం మొదలుపెట్టి సరిగ్గా ఏడురోజులలో అనగా బుధవారం నాటికి సంపూర్ణము చేసిన, సాయి అనుగ్రహము తప్పక కలుగును. ఈ గ్రంథమును మహా పర్వదినములైన గురుపౌర్ణమి, శ్రీ కృష్ణాష్టమి, శ్రీరామనవమి, విజయదశమి మరియు దత్త జయంతి రోజులలో తప్పక పారాయణ చేయవలెను. శ్రీసాయి సచ్చరిత్ర పారాయణ వలన రోగులు ఆరోగ్యవంతులుగా, పేదవారు ధనవంతులుగా మారెదరు. సంతానములేని వారికి సంతానము, నిరుద్యోగులకు ఉద్యోగము లభిస్తాయి. కాని ప్రతి భక్తుడు ఈ సాయి సచ్చరిత్రను ఎంతో భక్తితోను, శ్రద్ధతోను చదివి సాయి పాదములను సంపూర్ణముగా నమ్ముకుని సాయిపై సంపూర్ణ భక్తిని పెంపొందించుకొనవలెనని కోరుచున్నాము.

సద్గురు శ్రీసాయి నాథార్పణమస్తు

శుభం భవంతు

లోకాస్సమస్తా సుఖినోభవంతు